# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఆగస్టు, 2012 ₹ 20



కోరికలు

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 23 ఆగష్టు 2012 సంచిక 8**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాంద్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.

# ఈ నెల...

కమ్మతెమ్మెరలు

తమిళనాట తెలుగు మాండలికాలు ............................ 5
*- డాక్టర్ జె.వి. సత్యవాణి*

ఆంధ్రదేశములో శకముల వాడుక ........................... 10
*- వేపా రామేశం*

మమతల తల్లి ................................................... 14
*- నందనరెడ్డి*

అగతా క్రిస్టి అద్భుత సృష్టి........................................ 20
*- యస్సేరావ్*

సంగీత ఝరి వసంతకుమారి.................................. 26
*- డాక్టరు మంతెన సూర్యనారాయణరాజు*

సాహిత్యంలో హాస్యం ............................................ 29
*- దూపాటి శేషుకుమారాచార్యులు*

వందేళ్ళ వీరరాఘవునికి వందన ప్రాప్తి ........................ 31
*- డాక్టరు కొల్లోజు కనకాచారి*

సంకటి ............................................................... 35
*- డాక్టరు పులికంటి కృష్ణారెడ్డి*

అరక దున్నిన అధ్యాపకుడు ................................... 39
*- నిమ్మగడ్డ జనార్ధనరావు*

పల్లవరాణి సమవై.................................................. 40
*- దేవిరెడ్డి సుబ్రమణ్యరెడ్డి*

ఆశ్రిత శ్రామికులు .................................................. 44
*- డాక్టరు మూలె విజయలక్ష్మి*

సిమ్లా ఒప్పందం ................................................... 48
*- ఆర్వియార్*

నా స్వగతం.......................................................... 53
*- పసుమర్తి రామలింగ శాస్త్రి*

చివరి తత్త్వవేత్త .................................................. 58
*- ముక్తవరం పార్థసారథి*

బావగారి వాణి ..................................................... 63
*- డాక్టరు వోలేటి పార్వతీశం*

అదే గాలి – చైనా కవిత్వం ...................................... 67
*- ముకుంద రామారావు*

పుస్తక ప్రపంచం ................................................... 73
*- జి. లక్ష్మి*

చదవండి (పుస్తక పరిచయం) .................................. 76

అ'మో'ఘమ్ ......................................................... 78

*ముఖచిత్రం* : అందాల కొమ్మ : *చిత్రకారుడు* : నారాయణ శ్రీధర్ బెంద్రె

*రెండవ అట్ట* : కోరికలు : *చిత్రకారుడు* : మహంతి సర్కార్

*మూడవ అట్ట* : తీరిక : *చిత్రకారిణి* : సుజాత

*నాల్గవ అట్ట* : ఆట బొమ్మ : *చిత్రకారుడు* : అక్బరు

(*వివరాలు :* 25వ పుటలో.....)

పరిస్థితులు ఏ విధంగా ఉన్నా పండగలు చేసుకుంటూనే ఉంటాము. ఆగష్టు 15 కూడా మనకు పండగే. ఆ పండగ రావటానికి ముందుగా ఎన్నో సంఘర్షణలు, సమావేశాలు, ఒప్పందాలు జరిగాయి. మన ముందు తరం వారు చేసిన త్యాగాలతో పాటు వారి సహనం, సంయమనం ఈ ఒప్పందాలలో ప్రతిఫలిస్తాయి. సమీప చరిత్రలో అలాంటివి కొన్ని విషయాలు, కొందరు వ్యక్తుల గురించి చదవండి.

ఈ నాటి జీవనశైలిలో తారీఖులు తప్పని సరి. అసలు ఇవి ఎప్పుడు ఎక్కడ మొదలయినాయి? మన దేశంలో ఎలా వాడుకలోకి వచ్చాయో 'శకముల వాడుక' తెలియ జేస్తుంది.

అరవయి ఏళ్ళుగా ఒకే నగరంలో ఒకే థియేటర్‌లో ఒక నాటకం నడుస్తోంది అంటే దానిలో చాలా ప్రత్యేకతలు వుండి ఉండాలి. అగతా క్రిస్టి అద్భుత సృష్టి అయిన 'మౌస్ ట్రాప్' ను లండన్ నగరం వెళ్లి చూసిన యస్సేరావు గారి అనుభవాలు – ఆ నాటకం ప్రత్యేకతలు తెలియజేస్తున్నారు.

తూర్పు దేశ కవితా రీతులు అందించే అవకాశం 'అదే గాలి' ద్వారా ముకుంద రామారావు గారు కలిగించారు.

తెలుగు సినిమా రంగంలో దాదాపు పాతిక మంది సమర్థులైన హాస్యనటులు మనల్ని నవ్వించటానికి పడరానిపాట్లు పడుతుంటారు. అదే విశ్వనాథవారు ఒక చలన చిత్రం చూసి, 'ఇందులో ఒక హాస్యగాడు ఉండును. అతను మనలను నవ్వించుటకు ప్రయత్నించును' అని అన్నట్లు వినికిడి. అలాగే సాహిత్యంలో హాస్యపు సన్నివేశాలు తక్కువనే అనాలి. ఎప్పుడో వచ్చిన మొక్కపాటి వారి 'బారిష్టరు పార్వతీశం' లాంటి పూర్తి నిడివి హాస్య రచనలు ఇప్పుడు కరువే. వార పత్రికలవారు హాస్య కథల పోటీలు పెట్టినా ఫలితం అంతంతమాత్రమే. మనం ఎందుకు నవ్వుకోలేక పోతున్నాం?

తత్త్వశాస్త్రం చివరి దశలో ఉన్నదని మనకు తెలుస్తోంది. ఇది శాస్త్ర పరిశోధన ఫలితమే. వచ్చేనెల స్టీఫెన్ హాకింగ్ గ్రాండ్ డిజైన్ గ్రంథాన్ని సోదాహరణంగా పరిచయం చేస్తున్నాము.



– సంపాదకులు

# కమ్మతెమ్మెరలు

**ఉత్తరాలతో** పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "....ఈ నాడు వార్తాపత్రికలు, వార్తా టి.వి.లు సృష్టిస్తున్న భయానక వాతావరణం పూర్తిగా ఆయా యాజమాన్యాల స్వార్థపూరిత అవసరాలకోసమే...రాజకీయ ఆసరాలకోసమే...ఇది పూర్తిగా నిరసించదగింది. 'వార్త' అంటే చెడువార్తే-అని నిర్ధారించారు పత్రికలవాళ్ళు. ఇక టి.వి వార్తల సంగతి (సప్తగిరి మినహా) దేనికీ నిజాయితీ నిబద్ధతలేదు. చదువరులను-ప్రేక్షకులను భయభ్రాంతులను చేసి-వారి పబ్బం గడుపుకోవటమే ముఖ్యం. తమకు కాని వ్యక్తులను ఎండగడతమే పరమార్థం. మార్క్‌ట్వేన్ *పత్రికల యథేచ్ఛ* కాలానుగుణంగా ప్రచురించి మేలుచేశారు. ఇటీవల వస్తున్న 'సత్యమేవ జయతే' వలన టి.వి.కి కాస్త గౌరవం పెరిగిందనవచ్చు."

**– దాశరథి రామానుజం,** ద్రాక్షారామం.

✶ "...*సిద్ధార్థ గౌతముని జీవనగాథ* ఎంతో సంయమనంతో రాసిన వ్యాసం. కట్టుకథలకు, మాయ మంత్రాలకు తావు లేకుండా గౌతముని జీవనయానాన్ని నిర్దిష్టంగా వివరించిన రచయితకు ధన్యవాదాలు... ఎంతో ప్రణాళిక, మానసిక పరిపక్వతగలవారే ఇంత వివరంగా చెప్పగలరు... *అగాధం* చక్కని సందర్భోచితమైన పదాలతో ఎంతో బాగుంది... ఫజులుల్లాఖాన్ రచనలో ఎన్నో లోపాలున్నాయి. చారిత్రక అసత్యాలున్నాయి. ఇలాంటి రచన ***మిసిమి***లో చోటు చేసుకోవడం విచారించాలి..."

**– అరుణ......**జనగాం. (వాయిస్ మెయిల్)

✶ '*సి.ఆర్.రెడ్డి హైస్కూలు రోజులు* చదివి నవ్వలేక ఇబ్బంది పడిపోయాను. పడిపడి నవ్వుకున్నాను.ఎంత చక్కటి తెలుగు! ఇలాంటి అనుభవాలు అందరి జీవితాల్లోనూ ఉంటుంది. కాని ఆ విధంగా చెప్పుకోగలిగేవారే ధన్యులు-నిజాయితీపరులు..."

**– కె.రామారావు,** కొవ్వూరు.

✶ "*అగాధం*...రచన చాలా చాలా బాగుంది. ఇది పుస్తకరూపంలో వస్తే తెలియజేయండి. *గోటుహెల్* నాటకం గురించిన పరిచయం చాలా ఉత్సుకతను రేపింది. అది రాడికల్ నాటకమని తెలుస్తోంది. కథ కూడా కొంతవరకు తెలియజేస్తే బాగుండేదేమో?..."

**– ఎ.సి.రావు,** హైదరాబాద్.

✶ "...జూలై'12 ***మిసిమి***లో *సురభి నాటక రంగం* (ప్రసారరెడ్డి) *బుర్రకథ* (వెంకట సూర్యారావు) లఘువ్యాసాలైనా ఒకింత సంగ్రహంగానే వివరించారు. ...గోపాల కృష్ణారావుగారి *సార్వభౌముడు-మహామంత్రి* చరిత్రవ్యాసం సామాన్య పాఠకులకు అందుబాటులో లేని విషయాలు తెలిశాయి. ...*భారతీయులు హిందువులుగా ఎలా మారారు* ఫజులుల్లా ఖాన్ గారి వ్యాసం వాస్తవం అయితే మనలో ఉన్న అనుమానాలు నివృత్తి అయితే ఎంత బాగుండును! రచయిత జనరల్‌గా కాకుండా కొంచెం సవివరమైన ఆధారాలతో వ్రాస్తే వివరణాత్మకంగా ఉండేది...
...*యానాం ఆంధ్రలో ఎందుకు విలీనం కాలేదు?, అసంపూర్ణ అద్భుతాలు రా.వి.శాస్త్రి నవలలు* అన్నీ విషయం గల వ్యాసాలే. *కాలువ మల్లయ్య గారు వ్రాసింది ఆధారాలను చూపవలసిన వ్యాఖ్యగా భావిస్తున్నాను...* డాక్టర్ నరసయ్యగారి ప్రశ్నకు వివరణ ఏమిటంటే – ఈ రోజుల్లో ప్రభుత్వాలు తమ కిష్టంలేని రచనలను నిషేధించి సరిపెట్టుకుంటున్నాయి. ఆ రోజుల్లో ఈ వాతావరణం లేదే? ఆధారాలే లేకుండా, ఆ రచనలను కూడా అంతం చేసేవారు గదా?...
... ఏ నెల ***మిసిమి*** తీసుకున్నా విషయ విజ్ఞానగని. పదికాలాలపాటు పదిల పరుచుకోవలసిన అమూల్య సంచికలే..."

**– దూదల రాములు,** ఏలూరు.

✶ "...బహుమతిగా *సిద్ధార్థ* అంది వారమైనది. మంచి పుస్తకం. అక్కడక్కడ చదివాను. పుస్తకాలు చదువుతూంటే చాలచాల ఇన్‌స్పిరేషన్ వచ్చింది. నేను చిన్న చిన్న స్కెచ్‌లు వ్రాస్తూంటాను. వనిత, స్వాతి వారపత్రికలలోను వస్తాయి. మా ఇంటి వాండ్లందరూ అంటే కోడండ్లు ఇద్దరు, అల్లుండ్లు ఇద్దరూ వైజాగ్, బందరు, చీరాల: నెల్లూరు సొంత ఊరు. పెద్దఅల్లుడు, సేలం వాండ్లు, పెద్దకూతురు తెలుగు నేర్చుకోలేదు. నా మనుమలు, మనుమరాండ్లు బాగా చదువులు, ఉద్యోగాలు చేస్తున్నారు. మేమిద్దరము సంతోషంగా కాలం గడుపుతున్నాము..." **– దర్శి సత్యవతి,** నాగపూర్.

✶ "...***మిసిమి*** చాలా బాగుంటుంది. ఏ వ్యాసానికి ఆ వ్యాసమే విలక్షణంగా ఉంటున్నాయి. మూడవ అట్ట మీది బొమ్మ శ్రీరామచంద్రుడు చాలా బాగుంది. పత్రిక స్థాయి ఇదివరకటి కన్నా పెరిగింది. ప్రధాన సంపాదకులకు, సంపాదకులకు ధన్యవాదాలు. ***మిసిమి***లో పనిచేసే వారందరూ చాల అదృష్టవంతులు..." **– హనుమంతప్పన్,** మదరాసు.

✶ "...*ముగ్గు* – చక్కగా ఉంది. బొమ్మ మరీ బాగుంది... *లోహియా లేఖ*, ఎంతటి వారినీ వదలని లోహియా నిజాయితీ, కార్యాచరణ గొప్పది. అలాంటి నాయకులు ఇప్పుడున్నారా?..." **– రంగనాయకులు,** విశాఖపట్నం.

✶ "...శివారెడ్డి ప్రయాణం ఎంతో వివరంగా ప్రసంగం రూపంలో ఉన్నా– చదవటానికి అనుకూలంగా ఉంది– ఇక కవిగా ఆయన ఎక్కిన ఎత్తులు, పడిన లోయలు– తగిలిన గాయాలు– అన్నీ ఆలోచింప చేసేవే–..."

**– అనిరుధ్,** ఒంగోలు.

✶ "...*సురభి నాటకరంగం*– ఎన్నో విశేషాలు తెలియచేసింది. ...తెలుగు నవల తీరు తెన్నులు ఎంతో సమగ్రంగా అందించారు... *కోణార్క దేవాలయం* చరిత్ర ఎంతో కవితాత్మకంగా, వ్యధాత్మకంగా రాసిన శివనాగిరెడ్డి అభినందనీయులు... ... *జపాన్‌లో వసంతం,* ఇలాంటిది తెలుగులోనే మొదటిసారి చదివాను...

... రావి శాస్త్రి నవలలను ఎందుకు పూర్తి చేయలేదు? రచయితలందరికీ ఈ పార్శ్వం ఉంటుంది...

... అన్ని రచనలు పూర్తి కావు – అసంపూర్ణ రచనలతోనే వారు సందేశాన్నిస్తారు– ... *యానాం చరిత్ర* చదవదగినది. వివరాలు బడిపిల్లలకు సిలబస్‌లో పెట్టదగినది...

... *సార్వభౌముడు – మహామంత్రి* లో 27వ పేజీలో తేది పొరపాటు పడింది – (జూలై సంచిక)... ***మిసిమి*** బొమ్మలు రంగుల హరివిల్లు అనవచ్చు..." **– రావి రంగారావు,** అనంతపురం.

# ప్రతిస్పందన

***మిసిమి*** మే 2012 సంచిక కమ్మతెమ్మరలలో నేను వ్రాసిన శ్రుతి, తాళ విషయములలో మిత్రులు నందూరి పార్థసారథి గారు శ్రుతి విషయములో వ్రాసిన సహృదయస్పందన చదివి చాలా ఆనందించినాను.

నిజానికి నిజాయితీ కలిగిన సంగీత బోధనయే నా వృత్తీ, ప్రవృత్తీకూడా కావడం చేత ఆ బోధన అతి స్వల్పకాలంలోనే పూర్తయ్యేవిధంగా ఆ సర్వేశ్వరుని కృపతో అనితర సాధ్యంగా సరళీకృతం చేయడంలో సంగీత రచనలను స్వరపరచడంలో అపూర్వంగా సంజ్ఞాయుత స్వరలిపిని రూపొందించి వినియోగించే దిశలో కైశికి నిషాదానికి గల 27 రకాల ఛాయాలను తెలుసుకోవడమూ వాటిని విడివిడిగా ఆడియోఫైల్స్ (455 నుండి 481 వరకూ) గా రూపొందించి వీటి వివరముల పట్టిక తెలుగు (41వ పుట), ఇంగ్లీషు (34వ పుట) భాషలలో గల పి.డి.యఫ్ ఫైల్స్ తో బాటుగా 'http://sangeetamshare.org/chandra/AMS-easy-Methods - 2007' ద్వారా అందరూ సులభంగా పొందుటకు వీలుగా 'సంగీతంషేర్' వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగింది.

మన సంగీత రచనలను 1902లో బాధ్యతా యుతంగా ప్రప్రథమంగా పరిమిత సంజ్ఞాయుత స్వరలిపిలో తన *సంగీత సంప్రదాయప్రదర్శిని* లో ప్రచురించిన సుబ్బరామ దీక్షితుల వారిని మెచ్చుకోవడంతో మాత్రమే సరిపుచ్చి అమ్మపెట్టదు, అడుక్కుతినా నివ్వదు అనే సామెతగా మరేమీ చేయని, చేయనీయని మన ఛాందస సంగీత కళానిధుల కోసం కాకపోయినా నిజాయితీ కలిగిన సంగీత పరిశోధకుల కోసమూ, విమర్శకుల కోసమూ, అధ్యాపకుల కోసమూ అందరి కంటెనూ ఎక్కువగా మన విద్యార్థుల కోసమూ వీటిని సోదాహరణంగా, ప్రసంగించడానికి నేను సంసిద్ధంగానే ఉన్నాను.

వారంతట వారే వ్రాసిన విధంగా నందూరి వారు అందులకు తగిన ఏర్పాట్లు మన ***మిసిమి*** వారి సౌజన్యంతో జరిగే విధంగా రూపొందించి ఒక పది పదిహేను రోజులు ముందుగా నాకు తెలియజేసినట్లైతే నేను తప్పక వచ్చి తదనుగుణంగా చేయగలను.

ఈ ప్రయోగం తప్పక జయప్రదంగా జరగాలని ఆకాంక్షిస్తున్నాను.

***– ఆకెళ్ళ మల్లికార్జున శర్మ***

# తమిళనాట
# తెలుగు మాండలికాలు

**- జె.వి. సత్యవాణి**

**భా**షకు మార్పు సహజం. వ్యవహారంలో ఉండే భాష ఎప్పుడూ మార్పుకు లోనవుతూనే ఉంటుంది. మార్పు చారిత్రకం, ప్రాంతీయం, సాంఘికమని మూడు రకాలు. మొదటి మార్పు కాలానుగుణంగా ఏర్పడేదైతే, రెండవది సమాన శబ్దాల్లో వ్యాకరణబద్ధమైన మార్పు ప్రాంతీయంగా అగపడుతుంది. మూడవది ఆర్థికసామాజికపరమైనదై ఉంటుంది. వ్యవహారాన్ని అనుసరించి గృహ వ్యవహార భాష పదుగురిలో వాడే భాష. స్త్రీ, బాల, వృద్ధ విద్యార్థుల భాషల్లో భేదం ఉండనే ఉంటుంది.

ప్రస్తుతం తెలుగులో అధిక శాతం పండితులు అంగీకరిస్తున్నది ఆచార్య భద్రిరాజు ప్రతిపాదించిన మాండలికాలు. ఇవి తెలుగుప్రజలు ఆంధ్రదేశంలో వ్యవహరించేవి. ఇటీవల నడుస్తున్నచరిత్ర (ఫిబ్రవరి - 2009)లో తెలుగు వ్యవహారంలో ఉన్న ప్రాంతాలకు సూచిస్తున్న పటం తమిళనాట తెలుగు వ్యవహారంలో ఉన్న ప్రాంతాలను కూడా గుర్తించటం అభినందించదగ్గ విషయం.

అంటే, తమిళనాట వ్యవహారంలో ఉన్న తెలుగు కూడా ఒక మాండలిక భేదంగా పరిగణనలోకి వస్తున్నది. ఆ నేపథ్యంలో తమిళనాట వ్యవహారంలో ఉన్న తెలుగును మళ్లీ ఉత్తర, దక్షిణ ప్రాంతీయ భేదాలు కలిగిన భాషగా గుర్తించవచ్చు. దక్షిణాన ఉన్న మధురై, తంజావూరు లాంటి ప్రదేశాల్లో విజయనగర పతనానంతరం ఏర్పడ్డ రాజకీయ కారణాల దృష్ట్యా తెలుగు భాష వేళ్లూనుకుంది.

ఆధునిక కాలంలో చెన్నై, నెల్లూరు దిగువ ప్రాంతాలకు చెందిన చెన్నప్ప నాయకునిచే స్థాపితమైన చెన్నపురి - లేదా చెన్నపట్నమే ఒకప్పుడు తెలుగు నేలకు దక్షిణ, తూర్పు ఒడ్డు, చెన్నై నగరం చుట్టూ పూర్వపు సహజ తెలుగువారితో పాటు, బ్రిటీషువారి పాలనా కాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలస వెళ్లిన తెలుగువారు సుస్థిరమైన నివాసాలేర్పరుచుకుని ఆర్థిక సామాజిక ప్రగతికి కారణమవటమే కాదు, తెలుగు భాషా సంస్కృతులకు ఒక చక్కని స్థానాన్ని కల్పించారు. ఈ కారణాల వల్ల తమిళనాట మరో తెలుగు మాండలికాల పరిశీలన ఆవశ్యకమవుతుంది.

అయితే ఇవన్నీ మౌఖిక ప్రసారంలో ఉన్న మాండలికాలు. వీటి ప్రయోగ రూపాలు వేరు. సాహిత్య ప్రయోజన మాండలిక రూపాలు వేరు. సాహిత్యంలో ముఖ్యంగా వైష్ణవ సాహిత్యంలో, యక్షగానాది దాక్షిణాత్య సాహిత్యంలోనూ, తమిళనాట తెలుగు మాండలిక రూపం అధికంగా అగపడుతుంది.

ఉదా: ''కూత్తు'' తంజపురాన్నదాన నాటకము, 'తిరువళిక' (పూతనా హరణము) 'పంగుని' (మ.దా.వి) 'పదిలత' (ధర్మాంగద చరిత్రం) 'సొల్లు' (శ్రీ గిరి కురవంజి (20వ శతాబ్దం), ఆ తర్వాత 20వ శతాబ్దంలో తెలుగు సినిమా జగత్తు తమిళ నాట ముఖ్యంగా చెన్నై నగరాన్ని కేంద్రంగా చేసుకుని ఎదగటం వల్ల కాబోలు కొన్ని తెలుగు సినిమాల్లో తమిళ యాస దర్శనమిస్తుంది. కొన్ని తెలుగు సినిమాల్లో తమిళ పాత్రలు కూడా కనిపిస్తాయి.

**ఉదాహరణ:** మరోచరిత్ర, అమ్మా నాన్నా ఓ తమిళ అమ్మాయి, దేశముదురు, అర్జున్, ఇవి కాక ఎక్కడైనా చాలా అరుదుగా ఆ మాండలికం రచనల్లో కనిపించవచ్చును. కానీ సాధారణంగా తమిళనాడు నుంచి వెలువడే రచనలు ప్రామాణిక భాషలోనే ఉంటాయి. దానికి కారణాలు రెండు కావచ్చు.

1. ఎక్కువగా రచయితలు, రచయిత్రులు ఉన్నత విద్యావంతులు కావటం.

2. తమిళ సాహిత్యంలో మాస, వార, దిన పత్రికల్లో, సంభాషణలు మినహాయిస్తే మిగిలిన భాష నేటికీ గ్రాంథికంలోనే ఉండటం వల్ల దాని ప్రభావం తెలుగు

డాక్టర్ జె.వి. సత్యవాణి, ఫోన్ : 9441134856

రచనలపై పడి ఉండవచ్చు లేదా తొలితరం రచయితలు ప్రామాణిక భాషను స్వీకరించటం విద్యావంతుల లక్షణంగా భావించటం వల్లా కావొచ్చు. ఇంకా తరిచి చూస్తే, వివిధ మాండలిక భాషా వ్యవహర్తలు చెన్నై మొదలైన ప్రాంతాల్లో నివసించినా, విద్య, ఆర్థిక సామాజిక, రాజకీయ కళారంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నవారు కనుక ప్రామాణిక భాషనే వాడి ఉండవచ్చుననిపిస్తుంది. పైన చెప్పుకున్న చిత్రాల్లో కొన్నింటిలోని భాషను పరిశీలిద్దాం.

**1. అదొంగుప్ప రాణ నేనుదా వెళ్లి మాట్టాడనా?** 'మీ నాన్న మీద ఒట్టు. నేను వెళ్లి మాట్లాడనా? తండ్రి మీద ఒట్టు పెట్టటం తెలుగులో కనిపించదు. అమ్మ మీద ఒట్టే అగుపిస్తుంది. అయితే ఇది, తమిళంలో ఆశ్చర్యార్థకంగా వాడబడుతోంది. తెలుగులో ఈ వాడుక కృతకంగా అనిపిస్తుంది.

**2. బంతికెట్టలేదన్నా వెయ్యిమంది దాకా తింటా రనుకుంటిమే...** బంతికి ఎంత లేదన్నా వెయ్యిమంది లేస్తారనుకుంటున్నాం. వెయ్యి విస్తళ్ళు పడతాయను కుంటున్నాం. ఎట్ట అనే సర్వనామం తెలుగులో వాడుక కాదు. ఎంత అనే పరిణామార్థకమే. ఇలాంటి సందార్భాల్లో ప్రయోగించ బడుతుంది.

**3. మగబిడ్డకి ఇట్లా అయిపోతుండాము రెండూ ఆడబిడ్డలంటనే –** మగబిడ్డకే ఈ పాట్లు పడుతున్నాము. ఇద్దరూ ఆడబిడ్డలట కదా. మహత్, మహతీ వాచకాల్లో రెండు అనే సంఖ్యా వాచక ప్రయోగం తెలుగులో ఉండదు : అది అమహత్క్ష తోనే ప్రయోగించ బడుతుంది. ఇద్దరు అనే సంఖ్యా వాచక రూపమే మహత్, మహతీ వాచకాల్లో ఉంటుంది.

**4. ఈ పొద్దు చానా మంచి పొద్దు – పొళుదు** అనే తమిళ పదానికి దగ్గరగా ఉండే పొద్దు వాడకం తమిళనాట సాధారణం. చాలాకు బదులు చానా ల–నల వినిమయం తెలుగుకు సహజమే.

**5. నిజం సొల్లు సొల్లుడా నీయబ్బ... నామాట కేళు...** తెలుగు వాక్యంలో తమిళ క్రియా ప్రయోగం. సొల్లు – చెప్పు క్రియకు సమానార్థకం చెప్పు ప్రస్తుతం తమిళంలో లోపించింది. దాని స్థానాన్ని సొల్లు వాడుక అగుపిస్తుంది. కానీ దేశీ కవిగా కీర్తించబడుతున్న భారతి చెప్పుం మొళి పదినెట్టుడైయాళ్ అని చెప్పు క్రియనే వాడాడు. అలాగే కేళు – విను క్రియ తమిళ, మళయాలల్లో బాగా వాడుకలో ఉంది.

**6. నాన్ దా అమ్మన్ దా :** ఇది విశేష ప్రయోగం. చిత్ర పరిశ్రమకే పరిమితం అనవచ్చు. అమ్మకు మహద్వాచక ఏకవచన పుంలింగ ప్రత్యయం 'న్' చేర్చటం.

దీన్ని సాంస్కృతిక పరిధిలో పరిశీలిస్తే న్‌తో కూడిన అమ్మన్ రూపం దేవత, అమ్మవారు అనే అర్థాలను సూచించే రూపంగా చెప్పవచ్చు. ఎల్లైయమ్మన్, మారియమ్మన్, చెల్లియమ్మన్, పూవాత్తమ్మన్ వంటివి గ్రామ దేవతల పేర్లు.

**7. జుట్టుపట్టి గోడకేసి ఆడిదానంటే తల పగిలి పూడుసుద్ది ...వేగిరం సాపుడు... వాయి ముడిచి కాపురం చెయ్... నేనే సంపి పూడుస్తా...** జుట్టు పట్టుకుని గోడకేసి కొట్టానంటే తలపగిలి పోతుంది. వేగిరం తిను, నోరు మూసుకొని కాపురం చెయ్... నేనే చంపి పారేస్తా. తెలుగు తమిళ కలయిక బాగా విరివిగా అగుపిస్తుంది. పోతుంది తమిళ క్రియ. తమిళనాట పూడుస్తుంది గనే వాడబడుతుంది. వేగిరం – ఉత్తరాంధ్ర మాండలికం. అది తమిళదేశపు వాడుక కాదు. బహుశ రచయిత భాషకావొచ్చు. 'పోవు' క్రియకు పరిమితమైన 'పూదు' పారవేయు క్రియకు బదులుగా ప్రయోగించబడటం కూడా విశేషమే. పై ఉదాహరణలు చిత్రాల్లో నుంచి తీసుకోబడ్డాయి. ఇక నేటి తమిళ నాటి ఉత్తర మాండలిక ప్రయోగాలని చూద్దాం. మాండలికాలను పరిశీలించేటప్పుడు ధ్వనులు, పదాలు, వాక్య ప్రయోగాలను భాషావేత్తలు పరిగణనలోకి తీసుకుంటారు.

**ధ్వనులు :**

| | |
|---|---|
| **దగ్గర – దగ్గెర** | : పదాది, పద మధ్య 'అ' 'ఎ' గా మారింది. |
| **తీపి – తీపు** | : పదాంతంలోని 'ఇ' 'ఉ'గా మారింది. |
| **మావాడు – మావోడు** | : పద మధ్య 'అ', 'ఓ'గా మారింది. |
| **రాబోకు – రాబాకు** | : పై ప్రయోగానికి వ్యతిరిక్తంగా పద మధ్య 'ఓ', 'ఆ' గా మారింది. |
| **వస్తారు – వస్తురు** | : పద మధ్య దీర్ఘం హ్రస్వమయింది. |
| **హుషారు – ఉసారు** | : ఇందులోరెండు మార్పులు ఉన్నాయి. పదాది 'హ' లోపం మూర్ధన్యం ఊష్మం 'ష' దంత మూలీయం 'స'గా మారటం. ఇది శిష్టేతరుల భాషలో సహజం. |
| **చేమంతి – చామంతి :** | పదాది 'ఏ', 'ఆ' గా మారుతుంది. |

**పదాలు :**

ఏటులు – దెబ్బలు, దుడ్డు – డబ్బు, తోడుకొని – తీసుకొని, మగ పాప – మగబిడ్డ, భోంచేసివా – తిన్నావా (భోజనం మామూలుగా అన్నం విషయంలోనే తప్ప ఉపహార, ఫలహార విషయంలో తెలుగు ప్రయోగం ఉండదు).

చూసినావా – చేసావా (రాయలసీమ మాండలికాన్ని పోలిన రూపం, కాని, తమిళనాటి తెలుగు మాండలికంలో తిఫన్ భోంచేస్తివా వంటి ప్రయోగాలు అగపడతాయి).

చూసినావా విడిచి+నానా – ఇటువంటి పూరణార్థక క్రియల వాడుక తెలుగులో లేదు. మరోలా చెప్పాలంటే, ఇటువంటి ప్రయోగాల్లో సహాయక క్రియ తెలుగులో రాదు. తమిళ భాష ప్రభావం వల్ల తెచ్చు క్రియకు సహాయక క్రియగా విడుచు చేరిందని చెప్పవచ్చు. ఈ ప్రయోగం రాయలసీమ మాండలికానికి దగ్గరగా ఉన్నా తమిళ ప్రభావమనే చెప్పాలి. త. కొండువందాన్.

చేసును – చేస్తాడు / చేస్తుంది. ఇది ఒక విశేష ప్రయోగం.

తమిళంలో క్రియా రూపాల్లో కూడా స్త్రీ. పుంలింగ రూపాలు ఉంటాయి. (ఇటువంటి ప్రయోగం మళయాల భాషలోనే కనిపిస్తుంది).

కండిప్పుగా – తప్పకుండా

కండుకో – గమనించు

అంటిపండు – అరటిపండు

గొయ్యా పండు – జామ పండు

సెలవు – ఖర్చు

నేరమే – వేళ / సమయం

ఒత్తుకో – తప్పుకో / జరుగు

వారగా / ఓరగా – పక్కగా త. ఓరమా.

**వాక్యం :**

**1. దానికి నిండాదా తిమురు: అది అట్లదా మాట్లాడును :**

ఈ వాక్యాల్లో 'ఏ' 'ఆ' అనేవి ఏవర్ధకానికి బదులుగా 'దాన్' అనేది వాడబడుతుంది. తమిళనాట తెలుగులో ఈ ప్రయోగం ఎక్కువ. అందులోనూ పదాంతంలోని 'న్' లోపించిన రూపమే ఎక్కువ. ఇది మళ్లీ తెలుగు భాషకు సహజం. తెలుగులో పదాంతంలోని 'న్' లోపించటం నిండా – ఎక్కువ తెలుగులోని నిండుగా ప్రయోగానికి దగ్గర రూపం.

**2. గంట అయింది పండుకునేది ఎప్పుడు? :**

పొద్దు పోయింది. ఇంకా ఎప్పుడు పడుకోవటం? అన్న భావాన్ని సూచించే ఈ వాక్యంలో పదాల వాడుక, పద ప్రయోగ విధానం రెండూ తమిళ ప్రభావానికి లోనైనవే. ముఖ్యంగా 'పండు' పద మధ్య అరసున్న నిండుసున్నగా పలకటం అనేది తమిళనాటి భాషలో చాలా పదాల్లో అలా ఉచ్చరించబడటం గమనించవచ్చు.

ఉదా: కోతి – కోంతి, పీకు – పీంకు, మీద – మీంద, అరటి – అరంటి, / అంటి, ఈ ప్రయోగాలన్నీ (చివరిది తప్ప) గమనిస్తే దీర్ఘం మీది అరసున్న నిండుసున్నగా పలకబడటం స్పష్టమవుతుంది. కానీ పండుకొను – పడుకొను / నిద్రించు అనే అర్థాన్నిచ్చే క్రియలో మాత్రం ఈ ప్రయోగం విశేషమే. దీర్ఘాచ్చు మీది అరసున్నను నిండు సున్నగా ఉచ్చరింపబడటాన్ని కొందరు ఆధునిక వ్యాసకర్తలు గుర్తించారు. కానీ అక్కడక్కడా హ్రస్వాచ్చు మీద అరసున్న కూడా నిండుసున్నగా ఉచ్చరించ బడటం విశేషం.

**3. పండగకు గుడ్డలు ఎత్తిడిస్తివా? తీస్తివా? :**

పండగకి కొత్త బట్టలు కొనుక్కున్నావా? ఆత్మార్థక క్రియా రూప ప్రయోగం ఇక్కడ కనిపించటం లేదు. ఎత్తు / తీయు క్రియలు ఇటువంటి సందర్భాల్లో న్యూనార్థకంగా తెలుగులో భావించబడతాయి.

**4. ఏంది అట్టా మొరస్త వుండావు? అంత కోపమెందుకు వస్తావుంది? :**

గుడ్లు మిటకరించి చూడటం. కోపంగా చూడటం అనే భావాన్ని చెప్పటానికి 'మురస్త' అనే తమిళ పదం వాడబడుతోంది. ఇది ఇప్పటికీ నెల్లూరు మాండలికంలో వాడుకలో ఉన్నట్టు తెలుస్తుంది. 'వస్తోంద' ఆధునిక భాషలోని వర్తమాన క్రియా రూపం దానికి బదులుగా వస్తావుంది. ఇది పదంలో సంధి కలవని రూపమైనా కావొచ్చు. లేదా ఉండు అనే క్రియ తమిళ భాష ప్రభావంతో సహాయక క్రియ (ఆక్సిలరీవెర్బ్) గా నైనా ప్రయోగించబడి ఉండవచ్చు.

**5. ఇప్పుడంతా సెలవులు జాస్తి అయిపోయింది :**

ఇప్పుడు ఖర్చులు ఎక్కువవుతున్నాయి. / ఇప్పుడు ఖర్చు ఎక్కువయింది. ఖర్చు (నా, వా) ఏకవచనంలో ఉంటే క్రియ

ఏకవచనంలోను, బహువచనంలో ఉండటం సాధారణం. అయితే ఇక్కడ ఖర్చులు బహువచనంలోను క్రియ ఏకవచనంలోను ఉండటం గమనించదగ్గ విషయం.

**6. ఒళ్లుకు మంచిది, ఉదుకు నీళ్ళు ఒళ్లుకు పోసుకో, ఒళ్లుకు ఎట్టుండాది? :**

ఈ వాక్యాల్లో ఒళ్లు అనే నామవాచకం ఔపవిభక్తిరూపం. పొందుకుండానే విభక్తి ప్రత్యయాన్ని స్వీకరించటం తెలుగు భాషకు తగిన వాడుక కాదు. ఇది తమిళ ప్రభావం. ఒడంబుకు అని తమిళ ప్రయోగం. ఒళ్ళు – వంటి అనేది ఔప విభక్తిక రూపం.

తమిళ, తెలుగు భాషల కలయికలో ప్రయోగింపబడే వాక్యాలకు కొన్ని ఉదాహరణలు:

**1. అదంతా కందుకుంటే బతికేది నిండా కష్టం :**

అవన్నీ పట్టించుకుంటే బతకటం కష్టం. కందుకో అనే క్రియారూపం పట్టించుకో అనే అర్థంలో వాడబడింది.

బతుకు వంటి నామవాచకాలకు నిండా వంటి విశేషణాలు తెలుగు భాషకు అసహజం. అటువంటి సందర్భాల్లో చాలానే వాడబడుతుంది.

**2. నేను చెప్పేది మీకు అర్థమయిందా? అవలే అని మట్టుంచెప్పేయకావే :**

నేను చెప్పేది నీకు అర్థమయిందా? కాలేదని మాత్రం 'చెప్పకే'. ఇక్కడ అసహజంగా కనిపించేవి రెండు.

మొదటి ప్రశ్నలో గౌరవ బహువచన ప్రయోగం –

రెండవ వాక్యంలో చనువును సూచించే ప్రయోగం. ఏమే అనే రూపానికి మే, వే లు అపభ్రంశాలనవచ్చు. ప్రశ్న మొత్తం తెలుగులో ఉంది. వివరణలోకి వచ్చేసరికి 'అవలే – కాలేదు' కు బదులుగా వాడబడటం మాత్రం అనే అర్థంలో 'మట్టుం' అని వాడటం. ఈ మట్టుం తెలుగులో మట్టుకు గా ఉంది. చాలా అనే విశేషణంతోనే వాడుకలో ఉంది.
ఉదా: దారి చాలామటుకు పాడైయింది / బాగుంది : చాలామటుకు పని పూర్తయింది.

**3. మా ఇంటాయన ఊరికి పోయుండాడు. రెండు దినాల్లో వస్తురు :**

మా ఆయన ఊరుకు వెళ్లారు. రెండు రోజుల్లో వస్తారు. తెలుగులో మా ఆవిడ, మా ఆయన రూపాలున్నాయే కాని, ఇంటావిడ, ఇంటాయన వంటి ప్రయోగాలు లేవు.

**4. నువ్వేం మాట్లాడతాండావు? నాకేం పురింజలేదు :**

నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటం లేదు. ఈ వాక్యంలో పురింజ లేదు. అర్థం కాలేదు అనే తమిళ ప్రయోగమే కనబడుతుంది.

**5.నస్సున్నారా :**

బాగున్నారా? తమిళంలోని నల్లాయి రుక్కీంగళా కానీ, తెలుగులోని బాగున్నారా కానీ కాకుండా కోయంబత్తూరులో వినిపించే ఈ 'నస్సు' బహుశః 'లెస్స'రూపం కావొచ్చు.

**6. ఎళనీర్ తాగితివా ? :**

కొబ్బరి బోండాం తాగావా? ఈ ఎలసరు ప్రయోగం తమిళనాడుకు దగ్గరున్న కుప్పం పరిసర ప్రాంతాల్లో కూడా వినిపిస్తుంది.

**7. ఏం కాయలు వండేది? :**

ఏ కూర వండను? తమిళంలో ఎన్నకాయ్ సమైక్కరదు అనే ప్రయోగాన్ని పోలీ కూర అని కాకుండా కాయి అనే పదం వాడబడింది. తెలుగులో కూర వండటం తప్ప కాయ వండటం ఉండదు. కాయలు వండటం తమిళ సంప్రదాయం.

**8. సొమ్ములు ఆడమానం పెట్టిదా పెండ్లి చేయాల :**

సొమ్ములు కుదువ పెట్టే పెళ్లి చేయాలి. కుదువకు బదులుగా తమిళ శబ్దం ఆడమానం వాడబడింది. ఈ పద ప్రయోగం సాహిత్యంలో కూడా ఉంది.

**9. ఆ పడంలో కడసిలో హీరోని కొలచేసేది నాకు పట్టలా :**

ఆ సినిమాలో చివర్లో హీరోని చంపటం నాకు నచ్చలేదు. 'చిత్రం' అనే అర్థాన్నిచ్చే పదం : చివర అనే అర్థాన్నిచ్చే 'కడసి' 'చంపు అనే అర్థాన్నిచ్చే కొలై వాడటమే కాదు. కొలైసెయ్ వదు తమిళ క్రియా రూపం. అలాగే తెచ్చుకొని కొల+చేసేది అని వాడటం తమిళ ప్రభావమే.

**10. నీ తొల్ల తాంగముడియలేదు :**

నీ గొడవ భరించలేం. గొడవ అల్లరి అనే అర్థాలున్న

తొల్లై తొల్లగా వాడబడింది. తాంగు క్రియకు దగ్గరగా ఉండే తెలుగు క్రియా రూపం తాకు, ముట్టుకోవటం, స్పృశించటం అనే అర్థం కాదు. తాళు అనే అర్థాన్నిస్తుంది. తాకు పట్టలేదు / దు తాలిమి, ఓరిమి లేకపోవటంగా అగుపిస్తుంది.

**11. పెండ్లికి వాళ్లానంతా వచ్చేయమని చెప్పిడిస్తిని :**

పెళ్ళికి వాళ్లందరినీ రమ్మని పిలిచాను. పిలిచాను అనే క్రియకు బదులుగా చెప్పి + విడిస్తిని. విడచు అనే సహాయక క్రియ ప్రయోగం తెలుగులో అసహజం.

**12. రేషన్‌లో ఈ దినంద కిరసానాయిలు ఇస్తరు. పోయి, తెచ్చిడిసినావా? :**

రేషన్‌లో ఈ రోజు కిరసనాయిలు ఇస్తారు. వెళ్ళి తెచ్చుకో / తెచ్చుకున్నావా? ఇక్కడ విడుచు అనే సహాయక క్రియ ప్రయోగించటమే కాదు, సమీప భవిష్యత్తును సూచించే క్రియకు బదులుగా భూతకాలిక క్రియా ప్రయోగం కూడా విశేషమే.

**13. మా ఇంటాయనకి నాల్గు దినాలుగా ఒళ్లుకు బాగులేదు. డాక్టరు దెగ్గెర తోడ్కొని పోవాల :**

మా ఆయనకు ఒంట్లో బాగులేదు. డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాలి. ఒడలు రూపానికి బహువచన రూపమైన ఒళ్లు వాడటం తెలుగులోనూ ఉంది. కాని ఒళ్లు ఔపవిభక్తిక రూపంగా మారకుండానే ఉంటుంది. తమిళ వాడుకను అనుసరించి : 'ఒడలుకు' లాగే ఒళ్లు – కు అయింది.

**14. ఏమప్పా? ఏం చేస్తావు? మొన్న అంగడికి వస్తిని. నువ్వు కాణం. సెరిద అని పోయిడిసి నేటికిదా వస్తా వుందాను:**

ఏమయ్యా, ఏం చేస్తున్నావు? మొన్న మీ అంగడికి వచ్చాను. నువ్వు లేవు. సరేనని వెళ్లి పోయి ఇవ్వాళ వస్తున్నాను. తమిళ పదాలైన కాణం సెరిదాలు వాక్య రచనా రీతిలో కొత్తదనాన్ని తెస్తున్నాయి.

చేస్తున్నావు అనే వర్తమాన క్రియకు బదులు 'చేస్తావు' తద్ధర్మార్థక క్రియ వాడబడింది.

**15. కడలముటాయి పిల్లకాయలందరికి ఇస్తివా? :**

వేరు సెనగ మిఠాయి పిల్లలందరికి ఇచ్చావా? పదప్రయోగం విధానంలో తప్ప విశేషం లేదు.

**16. నేను చెప్పేది కాదులో వేస్కో అప్పుదుదా గమనం ఉంటుంది :**

నేను చెప్పేది జాగ్రత్తగా విను. అప్పుడే గుర్తుంటుంది / చెవినోసుకో, అప్పుడే గుర్తుంటుంది. కాదు – చెవి : గమనం – గుర్తు, జ్ఞాపకం.

**17. ఎంత దుడ్డు వాడికిస్తిని, వాడికి కొంజమైనా సంద్రి ఉందా? :**

వాడికి కొంచెమైన కృతజ్ఞత ఉందా?

పై వాక్యాల్లో తమిళ పదాలున్న వాక్య రచనా రీతిలో ఏ విధమైన విశేషం లేదు.

తమిళనాడు తెలుగులో విశేష ప్రయోగాలు పదాల వాడుకలోను, వాక్య రచనలోనూ కూడా అగుపిస్తున్నాయి. ఈ విశేష రూపాలు తమిళ భాషా ప్రభావం వల్ల మాత్రమే ఏర్పడి ఉండాలని లేదు.

అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్న భాషీయులు ఎక్కువగా మిగిలిన మాండలికాలు మాట్లాడే వారితో సంబంధాలు కలిగి ఉండకపోవటం వల్ల కూడా ఏర్పడి వుండొచ్చు. లేదా ఏ సెలవుల్లోనో మాత్రమే తమ మాండలిక భాషా వ్యవహర్తలతో కలవటం కూడా కారణాలు కావొచ్చు.

తమ మాండలికంగా రూపుదిద్దుకున్న భాషను పరిరక్షించుకోవాలన్న తపన అంతగా అగపడదు. తమిళనాట తెలుగు వారు ద్వితీయ శ్రేణి ప్రజలుగానే చూడబడుతున్నారు. నిజానికి దాదాపు 40 శాతం మంది తెలుగు వారున్న తమిళనాట వారికి ఏ ప్రత్యేకత లేదు సరికదా, హోసురు, తళి వంటి చోట్ల ఎన్నికైన తెలుగు ఎం.ఎల్. ఏలు చట్ట సభల్లో తెలుగులో తమ గోడు వినిపించడానికి కూడా వారికి అవకాశాలు తక్కువ.

తమిళనాట విడిమాండలికంగా వ్యవహారంలో ఉన్న భాషనే కాదు, అక్కడి భాషా వ్యవహర్తల సాంస్కృతిక విశేషాలను కూడా గమనించి వాటిని గురించి తగిన పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగులో ప్రస్తుతం వాడుకలోంచి తొలగిపోతున్న రూపాలు తమిళనాట కనిపిస్తాయి. వాటిని పరిరక్షించుకోవటం మన కర్తవ్యం. మి




# ఆంధ్రదేశములో శకముల వాడుక

- వేపా రామేశం

శకమనగానేమి? కొన్ని విషయములు సంభవించిన కాలమును వర్ణించవలసి వచ్చినప్పుడు ఒక మహాపురుషుని జననము, లేదా మరణము, లేదా వారి జీవితములో మరేదైనా ముఖ్యసంఘటన జరిగిన కాలము నుంచిగాని, లేక మరేదైనా గొప్ప సంఘటన జరిగినప్పటి నుంచిగాని సంవత్సరములు లెక్క పెట్టించుట మామూలు. అందులో మొదటి అంశమునకే శకమని పేరు. మన దక్షిణదేశములో మనము శాలివాహన శకమును వాడుచున్నాము.

ఉత్తరదేశమువారు విక్రమార్కశకమును వాడుచున్నారు. హూణులు క్రీస్తు జననం దగ్గర నుంచి సంవత్సరాలు లెక్కపెట్టుకొంటున్నారు.

మహమ్మదీయులు మహమ్మదు మక్కానుండి మదీనా వెళ్ళిన సంవత్సరంనుంచి లెక్కచూచుకొంటున్నారు.

ముఖ్యముగా ఆయాసమయాలలో ఆంధ్రదేశములో ఏ శకము ఎప్పటి నుంచి అమలులోనున్నదీ విచారిద్దాము-

మనకు దొరికిన వరకు శాసనములలో ఎక్కడా క్రీస్తు అనంతరము 400 సంవత్సరాలకు ఏశకమున్నూ వాడుక చేసినట్లు కనపడదు. ఏదైనా ఒక విషయము యొక్క కాలమును వర్ణించవలసి వచ్చినప్పుడు అప్పటిరాజు పరిపాలనా సంవత్సరము, ఋతువు, అందులో పక్షము, అందులో తిథి చెప్పుకుంటూ వచ్చేవారు.

ఉదా: బళ్లారి జిల్లాలో మయు 9దో నెలలో శాలివాహనవంశపు రాజైన శ్రీవాశిష్ఠపుత్ర స్వామిశ్రీ పులిమావి అనే రాజుయొక్క శాసనం ఒకటి ఉన్నది. అది వారి 8వ సంవత్సరంలో హేమంత ఋతువునందు రెండవపక్షంలో ప్రథమదినమున వ్రాసినట్లు ఉన్నది. ఇదే విధంగా ఇక్ష్వాకుల శాసనములలోను, పల్లవుల శాసనముల లోను కనిపిస్తున్నది. సాలంకాయనులూ, బృహత్పలాయనులూ మొదలైన వంశాల రాజుల చరిత్రలున్నూ ఇదే రీతిగా వర్ణింపబడియున్నవి. ఇందుకు నిదర్శనంగా పల్లవుల కాలంలో రెండవ సింహవర్మయిచ్చిన ఒంగోలుశాసనం ఒకటి వున్నది. అది వారి నాలుగవసంవత్సరంలో వైశాఖమాస ప్రథమపక్షమందు రెండవతిథిలో సూర్యగ్రహణకాలము నిమిత్తం ఒక అగ్రహారం (కొణికి) దానమిచ్చినట్లు కనబడుతోంది.

ఇంతకుముందు హిందూదేశంలో గ్రహణములు, మాసములు, తేదీలు మొదలైనవి చెప్పినట్లు లేవు. ఈ సింహవర్మశాసనము క్రీ.శ. 328 వ సంవత్సరం 6వ తేదీ ఏప్రిల్ నాటిది.

ఇంక శకప్రయోగము ఎప్పటినుంచి వచ్చినదో విచారిద్దాము. కళింగదేశపు మాథరులు, వాసిష్ఠులు మొదలైనవారి శాసనములలో శకము తెలుపబడి ఉండలేదు. వీరి తర్వాతను గంగవంశమువారు, అనగా గాంగేయులు ఏలినట్లు శాసనములలో కనిపిస్తున్నది. ఈ శాసనములన్నీ గాంగేయశకము నుండి లెక్కింపబడివున్నవి. ఈ గాంగేయ శకమును వాడుకచేసిన శాసనములన్నీ శ్రీకాకుళమునకు ఉత్తరముగా ఉన్న ప్రదేశములోనే ఉన్నట్లు కనిపిస్తుంది.

ఈ శకము క్రీ.శ.498 లో స్థాపించబడినట్లు నేను "ఆంధ్రా క్రానాలజీ" గ్రంథంలో నిర్ణయించివున్నాను. తర్వాత మిరాశి అనే ప్రభుత్వపురావస్తు పరిశోధన సూపరింటెండెంటు కూడ ఇదే విధంగా అభిప్రాయపడినారు. గంగ వంశమువారి ఈ శకము సుమారు 900 సంవత్సరముల వరకు వాడుకలో ఉండినది. మొదటి గంగవంశము అప్పటితో అంతరించినది.

అప్పుడు మరియొక గంగ వంశము ఆరంభమైనది. వారు వెనుకటి రెండు మూడు శాసనములలో అదివరకటి గాంగేయశకమునే వాడుకచేసి తర్వాత శాలివాహనశకమును అమలులోనికి తెచ్చినారు. క్రీ.శ.1045 సంవత్సరములో శాలివాహన శకమారంభించి, అప్పటినుంచి అమలులో ఉన్నది. అయితే, శ్రీకాకుళమునకు దక్షిణంగా ఉన్న ఆంధ్రదేశంలో ఏ శకము, ఎప్పటినుంచి అమలులోనికి వచ్చినది

అనేది యోచింప వలసియున్నది. ఆంధ్రదేశంలో మొదట ఏలూరు దగ్గర ఉన్న పెదవేగి గ్రామాన్ని, తర్వాత రాజమహేంద్రవరాన్ని తమ ముఖ్యపట్టణముగా చేసుకొన్నటువంటి తూర్పు చాళుక్య వంశరాజులు క్రీ.శ.624 నుండి 1070 వరకూ పరిపాలన చేసి తర్వాత అరవదేశమునకు వివాహాది సంబంధములచే రాజులై, అక్కడ 1260 వరకూ పరిపాలన చేసినట్లు కనబడుతున్నది. కాని వీరి మొదటి శాసనములలో శాలివాహన శకము కానరాదు.

వీరు బొంబాయి రాజధానిలో ఉన్న బీజపూరు జిల్లాలో ఇప్పుడు బాదామి అనే పేరుగల వాతాపిపురము నుంచి మన తెనుగు దేశమునకు వచ్చి రాజులైనారు. అన్నవచ్చి తమ్ముణ్ణి సింహాసనాధిపతిని చేసి బొంబాయి రాజధానికి వెళ్ళిపోయినాడు. అక్కడ వాతాపిలో ఉన్న రోజుల్లో శాలివాహనశకము మూడేమూడు శాసనములలో మాత్రము వాడుకచేసినట్లు కనబడుతుంది.

(1) ఈ రాజుల తండ్రి కీర్తివర్మ ఇచ్చిన శాసనం వాతాపిపుర గుహలో ఒకటి ఉన్నది. అది శా.శ.500 (క్రీ.శ.578) లో ఇచ్చినట్లు కనబడుతున్నది.

(2) ఆయన కుమారుడు పులకేశి ఇచ్చిన ఒక శాసనము హైదరాబాదులో ఇటీవల దొరికినది. అందులోనూ శాలివాహనశకము చెప్పబడినది. అది సూర్యగ్రహణ నిమిత్తం ఇవ్వబడినది.

(3) మూడవది వీరే అయిహోలు గ్రామంలో ఇచ్చిన శాసనం. అందులో వారి దండయాత్రాక్రమము, పిఠాపురము మున్నగు ప్రాంతములను జయించిన విధము చెప్పబడినది. ఈ మూడు శాసనములున్ను బొంబాయి రాజధానిలో ఇవ్వబడినవిగాని ఆంధ్రదేశములో ఇచ్చినవి కావు.

తర్వాత రెండో పులకేశి మనుమడు వినయాదిత్యుడు పల్లవులతో చేసిన యుద్ధంలో తంజావూరు వరకు వచ్చి, కావేరిని దాటి అక్కడ ఒక శాసనము ప్రకారం ఒక బ్రాహ్మణునికి అగ్రహారం ఇచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పుడు ఆ శాసనం గద్వాలలో ఒక బ్రాహ్మణునియింట, కర్నూలు హైస్కూల్లో చదువుకుంటున్న ఒక కుఱ్ఱవానిద్వారా దొరికినది. ఇప్పుడిది ప్రభుత్వపురావస్తుశాలలో ఉన్నది. ఆ శాసనం తమ యింట్లో చిరకాలంగా ఉన్నదని ఆ చిన్నవాడు చెప్పినాడు. దాని తేది (క్రీ.శ. 674) ఇదిన్నీ తెనుగుదేశమున ఇవ్వబడినది కాదు. దీని తర్వాతను మరియొక శాసనము-ఆ రాజకుమారుడే (వినయాదిత్యుడు) ఇచ్చినది-కర్నూలు జిల్లాలో నంద్యాలకు నైరుతి మూలగాఉన్నటువంటి తొగర్చేటి గ్రామంలో దొరికినది. అదిన్నీ బొంబాయి రాజధానిలో బాదామినుంచి ఇవ్వబడినదే. ఈ అయిదున్ను పశ్చిమ చాళుక్యులిచ్చినవే.

తూర్పు చాళుక్యులిచ్చిన తొలిశాసనము చాళుక్యభీముడు (ప్రథమ) ఇచ్చిన అత్తిలి శాసనము. ఇది శకసంవత్సరము (కీ.శ.814) మేషచైత్ర బహుళ 2 సోమవారమున ఇవ్వబడినది. (1917వ సంవత్సరములో జాగ్రత్తచేసిన రాగిశాసనాలలో 14-వ నెంబరు) ఇదే ఆంధ్రదేశంలో మొట్టమొదటి సారిగా శాలివాహన శకము వాడుకచేసిన సందర్భము. అప్పటినుంచి క్రమక్రమంగా దీని వాడుక హెచ్చి, దేశంలో బాగా పరిపాటి అయిపోయింది.

ఇక ఈ శాలివాహనశకమనగానేమో విచారిద్దాము. శాతవాహనులని ఒక వంశము పురాణాలలో ఆంధ్రులు, ఆంధ్రభృత్యులు, శాతవాహనులు అనే పేర్లలో చెప్పబడివున్నది. మత్స్య, వాయు, బ్రహ్మాండ, విష్ణు, భాగవత పురాణాలన్నిటిలో ఈ వంశపు రాజులు చెప్పబడివున్నారు.

ఈ వంశపు రాజుల్లో మొదటివారు మన ఆంధ్రదేశాన్ని ఏలినట్లు కనబడదు. పూనా చుట్టుపట్ల ప్రదేశాలను పరిపాలించినట్లు కనిపిస్తున్నది. పూనా దగ్గర నానాఘాట్ కనుమలోను, జుర్నార్ అనే గ్రామంలోను, ఇంకా కొన్ని గ్రామాలలోను వీరి శాసనములున్నవి. వీరిలో బహు కీర్తివంతుడైన రాజు గౌతమీపుత్రశాతకర్ణి అనే అతడు. వీరి కాలంలో ఈ శకం స్థాపించబడినదని నా అభిప్రాయం.

ఈ శకసంవత్సరము చెప్పిన మొదటి శాసనము లన్నిటిలోను దీనిని శాలివాహన శకమని అనలేదు. 'శకనృపకాలే' అనే చెప్పబడినది. అనగా 'శక'మనే పేరుగల వంశపురాజుల కాలమని సూచించబడినది. ఉజ్జయినీ ఆ ప్రాంతమందు శకరాజులు కొందరు ఏలినట్లు మనకు శాసనములు, ఇతర నిదర్శనములవల్ల తెలియవచ్చుచున్నది. వారు మొదట కేవలము హిందువులు కారు. పారసీక దేశమునుంచి వచ్చినవారు. వారికి సత్రాపులని (క్షాత్రప అనే పక్ష....శబ్దం) పేరు. వీరిలో మొదటివాడు భాషాన. వాని తర్వాత జయదామన. మూడవవాడు రుద్రదమనుడు.

క్రీ.శ.320 సంవత్సరముతో ఈ వంశమంతరించి పోయింది. హిందూదేశంలో ఉన్న శాలివాహన శకరాజుల శాసనములు ఈ క్షాత్రపరాజులవే అయియున్నవి. మొదటి అయిదు శాసనములలో నాలుగు క్షాత్రపులవిన్నీ, ఒకటి వాని బంధువుడైన అభీరుడు ఈశ్వరసేనుడిదిన్నీ అయియున్నవి. ఇవన్నీ గుజరాతుదేశంలోనే ఉన్నవి.

ఇవి దొరికిన గ్రామాల పేర్లు: జునాఘడ్ గుండా మూలవాసర్ జాన్‌దాన్, నాసిక్. ఇందువల్ల నాకు తోచుచున్నదేమిటంటే, ఈ క్షాత్రపులవల్లనే ఈ శకం మొదట స్థాపించడమైనది. సుమారు వెయ్యి సంవత్సరాలకు 'శకనృపకాలే' అనే చెప్పబడినది. ఇటీవల శకనృపులంటే ఎవరో తెలియక, శాలివాహన అనే శబ్దం కలిపి శాలివాహనశకం అని వాడుతూ వచ్చినారు. రమారమి కీ.శ.1000లో శాలివాహననామం చేర్చడమైనది.

శాలివాహనుడనే రాజు లేడు. సంస్కృతంలో శాతవాహన శబ్దానికి ప్రాకృతరూపం 'శాలివాహన' అని. ఆ వంశస్థులందరూ శాలివాహనులే. వారికే శాతకర్ణి అనే బిరుదు ఉన్నది. వీరు మొదట ప్రతిష్ఠానపురములోనున్ను, ఆ తర్వాత కోటిలింగాల, అమరావతి, ధాన్యకటకములలోనున్ను పరిపాలించుటచేత వీరి రాజ్యమునకు ఆంధ్రశాతవాహన రాజ్యమనే పేరు తటస్థించినది. విక్రమార్కశకం అనేది దక్షిణదేశంలో గాని, ఆంధ్రదేశంలోగాని ఎన్నడైనా ప్రయోగింపబడిందా అని యోచిద్దాము.

తూర్పుచాళుక్యరాజులలో కుబ్జవిష్ణువర్ధనుడు (పులకేశి తమ్ముడు) ప్రథముడు. వీరి దగ్గరనుంచే తూర్పు చాళుక్యవంశం ప్రారంభమైంది. వీరు క్రీ.శ.624 నుండి క్రీ.శ. 641 వరకు పాలించినారు. 641 జూలై నెలలో, అనగా 18వ సంవత్సరంలో వారికి కొంత జబ్బుచేసి, దాని నివారణ కొరకు శ్రావణమాసములో ఒక అగ్రహారమును ఇద్దరన్నదమ్ములకు ఇచ్చినారు. ఆ గ్రామం పేరు చీపురుపల్లి. ఆ నాటికి ఇంటిపేర్లు లేవు. ఆ సోదరుల పేర్లు మాధవవర్మ, చంద్రవర్మ. ఈ దానం చంద్రగ్రహణ నిమిత్తం ఇవ్వబడింది.

క్రీ.శ. 632, 641, 650–ఈ మూడు సంవత్సరాలలోనే శ్రావణమాసపు చంద్రగహణాలున్నవి. ఆ శాసనపు తేది 632, 650 అగుటకు వీలులేదు. కనుక వారి శాసన సంవత్సరం 641 అయియుండవలెను. అది 12వ సంవత్సరంలో అని వున్నది. గనుక వారి రాజ్య ప్రారంభం క్రీ.శ. 624 లో అయియుండవలెను.

ఇది 621వ సంవత్సరంలో విష్ణుకుండిన వంశం వాడైన మూడవ మాధవవర్మ ఇచ్చిన పొలమూరు శాసనం ఒకటి ఉన్నది. ఇది తూర్పు చాళుక్యుల రాజ్యం తర్వాత అయియుండవలెను గాని 621కి ముందు అయియుండదు.

ముషినికొండ అనే ఒక గ్రామం జైనులకు దానం చెయ్యబడినట్లు ఒక రాగిశాసనం దొరికింది. అది పైన చెప్పిన కుబ్జవిష్ణువర్ధనుని మనుమని మనుమడు (ఇను మనుమడు) మూడవ విష్ణువర్ధనునిచే ఇవ్వబడింది. శాసనంలో ఈ గ్రామం

***బుద్ధశకం*** *గురించిన వివాదం మనం గుర్తుపెట్టుకోవాలి. ఆ శకారంభం 544 బి.సి.గా తీసుకున్నా బుద్ధుని పరినిర్వాణపు తేదీప్రకారం 483 బి.సి.కి మార్చబడింది. విల్‌హెల్మ్ గిగర్ సూచించినట్లు – దీపవంశం, మహావంశాల ప్రాథమిక చరిత్ర దక్షిణాసియా శకాలకు మూలం. అశోకుని పట్టాభిషేకం బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత 218 సంవత్సరాలకు జరిగినట్లు చెప్పబడింది. అశోకునికి పూర్వం చంద్రగుప్తమౌర్యుడు 56 సంవత్సరాలకు రాజ్యాధికారంలోకి వచ్చాడు లేదా మహాపరినిర్వాణం తర్వాత 162 ఏండ్లకు వచ్చినట్లన్నమాట. అంటే షుమారుగా చంద్రగుప్తుని పట్టాభిషేక సంవత్సరం 321 బి.సి. దీనికి ఆధారం మెగస్తనీస్. ఆ విధంగా తీసుకుంటే మహాపరినిర్వాణపు సంవత్సరాలు 485–481 బి.సి.కి మధ్యలో వున్నట్లు అనుకోవచ్చు. మహాయానం ప్రకారం 483 బి.సి.కి నిర్ణయించారు. ఏదిఏమైనా దీపవంశ, మహావంశాల ప్రకారం థాయ్‌లాండ్, శ్రీలంక, బర్మాలాంటి థేరవాద దేశాలలో బుద్ధశకం 2556గా వాడుకలో ఉంది. ఇటీవల మన దేశంలోకూడా బుద్ధశకాన్ని కాలెండర్లలో చూపిస్తున్నారు.*

మొదటి కుబ్జవిష్ణువర్ధనునిచేత, అతని భార్య అయిన మహాదేవిచేత కొందరు జైనాచార్యులకు ఇవ్వబడినట్లున్న, బెజవాడలో ఉన్న 'నడుంబవసతి' అనే జైనమతం వాడుకకొరకు ఇచ్చినట్లున్ను ఉన్నది. ఇది ఉదకపూర్వకముగా ఇచ్చింది. దీని సరిహద్దునుగూర్చి తకరార్లు ఉండుటచేతనో, లేక మరేకారణం చేతనో రాగిశాసనంతో మరల అది ఖాయపరచబడింది.

దీనిలో సంవత్సరము 'స్వాదిత' అనే సంజ్ఞతో సాంఖ్యమున చెప్పబడియున్నది. మార్గశిర బహుళ ద్వాదశి అని ఉన్నది. 'స్వాదిత' అనగానేమిటి? సాంఖ్యం ప్రకారం చూచుకొంటే క్రీ.శ.684 ఏర్పడుతున్నది. 624 ఎవరి శకంలో అనే మీమాంస వెంటనే కలుగుతుంది.

ఇది శాలివాహన శకం కానేరదు. ఎందుకంటే 684కు 78 కలిపితే 762 వచ్చును. 762 ప్రథమ విష్ణువర్ధనుని తారీఖూ కాదు; రెండో విష్ణువర్ధనుని సంవత్సరమూ కాదు; మూడో విష్ణువర్ధనుడిదీ కాదు. కాన ఆ దేదీ మనము శాలివాహనశకం ప్రకారం గుణించుకోవడానికి వీలులేదు.

విక్రమార్కశకం ఒకవేళ దీనికి కుదురుతుందేమో చూతము. 684లో 57 కొట్టి వేస్తే 627 వస్తుంది. 627 కుబ్జవిష్ణువర్ధనుడిదై ఉన్నది. కనుక దీనిని విక్రమార్కశకం ప్రకారం అర్థం చేసుకోవలసియున్నది. అంటే, దక్షిణ దేశంలో విక్రమార్కశకప్రయోగం లేదే, ఇది ఎలా అన్వయిస్తారు అనే మీమాంస కలుగవచ్చును.

దీనికి ప్రతిపక్షమేమనగా- అప్పుడు దక్షిణాదిన విక్రమార్కశకమూ లేదు; శాలివాహన శకమూ లేదు; గాంగేయ శకమూ లేదు. ఒక శకపు వాడుక ఎక్కువ సంభవమనీ, మరొకటి తక్కువ సంభవమనీ చెప్పుటకు వీలులేదు. విక్రమార్క శకమని చెప్పుటకు ఎక్కువ అవకాశాలున్నవి.

జైనులు ఎప్పుడున్ను విక్రమార్కశకమే వాడుతున్నారు. పి.టి.శ్రీనివాసయ్యంగారి హిందూదేశ చరిత్ర, (పేజీ 199) తర్వాత విక్రమార్కచరిత్ర జైనగ్రంథములలోనే ఉన్నట్లు యస్.కృష్ణస్వామయ్యంగారు, స్టెంకోనల్ మొదలైన పండితులు వాడినారు.

(ఎపి గ్రాఫియా ఇండికా 14వ సంపుటం, 293వ పేజీ)

ఆ తర్వాత విక్రమార్కశకం దక్షిణదేశంలో వాడుకలోకి రాకపోవడం, శాలివాహనశకం అమలులోకి రావడంవల్ల మనం కలవరపడగూడదు. అప్పటికి రెండూ సమస్థాయిలోనే ఉన్నవి. కనుక ముషినికొండ శాసనం మొదట ఉదకపూర్వకంగా ఇవ్వడం ప్రథమవిష్ణువర్ధనుని వల్ల 627లో ఇచ్చినట్లు స్థిరపడుతోంది.

జైనులకు విక్రమ సంవత్సరము ఎక్కువ ప్రీతికరము. కనుక మూడవ విష్ణువర్ధనుని దగ్గర పుచ్చుకొన్నప్పుడు తమకు అలవాటైన సంవత్సరమును చెప్పినారు. వారిచ్చిన భోగట్టా ప్రకారం శాసనం చెక్కబడింది.

పైన చర్చించినదాని వల్ల తేలిన సారాంశమేమంటే -

(1) క్రీ.శ.627 కు ముందు ఆంధ్రదేశంలో ఏ శకమూ వాడుక కాలేదు.

(2) ఆ సంవత్సరములో 627 విక్రమ సంవత్సరాన ఒక దానము జైనులకు పుట్టినది. కాని విక్రమశకం మరి మన దక్షిణదేశంలో వాడుకలోకి రాలేదు.

(3) క్రీ.శ. 892లో ప్రథమ శాలివాహనశక శాసనం ఇవ్వబడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అమలులో ఉన్నది.

(4) గాంగేయశకం శ్రీకాకుళమునకు ఉత్తరంగా ఉన్న కళింగదేశంలోకి ప్రాకలేదు. అక్కడగూడా 1025 తర్వాత నిలిచిపోయింది. ఇవి తప్ప ఏ శకములున్ను ఆంధ్రదేశంలో వాడుక కాలేదు. తురకల వల్ల వాడుకలోకి వచ్చిన హిజరీ (627 క్రీ.శ.).

ఇంగ్లీషువారు వచ్చిన తర్వాత (1757) వచ్చిన క్రీస్తు శకములను గూర్చి చెప్పేదేమిటి? చాంద్రమాన ప్రకారం మన ప్రస్తుతపు వాడుకలో ఉన్న చైత్రాదిమాసముల పేరులలో ఒకటి-

దామోదరవర్మ ఇచ్చిన శాసనంలో కార్తీకశుద్ధ త్రయోదశి ప్రస్తావన ఉంది.

అంతకు పూర్వం వేద సంబంధమైన పేర్లు: మధు-మాధవ, శుక్ర-శుచి, నభన్-నభస్య, ఈశ-ఊర్జ, సహస్-సహస్య, తపన్-తపస్య అనేవి ఉత్తరహిందూస్థానంలో అమలులో ఉన్నవి.

తర్వాత చాంద్రమాన మాసాలు ప్రయోగంలోకి వచ్చినవి. ముషినికొండశాసనం వల్ల బెజవాడ అనే నామం ఆ పట్నానికి 627 నుంచీ అమలులోకి ఉన్నట్లు కనబడుతుంది. మి



స్నేహలత

# మమతల తల్లి

– నందనరెడ్డి

హఠాత్తుగా ఫోను మోగుతుంది. ఫోనుమోత నిశ్శబ్దాన్ని చీలుస్తుంది. నన్ను నా ఊహాలోకం నుంచి బైటికి లాగుతుంది. గబగబా మెట్లమీదుగా దిగుతూ డైనింగ్‌రూములోకి పరుగెత్తాను టెలిఫోను ఆగిపోతుందేమోనన్న తొందరలో. అది లాండ్‌లైను. రిసీవర్ని చేతిలోకి తీసుకుంటాను. అమ్మ నిరాసక్తమైన గొంతు వినిపిస్తుంది– “వాళ్లు మళ్లీ నన్నిక్కడికి తీసుకొచ్చారు, నువ్వు రాగలవా?” వెంటనే మా పాత ఫియట్‌కారు దగ్గరికి పరుగెత్తి, రివర్స్ చేసుకుని, సెయింట్ మార్క్స్ రోడ్డు మీదుగా ట్రాఫిక్‌ను దాటుకుంటూ, వాళ్లు ఆమెను తీసుకు వెళ్లకముందే, విక్టోరియా హాస్పిటల్‌కి చేరుకుంటాను.

ఎప్పటిలాగే ఆవిడ ఆర్.ఎమ్.ఓ గదిలో కూర్చొని ప్రజారోగ్యం గురించీ, జైలులో వుండే స్త్రీల జాగ్రత్తను గురించీ చర్చిస్తూ వుంటుంది. ఆమె నావైపు తిరుగుతుంది. మహారాణిలాగ కూర్చున్న ఆమె అందమైన కనుల్లో బాధ, విషాదం, ఇద్దరమూ నిశ్శబ్దంగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటాం. ఆమెను అలాగే గాఢంగా కౌగలించుకుని వుంటాను. అలాగైతే వాళ్లు మమ్మల్ని విడదీయలేరని.

ఆర్.ఎమ్.ఓ హాస్పిటల్లో చేర్చడం మంచిదని సలహా ఇస్తాడు. ఆమెకు ఆస్త్మా ఎక్కువయింది. శ్వాసకోశాలు బలహీనంగా వున్నాయి. రాత్రిళ్ళు జైలు డాక్టరు ఇంజెక్షను చేయడానికి రాడు. అందుకని ఆమె తనకు తనే అడెలైన్ ఇంజెక్షను చేసుకుంటుంది. రెండు సార్లు ఆస్త్మావల్ల కోమాలోకి వెళ్లిపోయింది. పోలీసు జవానును ఫారాలిమ్మని ఆర్.ఎమ్.ఓ వాటిని పూర్తి చేస్తుంటాడు. మేం ఊపిరి బిగబట్టి చూస్తుంటాం. ఈ సారైనా ఆమెను హాస్పిటల్లో చేరుస్తారని ఆశ. అంతలో పిలుపొస్తుంది. హోమ్ సెక్రటరీ చేర్చడానికి వీల్లేదంటాడు. క్షమాపణలు చెప్పుకునే ప్రయత్నంలో ఆర్.ఎమ్.ఓ నసుగుతాడు. అతను సూటిగా మా కళ్లలోకి చూడలేడు. అతడేదో గొణిగి అప్లికేషన్ని పంపిస్తానంటాడు. ప్రతిఫలంగా మేమిద్దరం కాస్సేపు ఒంటరిగా ఉండేందుకు ప్రక్కగదిలోకి పంపుతాడు. మేమిద్దరం ఒకరినొకరం చూసుకుంటూ, పరిశీలించుకుంటూ కూచుంటాం. ఆమె మోములోని ప్రతిముడత, ఆమె పెదవిమీది పుట్టుమచ్చ, పాపిట్లో దిద్దుకున్న కుంకుమ – ఎక్కడైనా ఆశారేఖలు కనిపిస్తాయేమోనని చూస్తాను. మేము రోజువారీ విషయాలు మాట్లాడుతుండగా మా కళ్లు వేరే భాషలో మాట్లాడుకుంటాయి. ఆమెకేమైనా కావాలా? తమ్ముడు బాగున్నాడా? నాన్న ఎలా సర్దుకు పోతున్నారు? ఆమె బట్టలు ఎవరు ఉతుకుతారు? భోజనం ఎలా వుంటోంది? సరిపడా మందులు ఆమెకు అందుతున్నాయా?

సమయం అయిపోయింది. తొందరగా మేమిద్దరమూ కౌగలించుకుని ‘ఐ లవ్ యూ’ చెప్పుకుంటాం. గుసగుసగా. ఆమెను తీసుకువెళ్లడానికి పోలీసు వస్తాడు. ఆమెను వ్యాను దగ్గరికి నడిపించుకెడుతుంటే నిస్సహాయంగా ఆమెని చూస్తాను. ఆమె గ్రిల్స్ లోంచి కనిపిస్తుందేమోనని చూస్తుండగానే తలుపులు మూస్తారు. మా కళ్లకు తాళాలు పడతాయి. వీధుల గుండా బెంగుళూరు సెంట్రల్ జైలుకి వెళ్లే వ్యానుని చూస్తుంటాను. పెద్ద కోట తలుపుల్లాంటి గేట్లు కీచు శబ్దాలతో తెరుచుకుంటాయి. వ్యాన్ లోపలికెడుతుంది. ఊపేందుకు చేయెత్తుతాను. ఆమెకూడా చెయ్యి ఊపుతుంది. చేతులూగుతుండగానే పెద్దశబ్దంతో గేట్లు మూసుకుంటాయి.

నామనసుతో ఆమెను అనుసరిస్తున్న నేను చాలా సేపు దేన్నీ చూడను. సెల్‌దాకా నడక. గొళ్లెం మోతతో సెల్ తలుపులు మూసుకుంటాయి. తాళం చెవుల గలగలలు. వార్డెన్ కీచునవ్వు. ఆమె ఓడిపోయి తన మంచం మీద కూర్చొంటుంది. ధారాపాతంగా, నిరాఘాటంగా ప్రవహించే కన్నీరు. ఆమె

అనువాదం : బి.వి.రామిరెడ్డి, ఫోన్ : 9908856530

ఉన్న జైలు దగ్గరే... అయినా ఎంత దూరం ! ఈ ఊహాచిత్రాలు 35 సంవత్సరాల తరువాత కూడా నన్ను బాధిస్తూనే ఉంటాయి. ఇప్పటికీ ఆ ఫోను శబ్దం విన్నప్పుడల్లా నేను చెమటతో తడిసి మేల్కొంటాను. ఎందుకలాగ అని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తూనే వున్నాను. ఇప్పటికీ ఎమర్జెన్సీ పిచ్చికి పరిహారాన్నిచ్చేందుకూ, విషయాలను సరైన మార్గంలో పెట్టేందుకూ ప్రయత్నిస్తూనే వున్నాను. నా కోపాన్ని నిర్మాణాత్మక కార్యకలాపాల్లోకి మార్చుకుని ఆమె ఆశయాలను పరిపూర్ణం చేసేందుకు ప్రయత్నిస్తూనే వున్నాను. ప్రతిరోజు నేనెలా ఓడిపోతున్నానో గ్రహించుకుంటున్నాను. అంత త్వరగా ఆమెను పోగొట్టుకున్న నేను అందుకు ప్రతిఫలాన్ని ఎన్నటికీ పొందలేనని నాకు తెలుసు.

అందరూ ఆత్మీయంగా 'స్నేహ' అనిపిలుచుకునే స్నేహలత రెడ్డి హిందూ క్రైస్తవ కుటుంబంలో జన్మించింది. రెండు తరాల క్రిందట ఆమె తల్లిదండ్రుల ముందు కుటుంబాలు క్రైస్తవమతం పుచ్చుకున్నాయి. మా అమ్మమ్మ వాళ్లమ్మ కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది. ఆమె తండ్రి బెంగాలీ బ్రాహ్మణుడు. మా తాత తమిళ మొదలియార్. ఆయన క్రైస్తవంలోకి మారాడు. ఆయన బ్రిటీషు సైన్యంలో మేజరుగా పని చేశాడు.

మా తాత, అమ్మమ్మ ఇంట్లో మాతృభాషకు బదులుగా ఇంగ్లీషులో మాట్లాడుకునేవారు. అమ్మకు బ్రిటీషువాళ్లంటే ఇష్టం వుండేది కాదు. అందుకే ఆమె భారతీయమైన పేరు పెట్టుకుంది. ఆమె హిందూ సాంప్రదాయ దుస్తుల్నే ధరించేది. పెద్ద బొట్టు పెట్టుకునేది. బాలికగా ఆమె దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించేది. ఆమె శ్రీ కిట్టప్ప పిళ్లై దగ్గర భరతనాట్యం నేర్చుకుంది. గొప్ప నాట్య కళాకారిణిగా పేరు తెచ్చుకుంది.

మా నాన్న పఠాభిరామరెడ్డి. అమ్మ క్వీన్ మేరీస్‌లో విద్యార్థినిగా వుండగా అక్కడ అమ్మనాట్యం చేస్తుండగా చూసి ఆమెతో మొదటి చూపులోనే ప్రేమలో పడ్డారు. అమ్మ గొప్ప సౌందర్యవతి. ఆమెను పెళ్లాడే దాకా జుట్టు తీయించుకోనని నాన్న ప్రతిజ్ఞతీసుకున్నారు. మా నాన్న ధనవంతులైన హిందూ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందినవారు. బ్రిటీషువారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటంలో గాంధీమహాత్మునికి అనుయాయులుగా వున్నారు.

మా పితామహులు నాన్నగారి వివాహ నిర్ణయానికి అంగీకరించలేదు. మా నాన్న గారి ముఖం చూడ్డానిక్కూడా ఆయన ఇష్టపడలేదు. కుటుంబంలో ఆ కొడుకు చనిపోయినట్టుగా భావించాలని ఆయన కుటుంబాన్ని ఆదేశించారు. ఆ విధంగా నాన్నగారి కుటుంబం ఆయన్ని గెంటేసింది. మా అమ్మానాన్నల వివాహం ఆర్యసమాజ పద్ధతిలో తమ మిత్రుల మధ్య జరిపించుకున్నారు. అడయారు బీచిలోని ఒక చిన్న షెడ్డులో జీవితాన్ని ప్రారంభించారు.

ఆ నెల పాత వార్తా పత్రికల్ని అమ్మి కుటుంబంలో చిన్న పండగ జరుపుకున్నాం. అప్పుడప్పుడు మద్రాసు జెమిని సర్కిల్‌లోని ఉడ్‌లాండ్స్‌కి వెళ్లేవాళ్లం. నాకప్పుడు అయిదు సంవత్సరాల వయసు. మా ఆర్థిక విషయాల్ని గూర్చి అభద్రతా భావాన్ని ఫీలయ్యేదాన్ని. అమ్మ తన దగ్గరొక మంత్రాలపెట్టె వుందనీ, దాన్నిండా తరగని సంపదవున్నదనీ, అదొక రహస్య ప్రదేశంలో దాచబడి ఉన్నదనీ, ఎప్పుడైనా డబ్బు అయిపోతే అందులోంచి తెచ్చుకోవొచ్చుననీ చెప్పేది. అందులోంచి డబ్బుని ఇప్పుడే తెద్దామా అనేది. నేను వద్దనేదాన్ని.

అమ్మ దగ్గర గొప్ప మాజిక్‌వుంది. విచారాన్ని సంతోషంగా, దుఃఖాశ్రువుల్ని ఆనందభాష్పాలుగా మార్చగలిగేది. ఆమెది కష్టాల బాల్యం. అందుచేత నా భయాల్ని అర్థం చేసుకునేది. బాల్యంలో తన సోదరీ సోదరుల్ని అమ్మా నాన్నల దెబ్బల్నుంచి కాపాడేది. ఆమె పుట్టుకతో మానవ హక్కుల పోరాట యోధురాలు. క్రూరత్వాన్ని ఏరూపంలో వున్నా ఎదుర్కొనేది. తన స్కూల్లో సహవిద్యార్థుల్ని కులమత విచక్షణల నుండి సమర్థించేది. ఆమె జీవిత కాలమంతా స్వాతంత్ర్యం కోసం, స్త్రీల హక్కులకోసం, అణగారిన వారికోసం పోరాడింది.

ఆమెకున్న కొద్ది వస్తువుల్లో ఒకనోట్‌బుక్ ఉంది. అందులో ఆమె బెంగుళూరు సెంట్రల్‌జైల్లోని స్త్రీలవార్డులో జరిగిన సంఘటనలకు సంబంధించి తన అనుభవాల్ని, అనుభూతుల్ని వ్రాసుకొంది. 1976 జూన్‌లో జరిగిన సంఘటనల్ని గురించి ఇలా వ్రాసింది – "ఎవరైనా ఒక స్త్రీ జైలువార్డులోకి వచ్చిన వెంటనే అందరిముందు ఆమె దుస్తులూడదీసి నగ్నంగా నిల్చోబెట్టేవారు.

ఒక మనిషికి శిక్షపడినప్పుడు మగ, ఆడ తేడాలేకుండా శిక్షించేవారు. మానవ శరీరాన్ని కూడా అవమానపరచి, హీనపరచాలా? ఇలాంటి వక్ర, రాక్షస విధానాలకు బాధ్యులెవరు? తెలివైన సూపర్నెంటెట్లు, జైళ్లశాఖ ఐ.జి.లు అలాంటి వాటిని నివారించి మంచి మార్పులు తేవచ్చు కదా? ఈ లోకంలో జన్మించిన ప్రతిమనిషి జీవన ప్రయోజనం

ఏమిటి? మానవసమాజాన్ని సంపూర్ణత్వం వేపు నడిపించే ప్రయత్నంలో దాన్ని ఏ కొంచెమైనా ఉన్నతికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయొద్దా? మనిషి ఏ జీవనమార్గంలో జన్మించినా, మనిషి ఫీలింగ్స్‌ని, ఆలోచనల్ని, వీలైన అన్ని పద్ధతుల్లోను ఉన్నతీకరించేందుకు ప్రయత్నించడం అతని బాధ్యత కాదా? ఇవి ఆమె అతనికోసం, మనందరికోసం ఏర్పరిచిన విధులు. అమ్మతో నా బంధం సంక్లిష్టమైనది. ఆమె పిల్లల్ని జాగ్రత్తగా చూసుకునే తల్లి. నా ఎదిగే సంవత్సరాలలో నా అవసరాల్ని పట్టించుకుని, నా జీవితాన్ని ప్రత్యేకమైనదిగా ఉండేట్టు చూసింది. నా ప్రతిపుట్టినరోజూ ఒక ప్రత్యేక సందర్భమే. నా మొదటి పుట్టిన రోజున మా పెరటిదొడ్డిని బెలూన్లతో నింపేసింది. బాలే గౌను తయారు చేసింది. మరో పుట్టిన రోజున డాన్స్ ప్రోగ్రాం. ఇంకోపుట్టిన రోజున స్పానిష్ రెస్టారెంట్‌లో స్పానిష్ విందు భోజనం, దాంతో బాటు ఒక గిటార్ వాయిద్యకారుడు! నా గురించి ఆమెకు ఉన్నతమైన ఆశలుండేవి. కుటుంబంలో మోరల్ కోడ్‌లో ఎలాంటి తేడాలు రానిచ్చేది కాదు. ఆమె నేర్పిన విలువల్ని జీర్ణించుకుని ఆమెలాగే చిన్న వయసు నుండీ మానవ హక్కుల పోరాటానికి సిద్ధమయ్యాను నేను.

1976 జూన్ 9న ఆమె వ్రాసింది – "కనీసం నేనిక్కడ కొంత సాధించాను. స్త్రీ నేరస్తులను కొట్టడాన్ని ఆపుచేయించ గలిగాను. వారికి పెట్టే భోజనాన్ని కొంచెం బాగుండేట్టు చేయగలిగాను. నీటి సదుపాయం బాగోలేకపోయినా, పైపులైన్లు వేయిస్తామని వాళ్లనించి హామీ పొందాను. అన్నిటి కంటే ముఖ్యంగా వారి భయాన్ని కొంత తగ్గించ గలిగాను. భోజనం బాగుపడేదాకా నిరాహారదీక్ష చేశాను."



పఠాభి

ఇండియాలో 70లలో పతనావస్థ ప్రారంభమయింది. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధంలో గెలిచాక, అణుబాంబును ప్రయోగాత్మకంగా పరీక్షించాక, ధైర్యవంతురాలైన రాజకీయ నాయకురాలిగా ఇందిరాగాంధి ప్రతిష్ఠ పెరిగింది. 1973 కల్లా ఉత్తర భారతంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక సమస్యలు, లంచగొండితనం, తగ్గిపోయిన జీవన ప్రమాణాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, వ్యతిరేకతలు మొదలయ్యాయి. 1975 జూన్‌లో అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధి న్యాయవిరుద్ధమైన పద్ధతులద్వారా లోక్‌సభకు ఎన్నికైనట్లు నిర్ధారించి, ప్రధాన మంత్రిపదవికి రాజీనామా చేయ వలసిందిగా ఆమెను ఆదేశించింది. దేశం నలుమూలల నుండి రాజీనామా చేయవలసిందిగా ఆమె మీద ఒత్తిడి పెరిగింది. ఆమె దేశంలో అంతరంగిక అత్యవసర పరిస్థితి విధించింది.

1975 జూన్ 26న భారతదేశంలో ఎమర్జెన్సీ ప్రకటించబడింది. ఆరోజే "చండమారుత" నిర్మాణం పూర్తయింది. ఎమర్జెన్సీని ముందే ఊహించి అమ్మానాన్న ఆ సినిమాను తీశారు. జార్జిఫెర్నాండెజ్ అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన బెంగళూరు వచ్చి, అజ్ఞాత ఉద్యమాన్ని ప్రారంభించాలని సూచించారు. ఆయన దాగివున్న ప్రదేశానికి ప్రక్కనే గోడమీద కూచుని విన్నాను– అమ్మ అహింసా పద్ధతిలోనే ఉద్యమించాలని స్థిరంగా వాదించింది. ఫెర్నాండెజ్ మాత్రం కొద్దిపాటి హింస అవసరమే అని వాదించారు. నా వంతుగా ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశ్యంతో ఉద్యమంలో చేరడానికి ముందు కొచ్చాను. నా జాగ్రత్త విషయంలో అమ్మ భయపడింది. అయితే అయిష్టంగా నైనా నాబాధ్యతల్ని ఆచరించడానికి ఒప్పుకుంది. మేము ఎడంగా నుంచుని రాజ్యాంగ స్వేచ్ఛలు కాలరాయ బడుతూంటే చూస్తూ ఉండలేమని ఆమె గ్రహించింది.

అమ్మ కళాకారిణి, నటి, నాట్యకారిణి, ఉద్యమశీలి. అన్యాయాన్ని అసహ్యించు కోవడం ప్రజల్ని ప్రేమించడం ఆమె నైజం. నాన్న చింతనాశీలి, రేషనలిస్టు, ప్రశాంత విప్లవవాది. ఆమె ఆవేశపరురాలు, ఆత్మీయురాలు. ఆయన ప్రశాంత చిత్తుడు, స్థిరమనస్కుడు. ఆయన ఆమెను తన ప్రేమలో ముంచెత్తాడు. ఆమెకు గొప్ప రక్షణ కల్పించాడు. అన్ని

విషయాల్లోను ఆమెకు మద్దతునిచ్చాడు. మా ఆత్మీయ మిత్రులు లక్ష్మీకృష్ణమూర్తి అన్నారు – "ఆయన ఆమెజ్వాలను కాపాడిన నీడ."

అమ్మ గాఢమైన మానవహక్కుల పోరాటయోధురాలు. రోడ్డుమధ్య ఆగి పోలీసుల హింస నుంచి బిచ్చగాళ్ళను రక్షించేది. విద్యార్థుల్ని ఇబ్బంది పెట్టే స్కూలు ప్రిన్స్‌పాల్స్‌ని ఎదుర్కొనేది. భార్యల్ని వేధించే భర్తల్నించి వారిని కాపాడేది. నాన్న నిశ్శబ్దంగా ఆమెకు అండగా వుండి, సలహాలిచ్చేవాడు. పరస్పర ప్రేమ ఆధారంగా నా తల్లిదండ్రులు గౌరవభావంతో వారి ఆదర్శాలను సాధించుకునే ప్రయత్నం చేశారు. అమ్మ జైల్లో ఉండగానే నాన్న "శృంగారమాస" అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక భార్యాభర్తల జంట తమమధ్య శిథిలమైన అనుబంధాన్ని పునర్నిర్మించుకునే ప్రయత్నం, ప్రేమజ్యోతిని తిరిగి వెలిగించుకునే ప్రయత్నం, పరస్పర నమ్మకాన్ని పునర్నిర్మించుకునేందుకు స్నేహాన్ని పునర్వ్యవస్థీకరించుకోవడం ఈ చిత్రం.

వారిద్దరూ కలిసి ఈ చిత్రాన్ని చక్కగా తీయాలను కున్నారు. కాని, ఎమర్జెన్సీ అరెస్టులవల్ల అది సాధ్యంకాలేదు. ఆమె నాన్నని ఆ చిత్ర నిర్మాణాన్ని కొనసాగించవలసిందిగా ఒప్పించింది. ఆమె జైలునుంచే నాన్నకు ఆ చిత్రాన్ని గురించి ఎన్నో సూచనలిచ్చేది. అందులో నటించే నటీనటులకు నోట్సు వ్రాసియిచ్చేది. వారానికి రెండుసార్లు ఆమెను కలుసు కోవడానికి వెళ్లినప్పుడు, అమ్మనాన్న ఆ సినిమా చిత్రీకరణ గురించి చర్చించుకుని ప్లాన్ చేసుకునేవారు.

ఆ చిత్రం నాన్న అమ్మకు చేసిన అర్పణ. అదివారి విలువల ప్రపంచం. అందులో వారిద్దరు భాగస్వాములు. అది వారి ఎడబాటు నుండి, జైలుగోడలనుండి ఒక ప్రవాసం. మాకేమో అది ఆమె కలను జీవించేందుకు ఒక మార్గం. నాట్యం, రంగస్థలం, సినిమా ఆమె రక్తిలోనే ఉన్నాయి. ఆమె అద్భుతమైన నటి. నటిగా ఆమెస్థాయి అత్యున్నతం. తన పాత్రలో లీనమై అందులో జీవించేది.

ఆ పాత్ర భావతీవ్రతలు, స్వభావ వ్యక్తీకరణలు, వీటితో ఆ పాత్ర సజీవంగా మనముందు దర్శనమిచ్చేది. ఆమెపాత్రలో ఎక్కడా లోపం చూడలేం. ఇంటిదగ్గర తన పాత్ర సంభాషణల్ని ఆమె ప్రతి క్షణమూ ప్రాక్టీస్ చేసేది. నేనామెకు సహాయ పడుతుండేదాన్ని. ఒక్కోసారి, అలాంటి సమయంలో హఠాత్తుగా ఆమె ఆ పాత్రలోకి పరకాయప్రవేశం చేసేది. మేం ఆశ్చర్యంలో మునిగి పోయేవాళ్లం. నాటకం, సినిమా మా జీవితాల్లో ఒక భాగం. అందుకే ఇప్పటికీ నేను చెఖోవ్, షేక్స్పియర్, పింటిర్, ఆర్థర్ మిల్లర్ మొదలైన వారి నాటకాల్నించి పెద్ద సంభాషణల్ని అనర్గళంగా అప్పచెప్పగలను. నాకిప్పటికీ గుర్తే – ఇబ్సెన్ నాటకం. 'పీర్ గైంట్' లో తల్లి పాత్రను అమ్మ అద్భుతంగా నటించింది. అప్పుడు నాకు ఎనిమిదేళ్లు. ఆ నాటకానికి అంతర్జాతీయంగా పేరు పొందిన దర్శకుడు పీటర్ కో దర్శకత్వం వహించారు. అది అద్భుతమైన ప్రదర్శన. అందులోని తల్లి 'ఏస్' పాత్రలో అమ్మని గుర్తు పట్టలేకపోయాను! స్టేజిమీద ఆవిడ నార్వేదేశపు విధవరాలైన రైతు స్త్రీ. పీర్‌గైంట్ తల్లి అంతే.

ఆమె మంచం మీద పడుకుని వుంది. తెల్లబడిపోయిన జుత్తు. ముఖంనిండా ముడతలు. ఆమె కదలికల్లో బలహీనత, కళ్లలో బాధ. ఆమె కొడుకు తల్లిమంచం ప్రక్కన కూర్చొని ఉన్నాడు. గుర్రబ్బండిలో వారిద్దరూ చేసిన ప్రయాణాన్ని గుర్తుచేసు కుంటున్నాడు. ఆమె మూలుగు తోంది. అతడు ఒంగి ఆమెను సర్ది కూర్చో బెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. "ఆc...అలా...ఆనుకూర్చో... బావుంటుంది." అంటాడు. "నాకు వెళ్లిపోవాలనివుంది... నేనెప్పుడూ కోరుకునేది అదే..." అంటుదామె. "అలా మాట్లాడకమ్మా..." అంటాడతను. తల్లిని ఊరుకోబెట్టాలనే ప్రయత్నంలో, మంచం కాళ్లకట్ట దగ్గరికి వచ్చి, ఒకతాడు తీసుకుని కుర్చీ చుట్టూ వేసి, కర్రొకటి తీసుకుని, గుర్రబ్బండిని తోలుతునట్టు నటిస్తాడు. ఆమె చనిపోతోందని అతనికి తెలుసు.

"సోరియా–మెరియాకి పోనివ్వు... అదెక్కడుందో తెలుసా? చంద్రుడికి పశ్చిమంగా, సూర్యోదయానికి తూర్పుగా వుంటుంది. అక్కడ గొప్పవిందు జరుగుతోంది... అమ్మా... మెత్తగా ఆనుకొనికూర్చో... తొందరగా అక్కడికి తీసుకుపోతాను...'' అంటాడు. ''వాళ్ళు మనల్ని ఆహ్వానించారా?" అంటుందావిడ. "అవును... నీతోబాటు నన్నుకూడా...'' అంటాడు. ఆమె నిట్టూర్పు శబ్దం వినబడుతుంది. ఆమెకు భయమేస్తుంది. "కొండ ప్రక్కన చెట్లు గాలికి వూగుతూ చేస్తున్న శబ్దం అది..." అని చెబుతాడు. దూరంలో ఆమెకు లైటు కనిపిస్తుంది. "అవే ... ఆ ప్రాసాదపు లైట్లు.... అక్కడ చాలామంది గుమిగూడి మనకు ఆహ్వానం పలకడానికి నిరీక్షిస్తున్నారు..." అంటాడు. ఆమె ఆఖరు సారిగా నిట్టూర్చి, కళ్లుమూసి, వెనక్కివాలి పోతుంది. ఆమె

చనిపోయింది. నాటకశాలలో చీమ చిటుక్కుమనని నిశ్శబ్దం. తరువాత చప్పట్లు ఉత్సాహపు అరుపులు. అమ్మకు తమ్ముడు కోణార్క్‌తో ప్రత్యేకమైన బంధం. అమ్మా నాన్న పెళ్లయ్యాక స్పెయిన్ హనీమూన్ ట్రిప్‌కి వెళ్లారు. అక్కడ అమ్మ ఫ్లెమింకో నృత్యం నేర్చుకుంది. తనకు పుట్టబోయే కొడుకు ఫ్లెమింకో గిటార్ వాయిస్తాడని ఆమె కలగన్నది. తమ్ముడికి పుట్టుకతోనే సంగీతం మీద ప్రేమ. వాడు ఆమె కలను నిజం చేశాడు.

1976 ఆగష్టు 16న అమ్మ వ్రాసింది – "ఇవాళ హెడ్ వార్డెన్ లేదు. అందుకని ప్రశాంతంగావుంది. కాని, నా ఆత్మలో ఆకలిగా, బాధగా వుంది. నాకు నా కొడుకు కావాలి. వాణ్ణి నేను చూడాలి. వాడితో మాట్లాడాలి... ఎంతో మాట్లాడాలి... ఈ చివరి కొద్ది రోజులు వాడితో ఉండాలి. నా కొడుకు వెళ్లిపోతున్నాడు. తరువాత వాడిలో మనిషిని చూస్తాను. డాడిలోని పిల్లాడికోసం వెదుక్కుంటాను. వాణ్ణి నే నెప్పుడు చూస్తాను? నాకే ఈ బాధ ఎందుకో? ఎందుకు...??

తమ్ముడు ఈ పిచ్చి గోలల్నించి బైటపడి అమెరికాలో బోస్టన్‌లోని బెర్క్లీ కాలేజీ ఆఫ్ మ్యూజిక్ లో చేరిపోవాలని అమ్మకోరిక. వాడు జైలులో అమ్మ దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు. మళ్లీ తామిద్దరూ ఒకరినొకరు చూసుకోవడం ఉండదని వాళ్లిద్దరికీ తెలుసు. చివరి వీడ్కోలు తీసుకుంటూ తమ్ముడు వంగి అమ్మ పాదాలను స్పృశించాడు. ఇది మేం ఎప్పుడూ చెయ్యని పని!

అమ్మానాన్నలిద్దరూ సోషలిస్టులు. డా॥రామ్‌మనోహర్ లోహియా వల్ల ప్రభావితులైనవారు. సినిమా, నాటకం, నాట్యం, కవిత్వం లాంటి కళలద్వారా వారు తమ భావాల్ని వ్యక్తీకరించుకున్నప్పటికి, రాజకీయ కార్యకలాపాలు వాటికి పునాది. వారి రాజకీయ సిద్ధాంతాలు వారి కళలను, జీవితాలను ప్రభావితం చేశాయి.

అందువల్లనే శాంతవేరి గోపాల్ గౌడ, యు.ఆర్. అనంతమూర్తి రచించిన "సంస్కార" నవలను చదవమని సలహాయిచ్చినపుడు, మత మౌఢ్యానికి సంబంధించిన ప్రధానమైన ప్రశ్నలు వారిని "సంస్కార" ను దృశ్యకావ్యంగా మలిచేందుకు నిర్ణయింపజేశాయి. చేతిలో డబ్బులేకున్నా ఆ సినిమా నిర్మాణాన్ని ప్రారంభించారు.

"సంస్కార" చిత్రనిర్మాణం అనేక రంగాల అనేకానేక వ్యక్తుల కలయిక. ఆ సినిమా జర్నలిస్టులు, రంగస్థలనటులు, సోషలిస్టులు, సినిమా టెక్నీషియన్లు, మామూలు మనుషులు అందర్నీ ఒక చోటికి చేర్చి కలిపింది. అమ్మానాన్నల రాజకీయ సిద్ధాంతాలు, సృజనాత్మకతలు మొదటిసారిగా సినిమా రూపంలో వ్యక్తీకరింపబడ్డాయి. ఆమె అప్పుడే 'తుంగ' నదిలో స్నానం పూర్తిచేసుకుని చీర ఆరబెట్టుకుంటోంది. ప్రాణేశాచార్యులు స్నానసంధ్యలు ముగించుకుని నది ఒడ్డువేపు సాగిపోతున్నారు. ఆమె వారిని చూసి అనుసరించింది. ఆమె కనులు దుఃఖాశ్రువులతో నిండివున్నాయి. వారి నిర్ణయం కోసం, సమాధానం కోసం ఆమె నిరీక్షిస్తోంది. ఆ సమస్యకు ముగింపు కోసం ఆమె నిరీక్షణ.

'చంద్రి'గా అమ్మ అద్భుతం. ఒక అంటరాని స్త్రీగా, ఏ సంభాషణలూ లేకుండా, మరణించిన తన బ్రాహ్మణ ప్రియుడి అంత్యసంస్కారాన్ని ఎలా జరిపించాలి అనే విషయం అసంపూర్ణ చర్చతో, సందేహాస్పదమైనప్పుడు, అనుకోనివిధంగా ప్రాణేశాచార్యులకు సౌఖ్యావసరం ఏర్పడ్డప్పుడు, కులభేదం వల్ల, ఆమె ఒంటరితనంవల్ల, ఏర్పడ్డ వెలితి, కరుడు గట్టిన ఆ ఉచ్ఛనీచ భావనలు బ్రద్దలైన తీరు– ఆ సందర్భంలో ఆయాభావ సంక్లిష్టతల్ని ఆమె వ్యక్తపరిచిన తీరు అమోఘం.

అమ్మకు కులభావాల మీద గౌరవం లేదు. ఆమె మిత్రులు సోషలిస్టులు, కళాకారులు, రచయితలు, యౌవనులు, కష్టజీవులైన సామాన్య స్త్రీ పురుషులు. ఆమె అందరినీ కలిపేది. ఒకరితో ఒకరు మాట్లాడుకోనివారు కూడా మా యింట్లో కలుసుకుని అభిప్రాయాలను వ్యక్త పరుచుకునేవారు. కలిసి భోజనం చేసేవారు. ఆమె చక్కగా వంట చేస్తుంది. స్వయంగా వడ్డించి ఆకలి తీర్చడం ఆమెకిష్టం. భోజనం చెయ్యకుండా, కనీసం టీ అయినా తాగకుండా ఇంట్లోంచి ఎవ్వరూ వెళ్లడానికి వీల్లేదు.

మాయింట్లో బెంగాలీ, తమిళ, ఆంధ్ర, ఇటాలియన్, చైనీస్, మొరాకో, టర్కిష్, ఈజిప్ట్, బాలి వంటకాలు తయారయ్యేవి. అమ్మ వంట చేస్తుంటే నేను కాళ్లపీటమీద కూర్చొని చూస్తుండేదాన్ని. ఎప్పుడు ఏం చెయ్యాలి, ఏం కలపాలి, ఎంతకలపాలి, ఏమేమి మసాలాలు వెయ్యాలి, ఆ వంటలు ఏ ప్రాంతానికి చెందినవి మొదలైన విషయాలు అమ్మ నాకు వివరంగా చెప్పేది. ఆమె పైట చెంగుతో నుదుటి చెమట తుడుచుకుంటుంటే ఇకిలించే దాన్ని. ఆ వంటకాల ఘుమ ఘుమల్తో నాకు నోరూరేది. ఆ రుచుల్లో ఆయా ప్రాంతాల ప్రజల రూపాలు, వారి గొంతులు కనిపించేవి, వినిపించేవి. ఆ ప్రాంతాలకు తీసుకెడతానని అమ్మ వాగ్దానం

చేసేది. ఆమె జీవించినంతకాలంలో ఆరోజురాలేదు. ఆమెతో ప్రయాణించి, ఆ ప్రదేశాలను చూసి, అనుభవాల్ని పంచుకునే అవకాశం నాకు కలగలేదు. నా ప్రయాణాలన్నీ ఆమె వెళ్లిపోయాక జరిగినవే. నేను పుట్టక ముందు అమ్మ కొద్దికాలం మాత్రమే ప్రయాణాలు చేసింది. అమ్మ కాస్మోపాలిటన్. ఆమెకు సరిహద్దులు, తేడాలు లేవు.

అన్ని జీవిన విధానాలనూ, అభిప్రాయాలనూ, ప్రభావాలనూ ఆమె ఆహ్వానించేది. సంస్కృతులు, భాషలు, ఆహారవిషయాల్లో విశాలంగా వుండడం నేర్పింది. చెన్నైలో, మా వంటగదిలో అనీ, ఆర్మడోరువాల్డి అనే ఇటాలియన్లు వారి వంట చేస్తున్నారు. వారు నాన్న సహకారంతో భారతదేశం మీద ఒక డాక్యుమెంటరీ సినిమా తీయాలనే సంకల్పంతో ఇక్కడకి వచ్చారు. వాళ్లకి ఇంగ్లీషురాదు. మాకు ఇటాలియన్ రాదు. అమ్మ సైగలతో, నవ్వుతో, కౌగిలింతలతో ఇటాలియన్ ఇంగ్లీషు ఉచ్చారణతో వారికి విషయాన్ని అర్థమయ్యేట్టు చేసేది. ఆమె నాట్యం చేస్తున్నట్టు కదిలేది. వాళ్లు చక్కగా అర్థం చేసుకోగలిగారు.

మాకు ప్రపంచం అన్ని ప్రాంతాలనిండా మిత్రులున్నారు. ఒక్కోసారినాకు భారతీయులు, విదేశీయులన్న భేదం తెలిసేది కాదు. వారంతా మా ఆత్మీయులు. అమ్మకు స్నేహం అంటే జీవితకాల బంధం. మిత్రులేవైనా కావాలని అడిగితే వెంటనే వాటిని ఇచ్చేసేది. వారేదైనా పొరపాటు చేస్తే క్షమించేసేది. జ్ఞానం, అనుభవంకాన్న గొప్ప సంపదలేవీ లేవనీ, వస్తువుల కంటే మనుషులే విలువైన వారనీ అమ్మమాకు నేర్పింది. అందుకే మాకున్న కాస్తంతనే మేము అదృష్టంగా భావించే వాళ్లం.

అమ్మ ఫెమినిస్టుకూడా. ఆమె స్త్రీ పురుష సమానహక్కుల్ని నమ్మింది. సాంప్రదాయం, గౌరవం, ఆచారవ్యవహారాల ముసుగులో స్త్రీలను వేధించేవారిని అసహ్యించుకునేది. అలాంటి విషయాలను ఆమె నిర్మొహమాటంగా మాట్లాడేది. ఆమె పురుష మిత్రులు కొందరికి ఇది అనుభవం మీద తెలుసు.

అమ్మ "సీత" అనే నాటకాన్ని వ్రాసింది. ఆ నాటకంలో రాముడికన్న రావణుడే ఉన్నతుడని చూపించింది. రావణుడు సీతను తన రాజ్యంకన్న, తన జీవితంకన్న అధికంగా ప్రేమించాడు. అదే రాముడికి తన భార్య సీతకన్నా రాజ్యం, రాజ్యాధికారం ముఖ్యం. అమ్మలో అలాంటి హేతువాద దృక్పథం ఉంది. నా కప్పుడు పదమూడేళ్లు. నేను "డాక్టర్ ఝివాగో" చూసినందుకు మా ప్రిన్సిపాల్ నన్ను ఆఫీసులో పెట్టి, తాళం వేసి రోజంతా బంధించింది. నాకు భయం వేసింది. తప్పించుకు పారిపోయేందుకు ప్రయత్నించాను. ఆఫీసు గోడలు మూసిలేవు.

ఒక కుర్చీని డెస్కుమీద వేసి, ఎక్కి గోడదూకి, ఇంటికి పరిగెత్తాను వర్షంలో తడుస్తూ. అమ్మను కౌగలించుకున్నాను – చలికి, శిక్షకు వొణుకుతూ. ఆమె రగ్గుకప్పి, చాకొలెట్ తాగించి ఓదార్చింది.

మరుసటిరోజు అమ్మ నాతో బాటు స్కూలుకొచ్చింది. ప్రిన్సిపాల్ అమ్మకు మోరల్స్ గురించీ, విలువల గురించీ ఉపన్యాసం యివ్వ బోయింది. అమ్మకు కోపం వచ్చింది.

తన కూతుర్ని స్కూలుకు చదువు నేర్చుకునేందుకు మాత్రమే పంపుతున్నాననీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చెడుల గురించి నేర్పుకోగలరనీ, పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకోవలసిన బాధ్యతల్ని స్కూలు వారు నెత్తికెత్తుకోవలసిన పనిలేదని వివరించింది.

అలాంటి అమ్మ జాగ్రత్తల్లో పెరిగాను. అమ్మ నాకిచ్చిన రక్షణవల్లనే ఎన్నో గాఢమైన విషయాలను శోధించే ధైర్యం నాకు కలిగింది. నేను ప్రేమించే జ్ఞానాన్ని, పరిశీలన ద్వారా, అనుభవం ద్వారా సాధించుకునే విధానాన్ని అమ్మ నాకు నేర్పింది.

1976 మే 1 న అమ్మ తన జైలు డైరీలో వ్రాసుకుంది– "ఆత్మయొక్క గాఢాంధకారపు రాత్రిలో, రోజు తరువాత రోజు; ఎప్పుడూ తెల్లవారు ఝూము మూడుగంటలే." నేను చెమటలు తుడుచుకుంటూ హఠాత్తుగా నిద్రలేస్తాను. సమయం తెల్లవారు ఝూము మూడుగంటలు. కళ్లు మూసుకుని కలను మననం చేసుకుంటాను. మూసుకుంటున్న జైలు గేట్ల శబ్దం, లోపలికి అంతర్ధాన మౌతున్న పోలీసు వాహనం – ఊపుతూ ఆగిపోయిన అమ్మ చెయ్యి... కాని, అది అక్కడితో ముగించడం ఒప్పుకోను.

ఆమెను నాతో తీసుకెడతాను... మేమిప్పుడు బీచిలో ఒకరిచుట్టూ ఒకరు చేతులు చుట్టుకుని కూర్చొని అందమైన ప్రకాశవంతమైన సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్నాం.

ఆమె హాయిగా, ప్రశాంతంగా కూర్చుంది. నేను నిర్భయంగా నిశ్చింతగా ఉన్నాను. నా బాకీని నేను తిరిగి చెల్లించేశాను.

మి



# అగతా క్రిస్టీ అద్భుత సృష్టి

## అరవయ్యేళ్ళుగా నడుస్తున్న 'మౌస్ ట్రాప్'

- యస్సేరావ్

**నా** అభిమానులు ఎప్పుడూ అడుగుతుంటారు మీకు కథలు ఎక్కడ దొరుకు తుంటాయని? దానికి సమాధానం అది ఒక విలక్షణమైన సమయంలోనే సంభవిస్తుంటుందని. అలాగే ఎప్పుడన్నా వీధిలో నడుస్తున్నప్పుడు, దుకాణం కిటికీ పరీక్షగా చూస్తున్నప్పుడు ఒక్కసారిగా ఆలోచన తళుక్కున మెరుస్తుంది. "ఆ ఇది ఈ విధంగా రాస్తే ఈ హత్యను ఎవరు చేశారో తెలియకుండా ఉంటుంది" అనిపిస్తుంది. వివరాలను తర్వాత కష్టపడి రాయవలసిందే. ఆ విధంగా నా ఆలోచనలోకొచ్చిన పాత్రలనే వ్యక్తులు ఒక్కొక్కసారి నన్ను బాగా సతాయిస్తారు. ఏదో నేను వారిని ఎందులోనో ఇరికిస్తున్నానని అనుకున్నట్లు. నా స్నేహితులు నేను ఎప్పుడు ఎక్కడ ఎలా రాస్తానో చూడలేదు. ఒక రకంగా కుక్కలు ఏదైనా బొమిక దొరికినప్పుడు దాక్కొని, దాచుకొని తింటున్నట్లు తరువాత మూతికి నెత్తురుతో, మట్టితో తిరిగి మన దగ్గరికి వచ్చినట్లు నేను కూడా పుస్తకమంతా రాసిన తర్వాత చేతికి, మూతికి ఇంకుతోనే వాళ్ళకు కనబడేదాన్ని. మైఖేల్ మోర్టాన్ మొదటిసారిగా నా పుస్తకమైన ఎలిబీని నాటకంగా మలిచాడు. ఆయన బాగా చేయితిరిగిన నాటక రచయిత. నిజానికి అది నాకు ఏమీ నచ్చలేదు. నా హీరో వయస్సు 20 ఏళ్ళు తగ్గించేశాడు. కానీ అప్పుడు నాకు అంతగా పోట్లాడే శక్తి లేక ఊరుకున్నాను... మౌస్ ట్రాప్ విజయాన్ని గురించి చాలామంది అడిగారు. నేను ఇది అదృష్టమేనంటాను. ఒక నాటకం విజయవంతం కావాలంటే అదృష్టం తోడు కావాలి. మరికొంత మంది మౌస్ ట్రాప్‌ని ప్రపంచ రికార్డుల కోసం ఆడిస్తున్నారా? అని అడిగారు. నేను ఇంకా రికార్డులు ఏమైనా మిగిలి ఉన్నాయా అని అడిగాను.

**ఒ**క నాటకం నిర్విఘ్నంగా, నిరంతరాయంగా ఒకే ప్రదేశంలో 60 సంవత్సరాలుగా ప్రదర్శింపబడుతూ వుండటం ప్రపంచ రికార్డుల్లో ఒక అద్భుతం. ప్రపంచ నాటకరంగ చరిత్రలోనే నమ్మశక్యంకాని నిజం. ఆ నాటకం పేరు *'మౌస్ ట్రాప్'.* ఆ అద్భుతాన్ని సొంతం చేసుకున్న నగరం లండన్. బ్రిటిష్ ప్రభుత్వం ఆ దేశ సాంస్కృతిక చరిత్రలో భాగంగా ఆ 'మౌస్ ట్రాప్' నాటక ప్రదర్శనని సగర్వంగా చేర్చుకుంది.

ప్రపంచంలో అత్యధికంగా చదవబడే రచనలు ఎవరివి అంటే చాలా మంది షేక్స్పియర్ పేరు గుర్తు చేసుకుంటారు. కానీ, యునెస్కో సర్వే ప్రకారం ఆ మొదటి స్థానం రచయిత్రి అగతా క్రిస్టీకి దక్కుతుంది. ఎంతో దూరంలో తర్వాత స్థానం షేక్స్పియర్‌ది. నెంబర్‌వన్ రైటర్‌గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆ అగతా క్రిస్టీయే ఈ *మౌస్ ట్రాప్* నాటక కర్త.

ఒక గొప్ప పర్యాటక నగరంగా లండన్ చూడటానికి వచ్చే యాత్రికులు బకింగ్‌హామ్ ప్యాలెస్, టవర్ బ్రిడ్జి, ట్రఫాల్గర్ స్క్వేర్... వంటి సందర్శనీయ ప్రదేశాలతోపాటు *మౌస్ ట్రాప్* నాటక ప్రదర్శన చూడటం ప్రత్యేక ఆకర్షణగా భావిస్తారు.

ముందుగా ఈ నాటకం లండన్ వెస్టెండ్‌లోని అంబాసిడర్ థియేటర్లో 25 నవంబరు 1952న ప్రారంభమయింది. తర్వాత 25 మార్చి 1974 నుండి అక్కడికి దగ్గర్లోనే వున్న సెంట్ మార్టిన్ థియేటర్‌కి మార్చబడింది. ఈ 60 సంవత్సరాల *మౌస్ ట్రాప్* ప్రదర్శనా కాలంలో పన్నెండు మంది అధ్యక్షులు, పదకొండు మంది బ్రిటీష్ ప్రధానులు మారారు. కానీ, వెస్టెండ్‌లోని సెంట్ మార్టిన్ థియేటర్‌లోనే కాకుండా ఈ నాటకాన్ని ఇంత వరకు 44 ఇతర దేశాల్లో ప్రదర్శించారు.

ఒక విమర్శకుడు ఈ నాటకం విజయాన్ని గురించి చెబుతూ లండన్ టవర్ మీద రోజూ పక్షులు వచ్చి వాలినంత సహజంగా వెస్టెండ్‌లో *మౌస్ ట్రాప్* ప్రదర్శింపబడుతూనే వుందని చమత్కరించాడు. ఈ నాటకంలో మొత్తం పాత్రలు

యస్సేరావ్, ఫోన్ : 9440730549

ఎనిమిదే అయినా గడిచిన 60 సంవత్సరాల ప్రదర్శనల్లో 403 మంది నటీనటులు, 23 మంది దర్శకులు మారారు. నాటకంలోని పాత్రధారుల్లో ఎవరైనా ఏ కారణంగానయినా ఆ రోజు ప్రదర్శనలో నటించే వీలులేనప్పుడు మరికొంత మంది నటీనటులు తర్ఫీదు పొంది సిద్ధంగా ఉంటారు. వీళ్ళని 'అండర్ స్టడీస్' అంటారు. అలా అండర్ స్టడీస్‌గా ఈ నాటకానికి మరో 187 మంది నటీనటులు పనిచేశారు.

1960 సంవత్సరంలో ఒకరోజున ఈ అండర్‌స్టడీస్ ఒకరి కారణంగా *మౌస్ ట్రాప్* ప్రదర్శన ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. డిటెక్టివ్ సార్జెంట్‌గా నటించే ఆంథోని ఆలివర్ ఆఖరి సీనులో స్టేజి మీదికి ప్రవేశించాక అతని పాత్రకి అండర్ స్టడీగా వున్న నటుడు థియేటర్ నుండి వెళ్ళిపోయాడు. తన పాత్రధారి ఆఖరి సీను నటించేందుకు స్టేజి ఎంట్రీ ఇచ్చాక అండర్‌స్టడీ వెళ్లిపోవడం మామూలే!

అయితే ఆ రోజున ఆఖరిసీనులో నటిస్తూ అలివర్ ఆకస్మాత్తుగా స్టేజిమీద కుప్పకూలిపోయాడు. వెంటనే తెర వేసేసి ఆ పాత్ర నటించాల్సిన అండర్‌స్టడీ కోసం చూశారు. కానీ, అప్పటికే అతను థీయేటర్ విడిచి వెళ్లిపోయాడని తెలిసింది. స్టేజి మీద నటిస్తూ స్పృహ కోల్పోయిన ఆలివర్ పరిస్థితి వివరించి ప్రేక్షకుల్ని కాసేపు ఓపిక పట్టమని అనౌన్స్ చేశారు. ఇంతలో ఆలివర్ కోలుకున్నాడు. మళ్లీ తెరలేపి ఎప్పటిలాగే నాటక ప్రదర్శనని ముగించారు. ఈ 60 సంవత్సరాల కాలంలో ఆ ఒక్కరోజు మాత్రమే *మౌస్ ట్రాప్* ప్రదర్శనకి కొద్ది క్షణాలు అంతరాయం కలిగింది. కానీ, ఆగిపోవడం జరగలేదు.

1952 సం॥ *మౌస్ ట్రాప్* నాటకం ప్రారంభంలో రిచర్డ్ అటెన్‌బరో ప్రధాన పాత్రలో నటించడానికి ఒప్పుకున్నాడు. *గాంధీ* సినిమాని డైరెక్ట్ చేసిన ఈ హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆ రోజుల్లో కూడా పాపులర్ హీరోయే! పద్దెనిమిది. నెలలపాటు నటించిన తర్వాత రిచర్డ్ అటెన్‌బరో నాటకం నుంచి తప్పుకున్నాడు. నిజానికి అదొక పెద్ద అవరోధమే ! కానీ, ఆ తర్వాత పేరు ప్రఖ్యాతులున్న నటీనటులు లేకపోయినా కూడా *మౌస్ ట్రాప్* విజయపథం వైపు దూసుకు పోవడం ఆగలేదు. 60 సంవత్సరాలు దాటిపోతున్నా *మౌస్ ట్రాప్* ఇప్పటికింకా లండన్ సెంట్ మార్టిన్ థియేటర్లో ప్రదర్శింపబడుతూనే ఉంది.

**గిన్నీస్ బుక్ రికార్డులు :**

ఒకే చోట ... లండన్‌లో సుదీర్ఘకాలంగా ప్రదర్శింపబడుతున్న నాటకంగా మౌస్‌ట్రాప్ గిన్నీస్‌బుక్ ప్రపంచ రికార్డు సాధించడంతో బాటు ఆ నాటకంలో డేవిడ్ రేవన్ అనే నటుడు మేజర్ మెట్ కాఫ్ పాత్రను వరసగా 4575 ప్రదర్శనల్లో నటించినందుకు గిన్నీస్‌రికార్డు పొందాడు.

ఇంకో విశేషమైన గిన్నీస్ రికార్డుని ఆ నాటకంలో మిసెస్

15 మార్చి 1959న *మౌస్ ట్రాప్* నాటక బృందం వార్మ్‌వుడ్ స్క్రబ్స్ జైలుకి వెళ్లి ఖైదీల కోసం ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంతో ఉత్కంఠగా జరుగుతున్న ప్రదర్శనలో ఖైదీలతో పాటు జైలు రక్షక సిబ్బంది కూడా లీనమైపోయారు. ఇదే అదనుగా ఇద్దరు ఖైదీలు జైలునుండి పరారీ అయ్యారు. ఆ వార్తను లండన్‌లో అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రధానంగా ప్రచురించారు.



కేవలం ఆరుగురు ప్రేక్షకుల కోసం 'మౌస్ ట్రాప్' ప్రత్యేక ప్రదర్శన (25-1-1976న)

'ది సండే పీపుల్' పత్రిక జనవరి 1976లో వేరొక పోటీ పెట్టి, అందులో గెలిచిన ముగ్గురు విజేతలకి ఓ ప్రత్యేకమైన బహుమతిని ప్రకటించింది. ఆ ముగ్గురు విజేతలు ఒక్కొక్కరు ఒకర్ని తోడు తీసుకుని ఆ ఆరుగురు మాత్రమే నాటకం చూసే నాటకం చూసే ఏర్పాటు జరిగింది. 25 జనవరి 1976 నాటి ప్రదర్శన యొక్క ఆదాయాన్ని ఆ పత్రిక చెల్లించి, కేవలం ఆ ఆరుగురి కోసం సెంట్‌మార్టిన్ థియేటర్లో *మౌస్ ట్రాప్* ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా తెరలేచింది. హాల్లో కేవలం ఆరుగురు ప్రేక్షకులే ఉన్నారు. ప్రతిరోజూలాగే ఆరోజు కూడా నటీనటులు ప్రదర్శనని రక్తికట్టించారు. ఈ 60 ఏళ్ల *మౌస్ ట్రాప్* చరిత్రలో కేవలం ఆరుగురి కోసం ప్రత్యేక ప్రదర్శన జరిగింది ఆ ఒక్కరోజే!



మూగ, చెవిటి ప్రేక్షకులకి సౌంజ్ఞలతో తర్జుమాచేస్తూ జరిగిన ప్రత్యేక ప్రదర్శన



అగతాక్రిస్టి, ప్రయోక్త పీటర్‌సాండర్స్

బోయ్లే పాత్రకి అండర్‌స్టడీగా 6240 ప్రదర్శనలకి తయారై వుండి 75 సార్లు నటించినందుకు గాను నేన్సీసీబ్రూక్ అనే నటీమణి సొంతం చేసుకుంది.

14 మే 1981న మూగ, చెవిటి వారి కోసం *మౌస్ ట్రాప్* ప్రత్యేక ప్రదర్శనని ఏర్పాటు చేశారు. నటీనటులు స్టేజి మీద నాటకం ప్రదర్శిస్తుండగా స్టేజి ముందుభాగంలో సౌంజ్ఞభాష తెలిసిన వ్యక్తులు కూర్చుని ఒక్కో పాత్రకి ఒక్కొక్కరు ఆ మూగ, చెవిటి ప్రేక్షకులకి అర్థమయ్యేలా బోధపరిచారు. *మౌస్ ట్రాప్* చరిత్రలో ఈ సౌంజ్ఞభాష తర్జుమాతో నడిచిన ప్రదర్శన నిజంగా ఒక అద్భుత ప్రయోగమనే చెప్పాలి.

ఇంగ్లండ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ *మౌస్ ట్రాప్* 21వ వార్షికోత్సవం సందర్భంగా 25 నవంబర్ 1972 నుండి ఉత్తరాల కవర్ల మీద పోస్టల్ ముద్రవేసి ఒక యేడాది పాటు ప్రభుత్వపరంగా నాటకానికి ప్రచారాన్ని ఇచ్చారు.

25 నవంబరు 1952న *మౌస్ ట్రాప్* ప్రారంభించాక అప్పటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ సతీసమేతంగా అంబాసిడర్ థియేటర్లో నాటకాన్ని చూశారు. 25 నవంబరు 1977న 25వ వార్షికోత్సవం (సిల్వర్ జూబ్లీ) వేడుకలకి గౌరవ అతిథిగా అప్పటి బ్రిటన్ ప్రధాని జేమ్స్ కాలగాన్ హాజరయ్యారు. 25 నవంబర్ 1992న జరిగిన 40వ వార్షికోత్సవ సభకి విచ్చేసిన బ్రిటన్ ప్రధాని జాన్‌మేజర్ ప్రసంగిస్తూ 'మన నాటకరంగంతో సరితూగేది ప్రపంచంలో ఎక్కడా లేదనేది నా ప్రగాఢ నమ్మకం' అన్నారు.

50వ వార్షికోత్సవం (గోల్డెన్ జూబ్లీ) సందర్భంగా 25 నవంబరు 2002న బ్రిటీష్‌రాణి ఎలిజిబెత్ *మౌస్ ట్రాప్* ప్రత్యేక ప్రదర్శనకి విచ్చేశారు. నాటకం ముగిశాక నాటక ప్రయోక్త పీటర్ సాండర్స్‌ని, అతని సతీమణిని, *మౌస్ ట్రాప్* ప్రారంభించిన తొలిరోజుల్లో ప్రధాన పాత్రలు పోషించిన రిచర్డ్ అటెన్‌బరో, అతని సతీమణి షీలాసిమ్‌లను, దర్శకుడు డేవిడ్ టర్నర్‌ని, పాత్రధారులందరినీ కలిసి ఎలిజిబెత్ రాణి అభినందనలు తెలుపుతూ కరచాలనం చేశారు. ఇది ఒక నాటకానికి దక్కిన అపూర్వమైన గౌరవంగా భావించాలి.

ప్రపంచ నాటకరంగ చరిత్రలోనే 60 ఏళ్లుగా ప్రదర్శింపబడుతున్న *మౌస్ ట్రాప్* విజయ రహస్యం ఏమిటి?... గొప్ప ఇతివృత్తమా? కుటుంబ కథా? సస్పెన్సా? ఉత్కంఠా? కథాగమనంలో పటుత్వమా?... ఈ ప్రశ్నలకి, సందేహాలకి నాటక రచయిత్రి అగతాక్రిస్టీ గానీ, ప్రయోక్త పీటర్‌సాండర్స్‌గానీ సమాధానం ఇవ్వలేకపోయారు.

*మౌస్ ట్రాప్* నాటకాన్ని ఆపకుండా ఇంకా ప్రదర్శిస్తూనే వుండటానికి కారణం మరికొన్ని రికార్డులు బద్దలు కొట్టడానికా? అని మీడియా అగతా క్రిస్టీని అడిగినప్పుడు ఆమె వినమ్రంగా 'అధిగమించాల్సిన రికార్డులు ఇంకేం ఉన్నాయి' అని జవాబిచ్చారు.

బ్రిటన్ మహారాణి చేత 'డేమ్' బిరుదు పొంది, ప్రపంచ సాహితీ, నాటకరంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించి,

లండన్ 'ఈవినింగ్ న్యూస్' పత్రిక 05-10-1970న ఒక పోటీని నిర్వహించింది. ఆ పోటీలో గెలుపొందిన వ్యక్తి ఒక్కరే థియేటర్‌లో కూర్చుని *మౌస్ ట్రాప్* నాటకాన్ని చూడొచ్చు. లేదా, ఆ ప్రదర్శనకి వసూలయిన డబ్బు మొత్తం తీసుకోవచ్చు. ఆ పోటీ గెలుచుకున్న బ్రెండా కోల్మన్ అనే గృహిణి ప్రదర్శన ఆదాయాన్ని కోరుకుంది. ఆ బహుమతి సొమ్ములో సగం తన కూతురి కంటిచూపుని కాపాడిన చిన్న పిల్లల హాస్పిటల్‌కి విరాళంగా ఇచ్చి, మిగతా సగం డబ్బుతో ఆ హాస్పిటల్ సిబ్బందికి తన భర్తతో కలిసి విందు ఇచ్చింది.

అపరాధ పరిశోధన రచనల్లో తనదైన ముద్రను మిగిల్చిన అగతా క్రిస్టీ 12 జనవరి 1976న ఆమె 85వ యేట కాలధర్మం చెందారు. అప్పటికి *మౌస్ ట్రాప్* 23 ఏళ్ళు పూర్తి చేసుకుని సెంట్ మార్టిన్ థియేటర్లో *మౌస్ ట్రాప్*ని చూడటానికి వచ్చే ప్రేక్షకుల్లో సగం మంది బ్రిటన్ దేశస్థులయితే, సగం ఇతర దేశాల నుంచి వచ్చిన వాళ్లుంటారు.

లండన్ టైం ప్రకారం రాత్రి సరిగ్గా 8 గంటలకి కర్టెన్ లేస్తుంది.

ఊరి పొలిమేరకి దూరంగా ఉన్న ఓ గెస్ట్‌హౌస్. గైల్‌రాల్స్‌టన్, మోలీరాల్స్‌టన్ అనే నవదంపతులు ఆ గెస్ట్‌హౌస్‌ని నడుపుతుంటారు. ఆ రోజు రాత్రి మంచు తుఫాను కారణంగా బయట విపరీతంగా మంచుపడుతోంది. ఆ చలిరాత్రి ఒకరి తర్వాత ఒకరుగా అయిదుగురు అతిథులు గెస్ట్‌హౌస్‌లో చేరారు. ఇంతలో ఎక్కడో హత్య జరిగిందన్న వార్త రేడియోలో ప్రసారమైంది. తర్వాత డిటెక్టివ్ సార్జెంట్ ట్రాటర్ ఫోన్ చేసి ఆ హత్య పరిశోధన నిమిత్తం తను గెస్ట్‌హౌస్‌కి వస్తున్నట్లు చెప్పాడు. ఆ వార్త తెలిసి రాల్స్‌టన్ దంపతులు, అతిథులు ఆశ్చర్యపోతుండగా డిటెక్టివ్ సార్జెంట్ రంగ ప్రవేశం చేశాడు. ఆ గెస్ట్ హౌస్ నడుపుతున్న రాల్స్‌టన్ దంపతులతోబాటు ఆ రాత్రికి బస చెయ్యడానికి వచ్చిన ఐదుగురిలో ఒకరికి హత్యతో సంబంధం ఉందని ట్రాటర్ ప్రకటించాడు.

అందరిలోను భయాందోళనలు చోటు చేసుకున్నాయి. డిటెక్టివ్ సార్జెంట్ ఒక్కొక్కర్నే ప్రశ్నిస్తూ నేరపరిశోధన చేస్తున్న సమయంలో స్టేజిలైట్లు 'ఫేడ్' అవుతున్నాయి. ఆ మసక చీకట్లో ఓ గావుకేక విన్పించింది. గెస్ట్‌హౌస్‌లోని ఏడుగురిలో ఒకర్ని ఎవరో హత్యచేశారు. ఆ షాక్‌తో మొదటి రంగం ముగించి నాటకానికి విరామం ప్రకటించారు. గెస్ట్‌హౌస్‌లోని మిగిలిన వాళ్లంతా బోనులో ఎలకల్లా చిక్కుకున్నారు. అదే *మౌస్ ట్రాప్!* రెండో రంగంలో డిటెక్టివ్ సార్జెంట్ నేరపరిశోధన చెయ్యడం, చివరికి హత్య చేసింది ఫలానా అని రుజువు కావడంతో నాటకం ముగుస్తుంది.

ప్రేక్షకుల కరతాళధ్వనుల హోరు తగ్గాక ప్రధాన పాత్రధారి డిటెక్టివ్ సార్జెంట్ ముందుకొచ్చి 'ఈ నాటకంలో ఇప్పుడు మీరు కూడా భాగస్వాములయ్యారు. మీరు తెలుసుకున్న సస్పెన్స్‌ని మీ గుండెల్లోనే దాచుకోండి' అని మనవి చేస్తాడు. తెరపడుతుంది. వాచీ చూసుకుంటే రాత్రి 10.15. అంటే 2 గం॥ 15 ని॥ల సేపు నాటకం నడిచింది.

60 ఏళ్లుగా బ్రిటన్ దేశస్థులనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే లక్షలాది ప్రేక్షకుల్ని ఆకర్షించి, ఆకట్టుకున్న అంశాలు ఏమున్నాయి ఈ నాటకంలో అని ప్రశ్నించుకుంటే ప్రధానంగా చెప్పుకోవలసింది నాటకంలోని సస్పెన్స్! ఏ పాత్ర హత్యలు చేస్తుందో ప్రేక్షకుల్లో ఎవరూ ముందుగా వూహించలేకపోవడం!

డిటెక్టివ్ రచనల్లో ఆరితేరిన అగతా క్రిస్టీ ఈ నాటకంలో పాత్రల్నీ, సన్నివేశాల్నీ నడపిన తీరు అద్భుతం! కనురెప్పలు వాల్చకుండా ప్రేక్షకుడు తదేక దృష్టితో ప్రదర్శనలో లీనమయ్యేలా చేస్తుంది. మన కళ్ళ ముందే కదలాడే పాత్రల్లో ఏ పాత్ర హత్యచేసి ఉంటుందో కనిపెట్టాలని ప్రతి ప్రేక్షకుడి మనసు ఉత్కంఠకు లోనవుతుంది. ఫలానా పాత్ర హత్య చేసి వుంటుందేమో అని నిర్ధారించుకునేలోగా మరో పాత్ర మీద సందేహం కలుగుతుంది. ఇంకో సన్నివేశంలో మన అనుమానం వేరొక పాత్ర మీదికి మళ్లిపోతుంది. చివరికి మన ఊహకందని రీతిలో అసలు నేరస్థుడి నిజరూపం బయటపడుతుంది.

బ్రిటన్ దేశస్థులే కాదు ఈ నాటకం చూసిన ప్రేక్షకులెవ్వరూ సస్పెన్స్ ఏమిటన్నది చెప్పరు. అలా చెప్పకపోవడటం నైతిక బాధ్యతలా భావిస్తారు. ఇది కూడా నాటక విజయానికి ఒక ప్లస్‌పాయింటే! నా వరకు నేను *మౌస్ ట్రాప్* నాటకం చూశానని చాలామందితో చెప్పానుకానీ, సస్పెన్స్ ఏమిటన్నది ఎవరికీ చెప్పలేదు. చెప్పకూడదు.

*మౌస్ ట్రాప్* విజయానికి ఆయువుపట్టు సస్పెన్స్ అనుకుంటే ప్రదర్శన ఆద్యంతం రక్తికట్టడానికి పాత్రధారుల నటనా ప్రతిభ, దృశ్యబంధన నిర్మాణం, నేపథ్య సంగీతం మొదలైన అంశాలన్నీ తోడ్పడ్డాయి. తెర తొలగించి స్టేజిని



'మౌస్ ట్రాప్' రంగాలంకరణ దృశ్యం

లైట్ అప్ చేసిన క్షణం నుండే అది రంగస్థలం అనే విషయం మరిచిపోతాం. అన్ని సదుపాయాలతో అమర్చిన ఒక గెస్ట్ హౌస్‌కి అతి చేరువలో ఉన్నామనే భ్రాంతి కలుగుతుంది.

గెస్ట్‌హౌస్‌లోకి ప్రవేశిస్తున్న అతిథుల కోటు, హేటు మీద తెల్లతెల్లగా కనిపించే కృత్రిమ మంచుతుంపర్లు, ఫైరోప్లేస్ దగ్గరకొచ్చి అరచేతులకి వేడిసెగ తగిలించి రాపిడి చేసుకోవడం, కిటికీ తెరిచినపుడు బయట కనిపించే మంచుతుఫాను హోరు... మనల్ని కూడా ఆ చలిగాలులు తాకినంత ఫీలింగ్ కలుగుతుంది. ఇక రంగోద్దీపన, నేపథ్యసంగీతం ఇవన్నీ తమ ఉనికి విడిగా కనిపించకుండా ప్రతి సన్నివేశంలో ఒదిగి ప్రదర్శనని ఆద్యంతం రక్తి కట్టించాయి.

*మౌస్ ట్రాప్* ప్రారంభమైన 1952వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు పనిచేసిన 23 మంది దర్శకులు కాలానుగుణంగా అవసరమైన మెరుగులు దిద్దుతూ ప్రదర్శన ఎప్పటికీ నిత్యనూతనంగా, జనరంజకంగా వుండేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రపంచ నాటకరంగ చరిత్రలో ఒక అద్భుత దృశ్యకావ్యంగా నిలిచిపోయిన *మౌస్ ట్రాప్* నాటకాన్ని చూడటం ఒక అదృష్టం! ఒక మధురానుభూతి!!




'మౌస్ ట్రాప్' ప్రదర్శింపబడుతున్న
సెయింట్ మార్టిన్స్ థియేటర్




60 సంవత్సరాలుగా

లండన్‌లో ప్రతిరోజూ నాటకాలు ప్రదర్శించడానికి 52 నాటకశాలలు వున్నాయని తెలిసి ఆశ్చర్యంతో కూడిన ఆనందం కలిగింది. ఇక్కడ మనవాళ్లు సినిమాల మీద చూపించే మోజుకన్నా అక్కడి ప్రజలు నాటకంపట్ల చూపే అభిమానం, ఆదరణ ఎన్నో రెట్లు ఎక్కువ!

అన్ని దేశాల్లోలాగానే లండన్‌లో కూడా సినిమాలు ఆడతాయి. అందులో చెప్పుకోదగ్గ విశేషమేమీ లేదు. కానీ, అక్కడ నాటకాలకి ఉండే ఆకర్షణ వేరు. అవి సంవత్సరాల తరబడి ప్రదర్శింపబడుతూ ఉంటాయి.

60 సంవత్సరాలుగా ప్రదర్శింపబడుతున్న *మౌస్ ట్రాప్* లాగే, హెర్‌మెజెస్టీ థియేటర్లో 'ఫాంటం ఆఫ్ ది ఒపేరా' 26 సంవత్సరాలుగా, క్వీన్స్‌లో 18 సంవత్సరాలుగా 'లే మిజరబుల్స్', డొమినియన్‌లో 10 సంవత్సరాలుగా 'వి విల్ రాక్ యు' ... విజయవంతంగా ప్రదర్శింప బడుతున్నాయి.



ఇవి మాత్రమే కాదు లండన్ నాటకరంగ చరిత్రలో ఎన్నో నాటకాలు గతంలో కూడా సంవత్సరాల తరబడి ప్రదర్శింపబడిన రికార్డులు ఉన్నాయి. ఇది ఎప్పటికీ వన్నె తరగని లండన్ రంగస్థల వైభవం.

# అట్టమీది బొమ్మలు




**ముఖచిత్రం :** భారతదేశం గర్వించ దగ్గ ఆధునిక చిత్రకారుల్లో అగ్రగామి నారాయణ శ్రీధర్ బెంద్రే. పి.టి.రెడ్డి, ఎమ్.ఎఫ్. హుస్సేన్‌లకు ఆయన గురువు. బెంద్రే వేసిన చిత్రాలలో రేఖలు, రంగులు కొద్దిగా వికేంద్రీకరణ కాబడినా సౌందర్యాన్ని కోల్పోవు. పైపెచ్చు అందులో అందాలు ద్విగుణీకృత మవుతాయి. ఈ చిత్రం చెట్టు కొమ్మనానుకుని నిలబడి వున్న ఒక సుగాలీ పడుచుది. ఇది చూడ్డానికి ఒక మొజాయిక్‌గా అంటే కొన్ని రంగు రాళ్ళు పేర్చగా ఏర్పడిన కలయికగా కనిపిస్తుంది. కానీ కుంచెతో ఈ రకమైన నైపుణ్యాన్ని ప్రదర్శించడం ఆయన ప్రత్యేకత. బెంద్రే పై ***మిసిమి*** జూలై 2007లో ప్రత్యేక వ్యాసం ప్రచురించ బడింది. బెంద్రే చిత్రాలంటే 'మో' గారికి ఎంతో ఇష్టం. అప్పటి మిసిమిలో వచ్చిన చిత్రాన్ని ఆయన చివరి రచనగా వచ్చిన 'మో నిషాదం'కు అట్టమీద బొమ్మగా ఎన్నిక చేసుకుని ప్రచురించారు.


బెంద్రే



**రెండవ అట్ట – *కోరికలు:*** చిత్రకారుడు – మహంతి సర్కార్, ఒరిస్సా చిత్రకారుడు. కోరికలే గుర్రాలయితే? – పురివిప్పిన ఆశలకు హద్దేముంటుంది? కోరికల గుర్రానికి కళ్ళెం వేస్తున్న స్త్రీ ఒక వైపు, ఆకాశంలో మరోవైపుకి గుఱ్ఱపు కళ్ళాన్ని లాగుతున్న రెక్కలు కలిగిన దేవకన్య మరొక వైపు. అయితే అనూహ్యంగా ఇద్దరివీ ఒకే రూపు రేఖలు. చిత్రకారుడు ఒకే స్త్రీలో ఉండే రెండు భిన్న భావోద్వేగాలను దీనిలో చూపించే ప్రయత్నం చేశాడు. ఈ చిత్రంలో వాస్తవికత, అధివాస్తవికత, కల్పన ఈ మూడు ధోరణులలో మిళితమై ఈ చిత్రంగా రూపు దాల్చాయి.



**మూడవ అట్ట – *తీరిక:*** చిత్రకారిణి సుజాత సింగ్. ఈ చిత్రంలో కనిపించేవి తక్కువ రంగులు, తక్కువ రేఖలు. కానీ అభివ్యక్తి మాత్రం గాఢమైనది. నిలబడి ఉండి ఎడమవైపుకు ముఖాన్ని తిప్పి ఉంచిన ఒక స్త్రీ చిత్రమిది. ఆమె ముఖంలో కుడి వైపు పార్శ్వము కనిపిస్తున్నా అది కనీకనిపించకుండా చిక్కగా నున్న నలుపు రంగులో కలిసిపోయింది. తీరిక వేళలో ఆమె అంతర్ముఖం కావటంతో ఆమె మనసులో భావాలు ముసురుకున్నట్లు చిత్రించ బడింది.



**నాల్గవ అట్ట – *ఆట బొమ్మ:*** చిత్రకారుడు మన అందరికీ తెలిసిన అక్బర్. అక్బర్ ఆధునిక చిత్రకళా ధోరణులలో తనదైన ముద్రను ఏర్పచుకుని అందరి మెప్పును పొందినవాడు. ఈనాడు అసంఖ్యాకంగా తెలుగులో వస్తున్న కవిత్వాలకు, కథలకు అతను కవర్ డిజైనర్. ఒక విధంగా చెప్పాలంటే ఈ నాడు ప్రచురించబడే ఎన్నో తెలుగు పుస్తకాలకతనొక ఆస్థాన చిత్రకారుడు. అక్బర్ ఖమ్మం జిల్లా పాల్వంచలో వెనుకబడిన సామాజిక వర్గంలో సామాన్య మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. పాల్వంచ మార్కెట్టు వీధిలోని కృష్ణాయాడ్స్ నుండి హైదరాబాద్ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆర్ట్ డెస్క్ ఇన్‌చార్జి వరకు సాగిన ప్రయాణంలో ఎన్నో మజిలీలు ఉన్నాయి. నేడు హైదరాబాద్‌లో సోలో ప్రదర్శన వరకూ సాగిన అక్బర్ రంగుల ప్రస్థానం వెనక ఆత్మీయ మిత్రుల ప్రోత్సాహం, అంతకుమించి స్వశక్తితో ఎదిగివచ్చిన ప్రతిభ, అకుంఠిత దీక్ష, కఠోర పరిశ్రమా ఉన్నాయి.


అక్బర్

1995లో హైద్రాబాద్ వచ్చిన అక్బర్ అప్పటి ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్ కే.శే. త్రిపురనేని శ్రీనివాస్ ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని జ్యోతిలో సీనియర్ ఆర్టిస్ట్‌గా స్థిరపడ్డాడు. ఈ పదేళ్ళలో అక్బర్ తనేమిటో తన కుంచె ద్వారా నిరూపించుకున్నాడు. తెలుగులో సుమారు రెండువేల గ్రంథాలకు ముఖపత్ర రచన చేశాడు. శీలా వీర్రాజుగారి తర్వాత అత్యధిక సంఖ్యలో ముఖచిత్రాలు వేసిన ఘనత బహుశా అక్బర్‌కే దక్కుతుంది. వర్తమాన స్త్రీ, దళిత, ముస్లిం, తెలంగాణా సాహిత్యోద్యమాలకు బొమ్మలతో బలాన్నీ విస్తృతినీ కలిగించాడు. మి



# సంగీత ఝరి
# వసంతకుమారి

– మంతెన సూర్యనారాయణరాజు

విశిష్టమైన మౌలిక సంగీత సంగతులనామె అవలీలగా అభివ్యక్తం చేస్తుంది. నిడివీ, ఎత్తూ, లోతూ – అనే మూడు ప్రమాణాలతో గానం కొనసాగుతుంది. ఇంతకీ ఆమె ఎవరను కునేరు? మన భారతీయ సంప్రదాయ సంగీతానికి అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్టిన కర్నాటక గాయనీత్రయంలో ఒకరైన ఎమ్.ఎల్.వసంతకుమారి. ప్రముఖ దాక్షిణాత్య సంగీత సరస్వతి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, డి.కె.పట్టమ్మాళ్, మూడవవారు మన ఎమ్మెల్వీ. సంగీతశాస్త్ర పారంగతురాలైన విదుషీమణి ఎమ్.ఎల్.వసంతకుమారి గానం చేసిన లలితగీతాలైనా, సుబద్ధ సంగీత కృతులైనా, మీరా భజనలైనా, భక్తతుకారాం అభంగ్‌లైనా, ఆఖరికి సినీగీతాలైనా ఆమె గొంతులోంచి తొణికిసలాడిన ప్రతినాద రేఖా ఒక ప్రత్యేక మూర్తిమత్వంతో అలరారుతాయి. సంగీతసాధనను ఒక యజ్ఞంలా భావించి, కృషి చేసిన కర్ణాటసంగీతంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన అనమాన ప్రతిభావంతురాలు, విద్వాంసురాలు ఎమ్.ఎల్.వసంతకుమారి.

ఎమ్మెల్వీ 1928 జూలై, 3వ తేదీన ప్రముఖ సంగీత విద్వాంసురాలైన లలితాంగి, అయ్యస్వామి దంపతులకు ఒక సంగీత కుటుంబంలో జన్మించారు. జననీజనకుల సంగీత వారసత్వ సంపదను స్వీకరించి ఎమ్.ఎల్.బాలగాయనిగా సంగీత ప్రియులను పరవశింప చేసిన ప్రతిభావంతురాలు.

సంగీత విద్యలో ఎమ్మెల్వీకి అమ్మా నాన్నలే ఆదిగురువులని చెప్పాలి. అనంతరం ఆమె విశ్వ విఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసులు జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం వద్ద శిష్యరికం చేసింది. జి.ఎన్.బి. గారి వద్దే గాంధర్వ విద్యలోగల లోతుపాతుల్ని క్షుణ్ణంగా అధ్యయనంగావించినది. అతిస్వల్ప కాలంలోనే వసంత కుమారి సాధన ద్వారా గురువును మించిన శిష్యురాలై ప్రకాశించినది. ఆమెకు సంగీతంలో గల మాధుర్యం, మార్దవం, లాలిత్యం, సంగీత శాస్త్రగత విద్వత్తు, భావం కాలానుగుణ్యంగా కరతలామలకాలయ్యాయి. తద్వారా వాటినే అభరణాలుగా చేసుకుని వసంతకుమారి తాను గానం చేసిన కీర్తనలన్నిటినీ అమృత రసగుళికలుగా మలుచు కోగలిగింది. ముఖ్యంగా ఎమ్మెల్వీ కర్ణాటకసంగీత పద్ధతిలో సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించిన ఘనత కూడా దక్కించుకోగలిగింది.

జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం శిష్యరికంలో శిక్షణ పొందిన ఎమ్మెల్వీ కర్ణాటక సంగీత వేదిక మీద మొదటి కచేరి తన పదకొండవ యేట లేత వయసులోనే చేయడం ఆశ్చర్యదాయకమైన అంశం. తరువాత కాలంలో ఎమ్మెల్వీ ఆమె తల్లి శ్రీమతి లలితాంగి చేసే కచేరీలకు సహకార గానం అందించేందుకు వెళుతుండేది. ఆ విధంగా కర్ణాటక సంగీత ప్రియులకు వసంతకుమారి నాలుగు దశాబ్దాల పర్యంతం శ్రోతల్ని ఉర్రూత లూగించిన విద్వన్మణి కాగలిగిందంటే అతిశయోక్తి కానేకాదు.

శాస్త్రపరంగా చెప్పాలంటే ఆమె ఏ రాగం ఆలాపన చేసినా, ఆ రాగ రసభావాదులను తాను సంపూర్ణంగా అనుభవిస్తుంది. అదే పారవశ్యంతోనే వీరవసంతమైనా, కళ్యాణవసంతమైనా, చంద్రజ్యోతి యైనా, వేగవాహిని అయినా ఇంకా మరే విధమైన రాగాన్నైనా మృదులాచ్ఛస్వరూపంతో సాక్షాత్కరించి హృదయంగతమై తక్షణమే శ్రోతల్ని ఆకట్టుకోగలుగుతుంది. మనం గ్రహించాల్సిన అంశా లేమిటంటే ఆమె గానంలో ఎక్కడా స్థూలదృష్టిని అలరించే జిమ్నాస్టిక్స్‌గాని, జిమ్మిక్స్‌గాని, దురాక్రమణ చెయ్యవు.

విపరీతమైన లయవిన్యాసం వేలంవెర్రి స్థాయిలో పేట్రేగదు. ఇటువంటి గుణగణాలన్నీ, జి.ఎన్.బాల సుబ్రహ్మణ్యం వద్ద నుంచి ఆమె పుణికి పుచ్చుకున్నది. అందువల్లనే వసంతకుమారి గానం సంగీత వేత్తలైన

డాక్టరు మంతెన సూర్యనారాయణరాజు, ఫోన్ : 9989542228

విమర్శకుల ఆమోదాన్ని ఆమూలాగ్రంగా పొందినదనే చెప్పొచ్చు. సుశ్రుతులైన అసంఖ్యాక శ్రోతల్ని తనవైపుకు ఆమె తిప్పుకోగలిగింది.

గాత్ర సంగీత విద్వాంసులలో సర్వసాధారణంగా ఒక్కొక్కరికి వారు ఆడైనా, మగైనా ఒక్కో వాగ్గేయకారుని తమలక్ష్యంగా వారి వారి కీర్తనలనే ఎక్కువగా పాడుతుండటం కనిపిస్తుంది. అది అభిమానం వలననే కావచ్చు. అందరిలాగే ఎమ్మెల్వీ కూడా పురందర దాసు కీర్తనలను ప్రత్యేకించి పాడుతుందనే ప్రతీతి ఉన్నది. ఉడిపి కృష్ణుని స్మరించే కీర్తనలన్నీ ఆమె చేతి వెన్నముద్దలవలె కమ్మగా కర్ణపేయంగా గానంచేస్తుంది. ఉదాహరణకు – 'బారోకృష్ణయ్య'... 'కృష్ణయ్య నీవేగ బారో'... వంటి కీర్తనలతో దక్షిణాది వారి హృదయాలలో ఆమె ఎప్పుడో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగింది. ఎమ్మెల్వీ పాడిన థిల్లానా కానివ్వండి, ఇంకా శుద్ధరాగంతో ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన కానివ్వండి అది ఎంత సంస్కృత భాషాకౌశలం గలదైనా ఆమె 'శోభిల్లు సప్తస్వరములు' అన్నట్లుగానే అలరారుతుంది.

తాను జన్యురాగాలకు కల్పించిన సొగసుకు ముగ్ధుడైన మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు ఎంతో ప్రశంసల జల్లు కురిపించడం అనేది మరిచిపోలేని అనుభూతి. ఆమె కంఠమాధుర్యాన్ని గమనించిన చలన చిత్రసీమ ప్రముఖులు తమస్థాయికి అవసరమయ్యే కొన్నిపాటల్ని మాత్రం పాడించుకోవటం విశేషం. కన్నడంలో తీసిన 'హంసగీతే', తమిళంలో నిర్మించిన 'పార్థివన్', తెలుగు 'భూకైలాస్' చిత్రాలలో వసంతకుమారి పాటలుపాడింది. వీటికి తోడు ప్రముఖ హిందీ చలన చిత్ర నటుడు – నిర్మాత – దర్శకుడు వి.శాంతారాం తాను తీసిన ఒక చిత్రంలో హీరోయిన్ పాత్రకు ప్లేబాక్ ఎమ్మెల్వీ చేత పాట పాడించడం చెప్పుకోదగ్గ విషయం. వీరిందరితో బాటు తెలుగు చలనచిత్ర సంగీత దర్శకులైన సుబ్బరామన్, పెండ్యాల నాగేశ్వరరావు, సుసర్ల దక్షిణామూర్తి, ఎస్. రాజేశ్వరరావుగారలు కూడా కొన్ని పాటల్ని ఆమె చేత పాడించారు. ఈ నాటికీ ఆ పాటలు ఆణిముత్యాలైనిలిచాయి.

ఎమ్మెల్వీ ఉదారస్వభావం గల కళాకారిణి. అందుకే ఆమె ఎన్నో ఉచిత కచేరీలు ఇచ్చింది. పాఠశాలల నిర్మాణం కోసం, సంగీతకళాశాలల స్థాపన సహాయార్థం, ఆసుపత్రులు నెలకొల్పడానికీ, సాంస్కృతిక సంస్థలకు, అంతేకాకుండా నిత్యనైమిత్తికంగా సంభవించే దేశ విదేశీయ విపత్తుల పరిహారానికీ ఆమె విరివిగా నిధులు సమకూర్చిన దాఖలాలు లెక్కకు మించి ఉన్నాయి. ఇటువంటి సహాయ కార్యక్రమాలకు ఎమ్.ఎల్.వసంతకుమారికి మన ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి ఆదర్శప్రాయంగా పేర్కొన వచ్చును. పుట్టిన గడ్డ మీదే కాకుండా ఎమ్మెల్వీ సింహళం, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో ఎన్నోసార్లు నిధుల సేకరణార్థం ఉచితంగా కచేరీలు చేసింది.

రెండో పర్యాయం అంటే 1975లో మలయా, సింగపూర్‌లలో పర్యటించి ఆమె అసంఖ్యాక కచేరీలు చేసి ఆ వసూలైన సొమ్మును మలయా యూనివర్సిటీలో భారతీయ భాషాధ్యయన శాఖ స్థాపనకు నిధిగా విరాళం అందజేయడం ఆనందించదగిన విషయం. మరోసారి సింగపూర్‌లోని తమిళ ప్రతినిధి మండలి సహాయార్థం వసంతకుమారి రెండు కచేరీలు చేశారు. ప్రతిఫలాపేక్ష లేకుండా ఈనాడు ఎంతగొప్ప కళాకారుడైనా ఈమెలా త్యాగ గుణం ప్రదర్శించి సహాయ సహకారాలందించడం అనేది అరుదనే చెప్పుకోవాలి. తరతమ భేదాలు, భాషాప్రాంతీయ భేదాలను విస్మరించి ఎమ్మెల్వీ తమిళ



**అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్టిన కర్నాటక గాయనీత్రయం: ఎం.ఎస్. సుబ్బలక్ష్మి డి.కె.పట్టమ్మాళ్, ఎమ్.ఎల్.వసంతకుమారి**

తత్త్వాలు దగ్గర్నుంచి, కొన్ని జావళీలు, లలితగీతాలు, తిరుక్కురళ్ (తిరువళ్ళువర్), నీతిశ్లోకాలు, సంస్కృత అష్టపదులు ప్రత్యేకించి ఇళా, గోదాదేవిలపై భక్తి శృంగారకృతులు ఎన్నింటినో గానం చేశారు. ఆకాశవాణి కేంద్రాలైన హైదరాబాద్, విజయవాడ వారి పుణ్యమాఅని ఆమె పలుకృతులు పాడి తెలుగు వారికి అత్యంత ఆత్మబంధువు అయింది. ఎమ్మెల్వీలోగల ప్రత్యేకత ఏమంటే – తమిళ, కన్నడ, తెలుగు, సంస్కృత భాషాపదాలైనా ప్రతి పదం భావార్థాలతో, ముగ్ధసౌందర్యంతో మెరిపించగల శక్తి ఉండటం. హెచ్. ఎం.వి. వారి పుణ్యమా అంటూ ఆమె ఉత్తరాది వారికి కూడా సన్నిహితురాలైంది. ఇంచుమించు నాలుగు వందల ఏభైదాటి గ్రామఫోను రికార్డులు యిచ్చినట్లు మన తెలుగు కవి అవంత్స సోమసుందర్ చెప్పడం సత్యదూరం కాదు. ఆమె గానం చేసిన 'తిరుప్పావై' గ్రామఫోను రికార్డులుగా లభిస్తున్నాయి. కచేరీల ద్వారా లభించిన పారితోషికాలలో కొంతలో కొంతైనా వసంతకుమారి ఉదారంగా ఎన్నో ధార్మిక సంస్థలకు విరాళాలు ఇచ్చింది. ధనుర్మాసం నెల రోజులూ దక్షిణాదిలో గల వైష్ణవ దేవాలయాల్లో ఆమె గానం చేసిన రికార్డులు ప్రత్యూషః కాలంలో శృతి శుభంగా వినిపిస్తూనే ఉంటాయి.

ఆమె విద్య గురించి చెప్పాల్సొస్తే ఎమ్.ఎల్. వసంతకుమారి సీనియర్ కేంబ్రిడ్జి వరకూ చదివింది. ఇంగ్లీషులో అనర్గళంగా ఉపన్యసించగలదు. ప్రాంతీయ భాషలైన తమిళ, తెలుగు, కన్నడ మలయాళ భాషలలోనూ చాలినంత పరిచయం ఉండనే వుంది. ప్రాంతీయ దురభిమానాలకు, సంకుచిత భాషా భేషజాలకు అతీతంగా వ్యవహరించే సమైక్యవాది ఎమ్మెల్వీ. తనకు వచ్చిన అవార్డులకు, రివార్డులకు కొదవే లేదు.

1954లో సంగీత కళానిధి, రాజమాణిక్యపిళ్ళై అధ్యక్షతన మద్రాసు ఆర్ట్స్ అకాడమీ అమెకు 'సంగీత కళానిధి' బిరుదు ప్రదానం చేసింది. కుంభకోణానికి చెందిన కళాలయసంగీత సభవారు 'అమృత గాన వర్షిణి' అనే బిరుదిచ్చి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆస్థాన గాయకురాలుగా ఆమె పనిచేసింది.

1967లో భారత ప్రభుత్వం వసంతకుమారికి 'పద్మభూషణ్' బిరుదిచ్చి గౌరవించడం జరిగింది. పురందర దాసు ఆరాధనామండలి ఎమ్మెల్వీకి 'సంగీతకళారత్నాకరం' బిరుదు, 'తిరుప్పావై' గానం చేసినందుకు ఢిల్లీ సంగీత అకాడమీవారు 'తిరుప్పావైమణి' బిరుదులనొసంగారు. 1976లో అమెరికా పర్యటన సందర్భంగా వసంతకుమారికి 'నాదజ్యోతి' బిరుదు, అక్కడున్న కర్ణాటక సంగీత అకాడమీ వారు 'గానజ్యోతి' బిరుదుయిచ్చి సత్కరించారు.

ఇదే క్రమంలో తిరుపతి త్యాగరాజ ట్రస్టు 'సప్తగిరి సంగీత విద్వన్మణి'తో గౌరవిస్తే, 1976లోనే మైసూరు విశ్వవిద్యాలయం డి.లిట్. ప్రదానం చేసింది. వీటన్నిటికి తోడు వసంతకుమారికి తిరుపతిలోని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం విజిటింగ్ ప్రొఫెసర్ హోదాను కలిగించింది. ముఖ్యంగా విదేశాల్లో ఆమె భారత దేశ సాంస్కృతిక రాయబారిగా కర్ణాటక సంగీత కీర్తి పతాకను ఎగురవేసిన విదుషీమణి అని చెప్పాలి.

అన్నిటికన్న మిన్నగా ఆమె స్నేహశీలత, సంస్కారం, సౌజన్యాలతో బాటు చెరగని చిరునవ్వుతో నిండిన హుందాతనం ప్రతిబింబిస్తూ వుండే రూపం ఎమ్మెల్వీది. నిరంతరం సంగీత సాధనతో, శోధనతో, బోధనతో ఆమె జీవితం సంగీత సరస్వతికి అంకితం చేయ గలిగిందంటే అంతకన్నా జన్మ ధన్యత వేరే ఏముంటుంది?

జిడ్డు కృష్ణమూర్తి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 'దారు ఋషీ వాలా' సంగీత కళాశాలలో ఆచార్య పదవినలంకరించి ఎందరో విద్యార్థులకు ఎమ్.ఎల్. వసంతకుమారి సంగీత విద్యను బోధించినది. ఆమె కేవలం గాయని మాత్రమేకాదు, వేదాంతి.

ఎమ్మెల్వీ ఇంటి ఆవరణలో గల తోటలో జిడ్డు కృష్ణమూర్తిగారు వేదాంత, తత్త్వబోధనలు చేస్తుండేవారు. పురందరదాసు కీర్తనలను, తమిళ–తెలుగు భాషల్లో ఆమె ప్రచురించినది. ఆంధ్రదేశంలో కాకినాడలో సైతం 'సంగీత వనప్రియ' బిరుదు కైవసం చేసుకున్న ఎమ్మెల్వీ 1973 డిసెంబర్ మాసంలో నేపాల్ రాజప్రాసాదంలో రాజదంపతుల ముందు కచేరీ చేసి విశేష ప్రశంసలు పొందడమే కాదు, సన్మానాన్ని కూడా పొందినది. కళామతల్లి ముద్దుబిడ్డగా, అమూల్యాభరణంగా, వసివాడని గాన వసంతంగా ఎమ్మెల్వీ సంగీత ప్రియుల హృదయాలను ఎప్పుడో కొల్లగొట్టింది.

విధిని మార్చలేంకదా! గొంతు కాన్సర్ వ్యాధితో బాధపడుతూ, పచ్చకామెర్లు కూడా రావడం మూలంగా అక్టోబర్ – 31, 1990 లో వసంతకుమారి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యంపొందుతూ కన్నుమూశారు. ✿

# సాహిత్యంలో హాస్యం

*- దూపాటి శేషకుమారాచార్యులు*

**ఒ**క కథ వ్రాయడానికి కావల్సిన వస్తువులను నిత్యం జరుగుతున్న కార్యక్రమాల పైన పుంఖాను పుంఖాలుగా కథలు వ్రాయవచ్చును. అలా హాస్యకథలను వ్యక్తుల మీద వస్తువుల మీద మతిమరుపు పైన అనేక మంది అనేక విధాలుగా కథలు, కవితలు, పద్యాలు వ్రాసిన వారెందరో. హాస్యకథ వ్రాయాలంటే కథలోకి భావం పాత్రల ఔచిత్యం ముఖ్యం. వారిని వర్ణించటం, సంభాషణ చేసే పద్ధతి పైన ఇతరులు ఆకర్షింపబడతారు.

**ఉదా:** *కుక్కపిల్ల-సబ్బుబిళ్ళ, ఒక మొద్దబ్బాయి* గురించి చివరకు నండూరి వారి *గణపతి* వరకు అనేక హాస్యకథలు, నాటికలు పుట్టుకొచ్చాయి. రైల్లో ఆవకాయ జాడితో ప్రయాణం చేస్తుంటే పై నుండి ఆవనూనె పడి క్రింద కూర్చున్న వ్యక్తుల బట్టల రంగు మారితే ఎలా వుంటుందో చక్కని నాటక రూపంలో అందించారు. అలాగే మరో నాటక కర్త దూపాటి వారు. *వీర్రాజు* నాటికలో దువ్వెన ఫ్రీగా వస్తుంటే మూడు వందలకు వస్తువులను వేలం పాడటం, దానిని తెలంగాణా యాస భాషలో సంభాషణ నడిపించటం జరుగుతుంది. భమిడి పాటివారి కథలు, మునిమాణిక్యంగారి *కాంతం* కథలు చదువు తుంటే గిరీశం పాత్రసృష్టికర్త, అలాగే సుబ్బావధానులు మళ్లీ బుచ్చెమ్మ తమ్ముడితో వచ్చీ రాని ఇంగ్లీషు సంభాషణ హాస్యం పుట్టిస్తుంది.




నవ్వు ఆరోగ్యానికి టానిక్కు అన్నారు. ముసలితనం వచ్చిన రచయితలు కూడ తాను నవ్వక ఇతరులను నవ్వించే వారు. తెనాలి వారి సాహిత్యం నుండి చక్కని కథలు ఎన్నో ఉన్నాయి. *బీర్బల్ కథలు* హాస్యరసప్రధానం. హాస్య కథల విలువలలో నండూరి వారి *గణపతి* రచన చూస్తే రఘు రామచారు తులసీదళం అనే అపద్య భావాన్ని అక్షరం అక్షరం విడివిడిగా చెప్పడమంటే చారు తులసీ దళ ధామ అన్న దానికి అడవిలో చారులోకి కరియపాకు దొరకక తులసీదళం వేశారు అన్న పదానికి హాస్యం పుట్టిస్తుంది. అలాగే మరో రచయిత దూపాటి *వారి ప్రయాణం పదనిసలు, నైటు ఎక్స్‌ప్రెస్,* సంపత్కుమారాచార్యులు గారి కథా వస్తువు *శ్రీమతితో సినిమాకు,* శ్రీమతి నిరసన దీక్ష ప్రయాణంలో బస్సు దిగిపోతూ కండక్టరును ఏడ్పించిన విధానాన్ని రచయిత చక్కగా వర్ణించారు.

హాస్యపు జల్లులు కురిపించడంలో రచయితలే కాదు అవధాన శిరోమణులు కూడ ఎందరెందరో చక్కని అప్రస్తుత ప్రశంసలతో హాస్యాన్ని పుట్టించారు.

ఒక అవధానంలో కరిమళ్ల గార్ని ఖమ్మంలో *వస్త్రధారణ* పై పద్యం చెప్పమనగ ఎవర్నీ విమర్శించక వాళ్లు కట్టుకొన్న పంచెపైన పద్యం హాస్యంగా చెప్పారు. ఇరుకు ప్యాంటులో సుఖమెరగని యువకులు మా పంచెకట్టులోనే హాయి ఉందని చాటి చెప్పారు. ఇంకో అవధాని గార్ని కృష్ణుడుకి మీసాలు ఉన్నాయా అని, అత్తగారిచ్చిన రిస్టువాచి పైన పద్యం చెప్పమన్నారు. అలాగే *అత్తగయ్యాళి కోడలు* అని అడిగే లోపు....

**అత్త చెయ్యెత్తి కొట్టులోపు / కోడలు చెంపలు పగుల గొట్టు**
**అత్త గారి గయ్యాళి తనమున / కోడలేమి తీసిపోదని**

చక్కగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితులు కూడా అలాగే వున్నాయి కదా. ఒకచోట భార్య భర్తను ఎలా గౌరవించాలి అనగానే ఏముందండి భార్యకుర్చీలో కూర్చుంటే వచ్చిన భర్తకు చాప చూపిస్తుందంటే ఆ అనుబంధం ఎలా చెప్పాలి. తెలుగురాని యాంకర్ల పైన హాస్యపు పద్యాల కవితలు అనేకంగా వ్రాశారు. హాస్యకథలు వ్రాసిన వారు ఎక్కువగా కథావస్తువు అత్తగారు, బట్టతల, పైన కథలు వ్రాశారు.

ఒక గయ్యాళి పై చక్కని హాస్య కవితలు అందించిన

దూపాటి శేషకుమారాచార్యులు, ఫోన్ : 9441884744

దూపాటి వారు. ఆమె గయ్యాళి యనుచును...

ఊరు వారల మంచము కట్టి శ్మశానంలో పడేస్తే అక్కడి పిశాచులు మీటింగు పెట్టి ఆవిణ్ణి భరించలేమంటు కడకు ఇంటిముందు దింపి వెళ్లాయట.

అలాగే ఒకాయన ఊరు వెళ్దామని బయటకు రాగానే పిల్లి ఎదురు వచ్చిందట పూర్వకాలంలో సెంటిమెంట్ల పైన చక్కని నమ్మకం. అందుకని ఇంట్లోకి వెళ్లి కాళ్లు కడుకొని మంచినీళ్లు త్రాగి మళ్లీ బయటకు రాగానే అలాగే గుమ్మంలో కూర్చొని వుందట. ఒక వేళ ఏమైతే అయిందిలే అని బయలు దేరితే ఏదన్నా జరుగుతుందమోనని అనుమానం.

పెళ్లి కొడుకుతో చాదస్తు *బామ్మగారి ఇంటర్వ్యూ* అనే హాస్య కథలో బామ్మగారి చాదస్తంతో పెళ్లికొడుకును విసిగించిన విధానం చక్కగా వర్ణించారు.

నాటికలు, కథలు, కవితలు నవలల్లో హాస్యం ఉండేది. ప్రయాణంలో కనీసం రెండు పుస్తకాలు అమ్ముడు పోయేవి. కాని టి.వీలు వచ్చాక పుస్తకాలు చదవటం మానేసి టి.వీలకు అతుక్కు పోతున్నారు అత్తలు, కోడళ్లు.

ఒక పెళ్లికి ఒక కవిగారు వెళ్లారట అక్కడ చేరిన సాహితీ అభిమానులు పెళ్ళి గురించి వర్ణన చేయమనగా ఆయన ఒక హాస్యపు పద్యాన్ని చదివారు. పద్య భావము పరిశీలిస్తే పెండ్లికి ముందు కూతురు ఏడుస్తుందట దిగులుతో. పెళ్ళిలో అందరూ ముక్త కంఠంతో ఏడుస్తారట అప్పగింతల వేళలో. కొన్నాళ్లకు అత్తమామలు ఏడుస్తారట చెప్పిన మాట వినటంలేదని, గౌరవం తగ్గిందని.

ఇలాంటి పెండ్లిలో అనేక హాస్యపు పద్యాలు, పాటలు అనేకంగా ఉన్నాయి. *ప్రేమలేఖలు* అనే నాటికలో ప్రేమలేఖ చేసిన చిలిపి పనులను రచయిత చక్కగా వర్ణించారు. ఒకానొక కవిగారిని శిష్యులపై ఓ పద్యం చెప్పమన్నారట.




"మొదటి టిక్కెట్టు కొనుకొన్న, ఫస్టు సీటులో కూర్చొమని చెప్పివారే ఆంధ్ర అని తెలుసుకో శిష్యా అని *శిష్యా శతకంలో* చెప్పారు. వంద పద్యాలు సీరియలుగా విజయభేరి (నెల్లూరు నుండి వచ్చే పక్షపత్రికలో పడ్డాయి.)

మరొక రచయితను అత్త (గయ్యాళి) గురించి పద్యం చెప్ప మంటే...

**కం॥ అత్తకు పెత్తనమిచ్చిన**
**మెత్తని కోడలిని హింస మొదలు పెట్టగా**
**చిత్తున మామగారు నిలచె**
**సొత్తును పోగొట్టుకొన్న సోమరిగ నిలచెన్**

భానుమతి రామకృష్ణగారి అత్తగారి కథలు సున్నితమైన హాస్యంతో నిండి అలరించాయి. ఆమె నటిగా కంటే రచయిత్రిగానే ఎక్కువ కీర్తి గడించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతినిత్యజీవితంలో హాస్యపు సంఘటనలు ఎన్నెన్నో. జరిగిన వాటికి తుదిమెరుగులు దిద్దు తారు.

ఒక రిటైరయిన కవిగారి మనోభావాలు ఎలా వున్నాయో ఆయన హాస్యపురసాన్ని గూర్చి ఏం వ్రాసారంటే తాతయ్యా నేను ముందు స్నానం చేయాలి అంది మనమరాలు. ఉండమ్మా నేను ఆఫీసుకు వెళ్లాలి నేను ముందు చేయాలి అన్నాడు.

ఏంటండి మీరు మీరు మరీను, ఎలాగూ రిటైరు అయ్యారు. చేసే పనేమీ లేదు కాని దాన్ని ముందు స్నానం చేయనీండి అందిట వారి శ్రీమతి. హాస్యపు సన్నివేశాలు ఎక్కువగా ఆధునిక కవుల వస్తువుగా మారింది.

ఒకరోజు ఒక కవిగారు ఒక పెళ్లికి వెళ్లారుట అక్కడ ఒకాయన కూర్చొని ఒక చిన్న కవిత చెప్పమన్నాడుట అప్పుడు...

**పెళ్లికి ముందు పెళ్లికూతురేడ్చు**
**పెళ్లైయ్యాక పెళ్లికుమారుదేడ్చు**
**కడకు అత్తమామల కడతేర్చు**
**కట్నం ఇవ్వడానికి తండ్రిఏడ్చు**
**చివరికి అప్పగింతలలో అందరుఏడ్చు**

అన్నాడట.

ఒక చోట ఒక ఒకకవిగారు బస్సుకోసం ఎదురు చూస్తున్నాట, బస్సు వచ్చింది. కాని నిలబడటానికి కూడ చోటు లేదట మాస్టారు బస్కెక్కలేదేవి అన్నాడట ప్రక్కనున్న ఆయన "ఏం ఎక్కమంటారు ఫుల్ రష్‌గా ఉందన్నాడు. కాని మనస్సులో ఆ బ్రహ్మ అధిక సంతానం కల్పించిన గర్భిణీ స్త్రీలాగ ఉందని చెప్పా"లనుకున్నాడుట.

# వందేళ్ళ వీరరాఘవునికి వందన ప్రాప్తి

– కొల్లోజు కనకాచారి



కొండూరు వీరరాఘవాచార్యులు

రాయలయుగమున వికసించి వెలుగొందని కళలేదు. అష్టదిగ్గజముల వలన కవితాకళ మిన్నుముట్టినది. మహాశిల్పాచార్యులవలన శిల్పకళాలక్ష్మి మధురలాస్య మొనర్చినది. చిత్రకళ కళకళలాడినది. ఇన్నికళలు వన్నెచిన్నెలతో అలరారినపుడు నాట్యకళ యేల వికసింప కుండును? కళాప్రపూర్ణ, దర్శనాచార్య కొండూరు వీరరాఘవార్యులు *లేపాక్షి* నవలలో ఒకచోట కన్పించే నాలుగు వాక్యాలివి. ఈ వాక్యాలు చదువుతుంటే, కథవకసరమయి రాయలయుగమున అని అనటంగాని, తక్కిందంతా తమ తెనాలిగురించే వ్రాశారా అనిపిస్తుంది. *పాండురంగమహాత్మ్యం* కర్త తెనాలిరామకృష్ణయ్య రాయలసభలో ఉండేవాడంటారు. కాని తెనాలిలో రాయలకాలం – ఆనాటి వైభవం హృదయం తెరిచిచూస్తే, స్మరిస్తే యెవరికైనా కనిపిస్తుందన్నదిమాత్రం సత్యదూరం కాదు. ప్రాకృతికంగా సంపన్నమై, సాంస్కృతికంగా, సామాజికంగా, రాజకీయంగానూ గొప్పగా ఎదిగిన సీమ తెనాలిసీమ. ఎందరెందరో కవులు, రచయితలు, పండితులు, శిల్పులు, చిత్రకారులు, హరికథకులు, సంగీత కళాకారులు, రంగస్థల కళాకారులు, సినీకళాకారులు! అంతేనా– స్వాతంత్ర్యసమరయోధులు, హేతువాదులు, ధార్మికులు, ఔదార్యనిధులు, రాజకీయపారమెరిగిన పెద్దలు– అన్నింటా కలిమియేగాని, లవలేశం లేమిలేని సీమ తెనాలిసీమ.

**శిల్పసాహిత్యములు నాకు జీవగఱ్ఱలు**
**ఔపనిషధ వనాలు విహారవీథులు**
**ఈ చరాచరాత్మక జగద్ధితము వ్రతము**
**నడపు మిటు నాదు జీవితనాటకమ్ము**

అంటూ తమనుగూర్చి తాము చెప్పుకుంటూ, పరమేశ్వరుని ప్రార్థించిన విద్వన్మూర్తి, 'దర్శనాచార్య'గా, 'కళాప్రపూర్ణ'గా ప్రసిద్ధులయిన కొండూరు వీరరాఘవాచార్యులు ఆ తెనాలిసీమలో పుట్టినవాడే.

**కార్యములెల్ల సుందరముగా వెలయించెను వీరరాఘవా**
**చార్యగురుండు – కొండురు విశాలకులాబ్ధి సుధాకరుండు నా**
**శ్చర్యకరంబుగా తెలుగుజాతి కరంబును గర్వమంద సౌం**
**దర్య గంభీర భావ సముదాత్తముగా విరచించె గ్రంథముల్**

అంటూ సాహితీ వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి గారు ఆచార్యుల ప్రస్తుతి చేశారు. మరి–

**పదపదమ్మున సత్యమధువుగ పరిఢవిల్లిన వనం – రాఘవు**
**డితడు సాహితిలో సహస్రకరాల వైవిధ్యాన భానుడు**
**సత్యరత్నాకరుడు ప్రత్నానందుడై సాహిత్యరంగము నందు...**

అంటూ నల్లగొండజిల్లా వాసి, గింజల నరసింహారెడ్డి అభివర్ణించారు.

జ్ఞానపీఠపురస్కారగ్రహీతలు విశ్వనాథ, సి.నారాయణ రెడ్డి, సమగ్రాంధ్రసాహిత్యనిర్మాత ఆరుద్ర, శతావధాని వేలూరి శివరామశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, కళాప్రపూర్ణ మధునాపంతులు, బి.డి.జెట్టి, నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శంకర్‌దయాళ్‌శర్మ, ఆచార్యులు దివాకర్ల, దోణప్ప, ఎఱ్ఱోజు, సాహిత్యబ్రహ్మ వి.వి.ఎల్. నరసింహా రావుగారలును–ఇంకా ఎందరెందరో, కొండూరు వారి ప్రతిభా–పాండిత్యాలకు నీరాజనం పలికినవారున్నారు. అదేమీ వింతకాదు. ఎందుకంటే –కొండూరువారు 'అక్షరజ్ఞానమూర్తి', 'ప్రణవజ్ఞాననిధి', ప్రముఖ పాత్రికేయులు *తెలుగుసంపత్‌ప్రభ* పొత్తూరి వేంకటేశ్వరరావు గారు *ఆర్షవిజ్ఞానక్షేత్రం*లో ఈ తెలుగునేలలో కొండూరువారు చేసిన సేవ అనన్యసామాన్యం అన్నారు. ఈ చెప్పుకొన్నదాంట్లో ఆవంతయినా అతిశయోక్తి లేదు.

కొండూరువారు 1912 సెప్టెంబరు 26న జన్మించారు. ఆ మేరకు వారి శతజయంతి సంవత్సరమిది (2012 సెప్టెంబరు 26 వరకు). వారు ఏ సాహిత్యక్షేత్రంలో సేవచేసి

డాక్టరు కొల్లోజు కనకాచారి, ఫోన్ : 9491593871

జీవనసాఫల్యం సిద్ధించుకొన్నారో ఆ సాహిత్యసేవను ఒకసారి క్లుప్తంగానైనా స్మరించుకోవటానికి ఇది సందర్భం. సంభావ్యంకూడా.

ఒకవంక కళారాధనం-సాంస్కృతికసేవనం, మరోవంక సంప్రదాయ స్వస్వరూపదర్శనం-ఆదర్శ జీవనవాదం వారి సువిశాల సాహిత్యసీమలో ఎక్కువగా ప్రతిఫలించాయి. అదే సమయంలో సాహిత్యశాఖలన్నిటికీ చోటు కల్పించబడింది. ఆచార్యులు తెలుగులోనూ, సంస్కృతంలోనూ రచనలు చేశారు. వేదాంతం ప్రవచించారు. శిల్పశాస్త్రమర్మాలు, శిల్పంతో జతకట్టిన వేదాంత ప్రవచనం, క్రొత్త ఒరవడిలో సాగిన దర్శననిర్మాణం, విశ్వకర్మవిశ్వరూపతాదాత్మ్యం, గాంధేయ మరియు ఆధునికవాదాలతో సనాతన వాదాల సమన్వయం, జైన, బౌద్ధ, మహ్మదీయ, క్రైస్తవవాది మతాల సారాంశాల సమన్వేషణం, *భారతీయ తత్త్వగంభీరత, చిత్రం, శిల్పం, సంగీతం, సాహిత్యం, నాట్యం, రత్న శాస్త్రం, జ్యోతిశాస్త్రం, లోహవిజ్ఞానం, యోగసాధన* - ఇట్లాంటి విషయాల విశేషాలు వారి సాహిత్యంలో విస్తారంగా కనిపిస్తాయి... తాత్త్వికం లేదా దార్శనికం అనీ, తదితరమనీ వారిసాహిత్యాన్ని రెండుగా విభజించవచ్చు. విషయ వివరణల్లో ధర్మానికన్నా ధర్మసూక్ష్మ ప్రామాణ్యానికే ప్రాథమ్యం, ప్రాధాన్యం. ఖండనలకు విమర్శలకు దూరంగా ఉంటూ చెప్పదలచిన సిద్ధాంతాన్ని జాగ్రత్తగా, సుబోధకంగా, సూటిగా చెప్పుకుంటూ పోతారు. ఒక్క శిల్పం, శిల్పి విషయాల దగ్గరతప్ప, అంతటా చాలా సంయమనం.

**తెలుగునాటి యోగులచరిత్రకు, సంస్కృతీ చరిత్రకు ఆంధ్రదేశంలోని మతసామరస్యచరిత్రకు ప్రత్యేకించి హిందూమహ్మదీయ సఖ్యతాసాధకులైన మహాత్ములచరిత్రకును ఆచార్యులిచ్చిన కానుక *శ్రీసిద్ధయ్యచరిత్ర* 1950లో వెలువడింది. ప్రత్యేకంగానూ, విస్తృతంగానూ నిర్మించబడిన *శ్రీసిద్ధయ్యచరిత్రల*లో ఇదే మొదటిదని చెప్పాలి.**

కొండూరువారి సాహిత్యసేవకు సాక్ష్యాలు వెదకబోతే, ముద్రణకు నోచుకొన్నవానిలో 1934 మార్చి 16 నాటి *పంచానన* పత్రికలో *మానసప్రబోధము* అనే ఒక కవిత దొరుకుతుంది. అదే పత్రికలో ఆ పైన డిసెంబరు వరకు 13 రచనలు కనిపిస్తున్నాయి. ఆ పత్రికేగాకుండా *ప్రబుద్ధ పంచానన, ప్రబోధిని, అరుణోదయ, వార బ్రహ్మప్రబోధిని,* అనే పత్రికలకు వారు గౌరవ సంపాదకులుగా కూడా తమ సేవలందించారు. వానిలో *ప్రబోధిని* 1907లో ఆరంభించ బడింది. దానికి రాజపోషకులు ఆనాటి మునగాల మరియు పిఠాపురం సంస్థానాధీశ్వరులు. మధ్యలో ఒకమారు ఆగిపోయి 1929లో పునరుద్ధరించ బడింది. గంజాంజిల్లా సోంపేట నుండి 1919 ప్రాంతంలో *పంచానన* పక్షపత్రికగా వెలువడింది. అదే సోంపేట నుండి 1937లో వెలువడింది *ప్రబుద్ధపంచానన.* దువ్వూరు నుండి జిల్లెళ్ళ వీరబ్రహ్మాచార్యులు సంపాదకులుగా 1942లో ఆరంభమైంది *అరుణోదయ.* 1943 నుండి ఈ పత్రిక నడిచినంతకాలం కొండూరువారి రచనలెన్నో వానిలో చోటుచేసుకున్నాయి. 1936 నుండి 50 సంవత్సరాలపాటు సగటున సంత్సరానికొకటి చొప్పున *భారతి*లో వారి రచనలు దర్శనమిస్తాయి. మరోవంక *ఆంధ్రప్రభ, రామకృష్ణప్రభ, గుంటూరుమండల సర్వస్వం, విజ్ఞానసర్వస్వం* (4,14వ సంపుటాలలో) వారి రచనలు ఉన్నాయి. వారి వ్యాసాల్లోని *శిల్ప జీవనము, భారతీయసాహిత్య దృష్టి, సాయణ భాష్యము, కాళిదాసకవిత-మానవధర్మ సంస్కృతులు, అద్వైత సిద్ధాంత ప్రవర్తకురాలు వాగ్దేవి. ఋక్కులలో ప్రాణాయామప్రక్రియ* వంటి శీర్షికలెన్నో ఆయా విషయాల ఎంపికలో వారికిగల అభిరుచినీ, నిశితదృక్కునూ, హృదయ సంస్కారాన్నీ ఇట్టే పట్టిస్తాయి.

గ్రంథాల విషయానికొస్తే వారి మొదటి గ్రంథం *శ్రీనిరంజనవిజయము.* 1938లో ప్రకటించబడింది. తమ పాండిత్యసర్వస్వాన్ని ధారపోసి ఆత్మాభిమానం, కులాభిమానం, విశేషించి గురుభక్తి- అన్నీ కలబోసి, మనసా వాచా కర్మణా తమకు ఆదర్శంగా నమ్మిన వడ్డెపాటి నిరంజన శాస్త్రిగారికి ఒక జ్ఞాపికగా, కానుకగా కూర్చిన జీవితచరిత్ర అది.

తెలుగునాటి యోగులచరిత్రకు, సంస్కృతీచరిత్రకు ఆంధ్రదేశంలోని మతసామరస్యచరిత్రకు ప్రత్యేకించి హిందూమహ్మదీయ సఖ్యతాసాధకులైన మహాత్ములచరిత్రకును ఆచార్యులిచ్చిన కానుక *శ్రీసిద్ధయ్యచరిత్ర* 1950లో వెలువడింది. ప్రత్యేకంగానూ, విస్తృతంగానూ నిర్మించబడిన *శ్రీసిద్ధయ్య చరిత్ర*లలో ఇదే మొదటిదని చెప్పాలి.

రెండుదశాబ్దాలపాటు విశేషమైన, సుదీర్ఘమైన శ్రమ, పరిశోధన చేసి 'మనగురుదేవుడు' పేర *వీరబ్రహ్మేంద్రుని చరిత్ర*ను గ్రంథస్థం చేశారు. ఈ రచన ఇతరులు వ్రాసిన

వీరబ్రహ్మేంద్ర చరిత్రలకన్నా విలక్షణంగా ఉంటుంది. వైదికమతాభిమానంతో, ప్రాచీనాలైన యోగవేదాంతాల పరిధిలో – పరిభాషలో వీరబ్రహ్మేంద్రుని జీవితాన్ని కొండ అద్దమందు కొంచెమన్నట్లుగా ఈ గ్రంథంలో నిక్షేపించారు. మహాపురుషావతార రహస్య వివేచనం, గీతాభాష్య ప్రవచనం, యోగవిద్యావివరణం, శిల్పాగమవైభవాభివర్ణనం – ఇట్లా ఎన్నో విశేషాలు ఇందులో చోటుచేసుకొన్నాయి. ఇది 1963లో ప్రకటించబడింది.

బుద్ధుని వేదదృష్టి, క్రీస్తులోని కృష్ణావతారం, మహ్మదులోని త్యాగరూపం, మహాత్మునిలోని సర్వమత సమన్వయరూపాలను వివరించి, భారతీయ ఋషి సంప్రదాయం నెలకొల్పిన ఆదర్శాలకే ఈ నలువురు మహాత్ములు అంకితమైనారనీ, జగత్సేవచేశారనీ నిరూపిస్తూ, యావత్ప్రపంచానికి వెలుగు ప్రసాదించిన ఆ మహనీయుల తత్త్వమకరాందాన్ని సులభమైన భాషలో వివరించారు తమ *ఆసియాజ్యోతులులో*. అది 1950లో అచ్చుయింది.

ఇక కావ్యసీమకొస్తే –

**చెలువములు గ్రుమ్మరించెడు**
**తెలుఁగునుడివెలంది కొల్వుదీరిన చవికెన్**
**వలపులు మేలిమి తలఁపులు**
**పులకింపఁగఁ చివురుటాకు తోరణముంతున్**

అంటూ 1949లో, 28 ఖండికలతో *తోరణము* అనే ఖండకావ్య సంపుటి ప్రచురించారు. వారి వాఙ్మయసౌధ ద్వారానికి కట్టిన తోరణమే ఈ కవితాతోరణం.

1950లో *అమరావతి* కావ్యాన్ని ప్రచురించారు. *ఆంధ్రప్రశస్తి, ముంతాజ్‌మహల్, దాక్షారామము, హంపీక్షేత్రము* మొదలయిన కావ్యాలకోనలలో నిలుస్తుందది. ఆ నాటికి – బహుశా ఈనాటికనీ *అమరావతి* కి కావ్యరూపం యిచ్చినవారు కొండూరువారే. అమరేశ్వరా! నీ లయ తాండవంతో అమరావతీవైభవాన్ని నీకాలిక్రింద త్రొక్కివేసినావే! నీవు కారుణ్యమూర్తివిగదా! బుద్ధుడును కారుణ్యమూర్తియే. మరి మీ యిరువురు స్నేహంగా ఉంటే తెలుగునేలకు ఐశ్వర్యం సిద్ధిస్తుంది. మీ యిద్దరూ చేతులు కలపండి అంటూ నమస్కరిస్తూ హిందూ బౌద్ధ సంస్కృతుల సహజీవనం ఆకాంక్షిస్తూ కావ్యాన్ని ముగించారు. లౌకిక మరియు పారమార్థిక అంశాలతో కూడుకున్న పద్నాలుగు శతకాలు వెలువరించారు కొండూరువారు. 1971లో *మిత్రపంచశతి* కూర్చి దాన్ని 1979 నాటికి *సాహస్రి* చేసి ప్రకటించి, ఆపై *ద్వితీయమిత్రసాహసి* కారంభించి నాలుగు శతకాలు ప్రకటించారు. ఈ శతకాల్లోని పద్యాల్లో హితప్రబోధం, లోకవృత్తచిత్రణం, పారమార్థిక పరిజ్ఞానం, సులభగ్రాంథికం, ధార, యుక్తివైచిత్ర్యం – అన్నికన్నిటినీ చక్కగాకలిపి, గొప్పగానిలిపారు. భారతీయుల నీతి, రీతి, సంస్కృతి, సంప్రదాయం– ఇవన్నీ భారత భాగవత రామాయణాలతో ముడిపడి ఉన్నాయనటం జగద్విదితం. భారతీయసాహిత్యానికి ఇవి శిరోభూషణాలుకూడా. ఆ మూడు గ్రంథాలలోని అనేక విశేషాలనూ, పాత్రల చిత్రణావైశిష్ట్యాలనూ, వాని నిర్మాణంలోను, తీర్పులోనూ వేర్వేరు రచయితలు కనబరచిన వైవిధ్యాలనూ, మెరుగులనూ, సవిమర్శనంగా, ఉదాహరణలతో పట్టిచూపించారు తమ *మూడుకావ్యాలు* అనే గ్రంథంలో. ఇందులో ఒకచోట భాగవతంలో శ్రీవిద్య ఉందంటూ చెప్పటం ఒక విశేషం. ఈ గ్రంథం 1951లో వచ్చింది.

కొండూరువారు, వివిధ పత్రికలకై వ్రాసిన వ్యాసాల్లో నుండి ఎంపికచేసుకొన్న వ్యాసాల సంకలనం సాహిత్య వ్యాసములు (*ఆంధ్రకావ్యాలోకనం*) 1967లో వెలువడింది. ఆంధ్రసాహిత్యంపై మతప్రభావం, రామకృష్ణుని నవ్యకవిత్వం, ప్రద్యుమ్నరాజచరిత్రం వంటి అపురూపమైన సాహిత్య వ్యాసాలున్నాయందులో. ఇట్లాంటివే మరో 22 వ్యాసాలతో *శ్రీవీరరాఘవవ్యాసావళి* (సాహిత్యఖండనం), 1976లో వచ్చింది. దాని రెండవ భాగం శిల్పతాత్త్వికఖండం 1981లో వెలుగుచూసింది.

వారి నవలలను మూడు, అన్నిటికన్నీ విశ్వవిద్యాలయ పాఠ్యాలుగా మన్నించబడ్డాయి. వానిలో *కళారాధన* 1961లో, లేపాక్షి 1969లో, *మోహనాంగి* 1973లో వచ్చాయి. వీటన్నిటిలోనూ చరిత్ర, సంస్కృతి, శిల్పం, చిత్రం, సాహిత్యం, సంగీతం, యోగవిద్య, జ్యోతిష, లోహ, రత్నశాస్త్రాల విషయాలూ, శిల్పి బ్రాహ్మణాభిమానం వంటివిషయాలు పెద్దస్థానం ఆక్రమించు కొన్నాయి. విశేషమేమంటే, ఇవేవీ పాఠకుని విసిగించకపోగా, తమవెంట తీసుకుపోతూ, ఎంతగానో అలరిస్తాయి. జ్ఞానపరిధిని విస్తరింపజేస్తాయి కూడా.

గోనుగుంట పున్నయ్యగారి *స్వప్నసందేశం* కోలవెన్ను పరబ్రహ్మతీర్థులవారి *జగచ్ఛిల్పం,* రుద్రకవి, *నిరంకుశోపాఖ్యానం,* బొమ్మకంటి ప్రభాకరకవి *ధర్మపాలవిజయం,* అనంతామాత్యుని *భోజరాజీయం,* వడ్డెపాటి నిరంజనశాస్త్రి *మాఘమాహాత్మ్యం,*

కాళహస్తిముని *విశ్వకర్మపురాణం, నాగరఖండం* ఇంకా ఎన్నెన్నో గ్రంథాలు కొండూరువారి పీఠికలతో సంపన్నమయాయి. పైవాటిలో *విశ్వకర్మపురాణం, మాఘమాహాత్మ్యాలకు* ప్రచురణ, పరిష్కారణ బాధ్యతా వారిదే. కొండూరివారికెనలేని కీర్తిని సంతరించిపెట్టిన గ్రంథం *ఆత్మదర్శనం.* 1944లో వెలువడింది. ప్రపంచం, నేను, ఆత్మ, ఆత్మదర్శన ప్రయోజనం – ఇట్లాంటి గహనమైన విషయాలను సులభగ్రాహ్యంగా, సోదాహరణంగా, సమగ్రంగా వివరిస్తుందీ గ్రంథం.

పరువపు వయసున రూపుదిద్దుకొన్నది *శిల్పదర్శనం.* 1946లో వెలువడింది. ఈ గ్రంథంలో సాహిత్యం, శిల్పం, వేదాంతం – ఈ మూడింటి మేళనం కనిపిస్తుంది. సౌందర్య, తంత్ర, తత్త్వ, వేద శాస్త్రాలను వివిధకోణాల్లో విచారించి, వివరిస్తుందీ *శిల్పదర్శనం.* విషయపరంగా తెలుగు వాఙ్మయంలో ఇదొక లోతైన గ్రంథం. కాగా, వారి దర్శన గ్రంథాలన్నింటి లోనూ, వారి దృష్టిలోనూ ఇది మేటి. మరో దర్శనగ్రంథం *యోగదర్శనం.* ప్రచురణ 1977లో. దీనికి *అనుభవ పరమార్థం* అనే పేరు కూడా సూచించారు. బౌద్ధంలోని అష్టాంగ మార్గమూ, ఆదిసత్యాలూ మొదలయిన విషయాలపై వివరణలు యిస్తూ అష్టాంగమార్గం, యోగమార్గాల తులనాత్మక అధ్యయనం చేయడం ఈ గ్రంథంలో చూస్తాం. ఇట్టి పరిశీలనం ఇంతకు పూర్వం ఎవరూ చేయలేదని విజ్ఞులంటారు. అయితే పతంజలిచెప్పిన మార్గంలోనే నడుపుతూ, వేదాంతదర్శనాలతో కలుపుతూ, సాంఖ్యదర్శనాన్ని తోడు చేసుకొని సంపూర్ణ ఆస్తికదర్శనంగా దీన్ని తీర్చిదిద్దారు.

పరువపు వయసున రూపుదిద్దు కొన్నది *శిల్పదర్శనం.* 1946లో వెలువడింది. ఈ గ్రంథంలో సాహిత్యం, శిల్పం, వేదాంతం–ఈ మూడింటి మేలనం కనిపిస్తుంది. సౌందర్య–తంత్ర–తత్త్వ–వేద శాస్త్రాలను వివిధ కోణాల్లో విచారించి, వివరిస్తుందీ *శిల్పదర్శనం.* విషయపరంగా తెలుగు వాఙ్మయంలో ఇదొక లోతైనగ్రంథం. కాగా, వారి దర్శన గ్రంథాలన్నింటిలో– వారి దృష్టిలోనూ ఇది మేటి.

గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలూ– ఈ ప్రస్థాన త్రయంపై వ్యాఖ్యానం చేస్తూ, కొండూరువారు చాలాకాలం వివిధప్రదేశాల్లో ఉపన్యాసాలు చేశారు. జీవిత చరమభాగంలో వేదాలకు వ్యాఖ్యానం చేయతలపెట్టి *ఋగ్వేద రహస్యాలుతో* కలిపి నాలుగు భాగాలకు, 1300 పుటలకు విస్తరించి ఋగ్వేద వ్యాఖ్యానం దిగ్దర్శనం, కూర్చారు. ఇవి 1984, 1988, 1991 సంవత్సరాలలో వెలుగు చూశాయి. మరో వ్యాఖ్యానాన్ని ఆపేక్షించనిరీతిగా ఈ ఋగ్వేద వ్యాఖ్యానం సాగింది. అట్లే శివ, పురుష, విశ్వకర్మ తత్త్వాల ఐక్యతను దర్శించి 36 శీర్షికలతో *యజుర్వేద దర్శనం* 1990లో నిర్మించారు. ఆపై 1992లో అథర్వవేదంపై సాధారణంగా ఉండే భయాన్ని పోగొడుతూ దాని ఉత్తమ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ *అథర్వవేదదర్శనం* నిర్మించారు. తమ వేదాంతజీవనానికి నిలువుటద్దాలుగానూ, తాత్త్విక జిజ్ఞాస గలవారికి చక్కని సోపానాలుగాను చెప్పదగిన 2932 సూక్తులను *తత్త్వసాధన, తత్త్వసూక్తులు* రెండుభాగాలు – *తత్త్వసూక్తిసాహస్రి* అనే నాలుగు గ్రంథాలుగా 1983, 1985, 1987, 1996ల్లో ప్రకటించారు. విశ్వకర్మవిశ్వరూపం, తమ వేదదర్శనాల పిండీకృతార్థంగా 1994లో నిర్మించిన గ్రంథం. *శ్రీవిద్య, కుండలిని, యోగసాధన, శాస్త్రపురాణేతిహాస వచనాలను* సమంజసమైన, సుసంగతమైన రీతిలో క్రోడీకరించి, విశ్వకర్మపారమ్యంతో ముగించారీ గ్రంథాన్ని. ఇదే వారి చివరి రచన. అయితే చివరిదిగా అచ్చయింది *ఆరనిగంధం.* ఆరు రేడియోనాటికల సంపుటి. నాటికల్లో కనిపించే ప్రధాన పాత్రలన్నీ జీవనంకన్నా జీవనకార్యాన్నే మిన్నగా భావించి, లోకోపకార పరాయణులై ప్రసిద్ధి పొందినవే. కథలేవో జ్యోతిష, శిల్ప, శాస్త్ర, విషయాలతో పెనవేసుకొన్న కథలు. అటుఇటుగా డెభ్భైసంవత్సరా లకు, నలభైగ్రంథాలకు విస్తరించిన సాహిత్య సేవ కొండూరు వారిది. వారి రచనలన్నీ విజ్ఞాన దాయకాలేగాని వివాదాస్పదాలు కావు. వారిది ప్రబోధ దృష్టేగాని ప్రాచుర్య దృష్టికాదు. రచనల్లో పొలుపేగాని పొల్లులేదు. సుగుణాలెన్నో కలగలసిన అభినవ పరుసవేదో ఒకదానితో అవి కాంతిమంతమై, పూనిన వారి వ్రతాను గమనంచేస్తూ, జగద్ధితసంభరితాలయ్యాయి. సాహిత్యసీమలో వారి త్రోవ వారికే స్వంతం. వారి చేవ వారికే ప్రత్యేకం. వారు కళాప్రపూర్ణులు. దర్శనాచార్యులును, అయితే ఆ రెండు లక్షణాలను విడదీయకుండా వారిని *కళాప్రపూర్ణ దర్శనాచార్యులు* అనీ, *దర్శనాచార్య కళాప్రపూర్ణులు* అనీ అనటం సమంజసం, సార్థకంకూడా అనుకోవచ్చు.

శతజయంతి సందర్భంగా కొండూరువారినీ, వారి స్ఫూర్తినీ స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటిద్దాం.

# సంకటి



– పులికంటి కృష్ణారెడ్డి

**ఊ**రికే ఉంటే ఊరా పేరా అంటారు. పేరు ఎట్టన్నా దోరిపోనీ. వాడెటుమంటి మొగోడైనా సరే! ఇంట్లో చేతులు ముడ్చుకోని కూసుంటే ఆడదానిగ్గూడా అలుసైపోతాడు. చీటికి మాటికి దేన్నో ఒకదానిమింద సాటవబెట్టి సాపించనన్నా సాపిస్తారు. లేకుండాబోతే కొజ్జామొగుడు కోట్లోవుణ్ణా వొగిటే! పేట్లోవుణ్ణా వొగిటేనని ఎత్తిపొడస్తారు. అందుకే మొగోడుగా పుట్నోడు ఏందో ఒకపని మాత్రం చెయ్యాల. ఏందో ఒకపనంటే? ఏపని చెయ్యాల? పేరొచ్చే పనే చెయ్యాల! మంచి పనులు చేసినా పేరొస్తింది. చెడ్డపనులు చేసినా పేరొస్తింది. అయితే బతికినంతకాలం మంచిపనిచేసినా రానిపేరు చెడ్డపని చేస్తే ఒక్క సెణంలో వచ్చేస్తింది. అట్టని చెడ్డపనులు చేసేదానికుండాదా? కాబట్టి మంచి పన్లంటే? – ఆ పనితో ఒకరికింతో అంతో మంచిజరగాల.

మల్లా ఈడొౕక చిన్నలిటిగేషన్. మనం చేస్తావుండే పనిలో ఆడెవుడికో మంచి జరిగితే మనకు వొరిగేదేఁవుండాది. మనం చేసేపనితో తొలీత మనకు మంచిజరగాల. తన్నుమాల్నె దర్మం మొదులుచెడ్డ బేరంగదా? అని కొంపలోకత మల్లా మొదుటికొస్తింది.

ఈ ఆడోళ్ళుండారే ఊరికేవుంటే ఉండనీరు.

అట్టని ఏదోవొగిటి చేస్తే ఒప్పుకోరు.

ఇంక మనపెద్దోళ్ళుండారే? వాళ్ళు పోతాపోతా ఊరికే పోరు. ఊరికే పోతే ఊరా పేరా అని దెయ్యిం పోతాపోతా ఒక కొమ్మయించేసి పొయ్‌నట్టు ఏదో ఒగిటి అనేసి పోతారు. అది పెద్దోళ్ళమాట గదా? సద్దికూడుమూటగా చంకకు తగులుకుంటింది. ఇంక పిల్లిని చంకలోపెట్టుకుణ్ణె యవ్వారఁవే!

ఇంతకూ ఆపొద్దు ఊరికే ఉంటే ఊరాపేరా? అని–

"నూకలసంకటికి కోడికూరకు బలేమజాగా ఉంటిందే. పిడ్సపిడ్స నువ్వు వస్తావుంటే నేను పోతావుండా నంటింది. అన్ని నూకలుపోసి సంకటికెలుకే" అంటి.

"సంకటి కెలికేదంటే ఎంతసంగటం? నావల్లగాదు పో"! అనె.

"చీటికీ మాటికీ సంకటి కెలికినట్టు నన్ను కెలకమంటే కెలకతావో?"

"నువ్వు ఆడేఆట్లకు పడేపాట్లకు నేనుగానా నిన్ను సంకటి కెలికినట్టు కెలికేటిగా ఉంటే ఈ పొద్దు నవ్వునన్ను సంకటికెలకమని నోర్దెర్సి అడగబొయ్యేదిలే. నేను చెయ్యలేనని చెప్పబొయ్యేదీలే."

అసలు సంకటంటేనే ఈకాలాన శానామందికి తెల్దు. ఇంక సంగటి కెలికినట్టంటే ఎట్టా తెలిస్తిందిలే? చెప్పాలంటే అదొౕక పెద్దకతగదా? అసలు రాయలేలిన సీమలోనేగదా సంకటి ముద్ద రాజసాలు పొయ్యింది!

మల్లా ఈ సంకటికూడా శానారకాలుగా ఉంటింది. సద్ద సంకటి, జొన్న సంకటి, నూకల సంకటి, ఒట్టిపిండి సంకటి – అని ముక్కెంగా నాలుగు రకాలు. చేసే వైనం తెలిస్తే ఎన్ని రకాలుంటేమాత్రం ఏఁవుండాది? ఏరకం సంకటైనాసరే మాయమ్మ ఒంటిచేత్తో కెలికిపారేస్తా ఉండె. అయితేగూడా ఏమాటకామాట ఒప్పుకొని చెప్పుకోవాల్సిందే. మాబాశాలి అన్నెట్టు సంకటి కెలికేదంటే మాట్లుగాదు.

సద్దసంకటి కావాలంటే సద్దలు నానబోసి రోట్లోపోసి దంచి పిండికొట్టుకోవాల. అదే జొన్నసంకటికైతే జొన్నలు పొట్టూడగొట్టి పిండికొట్టు కోవాల. నూకల సంకటికైతే నూకల్ను బాగానేఁవి ఏరిపించి సుద్దిచేసు కోవాల.

ఏ సంకటైనా రాగిపిండి కావాల్సిందే. సంకటిచట్లో ఎసురు పెట్టాల్సిందే!

ఎసురు కాగినాక సద్దపిండో, జొన్నపిండో, నూకలో ఏ సంకటి కావాలంటే ఆ పిండి కాగిన ఎసుట్లోపోస్తా అబకతో

---

డాక్టరు పులికంటి కృష్ణారెడ్డి (30 జూలై) జయంతి సందర్భంగా...

కలబెట్టాల. లేకుండాబోతే పిండి అట్నే ఉంటలు గట్టి పోతింది. ఇట్టామాదిరి పిండి పోస్తాపోస్తా కలబెట్టినాక బాగా కళకళ ఉడకనియ్యాల. అప్పుడు రాగిపిండి పొయ్యాల. పోసిన రాగిపిండి లోపలికిపోదు. పైన్నే కుప్పమాదిరి అవితింది. ఆకుప్ప అడుగుబాగం సంకటిచట్టి మూతి ఎంతయడం ఉంటిందో అంతయడం ఉంటింది. కాబట్టి చట్లో ఆవిర్ని పైకి రానీదు. ఆ ఆవిరితోనే పిండి కుతకుత ఉడికితింది. అట్టామాదిరి బాగా ఉడికినాక చట్టికి ఇరకలకట్టేసి ఒకాల్తో కదలకుండా కుండను తొక్కిపట్టుకోవాల. సంకటికట్టెతో కెలకాల. రాగిపిండితో కల్సేకుందిక అది మైణం మాదిర్తో అవితింది. అప్పుడు సంకటి పలకమింద పోసుకొని సిబ్బిరేకుతో ముద్దలు చేసుకోవాల!

ఒకొకముద్ద పెద్దతాటికాయికి ఒకచుట్టు పెద్దదిగానే ఉంటింది.

సంకటిచట్లో కట్టేసి రెక్కలిరిగిపొయ్యేటట్టుగా కెలికితే గానీ సంకటి మైణం మాదిర్తో కాదు. అందుకే ఎవుడైనా ఊరికేసతపోర్తా ఉంటే ఎందుకట్టా మణిసిన సంకటి కెలికినట్టు కెలకతావే అంటారు.

అంతకింతకు నన్ను సంకటి కెలికినట్టు కెలికే మా బాశాలి నోరుతెర్సి అడిగితే అంత సంకటి కెలిగిపెట్టలేక పొయ్యిందే? అని అనుకుండే కుందికి నా ఒళ్ళు అట్నే రగిలె. రగిల్తే ఏం చెయ్యాల? రాసిరంపాన పెట్టేదాని కవితిందా? అట్టగాని చేస్తేనా? –

“ఓయమ్మా? వాడేం మొగోడు? వాడేం మొగుడు? ఆడదాన్ని రీతిగా పెట్టుకోని సంసారం చెయ్‌నోడు. చెయ్‌లేనోడు చెయ్‌లేనట్టే ఉండిపోవాల. బొట్నేలు తొక్కి బొట్టెందుకు కట్టాల? ఇట్టెందుకు హిఁవస బెట్టాల” – అని నలుగురు నాలుగిదాలుగా నోరు పారేసుకుంటారు. నలుగురి నోళ్ళల్లో పడేదంటే అగుడు పడేదన్నమాట. అగుడుపణ్ణిగొడ్డు రతికెక్కనట్టే అగుడుపడ్తే మణిసిగూడా రతి కెక్కదంటారు. రతికెక్కకపోతే పీడే ఇరగడైపాయ. కొంపలో రంపులేకుండా పోతే అదే చాలనుకొని ఎలబార్నా!

నడస్తావుంటే నామణుసంతా సంకటిచుట్నే చుట్టకలాడ్తా ఉండాది.

ఇదే మాయమ్మను అడిగుంటే? ఎట్టన్నా కన్నపేగ్గదా? అదట్టాపోనీ, పదైదు మంది కూలోళ్ళకు ముప్పయిముద్దల సంకటంటే? లేక్కేసుకోండేఁవే? ఎంత పెద్దబాన పెట్టాల? ఎంత ఎసురు పొయ్యాల? ఎంత పిండి పొయ్యాల? ఇది గాకుండా ఇంట్లోవాళ్లకు నూకల సంకటి. మద్దేణాలకే కెలికి ఎత్తుకోనిపొయ్ కూలోళ్ళకేసి మల్లా వాళ్ళతోగూడా సరిసమానంగా మునంబట్టి పనిచేసే మాయమ్మకు ముద్దసంకటి కెలికేది ఒక లెక్కాపక్కా?

పోనీ! అప్పుడేఁవన్నా అట్టపోసి ఇట్ట తీసుకుండేదానికి మిసన్లు గిసన్లు యాడుండె? వడ్లు దంచుకోవాల్సిందే. సద్దలయినా జొన్నలయినా పిండి కొట్టుకోవాల్సిందే! రాగులు ఇసురు కోవాల్సిందే?

ఇప్పుడా? పొయ్యి ముందర కూసోని పుర్‌పుర్‌మని ఊదే పనేలేదంటే ఇంక రోలు రోకలికత ఎందుకులే? ఎమ్మే చదివినబిడ్డె ‘రాగ(త్రాయి ఎట్టుంటింది నాయనా?’ అని నన్నే అడిగిందంటే ఇంక రొండుదినాలుపోతే రోలు, రోకలి, రాగ(త్రాయి, సంకటిపలక ఇరకల కట్టి ఇట్టాంటివన్నీ ఎత్తుకోనిపొయ్ మ్యూజింలోపెట్టి చూపించాల్సిందే!

నా చిన్నప్పుడు మాయమ్మ కూలోళ్ళకు సంకటెత్తుకోని పోతావుంటే తోకమాదిరి కొంగు పట్టుకోని నేనుకూడా పొయ్యేటోణ్ణి!

మాయమ్మ చెట్టుకింద సంకటితట్టట్టా దించేకుందికి కూలోళ్ళందరు యాడపని ఆణ్ణే అట్నే ఇడ్సి పెట్టేసి దొనెలోనో, దొరువులోనో, కాలవలోనో, కాడాన ఆడపెట్టుండే కడవలోనో చేతులు కడుక్కుంటారు. గబగబ వచ్చి చెట్టుకింది సోలుపుగా కూసుంటారు. మాయమ్మ తలావొకముద్ద సంకటెత్తి చేతికిస్తింది. ఆ ముద్దను ఎడఁవచేతి అర్సేతిలో పెట్టుకుంటారు. కుడిచేత్తో ఆ ముద్దను గుంతచేస్తారు. మాయమ్మ ఆ గుంతల్లో అంతపులుసో పులగూరో పోస్తింది.

ఇంకచూస్కో నా సాఁవిరంగా!

ముద్దలో సంకటంత తుంచుకుండేది. పిడ్సచేసేది. తగిలీ తగలకుండా పులగూరంత అద్దుకుండేది. గుటిక్ గుటిక్‌మని మింగేది.

వాళ్ళట్టా మింగతావుంటే ఎంత తఁవాసగా ఉంటిందని! నేనైతే గుడ్లు మిటకరించుకోని చూస్తా ఉండేది. పిడ్సమిందపిడ్స గుటిక్ గుటిక్‌మని మింగతావుంటే ఎట్ట మింగతారబ్బా అని ఆచ్చెర్రెం కలిగేది. ఎందుకంటే మాయమ్మకు నేను ఉడబోతు కాయిని గదా? అందువల్ల ముదిగారం జాస్తి. ఆ ముదిగారంతో నాకెప్పుడూ సంకటి పెట్లా. నాకని తనీగా రొన్ని బియ్యం ఏసి వార్సి పెట్టేది.

తల్చుకుంటా ఉంటే ఇప్పిటిగ్గూడా నవ్వే నాకు! ఒకసారి తిరపతి నుంచి లీవుల్లో మిద్దూరికి పోతావుండా? చిల్లరదుడ్లు తక్కవగా ఉండె. గాదింకిలోనే బస్సు దిగేసినా. గాదింకి నుంచి మిద్దూరికి ఆరేడుమైళ్ళు ఉంటింది. నాలుగైదుమైళ్ళదాకా మాంతఁవయిన అడివి. ఆ అడివిలోనే పోవాల. పొగులైతే పరవాలే. కన్జీగిటి పడ్తాపడ్తా ఉండాది. ఆ యాళకాడ అడివి దోవన ఆరేడుమైళ్ళు నడ్సేదానికి అవితిందా? బుడంకాయంత గదా ఉండా. ఏ నక్కోగిక్కో నోట్లోయేసుకుణ్ణా అడిగే వాళ్ళెవురు? అందుకని తెల్లార్తో ఎలబారి పోవచ్చులే అని గాదింకిలోనే నిలబడి పొయ్‌నా. ఇంక ఆ ఊళ్ళో దిక్కెవురు? అట్టాయిట్టా చూసినా. దిక్కు లేనోళ్లకు ఆ దేముడు ఆ ఊళ్ళో ఒక గుళ్ళో ఉండాడు. ఆ గుళ్ళోకిపొయ్ కూసుణ్ణా!

కొంచిం ఎచ్చూతక్కవగా కూటేళ అయ్యుంటిదేఁవో? ఆ యాళకాడ కొందురు గుళ్ళోకొచ్చి బజినమొదుల పెట్రి. అప్పుడు ఏ సిల్మా కొటాయిలో చూడు బక్తపోతన సిల్మా ఆడ్తా ఉండాది. ఎవుడినోట్లో ఇందాఁవన్నా 'సర్వమంగళనామా సీతా రామా రామా!' పాటే. ఊరికే ఉంటే ఊరాపేరా అని ఆ పాట జఁవాయించి పాడేసినా. ఇంక చూస్కో నా సాఁవీ!–

"ఏ ఊఁర్రా అబ్బోడా? ఎక్కిడికి పోతా ఉండావురా? తిన్నావా లేదా?" – అంటా తలకొక ఇదంగా అడిగిరి. ఎచ్చులకుపోతే ఎండతాఁనని తిన్లేదని చెప్తి!

"అయ్యయ్యో! ఇంకా తిన్లేదా? పదబ్బారే పద!" – అని బలింతంగా ఒక ఇంటికాడికి పిల్చుకోని పొయ్‌రి. కాళ్ళూచేతులూ కడుక్కుండే దానికి నీళ్ళిచ్చిరి. కడుక్కోని వచ్చేకుందికి పీటేసిరి. ఆ పీట ముందర పెద్ద యిస్త్రాకు పర్సిరి. ఆ ఇస్త్రాకుమింద నీళ్ళు చల్లిరి. నేను పీటమింద కూసుండేకుందికి ముద్దసంకటి తెచ్చి ఆకులో పెట్రి!

ఆ ముద్దను చూసేకుందికి నా ఆకిలికి రెక్కలొచ్చి ఎగిరిపాయె!

రోట్లో తలకాయదూర్సిన యవ్వారఁవైపాయ కత. తినలేను చెప్పలేను. అట్నే ముద్దకల్లా చూస్తాకూసుంటే కండ్లల్లో నీళ్ళు కమ్మి రొంచేపిటికి పలపలరాలె.

పాపం! ఆ యింటి ఇల్లాలు ఏఁవనుకుణ్ణిందో?–

"ఒరే అబ్బోడా! ఎందుకురా యాడస్తా ఉండావు! ఎవురు గ్యాపకాని కొచ్చినార్రా. అలిగ్గిలిగి వచ్చేస్తివా? పోనీలే. మా ఇంటాయన ఉండాడు గదా. ఆ యిన్ను తోడంపిస్తాలే. ఇంటికి పోదువులే. తిను నాయినా తిను" అంటా ఉండాది.

ఆఁవెమాత్రం ఎట్టా అనుకుంటింది రాయలసీమలోపుట్నె ఒకపిలగాడు సంకటి తినలేకుండా యాడస్తా ఉండాడని– అదే దొరక్కుండా యాడస్తా ఉంటే?

ఇబ్బందిగా మొకపెట్టేకుందికి మహాతల్లి ఇంతింతకండ్లుచేసి చూసింది అప్పుడు అర్తం అయినట్టుండాది. గురుగుపువ్వు మాదిర్తో ఉండే పిలగాడు. గుటిక్ గుటిక్ మని సంకటి మింగలేడని. సరే! ఆ ముద్ద సంకటి ఎత్తేసె. ఇక్కింటిలో పక్కింటిలో పొయ్ పిడికిడు మెతుకులు తెచ్చిపెట్టె!

ఆ కూడు తింటావుంటే చెట్టుకిందకూసోని సంకటి చిన్నచిన్న పిడ్చలుగా చేసి గుటిక్ గుటిక్‌మని మింగతావుండే కూలోళ్ళు అట్నే నా కండ్లముందర మెదల్తా ఉండారు.

ఇంటికొచ్చినాక మా రాఁవన్నతో ఆ మాటంటే–

"అందుకేరా అబ్బోడా అన్నిట్లో పడిలెయ్యాలనేది. పడిలేస్తేగానీ దానిలోతు తెల్దు. కాళ్ళకు చెప్పులుండాయని ఏసుకోని తిరగతా ఉండావు గదా? అవ్వి లేవనుకోని వట్టికాళ్ళతో నడవాల. తినే దానికి కూడు ఉండాదని తింటా ఉండావు. తిండిలేని రోజుకూడా రావచ్చు. అందుకని పస్తుపడి ఉండాల. అప్పుడు ఆకిలంటే అర్తం తెలిస్తింది. అదేమాదిర ఎప్పుడు కూడుకూడని కలవరించకుండా సంకటిగూడా తినాల. వాడిక అయితిందనుకో. మొన్న ఇబ్బంది పణ్ణెట్టు పడవుగదా?" అంటా పాటం చెప్పె.

ఆ పాటం తలకెక్కేకుందికి అప్పుడు మాయమ్మ నడిగి నూకల సంకటి పెట్టించుకోని తింటి. తొలీత మింగేది కొంచియాసకాటంగా ఉణ్ణా మల్లామల్లా నూకలసంకటి కోడి కూరంటే ముందుముందుగా నేనే కంచం ఎత్తుకుంటా ఉంటి. అదే చెట్టుకింది కూలోళ్ళు అయితే కన్నుమూసి తెర్సేలోపల ముద్ద సంకటి లగాయించేసి రొండు అర్సేతులు జోడించి దోసిట్ని నోటికాడ పెట్టుకుంటే మాయమ్మ వర్సగా కూటినీళ్ళు పోసేది. ఆ నీళ్ళు తాగేస్తానే మల్లా ముద్ద సంకటి. కొందురు తినేస్తారు. కొందురు ఎత్తుకోని ఇంటికాడికి పరిగిత్తారు. ఎందుకమ్మా? అని అడిగితే –

"ఇంటికాడ లేదరబిడ్డలు ఎదుర్చూస్తా ఉంటారు? వాళ్ళకంత పెట్టాలగదరా?'' అనేది. రొండుముద్దలు సంకటితినేసి కొందురు పనిచేస్తే ముద్దసంకటితోనే కొందురు మునంపడ్తా ఉండారు. అయ్యో పాపం! అనిపించేది. అనిపిస్తే ఇనిపించుకుండే దెవురు?

"రొండుముద్దలసంకటి ఎట్ట తింటారమ్మ?" అని అడిగితే–

"ఇందేందిరా? వాడు అడివోళ్ళ కర్రెన్న తెల్సుగదా? వాడైతే అయిదు ముద్దలు అలాగ్గా లగాయించేస్తాడు. ఏలుకూరోళ్ళ ఎర్రోడికైతే ఏడుముద్దలు యాడికీ చాలవు" అంటా నవ్వేది.

వాళ్ళందరు అట్టామాదిరే తిన్నారు. అట్టామాదిర్నే కష్టిపణ్ణారు. ఇప్పుడా? అదీలే. ఇదీలే. అనుకుంటా ఆడతిరిగి ఈడతిరిగి రగిల్నేవొళ్ళు చల్లబణ్ణాక తిరుక్కోని వస్తావుండా. నాలుగ్గాళ్ళ మండపంకాడ ముత్తారెడ్డన్న ఎదురుపడె!

"ఏఁవిరా సమాచారం?" అంటే –

"అన్నా నోర్దెర్సి అడిగితే మాబాశాలి అన్నినూకలుపోసి అంత సంకటి కెలకమంటే కెలకపాయ గదన్నా. అదే మాయమ్మ అయ్యుంటే?" అనిబాదపడ్తే ఆయన్న నవ్వతా –

"నువ్వు పద్దెం రాయగల్తావా?"

"కష్టిఁవే!"

"అట్నే మీ బాశాలికి సంకటి కెలికేది కష్టిం. ఎట్టంటావా? పద్దెం రాయాలంటే యతి గణ ప్రాసలు తెల్సుకోవాల్సి నట్టుగానే సంకటి కెలకాలంటే ఎంత ఎసురు పెట్టాల? ఆ ఎసురుకు తగినట్టుగా ఎంతపిండి పొయ్యాల? ఈ రొంటికీ తగినట్టుగా ఎంత రాగిపిండి కావాల. అని తెల్సి ఉండాల. ఆఁవె మిద్దూర్లో పుట్లా. ఆఁవె కెట్టా తెలిస్తింది? నువ్వు పద్దెం రాయలేవు. మీ బాశాలి సంకటి కెలకలేదు. ముందునువ్వు ఇంటికి పోరా!" అనె.

"అదిగాదన్నా! దుడ్డు కట్టెలెత్తుకోని తెలుగుపద్దెం నడుఁవులు ఇరగ్గొట్టాఁవని మహా మహా కవులే గొంతులు చించుకుంటా ఉంటే నువ్వేందన్నా పద్దేన్ని ఎనకేసుకొని వస్తా ఉండావ్?"

"ఒరె పిచ్చోడా! తూర్పున పటంవెగిరితింది. అదెప్పుడైనా పాతబడితిందా? అట్నే అమ్మ ప్రేఁవ!– అదిపాతబడితిందా? తెలుగు సాహిత్తెంలో పద్దెంవూ అంతే! వాడెపుడో ఎరిముంద? దుడ్డికట్టెలు ఎత్తుకుంటే అవ్వి ఇరిగిపోవాల్సిందేకాని పద్దేనికి నడువులు ఇరిగేలే! వాడి పిండాకూడు లే. నువ్వుపదరా!" అనె.

అందుకేనేఁవో ఈ సీమలో అందురూ పద్దేలురాసే కవులే పుట్నారనుకుంటి. మి




మిసిమి
మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**
పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం మిసిమికి చందా ₹240 పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా *మిసిమి* పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**





ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 6. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 7. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



# అరక దున్నిన అధ్యాపకుడు

– నిమ్మగడ్డ జనార్ధనరావు

**మా** గ్రామానికి కరకట్టకు తూర్పున లంక పొలములు, మిగిలిన మూడు దిక్కులలోను వరి పొలములు. అందమైన గ్రామము. గోసంతతికి ప్రసిద్ధి. మొన్నటి వరకు అన్నీ ఒంగోలు జాతి. బీడు భూములలో మేసి సాయంత్రం కరకట్టపై వస్తూ ఉంటే దక్షిణాది వారు వచ్చి కనుల పండుగ చేసికొనేవారు. రైతు బిడ్డగా నిమ్మగడ్డ వెంకట సుబ్బయ్య, లక్ష్మమ్మ గార్లకు గుంటూరు జిల్లా, కొల్లూరు మండలములోని దోనేపూడి గ్రామములో 1938 ప్రాంతంలో పుట్టాను.

ప్రక్క వీధిలోనే నా మేనమామల యిల్లు. వారు నలుగురు అన్నదమ్ములు. బలవైనవారు. మమ్ములను ప్రేమగా చూచేవారు. నేను నాల్గవ ఏటనుండి నా అన్న వెంకటేశ్వరరావు వెంట బడికి పోతూ ఉంటే, కొంతకాలము గడిచిన పిమ్మట కాంతారావు మాష్టారు "ఒరే, నీ పేరు రిజిష్టరులో ఎక్కించాను. పలక, బలపము తెచ్చుకోరా?" అన్నారు ఆ మరునాటి నుండి ఒక పలకముక్క, బలపము పట్టుకొని ప్రతి దినము బడికి వెళ్లేవాడను. చదువు బాగానే వచ్చేది. కాంతారావుగారు ఉదయము మా యింటికి వచ్చి ఒక సోలెడు పెరుగు తీసుకు వెళ్లుచుండేవారు ఖరీదుకే. "లక్ష్మమ్మా! నీ బిడ్డలు తెలివైన వారు చదివించు అనేవారు. మా అమ్మ రాట్నము వడికి, పాడిపైన సంపాదించిన వాటితో మాకు స్కూలు ఫీజులు, బట్టలు ఏర్పాటు చేసేది.

నా అన్న చదువులో ఎంతో తెలివైనవాడు. నాకు నేర్పుతూ ఉండేవాడు. ఎస్.యస్.సి.లో తన రిజల్ట్సు నంబరు పేపరులో లేదని భట్టిప్రోలు వద్ద రైలుబండి క్రింద పడి మరణించాడు. నా తమ్ముడు బాబూరావును చదువు మాన్పించి పనిలో పెట్టారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా నేను గూడ పొలముపోతూ ఉండేవాడిని, కోడెలను, ఎద్దులను మేపటము ఇష్టముగా ఉండేది. చదువుకంటె పొలము పనే సంతోషముగా ఉన్నా, ఏనాడు బడి ఎగ్గొట్టలేదు. కాని రాత్రి పూట పుస్తకము పట్టుకొని లాంతరు ముందు కూర్చుంటే కళ్లు మూతలు పడేవి. పెద్దగా చదవకపోయినా ప్రతి తరగతి పాస్ అవుతూ ఉండేవాడిని. కాలేజిలో కూడ పరీక్షల కాలములో చదివితే మంచి మార్కులు వచ్చేవి. మేము మా మేనమామలు కొంతకాలము ఉమ్మడి వ్యవసాయం చేశాము. నా పెద్ద మేనమామలను చూస్తే "పనే వాళ్లను చూసి జడిసేది". నాగలి పట్టినా, వరినాట్ల కాలములోను, నూర్పిళ్లలోను వారిది అంత ఒడుపు. నూర్పిళ్ళలో చెరి వంద కట్టలు కొట్టి గడ్డి దులిపి కట్టలు కట్టి వామి వేసేవారు. మా నాన్న తోడుతో రోజుకు ఎకరం నూర్చి యింటికి చేర్చేవారు. బాబూరావుకు ఆ పనితనం అబ్బింది. రెండు యూరియా కట్టలు, ఒకేసారి మోసి చిమ్మి వచ్చేవాడు. బండి వెనుక తడిక పైకెత్తి తిప్పి పెట్టేవాడు. ఒకసారి రెండు నేత బస్తాలకు వడ్లుపట్టి మిల్లుకు మోస్తే 164 కిలోలు అయినవి. ఏదయినా రోజు పని ఒక పూటలో చేసేవాడు. ఎంతటి తాచుపామునైనా చేతితో పట్టేవాడు. 1991 మార్చి 30న తాచును పట్టి, ప్రక్కవారితో మాట్లాడుతుంటే, అది చేతి వ్రేలుపై కాటు వేసింది. తనకేమి కాదని అశ్రద్ధ చేస్తే ప్రాణం పోయింది. తరువాత వాడి దిగులుతో నాన్న కూడ చనిపోయాడు.

నా మూడవ మేనమామ బెజవాడ థర్మల్ పవర్ హౌస్‌లో టర్బన్ ఆపరేటరుగా రిటైర్ అయ్యేవరకు బదిలీ లేకుండా పని చేశాడు. చక్కని గొంతు. పాడుతూ ఉంటే ఘంటసాలను మరిపించేవాడు. రెండవ మేనమామ కమ్యూనిష్టు ఉద్యమంలో ఉండేవాడు. బుర్రకథలు, నాటకాలు వేసేవాడు. శ్రావ్యమైన కంఠం. నాల్గవ మేనమామ అన్నలతో పనిచేయలేక కొంతకాలము బయటికి పోయి మరల వచ్చి తన వ్యవసాయం తాను చేసికొన్నాడు. నాకు అయిదు తరాల ముందు తాత నిమ్మగడ్డ రామకృష్ణమ్మ. ఆయన భాగవత, రామాయణ, భారత కథలు చెప్పేవారట. తెనాలి తాలూకా చుట్టుప్రక్కల గ్రామాలవారు, పోటీపడి మేనాలో తీసుకు వెళ్ళి కథలు చెప్పించుకునేవారట. అలా చెప్పించుకొని కోడితాడిపర్రులో అయిదు ఎకరములు యిస్తే, దానిని గ్రైకొనక, చెరువు త్రవ్వించినారట. దానిని యిప్పటికి రామకృష్ణమ్మ చెరువు అంటారు. నేను మొదటి నుండి హేతువాదిని. మార్క్సు గ్రంథాలన్నీ దాదాపుగా ఆకళింపుజేసికొన్నాను. టీచరుగా కూడా ఆ విధంగానే బోధించాను. నాకు యిద్దరు కొడుకులు. పెద్దకొడుకు, కోడలు ఐ.పి.యస్‌లు. చిన్న కొడుకు కోడలు గ్రాడ్యుయేట్స్. కష్టపడినవాడను. మానసిక శారీరక శ్రమ తెలిసిన విశ్రాంత ఉపాధ్యాయుడను.

# పల్లవరాణి సమవై

- దేవిరెడ్డి సుబ్రమణ్యరెడ్డి



తిరుమల వేంకటేశుని ఆలయం ఆర్థిక పుష్టి గలదిగా పేరుగాంచడం క్రీ.శ.966 లో ఆరంభమైంది. పల్లవరాణి సమవై, నాడు భగవంతునికి సమర్పించిన తొలి భూదానం, విలువైన ఆభరణాలు, నగలే ఇందుకు కారణం. సమవై చేపట్టిన తొలి బ్రహ్మోత్సవం, తొలి అంకురార్పణ, తొలి గరుడోత్సవం(ధ్వజారోహణం), తొలి ఆర్భాట మెరమణలు (ఊరేగింపులు), పూజలు, తొలి నిత్యప్రసాద నైవేద్యాలు, తొలి వెండి వేంకటేశుని ప్రతిమా ప్రతిష్ఠాపన, తొలి శిలాశాసనం ఆలయంలో చెక్కించడం, తొలి మండప నిర్మాణం (తిరువిలన్ కోయిల్ అనబడిన స్థపన/స్నపన మండప) వంటి కార్యక్రమాలూ, వేంకటేశుని ప్రతిష్ఠను పెంచాయి.

సమవై తరువాత చోళ, పాండ్య, యాదవ, విజయనగర పాలకులు, ఇతరుల కాలాల్లో ఇవ్వబడిన పలువిధ దానాలు ఆలయ ఆర్థిక పుష్టి, ప్రతిష్ఠల్ని మరింత పెంచాయి. అందుకే తిరుమల సంపదను దోచుకోవడంకై క్రీ.శ. 1443 లో అఫాన్సో డిసౌసా నాయకత్వాన పోర్చుగీసు వారుపెద్దసంఖ్యలో గోవా నుండి సముద్రమార్గాన వచ్చారు. కానీ, ప్రకృతి వైపరీత్య కారణంగా మద్రాసు ఆవల నుండే తిరుగుముఖం పట్టారు. ఇంతకీ ఈ సమవై ఎవరు? ఈమె తిరుమల ఆలయానికి చేసిందేమిటి? ఈమెను దేవస్థానం ఎందుకు మరచి పోయింది?

చివరి పల్లవ రాజైన అపరాజితుని చోళ చక్రవర్తి ఒకటవ ఆదిత్యుడు (క్రీ.శ 880–907) ఓడించి తిరుమలతో కూడిన విశాల ప్రాంతమైన తొండై మండలాన్ని తన ఆధీనం చేసుకోవడంతో క్రీ.శ.898 లో పల్లవుల పాలన అంతమైంది. ఈ ఆదిత్యుని కుమారుడే ఒకటవ పరాంతకుడు (క్రీ.శ 907–952). ఈతని మనుమడే రెండవ పరాంతకుడు (క్రీ.శ. 954–970). సమవై దానాది కార్యక్రమాల్ని తిరుమలలో క్రీ.శ.966 లో చేపట్టిన కాలానికి చోళరాజ్య పాలకుడు సుందరచోళుడు అని పిలువబడిన ఈ రెండవ పరాంతకుడే. ఇతని సామంతుడు (వాసల్) కోపట్రపన్మార్. పాండ్య రాజైన వీరపాండ్యుని ఓడించడంలో రెండవ పరాంతకునికి

దేవిరెడ్డి సుబ్రమణ్యరెడ్డి, ఫోన్ : 9849584324

సహాయపడినవాడు ఇతడే. ఇతడు పల్లవుల వారసుడుగా తెలుస్తోంది. ఇతననే కోపఌ్ట మహేంద్ర పన్మార్ అని, కోపఌ్టపన్మార్ పార్థివేంద్ర వర్మ అని, కోపార్థివేంద్రవర్మ అని పలు రకాలుగా పిలిచేవారు. ఇతడు నాటి తొండై మండలంలో భాగంగా ఉండిన నేటి ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు జిల్లాలైన చిత్తూరు, ఉత్తర ఆర్కాడు, చెంగల్పట్టులతో కూడి ఉండిన ప్రాంతాల్ని పాలిస్తుండినట్లు ఆ జిల్లాల్లో లభించిన ఇతని శాసనాల బట్టి తెలుస్తోంది. (తొండర్లు అని పిలువబడుచుండిన జైన ఆచార్యులకు బలమైన కేంద్రంగా ఉండినది గాన వాడుకలో తొండర్ల, తొండైర్ల ప్రాంతంగా తొండైమండలంగా పేరుగాంచినట్లు తెలుస్తోంది; సుమారు 2200 సంవత్సరాల క్రితమే మధురై వంటి దూరప్రాంతాల్లో కూడా జైనం బలంగా ఉండినట్లు ఆధారాలున్నాయి).

కోపట్రుని అనుంగ (సబార్డినేట్) నాయకుడుగా (చీఫ్) పల్లవవంశీయుడైన శ్రీ కడప్పత్తిగళ్ అని పిలువబడిన సత్తివితన్కన్(శక్తి వితన్కన్) ఉండేవాడు. ఈతని భార్యే సమవై. తండ్రి పల్లవ పేర్కడయ్యార్. ఇతడు కూడా పల్లవుల వారసుడు, నాయకుడు. ఇతడు సత్తివితన్కన్ వద్ద ఉన్నతాధికారిగా ఉండేవాడని తెలుస్తోంది. పల్లవుల పాలన అంతమై చోళుల పాలన ఆరంభమయ్యాక పల్లవ వంశీయులు అనేక మంది చోళులకు సామంతులుగా జీవించసాగారు. అట్టివారిలో సత్తివితన్కన్ ఒకడు.

కోపట్రుని పద్నాల్గవ పాలనా కాలంలో క్రీ.శ. 966లో సత్తివితన్కన్ భార్య సమవై, తిరుమల శ్రీ వేంకటేశుని ఆశీసుల్ని నిత్యం పొందాలనుకొన్నారు. అందుకై క్రీ.శ. 966 లోనే తిరుమల ఆలయంలో భగవంతునికై అనేక శాశ్వత ఏర్పాట్లను చేపట్టింది, విలువైన దానాల్ని చేసింది. అందుకే, సమవై, కాలంనుండి శ్రీ వేంకటేశుని ఆలయ ఆర్థిక పుష్టి, ప్రతిష్ఠలు పెరగసాగాయి. (పల్లవుల ఇంటిపేరు 'కాదువేటి' గా తెలుస్తోంది. వీరి ఇంటిపేరు మీదుగనే నేటి కార్వేటి నగరాన్ని 'కాదువేటి నగర' గా పిలుస్తోంది. తొండైమండలంలో ఎండిన 'కువలాలపుర'మే నేటి కోలారు.)

వేంకటేశుని ఆర్థికపుష్టి, ప్రతిష్ఠలు పెరగడం కోసం సమవై పలు శాశ్వత ఏర్పాట్లను చేసింది. నిత్య 'నిమండం'ను (డైలీ ప్రొఫీషియేన్) ఏర్పరచింది. అందులో భాగంగా 'తిరువాముదు' అని పిలువబడిన నాల్గు 'నలి' ల అన్నప్రసాద నైవేద్యాన్ని తొలిసారిగా ఏర్పరచింది; నిత్యం జరిగేటట్లు చేసింది. 'నందవిలక్కు' అనబడిన నిర్విఘ్నంగా వెలిగించబడు దీపాన్ని ఏర్పరచింది (పరపెచ్యుయల్ ల్యాంప్). 'తిరుమంజనం' అని పిలువబడిన అభిషేక కార్యక్రమాన్ని ఏర్పరచింది. ఈ తిరుమంజనం రెండు ఆయన- సంక్రాంతులు, రెండు విష్ణు-సంక్రాంతుల రోజుల్లో జరిపేట్లు చేసింది. పురటాసి ఉత్సవ కార్యక్రమాన్ని కూడా ఏర్పరచింది. దీనినే తరువాత బ్రహ్మోత్సవం అనసాగారు.

ఇది మారళి-తిరుద్వాదశి అని పిలువబడిన ముక్కోటి - ద్వాదశికి ముందుగా జరిపేట్లు చేసింది (మారళి నెలలో, అనగా, డిసెంబర్-జనవరి నెలలో చంద్రుడు వృద్ధిచెందే పన్నెండవ రోజును మార్గళి-తిరుద్వాదశి అంటారు). మార్గళి-తిరుద్వాదశికి ముందు రెండు రోజులు, రెండు పూటలా ఉత్సవ కార్యక్రమాలు జరిపి, ఆ తరువాత ఏడు (తొమ్మిది?)

రోజులు ప్రధాన పురటాసి బ్రహ్మోత్సవాలు జరిపేట్లు చేసింది. ధ్వజస్తంభం చివరి ఎత్తువరకు పతాక ఆవిష్కరణ జరిపి, నవధాన్యాలతో 'తిరుమూలైయతి' (సీడ్ సోయింగ్) అని పిలువబడిన అంకురార్పణ కార్యక్రమంతో పురటాసి ఉత్సవం ప్రారంభించబడేట్లు చేసింది. ఈ అంకురార్పణ చిత్తిరై నక్షత్రం రోజున జరిగేట్లు ఏర్పాటు చేసింది.

ఈ కార్యక్రమాలన్నీ సూర్యచంద్రులున్నంత కాలం జరపాలని కోరింది. ఈ ఏర్పాట్లతో బాటు కోయిల్ ఆళ్వార్ గృహం అని నాడు పిలువబడిన ఆలయ గర్భగృహంలోని వేంకటేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాను తయారు చేయించి ఇచ్చిన వేంకటేశుని తొలి వెండిప్రతిమా రూపమైన



పల్లవ ఆలయం



సమవై ఇచ్చిన ఆభరణాలతో స్వామి

మానవాళ్ పెరుమాళ్ (నేటి భోగశ్రీనివాసుని) ప్రతిమను తాను తిరుమల రాకమునుపే నిర్మింపజేసిన తిరువిలన్ కోయిల్‌లో (నేటి స్థపన/స్నపన మండప) ప్రతిష్టింపజేసి (కాన్సిక్రేషన్) పూజాది కార్యక్రమాల్ని జరిపించింది. ఈ కార్యక్రమాలన్నీ శాశ్వతంగా జరగడం కోసం విలువైన ఆభరణాలు, నగల్ని, ఖర్చులకై విలువైన భూముల్ని మానవాళ్ పెరుమాళ్‌గా పిలువబడిన వేంకటేశునికి సమవై దానంగా ఇచ్చింది. వేంకటేశునికి ఇవ్వబడిన తొలి భూదానం, తొలి విలువైన ఆభరణాల దానం ఇదే.

సమవై ఇచ్చిన ఆభరణాల్లో- శ్రీ వేంకటేశుని శిరస్సు అలంకరణకు 'తిరుముడి' అని పిలువబడిన కిరీటాన్ని ఇచ్చింది. ఇందులో, ఇరవైమూడు వజ్రాలు, పదహారు పెద్ద ముత్యాలు, కిరీటం మధ్యలో పొదగబడిన రెండు పెద్దరూబీలు, మూడు కట్‌రూబీలు ఉండేవి. మెడ-ఎద అలంకరణకు 'వలయ్యల్' అని పిలువబడిన నాల్గు వృత్తాకార కంఠాభరణాలు, నాల్గుపోగుల 'మాల' ను ఇచ్చింది. 'మాల'లో పద్నాలుగు వజ్రాల్లు, మూడు రూబీలు, పదకొండు ముత్యాలు, అనేకమైన చిన్నసైజు ఎరుపు ముత్యాలు పొదగబడి ఉండేవి. చెవుల అలంకరణకు ఒక జత కోరల్ 'కొప్పు' మకర ఆకారంలోని రెండు నగల్ని ఇచ్చింది. పొట్ట అలంకరణకు ఒక బంగారు ఉదరబంధనం ఇచ్చింది. నడుము అలంకరణకు తిరువారిపట్టిక అని పిలువబడిన మొలత్రాడు (గిర్డిల్) ను ఇచ్చింది. ఇందులో నాల్గు రూబీలు పొదగబడి ఉండేవి. చేతుల అలంకరణకు బాహువలయం అని పిలువబడిన రెండు వలయాకార ఆభరణాల్ని ఇచ్చింది. చేతి మణికట్టు అలంకరణకు తిరుచ్చందం అని పిలువబడిన నాల్గు ఆభరణాల్ని ఇచ్చింది. వీటిలో రెండు కట్ రూబీలు వంతున పొదగబడి ఉండేవి. కాలి మడెమ అలంకరణకు కరై అని పిలువబడిన రెండు ఘనమైన ఆభరణాల్ని ఇచ్చింది. వీటిలో విలువైన రాళ్ళు, కోరల్స్, పెరల్స్ వంటి యాభైరెండు వస్తువులు పొదగబడి ఉండేవి. ఇవేగాక, మరో రెండు ఆభరణాలు కూడా కాలి మడెమ అలంకరణకు ఇచ్చింది. వీటిలో పాదచాయలంలు (బెల్టులు), ఒక వెండి ప్రభ (ల్యూమినస్ డిస్క్), దీని మధ్యలో పొదగబడిన ఒక పెద్ద రూబీ ఉండేవి.

ఈ నగలన్నింటిని తయారు చేయడానికి నలభైఏడు 'కలంజు' ల బంగారం వాడబడింది. మానవాళ పెరుమాళ్‌కు అభిషేకం జరిపించి, ఈ నగల్ని క్రీ.శ.966 లో సమవై సమర్పించింది. సమవై దానంగా ఇచ్చిన భూముల్లో- నాటి 'శ్రీవేంకటేశ్వరకొట్టం' లోని 'తిరుక్కుడవూర్‌నాడు' లో ఉండిన తిరుచ్చుకనూర్ అరి పిలువబడిన నేటి తిరుచానూరు 'సభయ్యర్' (గ్రామసభ) నుండి, అదే తిరుచానూరులోని తిరువలన్ కోయిల్‌పెరుమాళ్ అని పిలువబడుచుండిన వేంకటేశుని తొలి కట్టడం ఆలయానికి (క్రీ.శ. 826 లో నిర్మింపబడింది) చెందిన మఠంలో నివసిస్తుండిన లక్ష్మణనంబి నుండి కొనిన ఆలయ భూములు ఉండేవి. సభయ్యర్‌కు, తిరుచానూరు వేంకటేశుని ఆలయానికి డబ్బు చెల్లించి, సభయ్యర్ ద్వారా ఆ భూములకు పన్ను మినహాయింపు పొందిన తరువాతే వీటిని తిరుమల వేంకటేశునికి సమవై దానంగా ఇచ్చింది. వీటితో బాటు సభయ్యర్ నుండి కొనిన భూములు, నందిపరిప్పట్టి, మదుప్పట్టె, లక్ష్మణనంబి అదైకొండనిలం (లక్ష్మణనంబి ఆధీన భూములు), మధుసూదన్ ఆవియారై, పురుషోత్తమన్‌పట్టి -



పల్లవ ఆలయ కుడ్య చిత్రం

మొత్తం మూడు'పట్టి'ల భూమిని సమవై దానంగా ఇచ్చింది. ఇది మూడువేల 'కులి'లకు సమానం.

సమవై ఇచ్చిన ఇతర భూముల్లో-

1. తిరుచానూరు ప్రాంతాన ఉత్తర దిశగా పోవుచుండిన నాటి రహదారికి పడమరగా ఉండిన ఆయప్పట్టి అని పిలువబడుచుండిన 267 'కులి'ల భూమి.

2. కులిప్పట్టి అని పిలువబడుచుండిన 367 'కులి'ల భూమి.

3. పెరుబాన చెఱువుకు ఎదురుగా ఉండిన 340 'కులి'ల భూమి.

4. నవినప్పట్టి అని పిలువబడుచుండిన 1221 'కులి'ల భూమి.

5. కుశప్పట్టి అని పిలువబడుచుండిన 144 'కులి'ల భూమి.

6. పురుషోత్తమప్పట్టి అని పిలువబడుచుండిన 144 'కులి'ల భూమి.

7. పురుషోత్తమన్ పల్లం అని పిలువబడుచుండిన 505 'కులి'ల భూమి.

8. పాంచవన్మాదేవిపరి దిగువ ప్రాంతాన ఉండిన 1000 'కులి'ల భూమి.

9. కాళిప్పెరుమాన్, తంబిభట్టన్ నుండి కొనిన నాదర్‌సేరు అని పిలువబడిన 250 'కులి'ల భూమి.

10. శాలై పెరుమాళ్ తిరుమాలై నుండి కొత్తూరు గ్రామంలో కొనిన కీల్‌పట్టి అని పిలువబడిన 600 'కులి'ల భూమి ఉండేవి.

మొత్తంగా 4176 3/4, 'కులి'ల భూమి ఉండేవి. (పైన తెలిపిన భూమితో కలిపి 7176 3/4 'కులి'ల భూమి).

ఈ భూములన్నీ తిరుచానూరు పరిసర భూములే. వీటిని కొలవడానికి కాడిక్కాయ్‌కోల్ (మెషరింగ్ పోల్డ్) అని పిలువబడుచుండిన 'గడ' (ఘటిక) వాడబడింది. ఇది పదహారు చదరపు జాన (స్పాన్) లకు సమానంగా ఉండేది. జాన అనగా సుమారు 9 అంగుళాలు. అంటే, కులి అనగా 16 చదరపు గజాలు, 1000 కులిలు ఒక 'పట్టి' అనగా 1000 కులిలు 1600 చదరపు గజాలు. అనగా, 3.3 ఎకరాలు. మూడు పట్టిలు అనగా 9.92 ఎకరాలు, లేదా, సమారుగా 10 ఎకరాలు. పది ఎకరాల సరాసరి ధాన్యం 30000 ఎల్బీలు, లేదా, 15000 ఎల్బీల బియ్యం. ఈ భూములన్నింటినీ సమవై దానంగా ఇస్తూ తిరుమల వేంకటేశ్వర ఆలయ నిర్వాహకులు ఈ భూముల్ని తమ ఆధీనంలో ఉంచుకోవాలని, ఈ భూములపై పన్ను వేయకుండా తిరుచానూరు సభయ్యార్ చూసుకోవాలని, మాడపత్యం అని పిలువబడుచుండిన నాటి తిరుమల ఆలయ నిర్వాహకురాలు తాను ఆశించిన సేవలన్నింటిని సూర్యచంద్రులు ఉన్నంత కాలం శ్రీ వేంకటేశునికి జరిపించాలని కోరింది. అంతేగాక, తన దానాల్ని కాపాడేవారి కాళ్ళను తన నెత్తిన పెట్టుకొని మోస్తానని కూడా సమవై తెలిపింది. ముఖ్యంగా, శ్రీవైష్ణవులు ఈ భూముల రక్షణ బాధ్యతను వహించాలని కోరింది.

సమవైకి సంబంధించిన దానాది వివరాలన్నీ సమవై ఆజ్ఞమేరకు సాత్తాండై (సుత్తాండై) రచించగా తిరుమల ఆలయ గర్భగృహ దక్షిణ గోడ వెలుపలి ముఖంపై చెక్కించబడిన శాసనంలో ఉండేవి. ఐతే, క్రీ.శ.850-మధ్య (చివరి పల్లవ రాజులు లేక బాణవంశ రాజుల కాలాన) తిరుమలలో తొలిసారిగా నిర్మింపబడిన కట్టడ ఆలయంలో (వేంకటేశుని తొలి కట్టడ ఆలయం తిరుచానూరులో క్రీ.శ.826 లో నిర్మింపబడింది) మార్పులు క్రీ.శ.1250 లో చేపట్టిన సమయంలో ఈ శాసనాలు కాపీ చేయించబడి వేంకటేశుని ఆలయ లోపలి ప్రాకారం (ముక్కోటి ప్రదక్షిణ) ఉత్తరమూలలో చెక్కించబడ్డాయి.

నాటి యాదవ వంశ పాలకుడు నరసింగ యాదవ రాయలు (క్రీ.శ.1204 - 1263/1265) కాలాన ఆలయ స్థానత్తర్ అందించిన అనుమతితో తిరుపుల్లనదాసర్ అను 'దేశాంత్రి' (స్థానికేతరుడు) ఆలయ గర్భగృహ, శయన మండపాలతో కూడియుండిన ఆలయ గోడల చుట్టూ అనుకొని మరొక లావుపాటి గొడను నిర్మించి, ప్రదక్షిణా పథను వెడల్పు చేసి, దాని చుట్టూ గొడను నిర్మించి నేటి ముక్కోటి ప్రదక్షిణను ఏర్పరచి, వీటన్నింటిపై తొలిసారిగా గర్భగృహపై విమానాన్ని నిర్మించాడు. ప్రదక్షిణలో తూర్పుభాగాన అటు ఇటు గోడలు నిర్మింపబడడంతో (క్రీ.శ.1265-1285) రామర్‌మేడ (రాములవారి మేడ ఏర్పడింది). అనగా, క్రీ.శ.1250 నాటికి గర్భగృహ, శయన మండపాలతో కూడిన ఆలయం మాత్రమే తిరుమలలో ఉండేది.

ఆలయ మార్పులు జరిగాక నరసింగ యాదవరాయలు బంగారు తులాపురషం జరిపి, ఆ బంగారు విమానంపై పూతకు వినియోగించాడు. నాటి పాండ్యరాజు సుందరపాండ్యుడు కూడా క్రీ.శ.1262 లో విమానంపై బంగారుతాపడం గల మండపాన్ని క్రీ.శ.1417లో చంద్రగిరివాసి మల్లన్న అని పిలువబడిన మల్లన్నదాసర్ నిర్మించారు. మి

# ఆశ్రిత శ్రామికులు

*- మూలె విజయలక్ష్మి*

సామాజిక నిర్మాణంలో చాతుర్వర్ణ వ్యవస్థ, పంచమవర్ణం ఏర్పడటం, ఆ తర్వాత వృత్తి ఆధారంగా కులవ్యవస్థ స్థిరీకరింపబడటం సామాజిక నిర్మాణ పరిణామ చరిత్ర. బ్రాహ్మణులకు తప్ప తక్కిన కులాలకు ఆయాకులాలను ఉన్నతీకరిస్తూ, స్తుతిస్తూ, వంశావళులు, గోత్రనామాలు వల్లిస్తూ, కులపురాణాలు చెప్పే ఆశ్రిత కులాలున్నాయి. బ్రాహ్మణకులం సామాజిక స్థాయిలో అత్యున్నత స్థానంలో ఉండడమే ఈ ప్రకార్యాలు చేసే ఆశ్రితకులాలు లేకపోవడానికి కారణంగా భావించవచ్చు. విప్రవినోదులున్నా ఇంద్రజాల విద్యతో వినోదింపచేసేవారు మాత్రమే. పులికొండ సుబ్బాచారి కులపురాణాలపై విశేషకృషి చేసి 43 ఆశ్రితకులాలను వారి దాతృకులాలను పేర్కొన్నారు. (కుల పురాణాలు-ఆశ్రితవ్యవస్థ-25) పిచ్చుకుంట్ల - రెడ్డి - కమ్మ; కూనపులివారు - సాలె; రుంజలు - విశ్వబ్రాహ్మణ; ఒగ్గోళ్ళు- కురుమ; గౌడజెట్లు - గౌండ్ల, పటంవాళ్లు - చాకలి, పక్కింటివారు - కుమ్మరి మొదలైనవి. మాదిగలకు బెండ/ బవనీలు, పంబలవారు, సంగడివారు, ఆసాది, చిందు / చిందుమాదిగ, మాష్టి, డక్కలి అనే ఏడు ఆశ్రితకులాలు, మాలలకు గుర్రంవారు, గోత్రాలోళ్లు, మాలముష్టి, మాలభోగం ఆశ్రితకులాలుగా పేర్కొన్నారు.

నిరుపేదలయిన మాదిగలు ఆశ్రితకులాల కడుపు నింపకపోతే పడాల్సిన ఇక్కట్లు, యాతన, ఒకవైపు, మాదిగలను తప్ప ఇతరులను యాచించలేని నియమంవల్ల ఆకలిమంటలు చల్లార్చుకోవటానికి ఆశ్రితుడు చేసే నానాయాగీ, మాదిగలవారి ఆశ్రితకులాలైన మొండి బండకులాల దుస్థితిని, దారిద్ర్యాన్ని, దయనీయతను దర్శింపచేసి పాఠకుని హృదయాన్ని ద్రవస్థితికిచేర్చే కొలకలూరి ఇనాక్ కథలు *కట్టడి, కాకి.* వీరి మరోకథ *బుభుక్షితం నకరోతిపుణ్యం.* అగ్రవర్ణాల్లో అయినా, అట్టడుగా వర్గాల్లో అయినా ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు పేదలను ఎన్ని ఇక్కట్ల పాలుచేస్తున్నాయో. గౌరవనీయంగా బతికే అయాచిత భోక్తలు సమాజంలో ఎలా ఉన్నారో కళ్ళకు కట్టిస్తుంది.

**కట్టడి - కథాంశం :** మాదిగల పదో ఉపకులం మొండి. నేటి సమాజానికి దాదాపు అపరిచితులు. విస్మృత జాతి. మొండోన్ని చూడటం అపశకునంగా భావిస్తారు. రాత్రి పూటవచ్చి మొండోడు 'బువ్వ పెట్టుతల్లీ' అంటాడు. మాదిగలు కలోగంజో, చద్దో సారకో కుండలో కలిగింది ఒక చోట పెట్టివస్తే ఎవరికీ కనపడకుండా వచ్చి తినివెళ్ళిపోతాడు. వరుసగా మూడురోజులు బువ్వ పెట్టకపోతే తెల్లవారుజామున బావిగిలకలకు, బద్దెలకు వెంట్రుకలు చుట్టి కట్టడి చేస్తాడు. అదే జరిగింది. నీళ్ళకు కటకట. దానికి తోడు ఎండాకాలం. మొండోడి కట్టడి విముక్తి కావాలంటే బువ్వ పెట్టాలి. పిల్లలనోరు కట్టి ముదుసలుల కడుపు మాడ్చి, పుల్నీళ్లో, పులిసిందో, పాసిందో చద్దో, కూరో తలాఇంత తెచ్చి బావిగట్టుమీద పెట్టారు. ఇదంతా ఏమిటో అర్థం కాలేదు పదేళ్ళపెద్దోనికి. మొండోన్ని చూడాలని ఉబలాటం. చూస్తే కీడన్నా ఆరాటం. తామే ఎందుకు పెట్టాలి? ఎన్నో ప్రశ్నలు. దగ్గర్లో బొగ్గులలాట్లలో దాక్కుని మొండోన్ని చూస్తాడు. మొండోడు దర్జాగా వచ్చాడు. అయిష్టమయిందేది లేదు. ఇష్టంగా తిన్నాడు. అన్నీ తిన్నాడు, అంతా తాగాడు, తేన్చాడు. కట్టడి నుంచి విముక్తి కల్పించాడు. కన్పించకుండా వెళ్ళిపోయాడు. మొండోడు ఏ ఊళ్ళో పొద్దున్న కడుపారా తింటాడో ఆ ఊరికి కీడురాదని నమ్మకం.

**కాకి-కథాంశం :** మాదిగల పదకొండు ఉపకులాలలో పదవది బండ. మాదిగలను మాత్రమే యాచిస్తారు. దాతృకులం నిరుపేదలు, అరకడుపు పరకడుపు. రెక్కాడితేగాని డొక్కాడని దుస్థితి. అయినా ఆశ్రితుడు మాపటేల ఇంటి ముందుకు వస్తే చచ్చినట్లు బువ్వ పెట్టాలి. బువ్వ పెట్టకపోతే పెట్టేరావిడి, రంపు అంతా ఇంతాకాదు. కాకిని చంపి తల, కాళ్ళు ఈకల కట్ట ఇంటిముందు వేస్తాడు. కాకిని చంపింది ఆ యింటివాళ్ళే అని కాకి బలగం చేరి కాకిగోలచేస్తాయి. ఇది భరించరానిది. కాకిగోలపోవాలంటే బండోడికి బువ్వపెట్టాలి. పెడితే ఈకలు తీసేస్తాడు. కానీ అవ్వ, మనవడు, తల్లీ పెట్టలేరు. ముందు రోజు నుంచే పొయ్యిలో పిల్లి లేవలేదు. కాకిని చంపి కాల్చుకుతిని ఆకలి తీర్చుకుంటాడు బండోడు. అది అరగదు. కాకిని తినే మానవ మాత్రుడు బండోడొక్కడే. సాయంత్రమైంది బువ్వ పెట్టు తల్లీ అన్నాడు. విన్నా ఒకటే వినకపోయినా ఒకటే. "బండోడు కాకీకల కట్ట పంచబొంగుకు కట్టాడు. అరగని కాకి మాంసం

డాక్టరు మూలె విజయలక్ష్మి, ఫోన్ : 9966138779

ముక్కలు ముక్కలుగా కక్కాడు. కాకి మాంసం కంపు, రోత, అరగని జీర్ణంకాని ముక్కలు మరింత నీసు! ముక్కు పగిలే దుర్గంధం. కక్కిన కూటికి కాకులు కూడా ఆశపడలేదు. కాకి మాంసం కాకి తినటమా? ఎంత నామర్దా! బండోడు వెళ్ళిపోయాడు. పొద్దుగూకే ముందు కాకులూ వెళ్ళిపోయాయి. రెండో రోజు ఉదయం మళ్లీ కాకుల గుంపు వస్తే వాడు కక్కిన మాంసం మీద కంపు పోవటానికి మట్టిపోసి కప్పెట్టకూడదు. ఇక ఆ ఇంట్లోకి అడుగు పెట్టకూడదు. కాకీకలు తీయకూడదు. కక్కుడు మీద మట్టిపోసినా, కాకీకలు తీసేసినా, ఇల్లు పాడు బెట్టకపోయినా అనర్థం. పీనిగ లేస్తుంది" అని నమ్మకం. ఆ తర్వాత బండోడు ఆ ఇంటికి రాడు. అది బండోడు బిచ్చమడగని కొంప. అది సాటివాళ్ళలో అవమానం, వెలి.

**బుభుక్షితః కింనకరోతి పుణ్యం – కథాంశం :** రామానుగ్రహ శాస్త్రిది బ్రాహ్మణ వంశం. బుజ్జోడు దళితకుటుంబంలో బిడ్డ. ఇద్దరికీ వయసులో అంతరముంది. కాని ఇద్దరికి సంబంధం ఉంది. అది ఏ సంబంధం? రామానుగ్రహశాస్త్రి వంశ పారపర్యంగా వచ్చిన పూజారి వృత్తి చేస్తున్నాడు. భార్య పోవటం, ఇల్లరికం వెళ్ళలేదని రెండోభార్య సంసారానికి రాకపోవడంతో తానే చేయి కాల్చుకుంటూ, తండ్రికి ఆదరువుగా నిలిచాడు బుజ్జోడు విద్యార్థి.

మాదిగదాసు మాదిగిళ్లలో శుభకార్యాలు నిర్వహిస్తారు. వంశచరిత్రలు వల్లిస్తారు.

"బ్రాహ్మణులు శూద్రులతో ఎలా ప్రవర్తిస్తారో, వీళ్ళు మాదిగలతో అలా ప్రవర్తిస్తారు. మాదిగల దగ్గర భిక్ష పుచ్చుకొంటారు. కాని అన్నం పెట్టించుకోరు, తినరు. మాదిగలను దగ్గరకు రానీయరు, తాకనీయరు, వీళ్ళు తాకరు. బ్రాహ్మణులు వీళ్ళను తాకరో, వీళ్ళు బ్రాహ్మణుల్ని తాకరో, తెలియదు కానీ వీళ్ళు బ్రాహ్మణులకు దూరంగా ఉంటారు. బ్రాహ్మణుడు నడిచే తోవలో వీళ్ళు నడవరు. వీళ్ళు బ్రాహ్మణ వీధికి పోరు." శంభుదాసు ఒక మాదిగదాసు. ఒక రోజు బసవయ్య ఇంటికి వచ్చి వంశచరిత్ర చెప్పి, ఆహార దీక్ష తమ ఇంట్లోనే అని విన్నవిస్తాడు. పార్వతమ్మ గుండెల్లో రాయిపడింది. చారెడు బియ్యంతో పిల్లాడి కడుపు నింపాలనుకున్న తల్లి వాడంతా తిరిగి ఉప్పుతో ముప్పైమూడు అతనికి సమకూర్చింది. దాసు శాకాహారి. స్నానం చేసి సంబారాలతో వంటచేసుకొని కడుపారా భుజించాడు. వెంట వచ్చిన సేవకునికి పెట్టాడు. మిగిలింది కుక్కకు పెట్టాడు. అది తినగలిగినంత తిని వదిలేసింది. శంభుదాసు రాకతో బుజ్జోడి ఆకలితీరలేదు.

పరమపదించిన తండ్రిశ్రాద్ధ కర్మలకు సకలభోజ్య పదార్థాలు సమకూర్చాడు రామానుగ్రహ శాస్త్రి. భోక్తను బతిమాలి, బామాలి తెచ్చాడు. సంతృప్తిగా తినబెట్టాడు. పితృదేవతలను సంతుష్టి పరిచాడు. శాస్త్రికి ఆకలిమండి పోతోంది. భోక్తతిన్న తర్వాతే తినాలి. అది ఆచారం. భోక్త ఏమీ మిగల్చ లేదు. కాలంమారింది. గుడికి రాబడి లేదు. పూజారి పేదగా మారాడు. ముందురోజు వంటచేసుకోలేదు. ఆకలి. ఇదే రామానుగ్రహ శాస్త్రి, బుజ్జోడి సంబంధం. సామాజిక వ్యవస్థలోని ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, వాటిపాటింపుపట్ల నిష్ఠ పేదల డొక్కలు మాడ్చేదుస్థితికి అద్దంపడ్తుందీకథ. శ్రమజీవుల కష్టాన్ని అయాచితంగా భోంచేసే భోక్తలు "ఎందుకు పుట్టుకొచ్చారు? భిక్ష ఎవరుపెడతారు? ఎవరికి పెడతారు? ఎందుకు పెడతారు? ఎలాపెడతారు? అది వ్యవస్థలో భాగమా? సౌభాగ్యమా! సౌందర్యమా! అది శ్రమజీవన పరాజయమా? పరాభవమా?"

కట్టడి కథలో ఆశ్రితుడైన మొండోని రూపవర్ణన ఆశ్రితుని దుస్థితిని చెప్పకనే చెప్తుంది. "మొండోడు రాక్షసి బొగ్గులాగున్నాడు. అంతా నలుపు, జుట్టు, శరీరం, నిక్కరు కారు నలుపు, తారు నలుపు, నల్ల రాకాసి బొగ్గు నలుపు. అట్టలు కట్టుకుపోయిన జుట్టు చివర ఎక్కడో; శరీరం ఎక్కడో తెలియకుండా అఖండంగా నల్లగా ఉన్నాడు. వాడి నిక్కరు గోచి కంటే పెద్దది. మనిషికి బొగ్గురంగు నూత్న సౌందర్యం కలిగించింది. నల్లమట్టి, ఎర్రమట్టి, డొంకమట్టి, ఇసుక, బొగ్గు నుసిమసి కలగలసిన కాళ్ళు కదలి బావి వైపు వచ్చాయి. చెప్పుల్లేవు. కాని నడక దర్జాగా ఉంది. ఠీవిగా ఉంది".

మొండోడి ఆకారం దైన్యస్థితికి, కటిక దరిద్ర్యానికి, తిరుగుడు జీవితానికి నిలువెత్తు నిదర్శనం. నడకలో దర్పం తన హక్కు పట్ల నమ్మకం. కడుపునింపుకోవటానికి మరో దారిలేదు. దాతలూ నిరుపేదలే... ఆదరించి అన్నం పెట్టే శక్తిలేనివాళ్లు. కట్టడి చేసి ఇబ్బంది పెట్టి, నిర్బంధం అయితే తప్ప పట్టెడన్నం పెట్టరు. ఏ పూట కాపూట గడవటం కష్టమైన దాతలు. దాత తండ్రి. ఆశ్రితుడు బిడ్డ. తమకు కావలసింది ఇచ్చేవరకు బిడ్డలు మొండి చేస్తారు. హఠం చేస్తారు. పనికి అడ్డుపడ్తారు. నానాగొడవ చేస్తారు. అందితే ఆనందిస్తారు.

కాకి కథలో బండోడు నానాకంగాళీ చేస్తాడు. కాకుల్ని ఉసిగొల్పుతాడు. కర్కశం గానూ, కఠినంగానూ, రోతగానూ

దాతృకులం పట్ల ప్రవర్తించాడు. అయినా బుక్కెడు బువ్వ దక్కలేదు. దాతృకులానికి అవమానం. దాత ఆశ్రితున్ని నిరాదరించటానికి, నిరుపేదకావటమే కారణం. బువ్వ పెట్టక పోతే ఏం జరుగుతుందో తెలిసి పెట్టలేని స్థితి. ఆశ్రితుడు అడిగింది మణులా! మాణిక్యాలా! గోవులా! పట్టెడన్నం. ఇతర కులాల్లో వ్యవసాయం వల్ల, కులవృత్తుల వల్ల అంతో ఇంతో రాబడి ఉంది. ఆర్థికస్థితి అంతో ఇంతో మెరుగైంది. అదీగాక ఆశ్రితులకిచ్చే త్యాగం నిర్ణీతమై దాతృకులాలు ఆశ్రిత కులాలకు సమస్థాయి ఇవ్వక పోయినా సమాదరణ ఉంటుంది. దాతృకులాల ఆర్థికస్థాయి. సామాజిక స్థితి, ఆశ్రితకులాలకు పారంపర్యంగా వస్తున్న మిరాశి హక్కు తమవాటాకు వచ్చిన దాతృకులాల కుటుంబాల సంఖ్య పై ఆధారపడి ఆశ్రితుల ఆదాయం వారి జీవిక ఆధారపడి ఆశ్రితుల ఆదాయం, వారి జీవిక ఆధారపడి ఉంటుంది.

ఇతర కథా సందర్భాల్లో రచయితగాని, పాఠకుడుగాని, సహానుభూతి, లేదా సానుభూతి ఒక వైపు చూపే అవకాశం ఉంటుంది. ఇక్కడ దాతా! ఆశ్రితుడా! ఒకరివి పేదరికం మంటలు, మరొకరివి ఆకలి మంటలు. కథాంశం ఎన్నుకోవడంలో కథనడపటంలో రచయిత తనకు తానే సాటి. అట్టడుగు వర్గాలకు సంబంధించిన ఈ కథల్లోని అంశాలే కథా సంపుటాలకు కట్టడి, కాకి అని శీర్షికలుగా దిద్ది ఉదాత్తతను చాటుకున్నారు రచయిత. కట్టడి కథాకాలంనాటి పరిస్థితి స్వాతంత్ర్యం రాబోతున్న తరుణంగా రచయిత పేర్కొన్నారు. బహుశా పదేళ్ళ పెద్దోడు రచయితే కావచ్చు వారికి ఇప్పుడు డెబ్భైఏళ్ళు పైబడ్డాయి. రచయిత బాల్యంలోని సంఘటనను కథగా మలిచి ఉండవచ్చు. కట్టడి జరిగిన గ్రామం వేజండ్ల. అది రచయిత పుట్టినగడ్డ.

**బండ, మొండి ఒకే కులమా? మాదిగల ఆశ్రిత కులమా? :** దళితుల ఉపకులాల్లో పదవ కులంగా మొండి అని కట్టడి కథలో, బండ అని కాకి కథలో రచయిత పేర్కొన్నారు. ఈ కులాల ప్రస్తావన నిఘంటువుల్లోనూ సాహిత్యంలోనూ పరిశీలిద్దాం.

**బండ అంటే :** ఘోరకృత్యాలచే బిచ్చమెత్తే ఒక నీచజాతి అని, బండడు అంటే ఆకతాయి అని శబ్దరత్నాకరంలో అర్థాలున్నాయి. పండితారాధ్య చరిత్రలో ఈ పద ప్రయోగాన్ని పరిశీలిద్దాం –

> **బండడనక కదుమండరి యనక**
> **రెండుసేతులు లేని మొండివీడనక**
> **యంగవిహీనుడనక యల్పుండనక**
> **జంగమువేషంబు నంగీకరించి** పండి. పూ. పు 71

దుర్జనులు శివభక్తుడైన దసరయ్యను ఆగపట్టించటానికి కడుమండరి అంటే మిక్కిలి దైన్యంతో అర్థించేవాడు. అంగవిహీనుడు, అల్పుడు, అయిన బండడికి జంగమవేషం వేసి దసరయ్య వద్దకు పంపించారు. ఈ సందర్భంలో బండడు పదానికి శబ్దరత్నాకరం ఆకతాయి అని, సూర్యరాయాంధ్ర నిఘంటువు, బుద్ధిహీనుడు, మందుడు అని అర్థాలిచ్చాయి. పై అంశాలను గమనిస్తే బండ కులవాచకంగా గ్రహించటం సబబు.

అదే గ్రంథంలోని గురుభక్తయ్య కథలో ప్రయోగించిన బండెత పదానికి బండజాతి స్త్రీగా సూర్యరాయాంధ్ర నిఘంటువులో అర్థమివ్వబడింది. "మిండతల్మత్తికి మిగిలిన గౌంట్లు, కొండెపుగొఱవులు బండెతల్ముచ్చులు" (పండి.పు.రా. 116 ప్రయోగం) ఈ అర్థాన్ని బలపరుస్తుంది. బండబూతులు, బండతిట్లు అంటే బండజాతి వాళ్ళు తిట్టుకొనేతిట్లు (బూతులు) అని పదబంధ పారిజాతంలో అర్థం. జాతివాచకమైన బండ తర్వాతి విశేషణార్థంలో ప్రయోగింపబడినట్లు తెలుస్తుంది. బండచాకిరి, ఎక్కువ శ్రమ, బండకెత్తు – మొండికెత్తు, బండ సంసారం – పాడు సంసారం అనే అర్థాలున్నాయి.

బండమనిషి అంటే సిగ్గులేనివాడు, మొరటుపట్టుగల మనిషి అనీ మొండి బండవాడు / మొండి బండవాడు – పట్టువిడవని మూర్ఖుడు, బండవాండ్లు అనువారు దిమ్మరులైన అరణ్యకులు. బిచ్చమునకు వచ్చినపుడు ఎంతపొమ్మనినా వాకిలిని విడిచిపోక మోడిబెట్టుకుందురు అని మాండలిక వృత్తి పదకోశంలో అర్థాలున్నాయి. పై ఆధారాలు బట్టి బండ ఒక జాతి. అరణ్యాలలో ఉండే దిమ్మరులు అని, యాచకులనీ, బిచ్చం పెట్టకపోతే మొండికేస్తారని తెలుస్తుంది. దళితుల ఆశ్రితకులంగా పేర్కొనబడలేదు. మా అమ్మ గారుకూడా ఏదో సందర్భంలో మొండోళ్లు బిచ్చానికొస్తే పెట్టేదాకా ఇంటిముందే తిష్టవేస్తారని చెప్పారు.

నిఘంటువుల్లో మొండి జాతి ప్రస్తావన లేకపోవడం, రచయితకూడా కట్టడి కథా సంపుటికి రాసిన పీఠిక మొండి, బండ ఒకే కులమని చెప్పడానికి ఆస్కారమిస్తున్నాయి. ఆ తర్వాత బండజాతివారి స్వభావం ఆధారంగా బండడు అంటే బుద్ధిహీనుడు, మందుడు, ఆకతాయి అనే అర్థాలు ఏర్పడి ఉండవచ్చు. బండచాకిరీ అనే జాతీయం కఠిన శ్రమను సూచిస్తోంది. బండజాతి, అట్టడుగువర్గాల్లో ఇంట్లో అయినా, బయట అయినా గట్టిగా తిట్టుకోవడం, అరుచుకోవడం, కొట్టు కోవడం నామోషిగానో, అగౌరవంగానో, అప్రతిష్ఠగానో

భావించరు. అగ్రవర్ణాల్లో కత్తికోత ఉన్నా కనపడనీయక పోవడం సభ్యత, ప్రతిష్ఠ, గౌరవం. బండబూతులు, బండతిట్లు అనేమాటలు ఇప్పటికీ నిలచి ఉన్నాయి.

**మాదిగలు-సమాంతర సమాజ నిర్మాణం? ఊహా ప్రతిపాదన:**

మాదిగల చరిత్ర సంస్కృతి గ్రంథంలో చిలుమూరి శ్రీనివాసరావు మాదిగల్లో 18 ఉపకులాలున్నాయంటూ 17 మాత్రమే పేర్కొన్నారు. 1997 రామచంద్ర రాజు కమిషన్ రిపోర్టు ప్రకారం మాదిగ ఉపకులాలు 18 అని ఎసి.సి కులవర్గీకరణ సందర్భంగా గుర్తించారు. వీరిద్దరూ పేర్కొన్న ఉపకులాలు ఒక్కటే.

1891 సెన్సస్ ఆఫ్ ఇండియా వాల్యూమ్ 13లో మాదిగల్లో 443 సబ్‌డివిజన్స్ ఉన్నాయనీ, అందులో గంప, గోసంగి, మాతంగి, ఊర ముఖ్యమైనవిగా హెచ్. ఎ స్టువర్ట్ పేర్కొన్నారు. ఉపకులాలు పేర్కొనే సందర్భంలో చిలుమూరి శ్రీనివాసరావు కొన్ని సమానస్థాయి కలవి, మరికొన్ని మాదిగలకు సేవలందించేవిగా పేర్కొన్నారు. వీరి గ్రంథం ఆధారంగా ఉపకులాలు మాదిగలకందించే సేవలు, మాదిగ ఉపకులాలు నిర్వర్తించే ఈ కార్యకలాపాలు గమనిస్తే సమాంతర సమాజ నిర్మాణం ఉందని చెప్పవచ్చు. అంటరానివారిగా, ఊరిబయట వాడలో ఉంటున్న దళితులు సమాంతర సమాజం ఏర్పరుచుకున్నారా అనే ఊహకు పై ఉపకులాలు వాటి కార్యాలు తావిస్తున్నాయి. ఈ పరిశీలనలో ఆర్య, ద్రావిడ సంఘర్షణ ఫలితాలు పరిగణనలోకి తీసుకోలేదు. అది లోతుగా అధ్యయనం చేయవలసిన అంశం. చాతుర్వర్ణవ్యవస్థ ఏర్పడిన తదనంత సామాజిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదన చేయటం జరిగింది. వారి అవసరాలు, అనుకరణ సమాంతర వ్యవస్థకు దోహదపడి ఉండవచ్చు. ఊరిబయట వాడలో ఉంటున్న దళితునికి ఇతరకులాలు నివసిస్తున్న ఊరితో సంబంధాలున్నాయి. చర్మకార వృత్తి ఉత్పత్తి, చెప్పులు, రైతుకు అవసరమైన బొక్కెన, పట్టెండ్లు, తలతాళ్లు, బొద్దార్లు, చలకోల మొదలైనవి అందిస్తున్నాడు. ఆ సమాజంలో జరుగుతున్న తంతులూ, సంప్రదాయాలను గమనిస్తున్నాడు. రెండవది బ్రాహ్మణుడు పౌరోహిత్యం చేయడు, చాకలి బట్టలుతకడు, మంగలిక్షవరం చేయడు, దళితునికి సేవలిందివ్వటమే తప్ప ఇతరకులాల నుండి సహకారమందదు. పల్లెలోని ఇతర కులాలన్నీ పరస్పర ఆధారితాలు, సహకరించు కుంటాయి. దళితునికి ప్రాథమిక అవసరాలు ఉన్నాయి. అవి తీరాలి. బహుశా మాదిగకులం నుండి వివిధ వృత్తులను చేపట్టి, ఉపకులాలు ఏర్పడి ఉండవచ్చు. ఆయా ఉపకులాల పనులను గమనిస్తే ఈ అంశం తేటతెల్లమవుతుంది. ఇతరకులాల్లో ఉపశాఖలున్నా ప్రధానకులం పేరుతో గుర్తింపబడుతాయి. ఉపశాఖల్లోని ఏ ఒక్కశాఖ ఇలాంటి సేవలు లేదా కార్యాలు నిర్వర్తించదు. వీటన్నింటిని పరిశీలించినట్లయితే దళితవాడలో మరోసమాంతర సామాజిక వ్యవస్థ రూపుదిద్దు కుందనవచ్చు. ఆ సమాజంలో స్థాయి భేదం ఉన్నట్లు స్పష్టమవుతుంది.

**మాదిగలు-ఆశ్రితవ్యవస్థ :** పులికొండ సుబ్బాచారి ఆశ్రితవ్యవస్థలో ఐదు ప్రకార్యాలున్నట్లు గుర్తించారు. అవి మాదిగల్లో ఏ ఉపకులాలు నిర్వర్తిస్తున్నాయో గమనిద్దాం.

**కథాగానం :** కులపురాణ గానం, దాతల వంశకీర్తన, సామాజిక స్థితిని ఉన్నతీకరించడం. ఒకటి మాదిగల కులపురాణం జాంబపురాణం. ఈ కులపురాణం చిందోళ్ళు ప్రదర్శిస్తున్నారు.

**వంశవృక్ష, గోత్రపఠనం :** డక్కలివాళ్ళు, మాదిగల గోత్రాలు వంశక్రమాలు చెప్తున్నారు. కులపురాణాల్లో దాతృకుల మూలపురుషుని వంశీకులనుగానో, సంబంధీకులుగానో, ఆశ్రితకులం చెప్పబడుతుంది. డక్కలి వాళ్ళు మాదిగల మూలపురుషుడు జాంబవంతుని చనిపోయిన కుమారుని వెన్నెముక నుండి సృష్టింపబడినవారని జాంబపురాణగాథ.

**కుల, వృత్తి సమాదరణం :** ప్రతికులపురాణం ఆయాకులాల వృత్తులపట్ల గౌరవాదరణ పెంపొందించేవిగా ఉంటాయి. జాంబపురాణంలో జాంబవంతుడు తన కుమారున్ని బలిచ్చి అతని దేహాంగాలతో అన్ని పనిముట్లు తయారు చేశాడు. కాబట్టి అతని వృత్తిని గౌరవించాలి. ఇక వినోద వృత్తిలో మాష్టీలు సర్కస్ వంటి వ్యాయామవిద్యలు ప్రదర్శించి వినోదం అందిస్తారు.

**మూడోపురుషార్థ సేవ :** మాదిగబోగం / చిందుబోగం స్త్రీలు కొందరు దాతలకు శారీరక సుఖాన్నిచ్చే వృత్తి చేస్తారు. ఈ అంశాల దృష్ట్యాచూస్తే చిందోళ్ళు, డక్కడలివారు, మాష్టీలు, చిందుభోగంవారు ఆశ్రితవ్యవస్థ ప్రకార్యాలు నిర్వహిస్తున్నట్లు చెప్పవచ్చు.

**ముగింపు :** మాదిగ ఒక కులం. అది ఉపకులాలు, శాఖలు, ఆశ్రితులతో కూడిన ఒక సామాజిక వ్యవస్థ. మాదిగల సామాజిక వ్యవస్థలో కులాలు/స్థాయి అంతరువులు లేదా, సామాజిక స్థిరీకరణ ఉంది. ఉపకులాలసంఖ్య, ఉపకులాలు నిర్వర్తించే కార్యాలు, ఉపకులాలమధ్య ఉండే సంబంధాలు, బాంధవ్యాలు, ఆయా ఉపకులాల్లో పాటించే ఆచారాలు, సంప్రదాయాలు, వంశావళు లు. కులపురాణాలు సాహిత్యం సమగ్ర సేకరణ జరిగినపుడు మాదిగకుల మూలాలను, విశేషాలను, వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను గుర్తించే వీలుంటుంది. మి

# సిమ్లా ఒప్పందం

- ఆర్వియార్

వేవెల్ సిమ్లాలో సంప్రదింపులకి పిలుస్తున్నట్లు నాయకులకి ముందు తెలియజేశాడు. తనే ఒక ప్రణాళికను తయారుచేశాడు. హిందూ ముస్లిం సమస్య పరిష్కారం జరగాలి. అందుకు గాను కార్యనిర్వాహక వర్గంలో హిందువులు ముస్లింలు సమాన సంఖ్యలో వుంటారు. ప్రస్తుతం అమల్లో వున్న రాజ్యాంగాన్ని బట్టే కార్యనిర్వాహవర్గం పనిచేస్తుంది. వైస్రాయి దేశంలోని అందర్నీ సంప్రదించి జాబితా తయారు చేస్తాడు. ఆ రకంగా తనకి కావలసినవాళ్ళని ఆయన నియమించు కుంటాడు. నూతన రాజ్యాంగ విధానాన్ని అన్ని రాజకీయ పక్షాల సహకారంతో తయారు చెయ్యడం జరుగుతుంది.

సిమ్లా సమావేశం క్విట్ ఇండియా ప్రభావం వల్ల వచ్చిన పరిణామం అని చాలామంది అభిప్రాయం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు చాలాకాలం జైలు శిక్ష అనుభవించారు. సిమ్లా సమావేశం కోసం వాళ్ళని విడుదల చేశారు. వేవెల్ గాంధీజీని పిలిచాడు. ఆయన అంగీకరించారు గాని అజాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాబట్టి తన పాత్ర పరిమితం అని చెప్పారు.

గాంధీజీ లాంఛనంగా సంప్రదింపుల్లో పాల్గోలేదు. కాని ఆయన లేనిదే ఏదీ ముందుకు సాగదని అందరికీ తెలుసు. 'కాంగ్రెస్ ఇంజన్ డ్రైవర్ పాత్ర' తనకి ముగిసినట్టేనని భావించాడు. అందుకనే ఆ తర్వాత కాలంలో భారత్‌ని




విభజించి పాకిస్తాన్ ఏర్పాటు చెయ్యాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు ఆయన నిరాహారదీక్షలు, సత్యాగ్రహాలు లాంటిమాటే ఎత్తలేదు. ఎందుకని? నన్ను ముక్కలుగా కోసి విభజన జరగనివ్వండి అని చెప్పిన ఆయన మౌనం ఎందుకు వహించారు?

"ఆ మాట నేను అన్నప్పుడు ప్రజాబాహుళ్యం నా వెనకాల వున్నదనే నమ్మకం నాకు వుండేది. ప్రజాభీష్టం నేను అనుకున్నదానికి భిన్నంగా ఉన్నప్పుడు నా అభిప్రాయాన్ని ప్రజలమీద రుద్దమంటారా? నేను పక్కకు తప్పుకుని వెనక దిగబడాలి" అని ఆయన ప్రకటించాడు. "ఇప్పటికీ వర్కింగ్ కమిటీ తప్పుచేస్తోంది అని మీరనుకుంటే తిరగబడండి. అధికారం అందుకోండి. ఆ హక్కు మీకు వుంది... నేను గనక అంత శక్తి నాకు వుందనిపిస్తే ఒంటరిగానే తిరుగుబాటు బావుటా ఎత్తుతా. అలా చేసే పరిస్థితులు ఇప్పుడు నాకు కనిపించడంలేదు." గాంధీజీ ఆ రకంగా పరిస్థితుల్ని అంచనా వేసుకోవడం, తన పలుకుబడి, పరిమితులు గుర్తించడం ఆయన నాయకత్వానికి గీటురాళ్ళు. అయితే ప్రజల్లో ఆయనకి పట్టు బాగా వుందని కాంగ్రెస్ నాయకులు ఆయనని సలహా అడుగుతూ వుండేవాళ్ళు. అనుకున్న ప్రకారం కాంగ్రెస్ ముస్లిం లీగ్ ప్రతినిధులు, ఇతరులు సమావేశంలో పాల్గొన్నారు. జూలై 2న సిమ్లాలో సమావేశం జరిగింది.

వైస్రాయ్ ప్రతిపాదనల పట్ల తన విమర్శనాత్మక అభిప్రాయం చెప్పడానికి గాంధీజీ సుముఖంగానే వున్నారు. ఆ ప్రతిపాదనల్లో హిందువులకీ ముస్లింలకీ సమాన సంఖ్యలో ప్రాతినిధ్యం వుంటుందనీ, కాంగ్రెస్ నుంచీ, లీగ్ నుంచీ సమాన సంఖ్యలో ఆ సభ్యులు వుంటారనీ, వాళ్ళతో బాటు ఒక షెడ్యూల్డ్ తరగతి ప్రతినిధి ఉంటారనీ వుంది. కాంగ్రెస్‌ని అగ్రవర్ణ సంస్థగా ప్రస్తావించడం గాంధీజీకి కష్టం కలిగింది.

ఆయన అగ్రవర్ణాల నుంచి ఇద్దరు ముగ్గుర్ని ప్రతిపాదించమని వర్కింగ్ కమిటీకి చెప్పారు. అలా అయితే ముస్లిం ప్రాతినిధ్యమూ అంతే ఉంటుంది. మిగిలిన స్థానాలకి అస్పృశ్యులనుంచి, క్రైస్తవులనుంచి, సిక్కు, పార్శీ, ఆంగ్లో ఇండియన్, మూడు శాఖల నుంచీ ప్రతిభావంతులైన, విజ్ఞత కల వ్యక్తుల్ని (పురుషులు, స్త్రీలు అని నొక్కి చెప్పాడు) నియమించమన్నారు. ఏదో రకంగా ఒప్పందం కోసం ఆతృతగా ఉన్న ఆయన సహచరులకు ఇది సమ్మతం కాలేదు.

వేవెల్ ప్రతిపాదనల్ని అంగీకరించారు. వీటో అధికారాన్ని గురించి సమస్య కాదని వైస్రాయ్ చెప్పిన మాటనీ నమ్మి అంగీకరించారు.

జిన్నా ముస్లిం లీగ్ తరఫున తనే మాట్లాడాలనీ, కాంగ్రెస్ హిందువులది అనీ, హిందువులు తప్ప ఇతరులు అందులో లేరనీ అన్నాడు. నిజానికి డా. ఖాన్ సాహెబ్ కాంగ్రెస్ మనిషే. పంజాబ్ యూనియన్ ప్రధాని హయత్ ఖాన్‌ని చేర్చుకోవాలని వైస్రాయ్ భావించాడు. జిన్నా యెప్పుడైతే తన మాట కాదంటే వెనక్కి వెళ్ళిపోతానన్నాడో వైస్రాయ్ సమావేశం విఫలమైనట్లు అర్ధంతరంగా ప్రకటించాడు.

అంతలోకే ఇంగ్లండ్‌లో ఎన్నికలు వచ్చాయి. యుద్ధం ముగిసింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అమెరికా అవసరం ఉన్నా లేకపోయినా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి మీద అణుబాంబు వేసింది. "యుద్ధం ముగిసింది, ఆటంబాంబు కొత్త యుగానికి సంకేతం అయింది" (నెహ్రూ). బ్రిటిష్ వోటర్లు చర్చిల్‌ని ఓడించారు. క్లెమెంట్ ఆట్లీ ప్రధాని అయ్యాడు. ఆయన లేబర్ పార్టీవాడు. ఆయనా, ఆయన లేబర్ సహచరులూ వేవెల్ చెప్పిన దానికి సరేనన్నారు. భారత కేంద్ర అసెంబ్లీకి, స్థానిక శాసనసభలకి 1945-46 శీతకట్టులో ఎన్నికలు జరుగుతాయన ప్రకటించారు.

ఎన్నికలు జరిగాయి. రాజకీయ శక్తుల మోహరింపు దాదాపు వెల్లడైంది. ముస్లిమేతర ప్రాంతాల్లో అధికభాగం కాంగ్రెస్ గెలుచుకుంది. ముస్లింలీగ్ కేంద్ర అసెంబ్లీకి తన 30 సీట్లనీ గెల్చుకుంది. కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గంలో మొత్తం 507కీ 427 గెలుచుకుంది. కాంగ్రెస్ ఎనిమిది రాష్ట్రాలలో మంత్రివర్గాలు ఏర్పాటు చేసింది. తొమ్మిదో దాంట్లో భాగస్వామి అయింది. పంజాబ్ అకాలీ కాంగ్రెస్ ఐక్య సంఘటన ఏర్పడింది. ముస్లిం లీగ్‌కి పంజాబ్‌లో అధికారం దక్కలేదు. అయితే బెంగాల్, సింథ్ రాష్ట్రాల్లో సంకీర్ణ నాయకత్వం వహించింది. దక్షిణాదిన మద్రాస్‌లో సి.రాజగోపాలాచారి మళ్ళీ ముఖ్యమంత్రి పదవికి (అప్పట్లో ప్రధాని అనేవారు) మొగ్గు చూపాడు. గాంధీ కూడా ఆయన తరఫున సిఫార్స్ చేశారు. అయితే క్విట్ ఇండియా ఉద్యమంలో వెనక్కి తగ్గినందుకు శాసన సభ్యులు ఆయన్ని తప్పించారు. టంగుటూరి ప్రకాశాన్ని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. 1946 జనవరి లో, నౌకాదళ తిరుగు బాటుకి నెల ముందు లండన్ నుంచి వేవెల్‌కి ఒక కేబుల్ వచ్చింది. సమీప భవిష్యత్‌లో ముగ్గురు బ్రిటిష్ మంత్రి వర్గ సభ్యులు భారత్ సందర్శిస్తారని ఉంది. ఫిబ్రవరి 19న బహిరంగ ప్రకటన వచ్చింది. బ్రిటన్ భారతదేశాన్ని వదలిపెడుతుందని అట్లీ ప్రధానమంత్రి హోదాలో మార్చి 15న హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రకటించాడు. ఎలా నడవాలి, ఎవరి చేతుల్లో పెట్టాలి అనే అంశాలని నిర్ణయించడానికి ముగ్గురు సభ్యులున్న మంత్రివర్గ బృందం ఢిల్లీ వెడుతుందని ప్రకటించాడు. మార్చి 24న ఆ కేబినెట్ కమిటీ వస్తుంది.

ఢిల్లీలో కేబినెట్ కమిటీతో సంప్రదింపులకి గాంధీజీని వేవెల్ రమ్మని పిలిచాడు. వర్కింగ్ కమిటీ సభ్యులు సంప్రదింపుల్లో వుంటారు. కాని తను సలహాలు, సూచనలు ఇవ్వడం కోసం అందుబాటులో ఉంటారంతే. ఆ సమయంలో కాంగ్రెస్‌కి కొత్త అధ్యక్షుడు రావాలి. గాంధీజీ అంతకుముందు 1942 జనవరి 15న ఓ సంచలనాత్మక ప్రకటన చేశారు.

"రాజాజీ కాదు, సర్దార్ వల్లభాయ్ కాదు, జవహర్‌లాల్ నా వారసుడు" అనేది ఆ ప్రకటన. తనకీ, జవహర్‌లాల్ నెహ్రూకి అభిప్రాయ భేదాలు చాలా వున్నాయి. నిజమే, అహింసా సిద్ధాంతంతో సహా అనేక విషయాల మీద జవహర్‌లాల్‌కీ, గాంధీజీకి ఉత్తర దక్షిణ ధ్రువాల తేడాలు ఉన్నాయి. "మమ్మల్ని విడదీయడం కష్టం... తన మనసుకి తోచింది తను చెపుతాడు కాని నేను కోరేదే సర్వదా చేస్తూ ఉంటాడు. నేను నిష్క్రమించాక నేనిప్పుడు చేస్తున్న కృషిని కొనసాగిస్తాడు. అప్పుడు నా భాషనే మాట్లాడతాడు" అని గాంధీజీ వ్యాఖ్యానించారు.

ఈ ప్రకటన విని జవహర్‌లాల్ ఒక్కసారిగా లేచాడు. పటేల్, రాజాజీ ఎలా స్పందించారో దానికి సంబంధించిన రికార్డులు లేవు అని రాజ్‌మోహన్ గాంధీ రాశాడు. ఇప్పుడు ప్రభుత్వంతో సంప్రదింపులు జరగబోతున్నాయి. స్వాతంత్ర్యం గురించి తేలుతుంది. కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్నవాళ్ళే ప్రభుత్వాధినేత అవుతారు. వీటిని దృష్టిలో పెట్టుకుని, జవహర్‌లాల్ నెహ్రూని తమ వారసునిగా ప్రకటించిన గాంధీజీ నెహ్రూని కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉండాలని సూచించారు. జవహర్‌లాల్ నెహ్రూని కాంగ్రెస్ అధ్యక్షునిగా



ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బ్రిటిష్ ప్రధాని అట్లీ ప్రకటించినట్టు ముగ్గురు మంత్రుల బ్రిటిష్ కేబినెట్ కమిటీ మార్చి 24న ఢిల్లీ వచ్చింది. అందులో పాతకాపు సర్ స్ట్రాఫర్డ్ క్రిప్స్ (1942లో ఆయన సందర్శననే క్రిప్స్ మిషన్ అన్నారు.) ఎ.వి. అలెగ్జాండర్, పెథిక్ లారెన్స్ ఉన్నారు. వైస్రాయ్ నాల్గవ సభ్యునిగా పనిచేశారు. ఆ బృందానికి రెండు లక్ష్యాలు ఉన్నాయి. పాకిస్తాన్ సమస్యని పరిష్కరించడం, వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని తాత్కాలిక ప్రభుత్వంగా మార్చడం, ఆ కమిటీ ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో భారత రాజకీయ నాయకులతో ఢిల్లీలో, సిమ్లా లో, తిరిగి ఢిల్లీలో సంప్రదింపులు జరిపింది. అంతకు ముందెన్నడూ బ్రిటిష్ కేబినెట్ మంత్రులెవ్వరూ వేసవి మూడు నెలలూ భారతదేశంలో గడిపిన దాఖలాలు లేవు. చిత్రం ఏమిటంటే బ్రిటిష్ ప్రభుత్వ ప్రవర్తనా నియమావళిని పక్కన పెట్టి, పెథిక్ లారెన్స్, క్రిప్స్ వాల్మీకి కాలనీలో బసచేస్తూ ఉన్న గాంధీజీని కలవడం.

అయితే మెజారిటీ ఉన్న కాంగ్రెస్‌కి అధికారాన్ని బదలాయించడానికి వాళ్ళు మొగ్గుగా లేరు. ఏమంటే ముస్లింలీగ్ దానికి వ్యతిరేకం. దాంతో కాంగ్రెస్ చేతిలోనే అధికారాన్ని పెట్టడం ఇష్టంలేదు. ఆ బ్రిటిష్ మంత్రులు కాంగ్రెస్, లీగ్ ఒక అంగీకారానికి రావాలని ఉచిత సలహా ఇచ్చారు. అది జరగని పనని గాంధీజీకి తెలుసు. కేబినెట్ మిషన్ పాకిస్తాన్ పరిమాణం గురించి జిన్నాతో మాట్లాడింది. జిన్నా పంజాబ్, సింధ్, వాయవ్య సరిహద్దు రాష్ట్రాలు, బెలూచిస్తాన్, బెంగాల్, అస్సాం ఆరు కలిసిన విస్తృత పాకిస్తాన్‌కే పట్టుబట్టాడు. సంపూర్ణంగా సార్వభౌమత్వం ఉండాలన్నాడు.

ఈ చిక్కుముడిని విప్పడానికి సంప్రదింపుల్ని సిమ్లాకి మార్చుకున్నారు. అజాద్, నెహ్రూ, పటేల్, ఖాన్ గఫార్ ఖాన్ కాంగ్రెస్ నుంచి, జిన్నా, అనుచరులూ ముస్లిం లీగ్ నుంచీ సిమ్లా చేరుకున్నారు. ప్రభుత్వం, వర్కింగ్ కమిటీ కూడా గాంధీజీని సిమ్లా ఆహ్వానించాయి. ఆయనా వెళ్ళారు. కాని ప్రత్యక్షంగా సంప్రదింపుల్లో పాల్గోలేదు. ఓ పక్కన స్వాతంత్ర్యం గుమ్మంలో వుంది. హోదా, అధికారం అలరిస్తూ పిలుస్తున్నాయి. దాంతో చర్చల సమయంలో ఏదో ఒప్పందం కోసం వర్కింగ్ కమిటీ సభ్యులు తహతహ లాడుతున్నారు. తమ అధినాయకుని కంటే – లేదా రాజ్ మోహన్ గాంధీ రాసినట్టు తమ పూర్వ అధినాయకుని కంటే –బ్రిటిష్ మంత్రులకే ఎక్కువ దగ్గరైనట్టు కనిపించింది. ఒప్పందం ఏదో ఒకరకంగా కుదుర్చుకోవాలని తాపత్రయ పడ్డం గాంధీజీకి కష్టం కలిగించింది. సిమ్లా సంభాషణలు క్రిప్స్ ఆలోచించిన పథకం మీద లగ్న మయ్యాయి. ఆ పథకంలో మూడు అంచెలు ఉంటాయి. దేశమంతా కలిపి ఒక సమాఖ్యగా ఉంటుంది. దేశరక్షణని, విదేశీ వ్యవహారాలు, సమాచార సౌకర్యాలు దీని అధికారంలో ఉంటాయి. మిగిలిన అధికారాలు రాష్ట్రాల కింద ఉంటాయి. పంజాబ్, సింధ్, వాయవ్య సరిహద్దు రాష్ట్రం, బెలూచిస్తాన్ ఒక సమాఖ్య (ఈ ఉప సమాఖ్య ఓ విధంగా పాకిస్తాన్ భావనకు దగ్గరగా ఉంది). బెంగాల్, అస్సాం ఒక ఉపసమాఖ్య. అంటే ఇండియన్ రాష్ట్రాలన్నీ ఒక అంచె. ముస్లిం రాష్ట్రాలన్నీ ఒక అంచె, కేంద్రసమాఖ్య ఒక అంచె. హిందూ ముస్లిం సమాన సంఖ్యలో వుంటే, ముస్లిం ప్రాంతాలు పెద్దవిగా వుంటే నామకః కేంద్ర సమాఖ్యకు అంగీకరిస్తానని జిన్నా ప్రకటించాడు.

ఇలా ఆ ప్రతిపాదన తోనే పాకిస్తాన్ అంశ వుంటే భవిష్యత్ రాజ్యాంగం కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పడాలి. దాని గురించి కాబినెట్ కమిటీ సూచనలు చేసింది. రాజ్యాంగం కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పడాలి. దాని గురించి కాబినెట్ కమిటీ సూచనలు చేసింది. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులు ఎంతమంది వుండాలో, ఎలా ఎన్నికకావాలో నియమాలు రూపొందించారు. పైన చెప్పిన మూడు అంచెలలో హిందువులు ఎక్కువ వున్న రాష్ట్రాలు 'ఎ' తరగతి, సింధ్, పంజాబ్ వగైరా ముస్లిం రాష్ట్రాలు 'బి' తరగతి, అస్సాం, బెంగాల్ 'సి' తరగతిగా వుంటాయి. ఆయా రాష్ట్రాలనుంచి రాజ్యాంగ పరిషత్ ప్రతినిధుల్ని ఎన్నుకుని రాజ్యాంగ పరిషత్‌కి పంపిస్తారు. ఓ రకంగా ముస్లిం లీగ్ కోరుకున్నది సూత్రరీత్యా దక్కినట్టే అయింది. అయితే లీగ్ కోరింది పూర్తి దేశవిభజన, పాకిస్తాన్ ప్రత్యేకం వుండాలని. కాంగ్రెస్ కోరింది దేశ సమైక్యత, సమగ్రత. ఈ రెండూ సంపూర్ణం కావు. దాంతో ఉభయ పక్షాలకీ ఇది ఆమోదయోగ్యం కాలేదు.

రాజ్యాంగ పరిషత్ ఏర్పడేదాకా ప్రధాన పార్టీలు చేరిన తాత్కాలిక ప్రభుత్వం అవసరం అని కేబినెట్ మిషన్ భావించింది. కాంగ్రెస్, లీగ్ తమ తమ అపోహలతో దానికి అంగీకరించలేదు. తమ ఉద్దేశ్యం నెరవేరలేదని కేబినెట్ కమిటీ తిరిగి వెళ్ళిపోయింది. అయితే వైస్రాయ్ తాత్కాలిక ప్రభుత్వం ఉంటేనే బాగుంటుందని భావించారు. మళ్ళీ ఆలోచించమని

కాంగ్రెస్, లీగ్‌లని కోరాడు. తాత్కాలిక ప్రభుత్వంలో మొత్తం 14 మంది ఉంటారు. ఆరుగురు కాంగ్రెస్, అయిదుగురు లీగ్, సిక్కు, క్రైస్తవ పార్టీ ప్రతినిధులు ఒక్కొక్కరు ఉంటారు. జిన్నా తిరస్కరించి తనకు కావాల్సింది పాకిస్తాన్ తప్ప మరేదీ కాదన్నాడు.

ముస్లిం లీగ్ చేరకపోయినా కాంగ్రెస్‌కి అంగీకారమైతే తాను తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని వైస్రాయ్ అన్నాడు. కాంగ్రెస్ ఒప్పుకుంది. వైస్రాయ్ ఆహ్వానాన్ని మన్నిస్తూ మంత్రివర్గంలో చేరడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగష్టు 8న తెలియజేశారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూకి ఆ విషయంలో అధికారం ఇచ్చారు.

ముస్లిం లీగ్ అభ్యర్థుల్ని పంపమని జిన్నాను కోరాడు. ఆయన నిరాకరించాడు. పటేల్, రాజేంద్ర ప్రసాద్, రాజ గోపాలాచారి, అసఫ్ అలీ, శరత్‌చంద్ర బోస్, జాన్ మత్తయ్, సర్దార్ బలదేవ్‌సింగ్, జగ్జీవన్‌రామ్, సఫాత్ అహ్మద్ ఖాన్, సయ్యద్ అలీ ప్రభృతులతో ఎంపిక జరిగింది. ముస్లిం లీగ్ కోసం రెండు స్థానాలు ఖాళీగా ఉంచారు. సెప్టెంబరు 2వ తేదీన ప్రమాణస్వీకారం జరిగింది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది.

**ము**స్లిం లీగ్ చేరకపోయినా కాంగ్రెస్‌కి అంగీకారమైతే తాను తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని వైస్రాయ్ అన్నాడు. కాంగ్రెస్ ఒప్పుకుంది. వైస్రాయ్ ఆహ్వానాన్ని మన్నిస్తూ మంత్రివర్గంలో చేరడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగష్టు 8న తెలియజేశారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూకి ఆ విషయంలో అధికారం ఇచ్చారు.

జిన్నాకి ఈ పరిణామాలు మింగుడు పడలేదు. పాకిస్తాన్ కావాలి. అందుకోసం ఏమైనా చెయ్యగలడు. కేబినెట్ కమిటీ ప్రతిపాదనల్ని కాదన్నాడు. తాత్కాలిక ప్రభుత్వం పనికి రాదన్నాడు. ఆగష్టు 16న ప్రత్యక్ష ఆందోళన దినంగా పాటించమని ముస్లింలకి పిలుపు ఇచ్చాడు. దాంతో



జిన్నాతో గాంధీ

హింసాకాండ పడగ విప్పింది. హత్యలు లూటీలు, మానభంగాలు అడ్డూ ఆపూ లేకుండా సాగాయి. ఇళ్ళు, ఆస్తులు విపరీతంగా ధ్వంసం అయ్యాయి. ముస్లిం లీగ్ బెంగాల్‌లో అధికారంలో ఉంది. ఈ దారుణ మారణకాండని నిలువరించే ప్రయత్నాలు ఏవీ జరగలేదు. పోలీసులు, సైన్యం ప్రేక్షక పాత్ర వహించాయి. ఆ హింసాకాండలో, దౌర్జన్యంలో 5 వేల మంది హిందువులు మరణించారు. 15 వేలకి పైబడి గాయపడ్డారు. చాలామంది పారిపోయారు. పాకిస్తాన్ ఏర్పాటు కాకపోతే ఇలాంటి దారుణాలు ఇంకా జరుగుతాయని లీగ్ బ్రిటిష్ వాళ్ళని బెదిరించింది. బెంగాల్‌లోని నౌకాదళంలో హిందువులు, అల్ప సంఖ్యాక వర్గాలు, ముస్లింల దాడులకి విలవిలలాడి పోయారు.

ఈ దారుణ కృత్యాలకి గాంధీజీ చాలా కలత చెందారు. ముస్లిం లీగ్‌తో ఏదో ఒక ఒడంబడిక చేసుకొమ్మని వర్కింగ్ కమిటీకి చెప్పారు. జిన్నా ఏదో రకంగా కాంగ్రెస్‌కి తలనొప్పి తెప్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. ముస్లిం లీగ్‌కి, గాంధీజీ అంత ప్రాముఖ్యం ఇవ్వడం నచ్చకపోయినా పరిస్థితుల దృష్ట్యా గాంధీజీ కోరిక మేరకి తాత్కాలిక ప్రభుత్వంలో చేరమని లీగ్‌ని కోరారు. జిన్నా కూడా అధికారం దూరమైతే ఏం చిక్కులు చుట్టు ముడతాయోనని అంగీకరించాడు.

అయితే నెహ్రూ కింద పని చెయ్యడం ఇష్టం లేక తనకు బదులుగా తన సభ్యుల్ని ఎంపిక చేసి పంపాడు. అందులో ఒక అస్పృశ్యుడైన హిందువు కూడా ఉన్నాడు. జిన్నా తన తరఫున లియాఖత్ అలీని తను ఎంపిక చేసిన బృందంలో చేర్చాడు.

లీగ్‌ని మెత్తబరచడానికి ఆయనకి ఆర్థిక మంత్రి పదవి ఇచ్చారు. దాన్ని ఆసరా చేసుకుని ఆర్థిక మంత్రి హోదాలో ప్రభుత్వానికి శల్యసారథ్యం చేస్తూనే వచ్చాడు. లీగ్ చేరడంతో కాంగ్రెస్‌కి అడుగడుగునా ముళ్ళకంపలే చుట్టుకుంటూ వచ్చాయి. సమిష్టి బాధ్యత అనేది లీగ్ పాటించలేదు. లీగ్‌వాళ్ళ బృందం వేర్పాటుగా వున్నట్టు సాగింది. ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఈ తేడాలు కొట్టవచ్చినట్టు కనిపించాయి.

బ్రిటిష్ వాళ్ళు లీగ్‌పట్ల పక్షపాతంగా ఉన్నారు. వర్తక వ్యాపారాలు ఎక్కువగా హిందువుల చేతిలో ఉండేవి. వాళ్ళని



నెహ్రూ

తిప్పలు పెట్టాలని లియాఖత్ అలీ అధిక సుంకాలు విధించాడు. నెహ్రూ మొదటికే మోసం వస్తుందని భయపడ్డాడు. లీగ్ వాళ్ళు హిందువుల మీద కక్ష కార్పణ్యాలతో అధికారాన్ని ప్రయోగించారు. నౌఖలి, తిప్పర లాంటి చోట్ల అల్ప సంఖ్యాకులుగా ఉన్న హిందువుల మీద ముస్లింలు విరుచుకుపడ్డారు. ప్రతీకారంగా బీహార్‌లో ఉన్న హిందువులు ముస్లింలని దారుణంగా హింసించారు. బెంగాల్ ప్రభుత్వం ఉదాసీనంగా ఉపేక్షిస్తే, నెహ్రూ బీహార్‌లో విస్తృతంగా పర్యటించి అల్లర్లని అణిచే ప్రయత్నం చేశాడు. ప్రభుత్వంతో పని జరగదని గాంధీజీ స్వయంగా నౌఖలికి ప్రయాణం కట్టాడు. నౌఖలి, తిప్పర ప్రాంతాల్లో రెండు నెలలు పర్యటించారు.

1946 అక్టోబర్ 28 నుంచీ ఆయన 'భగవంతుని దూత'గా కల్లోల ప్రాంతాల్లో బెంగాలీ వనితల కన్నీళ్ళు తుడవడానికి పర్యటించారు. అప్పుడు బెంగాల్‌లో సుహ్రావర్దీ ప్రభుత్వాధినేత, అతన్ని కలిసి పరిస్థితిని చక్కబెట్టమని గాంధీజీ చెప్పారు.

సుహ్రావర్దీ హిందువుల మీద దాడుల్ని ప్రభుత్వం అడ్డగిస్తుందని హామీ ఇచ్చాడు. గాంధీజీ వూరు వూరికీ కాలి నడకన వెళ్ళారు. గాంధీ పర్యటనతో ప్రజలకి ఊరట లభించింది. ఈ లోపున రాజ్యాంగ సభకు ఎన్నికలు జరుగు తాయని వైస్రాయ్ ప్రకటించాడు.

ముస్లిం లీగ్ వాటిని బహిష్కరించలేదు. సిక్కులు బహిష్కరించారు. మొత్తం 292 మందికి 288 మందిని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ అత్యధికంగా 164 స్థానాలు గెలుచుకుంది.

రాజ్యాంగసభ 1946 డిసెంబర్‌లో సమావేశం కావాల్సి ఉంది. లీగ్‌కి ఇష్టం లేదు. ఇంగ్లండ్‌లో భారత వ్యవహారాల మంత్రి వైస్రాయ్‌ని, రెండు పార్టీల నాయకులను, సర్దార్ బలదేవ్ సింగ్‌ను లండన్ రమ్మని కబురు చేశాడు. నెహ్రూ తప్పనిసరై, మానేస్తే మర్యాదగా వుండదని లండన్ వెళ్ళాడు.

> **రా**జేంద్ర ప్రసాద్ అధ్యక్షుడిగా 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ సమావేశమైంది. లీగ్ పాల్గొనలేదు. నెహ్రూ లక్ష్యాలని నిర్దేశిస్తూ ప్రసంగించాడు. లీగ్ సభ్యుల్ని మంత్రి వర్గంనుంచి తొలగించమని నెహ్రూ వైస్రాయ్‌ని కోరాడు. కాని వైస్రాయ్ అంగీకరించ లేదు. నెహ్రూ తన సహచరులతో రాజీనామా చేశాడు.

కాని సమాఖ్య, ఉప సమాఖ్యల గురించి మే నెల పథకం ప్రకారం ప్రకటన వెలువడింది.

1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ సమావేశమైంది. రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడు. లీగ్ పాల్గొనలేదు. నెహ్రూ లక్ష్యాలని నిర్దేశిస్తూ ప్రసంగించాడు. లీగ్ సభ్యుల్ని మంత్రి వర్గంనుంచి తొలగించమని నెహ్రూ వైస్రాయ్‌ని కోరాడు. కాని వైస్రాయ్ అంగీకరించలేదు. నెహ్రూ తన సహచరులతో రాజీనామా చేశాడు. లీగుని తొలగిస్తే ఎంత ప్రమాదమో కాంగ్రెస్‌ని వొదులుకున్నా అంతే ప్రమాదం అని వైస్రాయ్‌కి తెలుసు. ఆ సమయంలో 1947 ఫిబ్రవరి 27న లండన్‌లో అట్లీ ఒక ప్రకటన చేశాడు.

1948 జూన్ లోపల బ్రిటన్ భారత్ నుంచి వైదొలగుతుందని, అధికారాన్ని ఏదో ఒక తరహా కేంద్రప్రభుత్వానికి అప్పగించడం జరుగుతుందనీ ప్రకటించాడు.

వేవెల్ బదులు ఆరవ కింగ్ జార్జి చక్రవర్తికి బంధువైన లార్డ్ మౌంట్ బాటన్ వైస్రాయ్ అవుతాడని చెప్పాడు.

భారత్ స్వాతంత్ర్య పోరాట మహా ఇతిహాసంలో ఆఖరి అంకం సమీపించింది. త్వరలో భారతమాత దాస్య శృంఖలాలు తెగిపోనున్నాయి. ఎన్నో ఏళ్ళ పోరాటం ముగియ బోతుంది. ఎంతో మంది అమరులయ్యారు. ఎంత రుధిరం తర్పణం అయిందో, ఎన్ని కన్నీళ్ళు ఈ నేలని తడిపాయో, ఎన్ని కడగండ్ల చీకట్లు కమ్ముకున్నాయో! అన్నింటికీ ఫలితం దక్కబోతోంది.

ఒక మహాత్ముని జీవితపు అహింసా మహాయజ్ఞంలో స్వస్తి వాచకం పలికే సమయం వచ్చింది. సామ్రాజ్యవాద పాలకులు తమకి తాముగా వైదొలగి పోతామని ప్రకటించడం ఏ దేశచరిత్రలోనూ కనిపించని మహత్తర సన్నివేశం. ఆ దశకి తెరలేచింది.



మౌంట్ బాటన్

లార్డ్ మౌంట్ బాటన్ 1947 మార్చి 24న వైస్రాయ్ పదవి స్వీకరించారు.

## నా స్వగతం:

# అభినయ దర్పణం

– పసుమర్తి రామలింగ శాస్త్రి

నేను కూచిపూడి అగ్రహారంలో పసుమర్తి శ్రీరామమూర్తి లక్ష్మీనర్సమ్మలకు జ్యేష్ఠ పుత్రుడిగా జన్మించాను. నన్ను పసుమర్తి రామలింగశాస్త్రి అంటారు. చిరుప్రాయంలోనే మా నాన్నగారు నన్ను మా మేనత్త భర్తయైన నృత్యవాచస్పతి వేదాంతం పార్వతీశం గారి వద్దకు నాట్యశిక్షణకై పంపేవారు. ఆ సమయంలో మహంకాళి నరసింహం మాకు సిద్ధాంత విషయమై అభినయదర్పణం మరియు బాలరామాయణం, శబ్దమంజరి మున్నగునవి నేర్పించేవారు. అంటే వల్లె వేయించేవారు. మాకంతగా వాటి అర్థాలు కూడా తెలిసేవి కావు. ఆ తరువాత నాకు 7 సంవత్సరాల వయసు వచ్చాక నేనూ నా సోదరుడు జోస్యుల వెంకటచలపతి కలిసి 'రుక్మిణీ అరుండేల్ కళాక్షేత్ర' మద్రాస్‌కు ఒకే రోజున వెళ్ళాము. అప్పటికి మా బావగారైన సంగీత విద్వాన్ భాగవతుల సీతారామశర్మ ఆ కళాక్షేత్రంలో సంగీతాధ్యాపకులుగా ఉండటం చేత కొంతకాలం మేము వారింట్లో వుండి అక్కడే భరతనాట్యం నేర్చుకున్నాము.

ఆ తరువాత కళాక్షేత్ర హాస్టల్‌లోనే ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించాను. అప్పుడు కూచిపూడి, భరతనాట్యం అనే రెండు నాట్య శైలులు ఉన్నాయన్న విషయం కూడా నాకు తెలియదు. అలా నేను 10 సం॥లు విద్యాభ్యాసం చేసి, ఎంతో విలువైన డిప్లొమా పొందాను. నేను అక్కడున్న సమయం అంతా ఒక స్వర్ణయుగం. ముందు కూచిపూడిలో నేను వల్లె వేసిన అభినయదర్పణం లోని శ్లోకాలను ప్రాయోగిక పద్ధతితో కలిపి కళాక్షేత్రంలో నేర్పేవారు. అప్పటికి కూచిపూడిలో నాట్యశాస్త్ర గ్రంథ వినియోగం వాడుకలో లేదు. అంతేకాక కళాక్షేత్రంలో నాట్యంతో పాటు సంగీతం కూడా నేర్పించే వారు. మరియు శ్రీకారైకుడి కృష్ణమూర్తిగారి వద్ద, పళని సుబ్రహ్మణ్య పిళ్ళై గారి శిష్యులైన రఘుప్రసాద్ వద్ద మృదంగం అభ్యసించడం జరిగింది. అలా కూచిపూడిలో అయితే నేమి మద్రాసులో అయితే నేమి గొప్ప గొప్ప గురువుల శిక్షణలో నా అభ్యాసం జరిగింది. నా చిన్నతనంలో మా పసుమర్తి కొండల రాయుడు మా నాన్నతో చెప్పేవారట! వీడికి జంటస్వరాలను అన్ని సంపూర్ణ రాగాలలోను సాధన చేయించు అని! అలా మా నాన్నగారు నా చేత పాడించేవారు. ఆ పద్ధతి ద్వారా మనకు తెలియకుండానే ఆ స్వరస్థానములు అలా గుర్తుండి, శాశ్వతంగా నిలిచిపోతాయని వారి భావన. ఆ సాధన ద్వారా, మద్రాసులో సంగీత శిక్షణ ద్వారా కొంత సంగీత జ్ఞానాన్ని సంపాదించాను.

ఇక రుక్మిణీదేవి వంటి అపూర్వ ప్రజ్ఞావంతురాలు నా గురువు కావడం నా పూర్వజన్మసుకృతం. వారిని అందరు "అత్తై" అని పిలిచేవారు. ఆవిడ ఎప్పుడో ఒక్కసారి అన్ని తరగతులకు వచ్చి పరిశీలిస్తూ వుండేవారు. ఐనా ఆవిడను చూడగానే అందరికి భయం. మాకు కళాక్షేత్రంలో రోజూ ఉదయం ఒక జ్యోతిని వెలిగించి దక్షిణామూర్తి మీద, హయగ్రీవుడి మీద ప్రార్థన చేయించేవారు. అక్కడ ఏ మతానికి సంబంధించిన చిత్రపటాలూ లేకుండా జ్యోతిని వెలిగించి ప్రార్థనచేయించడం ఒక ప్రత్యేకత. దానికి అప్పుడప్పుడూ వారు హాజరౌతుండేవారు. ఆవిడ వస్తున్నారంటే అందరికి ఒక కుతూహలంగా ఉండేది. వారితో నా అనుభవాలలో ముఖ్యమైన రెండు సందర్భాలలో జరిగిన సంఘటనలు మీతో పంచుకుంటాను. ఒకసారి నా డిప్లొమో పరీక్షలు జరుగుతున్నప్పుడు ప్రాయోగికంగా నాట్య



పసుమర్తి రామలింగ శాస్త్రి

పరీక్షకు రుక్మిణీ దేవి గారు ఎగ్జామినర్‌గా వచ్చారు. ఆ సమయంలో వారి ప్రదర్శనలకు నట్టువాంగం చేస్తూ పాడే (నాకు తెలిసి నట్టువాంగంలో మొట్టమొదటి స్త్రీ) శ్రీమతి కమలారాణీ నన్ను పరీక్ష చేయిస్తుండగా వర్ణంలో జతి దగ్గర రెండు, మూడు సార్లు నేను ఆగిపోయాను.

ఎందుకు ఆగిపోతున్నావని రుక్మిణీ దేవి నన్ను అడిగినప్పుడు నేను సమాధానం చెప్పలేదు. వెంటనే వారికి కోపం వచ్చి ఇది పరీక్ష, ఇలా నాలుగు సార్లు ఆగిపోతున్నావేమిటి అని మళ్ళీ గుచ్చి గుచ్చి అడిగినపుడు నాకు చెప్పక తప్పలేదు. “అత్తై టీచరు జతి తప్పు చెప్తున్నారు. మళ్ళీ నేను తప్పుచేశానని మీరనుకుంటారని, కోప్పడతారని చెప్పలేదు” అనగానే వెంటనే వారు టీచర్‌ని మందలించారు. చిన్న పిల్లవాడు తప్పుచెప్తున్నావని అంటే 4 సార్లు మళ్ళీ అదే తప్పా! అని గట్టిగా ఆమెను కసురుకొన్నారు. మా టీచర్‌ని బయటపెట్టాలన్న ఉద్దేశం కాకపోయినా వారు గట్టిగా అడిగినపుడు గత్యంతరం లేకపోయింది. ఆ తరువాత వారు నన్ను బాగా ప్రశంసించారు. అన్ని విషయాలలోను ఇలాగే ఖచ్చితంగా ఉండాలని మెచ్చుకున్నారు.

మరొక సందర్భంలో, వారెన్నో నృత్య నాటకాలను తయారు చేశారు, అది లోక విదితమే! ఒకసారి “అభిజ్ఞాన శాకుంతలం” రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు దూర్వాసుడు శకుంతలను శపించే సన్నివేశంలో దూర్వాస పాత్రకు ప్రవేశం లేకుండా తెర వెనుక నుండి వచనంతో చెప్పించే వాళ్లు. ఆ వచనాన్ని అప్పటి సీనియర్ ఆర్టిస్ట్ అయిన బాలగోపాలన్ అనే ఆయన చెప్పాల్సి ఉండగా, రుక్మిణీ దేవి గారు ప్రతి ప్రదర్శనకు ముందు స్టేజ్, డ్రస్, లైటింగ్ ఇలా మూడు రిహార్సల్స్ చేయించేవారు. ఆ రోజు డ్రస్, లైటింగ్‌లతో ఆఖరి రిహార్సల్స్ జరుగుతున్నాయి.

దూర్వాసుడు నేను వచ్చేసరికి కారణాంతరాల వలన బాలగోపాలన్ అక్కడ లేరు. రిహార్సల్ ఆగకుండా వెళ్లాలి, అప్పుడు “అయమహంభోః ఆహా అతిథి పరిభావినీ! విచింతమంతీయ మనన్య మానసా స్మరిష్యతిత్వాం న సబోధితోపిసన్” అని నేను చెప్పేసరికి రుక్మిణీ దేవి గారు ఆహా! రోజూ తప్పులు చెపుతూ భావ ప్రకటనతో వచనం సరిగ్గా చెప్పలేని బాలగోపాలన్ ఈ రోజు చాలా బాగా చెప్పాడే అనగానే, అప్పుడు శకుంతల పాత్రలో చేస్తున్న శాంతక్క (శాంతాధనుంజయన్) అది చెప్పింది బాలగోపాలన్ కాదు, రామలింగం అత్తై, అనగానే వెనువెంటనే ఆవిడ రేపు ప్రోగ్రామ్‌లో నువ్వే డైలాగ్ చెప్పు అని నన్ను బాగా ప్రశంసిచారు.



నృత్య భంగిమ

అలా ఆవిడతో ఉన్న అనుభవాలు నేను ఎప్పటికీ మరువలేను. అదీగాక నేను చిన్నవాడినని నాకు ఏ పాత్రలూ ఇచ్చేవారు కాదు. అందువలన ఆవిడ నృత్యీకరించే నాటకాలన్నీ దగ్గర కూర్చొని నిశితంగా పరిశీలించేవాడిని. ఆ అనుభవమే నాకు మరింత ఉపయోగపడింది. తరువాత ఆమె నన్ను అందరిముందు బాగా మెచ్చుకొని అందరూ నీ గురించి ఏవో చెప్పారు కాని, నువ్వే అందరికన్నా తెలివిగలవాడవు అని అన్నారు. అలాంటి ప్రశంస ఆమె నుండి పొందానంటే నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఆ తరువాత అక్కడ కొనాసాగాలి, నర్తకుడుగా ఎదగాలి అనుకునే సమయానికి ఇంటికి పెద్ద కొడుకు కావడంతో మా కుటుంబం పెద్దది కనుక పోషణాబాధ్యత నేను తీసుకొని ఆర్థికంగా వేగంగా ఫలితం వచ్చే మార్గాన్వేషణ చేస్తూ నాట్య ఉపాధ్యాయుడిగా నలుగురికీ విద్యాబోధన చేయడం మంచిదని వెంటనే విజయవాడ వచ్చి నృత్యశిక్షణను ప్రారంభించి ఆ తరువాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాను.

నృత్యశిక్షణ ఇచ్చేనాటికి నా వయస్సు 18 సం॥లు. విజయవాడలో నాకంత తృప్తికరమైన ఫలితంలేక హైదరాబాద్ మారిపోయాను. ఎందుచేతనంటే– విజయవాడ కన్నా హైదరాబాద్‌లో కళకు ఆదరణ ఎక్కువని తెలిసి అక్కడకు మారాను. ఆ రోజుల్లో విజయవాడలో తక్కిన వారి ప్రదర్శనలు, శిక్షణ, సరియైన శాస్త్రసమ్మతంగా లేదని నాకనిపించేది.

నేను వయస్సులో చిన్నవాడిని కనుక నేనేం చెప్పినా చెల్లేపరిస్థితి లేదు. ఎలాగు హైదరాబాద్‌లో నవ్యనాటక సమితి నాట్యపోటీల్లో మా శిష్యురాలికి ప్రథమ బహుమతి వచ్చి అందరూ నన్ను ఆదరించి, అక్కడ నాట్యాలయం ఏర్పాటు చేయమని కోరారు గదా! అని అలా నా నివాసం

మార్చాను. మరి నేను నేర్చిన విద్యకు కూడా సార్థకత అవసరం కదా! ఒక్కొక్కసారి పనుల నిమిత్తం కూచిపూడి వెళ్లినపుడు చిన్ననాడు నేను నేర్చుకున్న కూచిపూడి అంశాలు మళ్ళీ కళాక్షేత్రానికి వెళ్ళి మా అన్నగారైన పసుమర్తి వేణుగోపా కృష్ణ శర్మ అప్పుడు ప్రిన్సిపాల్‌గా వుండటం చేత వారి వద్ద సాధన చేసేవాడిని.

భామా కలాపం ఇత్యాది విషయాలనూ వారు నాకు నేర్పారు. ఇక ఈ తరంలో ఉన్న కళాకారులలో దాదాపుగా అందరూ నా వద్ద మెళకువలు నేర్చుకున్న వారే! నా దగ్గర శిక్షణ పొందినవారు ఇప్పటికి దాదాపు 250 మంది వరకు ఉండవచ్చు. నాట్యాచార్యుడైన వాడికి సృజనాత్మక శక్తి ఉంటేనే అతడు ఒక స్థానానికి ఎదగ గలడు అనేది నా నమ్మకం. నేను భరతనాట్య సంప్రదాయంలో తంజావూర్ సోదరుల వర్ణాలు, జతిస్వరాలు, శబ్దాలు, త్యాగారాజస్వామి, దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతితిరునాళ్ వంటి వారి కీర్తనలే కాక అన్నమయ్య, కనకదాసు, పురందరదాసు, వంటి వారి కీర్తనలు, సభాపతి అయ్యర్, సారంగపాణి, క్షేత్రయ్య పదాలు, ధర్మపురి వారి జావళీలు, తిరుపతి నారాయణస్వామి జావళీలు, కాకుండా ఆధునిక వాగ్గేయకారులైన డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, మహారాజాపురం సంతానం, లాల్‌గుడి జైరామన్ వంటి ప్రముఖ విద్వాంసుల రచనలను, తిల్లానాలను, ఉభయ సాంప్రదాయాలలో చేసి ఉన్నాను.

ఈ విధముగా నేను కూర్చిన నృత్యాంశములు దాదాపు 150కి మించి ఉండవచ్చు. వీటిలో శారదా అశోకవర్ధన్ రచించిన "ఎవరికి తెలియదులే గోపాల" అనే వలజిరాగంలోని జావళి నాకు నచ్చిన అంశం. అంతే కాక కూచిపూడిలో నేను చిన్నతనంలో నేర్చిన అంశాలను అలాగే నేర్పిస్తూ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలలో జరిగే పరీక్షలకు విద్యార్థులను తయారు చేస్తుంటాను. మా గురువు పార్వతీశం బాణీనే నేను అనుసరిస్తున్నాను.

మద్రాసులో ఉన్న రోజులలోనే డా॥ వెంపటి చినసత్యం వద్దకు వెళుతుండే వాడిని. ఆ సమయంలో లండన్ నుండి కామదేవ్, ఇంకా చంద్రకళ, రత్నపాప మున్నగు వారు వారి దగ్గర శిక్షణ పొందుతూ ఉండేవారు. అపుడు వారి అకాడెమీ పానగల్‌పార్కు దగ్గరలో ఉండేది. అప్పుడు నేను కూడా సాధన చేస్తూ ఉండేవాడిని. ఆ తరువాత చినసత్యంగారు 1985 ప్రాంతంలో వరుసగా 3 సం॥లు కూచిపూడిలో నిర్వహించిన కూచిపూడి నాట్యశిక్షణా తరగతులకు వారి ఆహ్వానం మేరకు వెళ్లి పాల్గొనడమే కాకుండా వారు రూపొందించిన క్షీరసాగర మథనం లో శివుడుగా, శ్రీనివాస కళ్యాణంలో నారదుడిగానూ, పాత్రపోషణ చేసియున్నాను. ఆ తరువాత హైదరాబాద్‌లో నేను స్వయంగా భామ పాత్ర ధరించి భామాకలాప ప్రదర్శనలనూ ఇచ్చాను.

ఆ తరువాత కేంద్రీయ విశ్వవిద్యాలయంలో భరతనాట్య విభాగంలో అధ్యాపకుడుగా నియమితుణ్ణవడం, తద్వారా కొత్త కొత్త నృత్యరూపకాలు చేయడం జరిగింది. ఐతే అందరూ చేసేదే నేను చేయాలంటే నాకు మనస్సంగీకరించేది కాదు. ఏది చేసినా ఏదో కొత్తదనం ఉండాలి అనేది నా సూత్రం.

ఆ విధంగా కూచిపూడిలో సంప్రదాయంగా వస్తున్న యక్షగానాలు కాకుండా నాతరంలో, నా ముందు తరంలోను ఎవరికీ తెలియని శశిరేఖాపరిణయం, యక్షగానాన్ని తీసుకుని దాదాపు 48 సం॥ల తర్వాత మళ్లీ నేను బయటకు తీసి, దానిని గూర్చి వేదాంతం సత్యనారాయణ శర్మ వంటి ప్రముఖ కళాకారులందరినీ అడిగి, వారికి సరిగా గుర్తుండి గుర్తులేక, అది ఏదో నాలుగు రోజులు ప్రదర్శనల్లో 4వదిగా ప్రదర్శించే వాళ్ళం, అని చెప్పగా అప్పుడాస్క్రిప్ట్ తీసుకుని పరిశీలించుకుంటూ, 1959 ప్రాంతంలో AIR వారు చింతా కృష్ణమూర్తి బృందంచే రికార్డు చేయించిన "శశిరేఖా పరిణయం" సంపాదించి దాని ఆధారంగా ఒక పద్ధతిలో దానిని రూపు దిద్దుకుంటూ సందర్భావసరాలను బట్టి కాలాను గుణమైన మార్పులు చేయవలసి వచ్చింది. ఎందువల్ల అంటే నవరసాలు మిళితమైన కథాంశం ఇది. అన్ని యక్షగానాలూ భాగవతాధారంగా రూపుదిద్దుకుంటే ఇది మహాభారతం నుండి గ్రహించబడిన కల్పిత గాథ.

"శశిరేఖాపరిణయం" అని పేరులో ఉన్నా మాకు లభ్యమైన AIR రికార్డింగ్‌లో శశిరేఖ ప్రవేశ దరువు లేకపోవడం, కూచిపూడి యక్షగానాలలో పాత్ర ప్రవేశమే గదా ప్రత్యేకత!

అంతేకాక కథకు ఆయువుపట్టు అయిన ఘటోత్కచుడికీ ప్రవేశ దరువు లేకపోవడం చేత, లక్ష్మణ కుమారుడికి కూడా విశేషమైన దరువులేవీ లేకపోవడం చేత పూర్వార్థంలో ఉన్న బరువు ద్వితీయార్థంలో లేక సమతౌల్యంగా ఉండేందుకై కొన్ని అవసరమైన దరువులను మా ఊరి వాడైన చి॥ దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తిచే వ్రాయించడం వాటికి మా వద్ద



త్రిపాదిగంగ నృత్యరూపకం

గాయకుడిగా పనిచేస్తున్న చి॥ డి.ఎస్.వి. శాస్త్రిచే సంగీత బాణీలు చేయించడం జరిగింది. ఐతే ఈ యక్షగానానికి రచనా శిల్పి వల్లభనేని రామకృష్ణయ్య చౌదరి.

సంగీతం యక్షగాన పితామహులైన చింతా వెంకటరామయ్య చౌదరి గారు 1911లో దీనిని కూచిపూడి విప్రులకు అంకితం ఇవ్వడం, తరువాత కొంతకాలం ప్రదర్శించి ఆగిపోవడం– ఇన్ని సం॥ల తర్వాత మళ్ళీ మనం చేసేది ఎక్కడా ఏ లోపంలేకుండా చేయాలి అనే దృఢసంకల్పంతో ఎన్నో కష్టాలకోర్చి తీర్చిదిద్దడం జరిగింది. ఐతే నేను చేసిన మార్పులేమంటే దుర్యోధన ప్రవేశ దర్వులో సాంప్రదాయంగా సంగీతంలో వచ్చే సావేరి రాగాన్ని మార్చడం ఇష్టం లేక కొత్తదనంకోసం 'దుర్ణయులగు దుస్సేన సౌబల' అన్న పాదంలో దుష్టచతుష్టయం నలుగురికీ నాలుగు జాతులను వాటి నడకలను సంప్రదాయంగా వచ్చే వరసలను చేర్చి చేయించాను. ఎందుకంటే – మిగిలిన నాట్యరీతులలో లేని పంచజాతులకు సంబంధించిన అడుగులు కూచిపూడిలో మాత్రమే ఉన్నాయి. వాటిని వాడుకుంటూ చేయడం జరిగింది.

అలాగే లక్ష్మణ కుమారుడి ప్రవేశ దరువులో వాని సహజలక్షణాలను రచనా రూపంలో, దానికి హాస్య రసపోషణగా అటువంటి రూపంతో ఉండే నటుణ్ణి ఎంపిక చేసుకొని దానికి తగిన రీతిలో హస్తపాద విన్యాసాలను చేయిస్తూ హాస్యరసాన్ని పండించడం. ఈ నాట్యంలో మరో ప్రత్యేకత ఏమంటే మామూలుగా ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క ప్రవేశ దరువు ఉంటుంది. కానీ దీనిలో నాటకం మొదటిలోనే బలరామకృష్ణులకు ఇద్దరికి కలిపి ఒకే ప్రవేశ దరువు రచించారు కవి. ఈ కూచిపూడి యక్షగానం 1911 నుండి 4 దశాబ్దాల పాటు ప్రదర్శితమైందట. దీని ప్రభావం 1957లో వచ్చిన చిత్రరాజం "మాయాబజార్" పై ఉన్నదని పెద్దలు చెప్పేవారు. అయితే మిగిలిన భాషలలో కూడా ఈ చిత్రాన్ని చాలా మంది నిర్మించారు.

అయినప్పటికీ తెలుగులో వచ్చినంత విజయం మరే చిత్రానికి లేదు. కారణం అద్భుతమైన కథాగమనాన్ని ఈ నాటక ప్రభావంతో అనుసరించడం వలన అని నా విశ్వాసం. మాయా శశిరేఖ, శశిరేఖల రెండు వివాహ ఘట్టాలను వేదికపై ఒకే సారి చూపించే సమయంలో ఎంతో ఆలోచించి పూర్వులకంటే భిన్నంగా ఉండాలని వేదికకు ఒక మూల శశిరేఖాభిమన్యులను, ఒక మూల మాయా శశిరేఖ లక్ష్మణకుమారులను కళ్యాణ మంటపాలపై కూర్చుండబెట్టి వారిపై స్పాట్‌లైట్ ఏర్పాటు చేసి కృష్ణుడే రెండు వివాహాలను దగ్గరుండి జరిపించాలి కనుక కృష్ణుడు అనగా మాయ కనుక రెండు కళ్యాణ మంటపాలకు మధ్య చీకటిలో నిల్చుండబెట్టి నాటకాన్ని నడిపించాను. యక్షగానాలన్నింటిలోను ఎక్కువ పాత్రలు కల్గినది ఇదొక్కటే! ఇందులో దాదాపు 30 మందికి పైగా పాత్రలున్నాయి. ఇంతమందిని ఒక త్రాటిపైకి తెచ్చి చెయ్యాలంటే అది ఎంత కష్టతరమైన పనో ఆలోచించండి. ఇవన్నీ స్వానుభవంలోగానీ తెలియవు. ఇంత కష్టతరమైన ప్రదర్శనలను 20కి పైగా ప్రదర్శించి ఉన్నాం.

ఇందులో ఘటోత్కచుడు ప్రవేశ దరువులో జతి రాయడానికి నాకు చాలా రోజులు పట్టింది. నాటకం తేది ఇంకా 3 రోజులు ఉందనగా అన్నీ పూర్తయినా ఇదొక్కటే మిగిలింది. ఆ రోజు సాయంత్రం మా ఇంట్లో నేను మా శాస్త్రి ఫోన్‌లో పాట వినిపిస్తుండగా వింటూ, వాకిట్లో, మా మేకప్ మాన్ జితేంద్ర సెట్టింగ్స్ నెత్తిమీద పెట్టుకొని వస్తుంటే లోపలికి రానివ్వకుండా మా కుక్క అరుపులు, అది విని ఏదో గందర గోళంగా ఉండి రణగొణ ధ్వనులుగా వినబడి వెంటనే "గ" అనే అక్షరంతో మొదలుపెట్టి కొత్తగా చెయ్యాలని స్ఫురించి...

గంభీరా–ఘటోత్కచా గంభీరా– ఘటోత్కచా
గంభీరా– గణగణగణగణ
ఘటోత్కచా – ఘటఘటఘటఘట

అని కొన్ని శబ్దాలతో ప్రారంభించి అక్కడనుండి సంప్రదాయంగా వస్తున్న 'కిణ్ణం కిణ్ణం తక్కిణ్ణం తతక్కిణ్ణ కిణ్ణం కిణ్ణం' అనే జతుల కూర్పుతో కొనసాగించి తరువాతి

రోజు మొత్తం పూర్తి చేశాను. భగవంతుడి దయవల్ల అది మొత్తానికి విజయవంతమైంది. పూర్వం జతి పద్ధతికి నేటి జతి పద్ధతికి చాలా తేడా వచ్చేసింది. పూర్వం అందమైన శబ్దాలను కూర్చి కూచిపూడి నుడికారంతో జతులను చెప్పేవాళ్ళు. ఇప్పుడు ఆ పద్ధతి పోయి మృదంగ శబ్దాలను ఎక్కువ మిళితం చేసి చేస్తున్నారు. అందుకే ఆ అందం వీటికి రాదు. ఐతే కొత్త ప్రయోగాలు చేసినా రక్తి ప్రధానంగా సంప్రదాయ పునాదులమీదే చేయడం పద్ధతి; దానికి ఒక స్థాయి, శాశ్వతత్వం చేకూరుతుంది. ఈ యక్షగానానికి నాకు పూర్తి సహకారం అందిస్తూ నాకు కుడిభుజం, ఎడమభుజం లాగ మా దండిభొట్ల శ్రీనివాస వెంకటశాస్త్రి, మా మేనల్లుడు వేదాంతం రాఘవయ్యలు నిలబడ్డారు.

అంతేగాక ఇంత పెద్ద నాటక నిర్మాణ విషయాన్ని "రస" సంస్థద్వారా డా॥ అలేఖ్య, ఆనందశంకర్‌లు చూసుకున్నారు. సందర్భాన్ని బట్టి సన్నివేశాలకనుగుణంగా పూలవనాలు, దుర్యోధనుని సింహమకరతోరణం, ఘటోత్కచునికి రాతి తోరణం మున్నగు కళావిభాగాన్ని డి.యస్.కె.వి. శాస్త్రి నిర్మించారు. ఇలా సమిష్టి కృషితో నేనీ యక్షగానాన్ని పునర్నిర్మించి సఫలీకృతుడనయ్యాను. ఇంకా మా కేంద్రీయ విశ్వవిద్యాలయం 25సం॥ల ఉత్సవాలకు విశ్వవిద్యాలయం నాట్యవిభాగం తరఫున 'గజాననీయం' నృత్యరూపకం చేయించాను. హైందవ సంప్రదాయంలో గణపతిని పూజించకుండా ఏ పనినీ ఎవ్వరూ చేయరు. మరి గణపతి మీద ఎవరూ నృత్య రూపకం చేయలేదు, అని సంకల్పించి రెండు నెలలు శ్రమించి దానిని తయారుచేశాను.

దీనికి శ్రీ వేదాంతం రామలింగ శాస్త్రి సంగీతాన్ని అందించారు. ఇందులో గజాసురుడి ప్రవేశ దరువుకు "రవళి" అనే రాగంలో శాస్త్రి కూర్చగా ఆ ఏనుగు శబ్దాలకు ఘీంకారాలకు సరిపడే శబ్దాలను మృదంగం మీద పలికిస్తూ, తిల్లాన శబ్దాలతో జతిని నిర్మించి "ధీం;; ధీం;; దిరనా; దిరనా; దిరనా; దిరనా; ఈ విధంగా కూర్చి ఆ వాతావరణాన్ని సృష్టించాను. ఈ జతి చివరలో మామూలుగా తీర్మానాన్ని 3 భాగాలుగా చెప్పడం జరుగుతుంది. మూడింటికీ మధ్యలో 2 చోట్ల ఖాళీలు వదిలి చెప్పడం, మూడవ భాగం కాగానే పల్లవి ఎత్తుగడ సంప్రదాయం.

అయితే నేను మూడవ భాగం తర్వాత కూడా ఖాళీ వదిలి పల్లవి ఎత్తుగడను తీసుకున్నాను. కొంతమంది పెద్దలు ఇదేమీ శాస్త్ర విరుద్ధం కాదు, అరుదుగా ప్రయోగించడం వల్ల మరింత అందంగా ఉందని కూడా కితాబిచ్చారు. అదే విధంగా 'శ్రీరామ కథాసారం' అని రాముని జీవితంలో ఆదర్శమైన విషయాలను ముఖ్య సూత్రంగా చేసుకొని నిర్మించడం జరిగింది. దీనికి శ్రీ బ్నిం రచన, మా శాస్త్రి, సంగీతం సమకూర్చాడు. దాదాపు అన్ని నృత్యరూపకాలకు రచయితలు మారినా సంగీతం మా శాస్త్రియే చేశాడు. ఇంకా నేను నవదుర్గా విలాసం, నరకాసుర సంహారం, అష్టవిధనాయికా విలాసం, అనగా నాయికల యొక్క లక్షణాలను విద్యార్థులకు అర్థమయ్యేలా సంపూర్ణంగా అవగతమయ్యేలా ప్రయోగికంగా వాటి అవస్థలను చూపుతూ తయారు చేసిన రూపకమిది. దీని రచన శ్రీ డి.వి. నారాయణమూర్తి.

తరువాత "త్రిపాదిగంగ" అనే నృత్యరూపకాన్ని స్వీయ–పరకీయ– సామాన్య నాయికలను గంగలో చూపుతూ ఏ విధంగా స్వచ్ఛంగా, నిర్మలంగా విష్ణుపాదాల వద్ద ప్రభవించి, ఆ తరువాత భగీరథుని కోరికపై శివుణ్ణి చేరి, శివుని ఆజ్ఞానుసారం అతని వెంట వెళ్ళడం, ఆ తరువాత భూలోకానికి వచ్చి శంతనుణ్ణి వివాహమాడటం, సామాన్య ప్రజలకు అన్నపానాదులందించడం వంటి తదితర విషయాదులతో రూపొందించాను. దీని రచన శ్రీ బ్నిం. ఈ విధంగా ఎన్నో నృత్యాంశాలను, నృత్యరూపకాలను రూపొందించి నాదంటూ ఒకే ప్రత్యేక ముద్రతో నాకళాయాత్ర సాగిస్తున్నాను.

ఈ కళ మనకు లభించిన మహానిధి. దీనిని ఎవరి శక్తి కొలది వారు త్రవ్వుకొని తీసుకోగల్గినది. ఐనా ఇంకా చేయవలసింది ఎంతో ఉన్నది. అలా ఎవ్వరికి వారు విశ్రాంతి వీడి ఇంకా ఎన్నో విషయాలను పరిగ్రహిస్తూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తే, ఈ కళలోని చిరస్థాయిగా నిలిచిపోయే ఎన్నో మహత్తరమైన అంశాలు మనకు లభిస్తాయి అని నా నమ్మకం.

ఈ విధంగా సంగీత, సాహిత్య విషయాలనూ ఆంగిక, వాచిక, సాత్విక ఆహార్యాలను నిర్దిష్టంగా చేయదలచిన విషయానికనుగుణంగా మార్చుకుంటూ ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ కలకాలం నిలిచిపోయే విధంగా రాశికన్నా వాసికి ప్రాధాన్యత నిచ్చి ఈ నాట్య కళను, మనదైన కూచిపూడి కళాజ్యోతి వెలుగులను విశ్వమంతా వ్యాపింపజేయాలని ఆకాంక్షిస్తున్నాను. మి

# చివరి తత్త్వవేత్త

– ముక్తవరం పార్థసారథి



విట్‌గెన్‌స్టీన్

**గతసంచిక తరువాయి...**

ఇప్పుడు మరో ప్రశ్న తలెత్తుతుంది. భాష అంటే ఏమిటి?

లోకాన్ని మనకు దర్శనీయం చేస్తుంది భాష అంటాడు విట్‌గెన్‌స్టీన్. ఈ అభిప్రాయానికి కారణం ఒక కోర్టు కేసు. ఒక కారు ప్రమాదం ఎలా జరిగిందో నిరూపించటానికి మోడల్ కార్లను ఉపయోగించారు ప్రాసిక్యూషన్ వారు. అంటే, వాస్తవాన్ని అర్థం చేసుకోవటానికి కొన్ని ప్రతీకలు అవసరమవుతాయి. మోడల్ కార్ల లాంటిదే భాష కూడా. వాస్తవికతను పునఃసృష్టించటమే కాదు, దానికో హేతుబద్ధతను, తార్కికతను తీసుకొస్తుంది భాష. ఈ మోడల్ కార్లను ఉపయోగించి మనం కొన్ని వ్యూహాజనిత సంఘటనలను– ఉదాహరణకు ఢీకొట్టే స్థితి, ట్రాఫిక్ జాం, ప్రమాదానికి కారణమైన కారు, ప్రమాదానికి గురైన కారు కూడా సృష్టించవచ్చు.

ఇక నిర్మాణమూలాలను పరీక్షిస్తే భాష, వాస్తవికత యొక్క చిన్న చిన్న అంశాలకు ప్రతీక అని స్పష్టమవుతుంది. హేతుబద్ధత, తార్కికత భాషకు ప్రామాణికం.

ఆలోచనకున్న పరిమితులే భాషకూ వర్తిస్తాయి. రెండూ తర్కాతీతమైనవికావు. భాషను అధిగమించామంటే తార్కికతను అధిగమించినట్టే. అంటే, కొన్ని విషయాలు మనం మాట్లాడలేమని కూడా గ్రహించవచ్చు. దురదృష్టవశాత్తూ, Tractatus చేసిన ప్రతిపాదనలన్నీ ఈ కోవలోకే వస్తాయి. అంటే ఇవేవీ వాస్తవికతను ప్రతిబింబించటం లేదు.

ఈ విషయం గ్రహించాడు విట్‌గెన్‌స్టీన్. కొన్నింటిని మనం నిరూపించలేకపోయినా, అవి ఉన్నట్లుగా మనకు తెలుస్తూనే ఉంటుంది. నిరూపించలేని వాస్తవికత గురించి మాత్రమే Tractatus లో ప్రస్తావించానన్నాడు. ఇంతా చేసి, చివరికి యిప్పటికే చెప్పుకున్నట్లుగా "What we cannot speak about me must pass over in silence" అంటాడు.

ఈ మాట్లాడలేని విషయాల కోవలోకి 'దేవుడు' రాక తప్పదు గదా. భాష, వాస్తవికత గురించి మాత్రమే వివరిస్తుంది గనుక, మనం దేవుడి గురించి మాట్లాడలేం. అతడి గురించి మాట్లాడలేకపోయినా, ఆలోచించలేకపోయినా, దేవుడు ఉన్నాడంటాడు విట్‌గెన్‌స్టీన్.

ఉన్నాయని తెలిసినా మాటల్లో పెట్టలేని విషయాలు ఎన్నో. అవి అనుభవ గ్రాహ్యమే. వీటినే మనం "మిస్టికల్ లేదా మార్మిక విషయాలు అనాలి." Tractatus లోని చివరి వాక్యంలో, లాజిక్, మిస్టిసిజం కలగలిశాయన్నది స్పష్టమే. దీన్ని 'గాలికబుర్లు' అని తీసివెయ్యటానికీ లేదు. అర్థం స్పష్టంగానే ఉంది. నిజాయితీ కూడా కనిపిస్తుంది. కాని, అది 'ఫిలాసఫీ' అవుతుందా? 'అద్భుతమైన తాత్త్విక కవితాచరణం అనటంలో మాత్రం సందేహంలేదు.

Tractatus గురించి చాలా మంది చాలా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. భాషకూ, వాస్తవికతకూ సంబంధముందంటే ఎవరూ కాదనరు. అయితే, అది తార్కికమైన సంబంధమని నిర్ణయించడం ఎలా? ఒకరకంగా, విట్‌గెన్‌స్టీన్ ఈ సమస్యను దాటేశాడు. తర్క బద్ధం కాని అనేక విషయాలు మనం రోజూ మాట్లాడుకుంటూనేవున్నాం. ఒక నాగరక ప్రపంచంలో బ్రతకాలంటే యిది తప్పదు. తార్కికంగా మాట్లాడాలంటే

ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

మంచి–చెడూ, తప్పు–ఒప్పుల గురించి మనం ఏ వ్యాఖ్యలూ చెయ్యకూడదు. ఏ అభిప్రాయమూ వ్యక్త పరచకూడదు. మరి, కళ, సాహిత్యం వగైరాల గురించి, కూడా నోరు మెదపకూడదు. లాక్షణికంగా చూసినప్పుడు, 'కళాకృతి'లో కనిపించేదీ, కనిపించనిదీ కూడా ఉంటుంది. కనిపించని దాని గురించి మాట్లాడుకోలేం గనక. అది లేదన్నట్టు కాదుగద. వ్యక్త పరచగలిగినదీ, వ్యక్త పరచలేనిదీ అనే సమస్య అసలు భాషలోనే ఉందన్నారు పలువురు. తర్కబద్ధమైన విషయాలు సుస్పష్టంగా ఉంటాయి గనక – అవేమీ వ్యక్తపరచనట్టే అన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఈ ప్రతిపాదనలో ఫిలాసఫీ కథ ముగిసినట్టే అనిపిస్తుంది. Tractatus కు రాసిన ముందు మాటలో ఆయన ఈ విషయం స్పష్టం చేశాడు.

ఎన్ని అభ్యంతరాలున్నా, తాత్విక దివాళాకోరుతనం గురించి ఎన్ని ప్రతిపాదనలు చేసినా, ప్రపంచ వ్యాప్తంగా తాత్త్వికులను బాగా ప్రభావితం చేసింది Tractatus దీని ప్రేరణతో వియెన్నా తాత్త్వికులు 'Logical Positivism' కు తెరతీశారు. ఫిలాసఫీ ప్రస్థానం ముగిస్తే ముగిసి ఉండవచ్చు గాక, కాని Logical Positivists, Tractatus ఆధారంగా కొత్త ఫిలాసఫీని రూపొందించటానికి కృషి చేశారు. వాళ్ళప్రకారం నిరూపించబడినప్పుడు మాత్రమే ఏ ప్రతిపాదనైనా నిజమని నమ్మాలి. ఈ ప్రకారం అర్థవంతమైన ప్రతిపాదనలు రెండు రకాలు.

**మొదటి రకం :** గణితంలో, లాజిక్‌తో చేసేవి. ఇవి Tantologous ప్రతిపాదనలోనే అర్థం అంతర్గతంగా ఉంటుంది.

**ఉదాహరణకు :** "పన్నెండు లో నుండి పది తీసివేస్తే రెండు."

**రెండవ రకం :** రాయి కొండపై నుండి కిందికి దొర్లుతోంది. ఏది ఏమైనా నిరూపించలేని ప్రతిపాదనకు అర్థం లేదు. కాని మెటాఫిజికల్ లేదా మత పరమైన విషయాల గురించి నిరూపణలుండవు. "దేవుడున్నాడా?" అనే ప్రశ్నకు జవాబు ఉండదు సరిగదా, ప్రశ్న అడగటమే అర్థరహితం. Tantologous లేదా Verifiable by observation కాని విషయాల గురించి మాట్లాడలేం. తనను అనుకరించిన Logical Positivists నమ్మక పోయినా, విట్‌గెన్‌స్టీన్ దేవుణ్ణి నమ్మాడు. ఆ విషయం గురించి మాట్లాడటం 'తర్కం' అనిపించుకోదంటే అది వేరే సంగతి. Tractatus లోని చివరి ప్రతిపాదన, (మాట్లాడలేని విషయాల గురించి మౌనంగా ఉండక తప్పదు). కొన్ని సమస్యల్ని సృష్టిస్తుంది. అర్థవంతంగా మాట్లాడలేక పోతే మాట్లాడకూడదు. దేవుడు, నైతిక విషయాలు, కళలు లేదా గెలిచే రేసు గుర్రం – దేని గురించీ నోరు మెదపకూడదా?

కాసినో (నగరం) యుద్ధ ఖైదీల క్యాంపులో ఉన్నప్పుడు Tractatus Logico-Philosophicusకు తుదిమెరుగులు దిద్దాడు విట్‌గెన్‌స్టీన్. అప్పుడే రసెల్‌తో సంప్రదింపులు కూడా జరిపాడు. చివరికి, రసెల్ ఉపోద్ఘాతంతో ప్రచురితమైంది Tractatus. అయితే, అది చదివి విట్‌గెన్‌స్టీన్‌కు కోపం వచ్చింది. తను రాసింది రసెల్ అర్థం చేసుకోలేక పోయాడనుకున్నాడు. దాన్ని సరిచేస్తూ, తను మరో ఉపోద్ఘాతం రాస్తానన్నాడు. "నిర్ద్వంద్వమైన, ఎవరూ ఖండించలేని వాస్తవిక విషయాలను, ఫిలాసఫీ సమస్యలకు అంతిమ పరిష్కారాన్ని తాను కనుగొన్నానన్నాడు. అయినప్పటికీ వీటి వల్ల ఒరిగే దేమిటి?" అని పెదవి విరిచాడు.

ఫిలాసఫీకి చరమగీతం పలికిన విట్‌గెన్‌స్టీన్, తర్కబద్ధంగానే, యిక దానితో తనకు పనిలేదనుకున్నాడు. విడుదలై, వియెన్నాకు తిరిగి వచ్చి మరేదైనా కొత్త రంగంలో కృషి కొనసాగించాలనుకున్నాడు. మొనాస్టరీలో చేరాలనుకుని మనసు మార్చుకుని, అక్కడే తోటమాలిగా పనిచేశాడు. సెయింట్ (Saint) గా మారితే ఎలాగుంటుందని కూడా ఆలోచించాడు. (ఆయన ఫిలాసఫీ ప్రకారం సెయింట్‌లది అర్థవంతమైన జీవితం కాకపోయినప్పటికీ). మొత్తం మీద



**ఆల్ ఫ్రెడ్ ఏడ్లర్**

విట్‌గెన్‌స్టీన్ మళ్లీ మానసిక సంఘర్షణ తీవ్రమైంది. యుద్ధరంగంలో అనుభవించిన క్రౌర్యం, కాఠిన్యం అతనిలో ఆధ్యాత్మిక చింతనని పెంచాయి. (టాల్‌స్టాయ్ తన చివరి సంవత్సరకాలంలో కూడా యిలాంటి మార్పునకు లోనయ్యాడు.)

ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యం పతనమైంది. ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా ఆస్ట్రియా దివాళా తీసింది. అయితే మరణించేముందు కార్ల్ (తండ్రి) విట్‌గెన్‌స్టీన్ ఆదేశాల ప్రకారం, కుటుంబ సంపదనంతా అమెరికాలో పెట్టుబడి పెట్టారు. కొడుక్కు చిర్రెత్తించిన విషయమదే. అతడి సంపద అనేక రెట్లు పెరిగింది. తోటమాలి పనులనుండి తీరిక చిక్కిన సమయంలో, వియెన్నాకెళ్ళి, తన ఆస్తినంతా దానధర్మాలకు ఎలా వినియోగించాలో స్పష్టంగా తన లాయరుకు ఆదేశించాడు. అయితే లాయర్ ఆ మాటల్ని నమ్మటానికి కొంత సమయం పట్టింది. అది అపారమైన సంపద. అంతా యిచ్చెయ్యాల్సిందేనా! అదంతా, యితరులచేతుల్లోకి పోవటం యిష్టపడని అక్కాచెల్లెళ్లకు చాలా మట్టుకు బదలాయించాడు. తాగుబోతు కవులకు ఎంతిచ్చినా అదెల సద్వినియోగ మవుతుంది?

సంపదనూ, ఫిలాసఫీనీ ఒదిలించుకున్న విట్‌గెన్‌స్టీన్ ఆస్ట్రియాలోని ఒక కుగ్రామంలో స్కూల్‌టీచర్‌గా కొత్త జీవితం ప్రారంభించాడు. స్కూల్లో చిన్న పార్కూ, వాటర్ ఫౌంటెన్ ఉందని, ఏ సదుపాయాలూ లేని నిజమైన గ్రామీణ పాఠశాల (అతి పేద గ్రామం ట్రాటెన్‌బాక్ లో ఉండేది.) కు వెళ్ళాడు. అక్కడ, పిల్లలకు, ఈ అపకరకుబేర సన్యాసి, పేదరికం గురించీ నిరాడంబర జీవితం గురించీ బోధించాడు. పిల్లల తల్లిదండ్రులకు కోపమొచ్చింది. పేదలకు పేదరికం గురించిన పాఠాలు చెప్పవలసిన అవసరం ఉందా? 'దొరికిందేదో తినాలి' అంటాడు. ఇప్పుడు చేస్తున్నదదేగా. పల్లెలలో జనానికి భయభక్తులెక్కువ. "చర్చికి వెళ్లొద్దు, అక్కడి బోధనలు వినొద్దు" అంటే, ఈయన వాళ్లకో ప్రమాదకరమైన వ్యక్తిలా కనిపించాడు.

స్థానికులకు, అతని మీద కోపం రావటానికి మరో ముఖ్యమైన కారణం – సాయంత్రాలు వాళ్ళు లోకల్ బీర్ ఏదో తాగుతుంటే ఈయన వాళ్ల ఆహ్వానాన్ని తిరస్కరించి, తన యింటిపై గదిలో కూర్చుని క్లారినెట్ వాయించటం. (ఆత్మహత్య గురించి ఆలోచించ లేదంటారా! అదాయన రోజూ చేసే పనే.) రెండేళ్ళ తర్వాత, యిక అక్కడ ఉండలేని పరిస్థితి వచ్చింది. క్లాసులో ఓ కుర్రాణ్ణి కొట్టాడు. దీనికి కొంత అనవసరమైన పబ్లిసిటీ కూడా వచ్చి, స్థానికులు, మన ఫిలాసఫర్ సెయింట్ బెడద వదిలించుకున్నారు.

వియెన్నా తిరిగి వచ్చాడు విట్‌గెన్‌స్టీన్. అతడి మానసిక స్థితి, కుటుంబ సభ్యులకు ఆందోళన కలిగించింది. ఆయన సోదరి తనకో ఇల్లు కట్టించి యివ్వమంది. డిజైను దగ్గర్నుండి, అన్ని విషయాలూ స్వయంగా నిర్ణయించాడు విట్‌గెన్‌స్టీన్. సింపిల్‌గా కనిపించినా చాలా ఖరీదైన ఇల్లది. యుద్ధానంతరం వీధుల్లో జనం ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఆ నిర్మాణం జరిగింది. డాన్యూబ్ (నది) తూర్పుకాలువకు సమీపంలో ఆ ఇల్లు యింకా ఉంది.

'వియెన్నా సర్కిల్' ఫిలాసఫర్లతో పరిచయం పెంచుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. అతడి Tractatus ప్రతిపాదనలను Logical Positivism గా మార్చింది వీళ్లే. తమ గురువుగారైన విట్‌గెన్‌స్టీన్‌లో ఆధ్యాత్మికత దాగివున్నదని తెలిసి వాళ్లు నమ్మలేకపోయారు. అసలు Tractatus లోనే వుంది ప్రచ్ఛన్న మార్మికత. (ఈ లోకంలో మిస్టికల్ విషయాలెలా ఉన్నాయన్నది కాదు ప్రశ్న. వున్నాయంతే.) ఇది సరిపోదన్నట్టు Tractatus లో తను చెప్పిన విషయాలకన్న, చెప్పనివే ఎక్కువ ముఖ్యమన్నాడు విట్‌గెన్‌స్టీన్. యూరోపులోని మేధావులెవ్వరికీ ఈ మాటలు అర్థం కాలేదు. చెప్పని విషయాలను ఎలా వివరిస్తాడు? ఇది ఇండియన్ రోప్‌ట్రిక్ లాంటిది. తాను పిలాసఫీని చంపటానికి ప్రయత్నించిన మాట వాస్తవమేగాని, అందులో పూర్తిగా కృతకృత్యుడిని కాలేకపోయానేమో అనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్.



ఫ్రాయిడ్

తాత్త్విక చరిత్రలో జరిగిన ఒక అపూర్వ సంఘటన యిది. తాను చెప్పిందంతా తప్పని యింత వరకు ఏ తాత్త్వికుడూ అంగీకరించలేదు. విట్‌గెన్‌స్టీన్ ఆ పని చేశాడు. అయితే, ఈ విషయంలో అతడు మరో అడుగు ముందుకు వేశాడు. 'ఇంత లాజికల్‌గా నిరూపించిన తన ఫిలాసఫీయే తప్పుగనక, అసలు ఫిలాసఫీ అంతా తప్పులతడక' అన్నాడు. అలా ఫిలాసఫీని తుద ముట్టించటానికి రెండో ప్రయత్నం ప్రారంభమైంది.

1929లో కేంబ్రిడ్జికి తిరిగి వచ్చాడు విట్‌గెన్‌స్టీన్. అతడు చెప్పింది అర్థం చేసుకున్న మనిషి ఈ లోకంలో ఒక్కడైనా ఉన్నాడంటే అతడు రసెల్. అయితే మాట్లాడుతున్నదేదో తన శిష్యునికే అర్థం కావటంలేదని కూడా గ్రహించాడు రసెల్. అయినప్పటికీ, ట్రినిటీ కాలేజ్ యజమాన్యం విట్‌గెన్‌స్టీన్‌ను తమ ఫ్యాకల్టీగా నియమించు కున్నారు. (ఈయనకు ఏ అకడమిక్ డిగ్రీ కూడా లేదు!)

ఆ తర్వాత పద్దేనిమిదేళ్ల పాటు కేంబ్రిడ్జిలో లెక్చర్లిస్తూ గడిపాడు విట్‌గెన్‌స్టీన్. కాని అతడికి ఉద్యోగమంటే అసహ్యం. 'Dishonest job' ఫిలాసఫీ ఒక 'living death' లెక్చర్లలో తన కొత్త ఫిలాసఫీ లేదా Antiphilosophy బోధించాడు. క్లాసురూంలో అతడు మాట్లాడింది తక్కువ ఆలోచిస్తూ గడిపిందెక్కువ. అయినా, కేంబ్రిడ్జిలోని అత్యంత బ్రిలియంట్ బ్రెయిన్స్‌గా గుర్తింపు పొందిన యువకులు ఆయనను లెక్చర్లను వినటానికి యిష్టపడ్డారు. అప్పుడప్పుడు ప్రశ్నలు వేసి తన విద్యార్థుల్ని పరీక్షించేవాడు విట్‌గెన్‌స్టీన్. అది Spanish lnquisition కన్న తక్కువేమీ కాదన్నారు తెలిసిన వాళ్లు. అతని వ్యక్తిత్వంలో ఒక అద్భుత గాంభీర్యముండేదట.

అతణ్ణి చూస్తే కేంబ్రిడ్జిలో అందరికీ భయమూ, భక్తీ. వారం వారం జరిగే ఫిలసాఫికల్ క్లబ్ సమావేశాల్లో పాల్గొన్న విట్‌గెన్‌స్టీన్ సహాధ్యాయుల, విద్యార్థుల వాదనలను చీల్చి, చెండాడి అందర్నీ హడలగొట్టాడు. ఒంటరి జీవితం, ఏకాంతం ఇష్టపడేవాడు. ఒక యువకుడితో మాత్రం కొంత సాన్నిహిత్యం పెంచుకున్నాడు. చర్చల సంగతెలా ఉన్నా అందరూ టాల్‌స్టాయ్ లాగ నిరాడంబర జీవితం గడపాలని బోధించి (ఫ్యాక్టరీలో కూలీగా, ఆస్పత్రిలో వార్డ్ బాయ్‌గా) విద్యార్థులకు కొంత అపకారమే చేశాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో విట్‌గెన్‌స్టీన్ కూడా హాస్పటల్ పోర్టర్‌గా పనిచేశాడు. అదృష్టవశాత్తూ అప్పటికే ఉన్నత స్థానాలలో ఉన్న మిత్రులు అతనికి బ్రిటిష్ పౌరసత్వం యిప్పించారు. తనిక్కడ సుఖంగానే ఉన్నాడు. కానీ నాజీ ఆక్రమణలో ఉన్న వియెన్నాలో తన అక్కాచెల్లెళ్లెలా ఉన్నారో నని బెంగ మొదలైంది.



సిసిఫస్ హ్యూమనిజం

వీళ్లు యూదులు ఎంత సంపన్నులైనా, నాజీలకు యూదులే ప్రథమ శత్రువులు! (ఆత్మాభిమానమో, అహంకారమో గాని విట్‌గెన్‌స్టీన్‌ల వంశంలోని అందరికీ తలబిరుసు కాస్త ఎక్కువే. వియెన్నాలో, ఒక నాజీ అధికారి, విట్‌గెన్‌స్టీన్ సోదరికి, తాను ఆమెను 'యూదు' గా నమోదు చెయ్యనని వాగ్దానం చెయ్యబోతే, ఆమె ఏదిఏమైనా సరే, నన్ను యూదుగానే మీరు అధికారికంగా గుర్తించాలని పట్టుబట్టింది.)

యుద్ధానంతరం కేంబ్రిడ్జికి తిరిగి వచ్చిన విట్‌గెన్‌స్టీన్ తన 'కొత్తఫిలాసఫీ' పుస్తక ప్రచురణకు సన్నాహాలు ప్రారంభించాడు. దీనిపేరు Philosophical Investigations. రచయిత మరణానంతరం 1953లో అచ్చయింది. తను ప్రచురణకు అంగీకరించిన పుస్తకాలు ఇదీ, Tractatus మాత్రమే. (Tractatus ను తర్వాత Disown చేశాడు.) తరువాత, మరో అరడజను విట్‌గెన్‌స్టీన్ రచనలు వెలువడ్డాయిగాని అవన్నీ ఆయన కేంబ్రిడ్జి లెక్చర్లు. తనకోసం రాసుకున్న నోట్‌బుక్స్ ఆధారంగా తయారు చేసినవి.

తన నోట్సును, సన్యాసిలాగ జీవించిన విట్‌గెన్‌స్టీన్, ఒక 'సేఫ్'లో దాచుకున్నాడు. కొందరు దీనిలో ఒక ప్రతీకాత్మకత చూశారు. జీవితంలోనూ, మేధోమధనంలోనూ 'స్పష్టత' కావాలన్న వ్యక్తి తన అభిప్రాయాలను 'సేఫ్‌లో ఎందుకు దాచుకున్నాడు? "మనం మాట్లాడలేని విషయాల గురించి మాట్లాడకూడదు" అన్న ఆయన ప్రతిపాదనలో, కొందరికి ఆయన హోమోసెక్సువల్ పార్శ్వం కనిపించింది. విట్‌గెన్‌స్టీన్ వంటి అసాధారణ మేధావి జీవితంలో వైరుధ్యాలుండక తప్పదు. అతడు చేసిన ప్రతి పనికీ అనేకమంది అనేక అర్థాలు తీయటం సహజమే. మళ్లీ, విట్‌గెన్‌స్టీన్ మాటల్లోనే, మాట్లాడుకోలేక పోయినా, కొన్ని విషయాలున్నాయిగదా మరి!

Tractatus తో పోల్చితే, Philosophical Investigations అందర్నీ నిరాశకు గురిచేసింది. Tractatus లో ఉన్న స్పష్టత, ధైర్యంగా (తాత్త్విక చరిత్రలోనే అసమాన ధైర్యమది!) చేసిన ప్రతిపాదనలకు బదులు logical analysis గురించి అనవసరమైన ఆక్షేపణలతో, పదాల అర్థాలను గురించిన చర్చలతో నిండి ఉంటుంది. philosophy చర్చించటం వేరు, ప్రతిదాన్నీ philosophise చెయ్యటం వేరు. మన ఆలోచనా ధోరణిలోని లోపాలను ఎత్తిచూపటాన్ని philosophising అనొచ్చు. ఈ పొరబాట్లెందుకు జరుగుతాయి? భాష ద్వారా వ్యక్తీకరించే క్రమంలో పొరబాట్లు దొర్లే అవకాశముంది. భాష వాస్తవ జీవిత దృశ్యం కాదు. అది దారాలతో అల్లిన సన్నటి వల లాంటిది. సరైన సమయంలో, సరైన పదం ఉపయోగించనప్పుడు చిక్కుముడి పడుతుంది. ఈ ముళ్లను విప్పటమే ఫిలాసఫీ చెయ్యాల్సిన పని. అసలు, ఫిలాసఫీ ఇంత సంక్లిష్టంగా, యింత బోరింగ్‌గా ఉండటానికి కారణమిదే. మన సుదీర్ఘ తాత్త్విక సాంప్రదాయం, మన సత్యాన్వేషణ, అస్తి, నాస్తి విచికిత్స, వగైరా అన్నీ కేవలం 'భాషాసమస్య' గా మారిపోయాయి. తరువాతి దశలో విట్‌గెన్‌స్టీన్ ప్రతిపాదించిన ఫిలాసఫీని, సూపర్‌స్ట్రింగ్ థియరీతో పోల్చారు. (దీని ప్రకారం, ఈ విశ్వాంతరాళానికి కారణమైన subatomic particles ఒక దాన్నొకటి పెనవేసుకున్న గొలుసులాగుంటాయి.) ఈ పోలిక బాగుందనిపించినా, ఇది శుద్ధ తప్పు అన్నారు కొందరు.

అలా, తన ఫిలాసఫీ ప్రస్థానం రెండు దశల్లో ముగించి, మళ్లీ సెయింట్‌గా మారిపోయాడు విట్‌గెన్‌స్టీన్. ఐర్లండ్‌లోని ఒక మారుమూల ప్రాంతంలో నివాసం ఏర్పరుచుకుని, ఆలోచిస్తూ, సీగల్స్‌కు ఆహారంవేస్తూ గడిపాడు. కఠిన నియమాలవల్ల ఆరోగ్యం పాడైంది. శేషజీవితం, ఇంగ్లండులో, అమెరికాలో మిత్రుల వద్ద గడిపాడు. కాన్సర్ సోకిందని తెలిసింది. కేంబ్రిడ్జిలో 1951లో ఏప్రిల్ 29న మరణించాడు.

ఎప్పుడూ చర్చికి వెళ్లక పోయినా, కేథలిక్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని కోరాడు. ఆత్మహత్యను సూయిసైడ్ అంటారు. విట్‌గెన్‌స్టీన్‌ది ఫిలాసఫిసైడ్ (philosophicide). అయినా, ఆయన శిష్యగణమంతా తాత్త్వికులే.

తనే చివరి తత్త్వవేత్త అని చెప్పుకున్న విట్‌గెన్‌స్టీన్ శిష్యులు తాత్త్వికులెలా అవుతారు?

కొన్ని విషయాలు మాట్లాడకుండా వుంటేనే మేలు...!

**(అయిపోయింది)**

## ప్రిన్సిపాల్ వెంకటరామనర్సు

**మా** కాలేజీ ప్రిన్సిపాల్ బారు వెంకటరామనర్సు గారు. ఛలోక్తులు విసరడంలో ఆయనకు ఆయనే సాటి. కాకినాడ పిఠాపురం రాజావారి కళాశాల, హైదరాబాద్ నిజామ్సు కాలేజీలోను పనిచేసి తర్వాత మా (వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్) కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వచ్చారు. వారి వద్ద చదువుకునే భాగ్యం నాకు కలిగింది. హైదరాబాద్‌లో వారి వద్ద చదువుకున్న వారందరూ చాలా మంది ప్రొఫెసర్లు, ఐ.ఏ.యస్. ఆఫీసర్లు, భారతదేశంలో అనేక ఉన్నత పదవులను అలంకరించిన వారున్నారు. సదసద్వివేక విమర్శనాశక్తి గలవారు. హాస్యప్రియుడు. లలిత కళలపట్ల అత్యంత ఆసక్తి చూపించేవారు. ఎవరిలోనైనా ఏదైనా స్పార్క్ కనపడితే ఆ గుణాన్ని ప్రోత్సహించి అతనిలోని శక్తికి దోహదం చేసేవారు. వారికి కులమత విచక్షణ లేదు. గుణమే ప్రధానం. వారు అర్థశాస్త్రాన్ని కూడా ఎంతో చాకచక్యంగా ప్రపంచంలోని అనేక దేశాల రాజకీయాలకు సంబంధించిన ఆర్థిక విధానాలను జోడించి ప్రత్యక్షంగా కళ్ళకు కట్టినట్లు పాఠం చెప్పేవారు. ప్రముఖ పత్రికా రచయిత జి.కృష్ణ వారి శిష్యుడే. ప్రణాళికామండలి సభ్యుడు ఎ.ఎం. ఖుస్రో నిజాం కాలేజీలో 'ఎకనామిక్స్' చదువుకున్నాడు. విద్యార్థులు ఆయన్ని చూసి భయపడేవారు. చదువులలో గట్టివాళ్ళయిన ప్రతిభావంతులైన విద్యార్థులే గాక లలిత కళలు, క్రీడలలో ప్రజ్ఞ కనబర్చిన విద్యార్థులను కూడా ప్రేమతో ప్రోత్సహించేవారు. సమదృష్టి ఆయన గొప్పతనం. నేను ఒకరోజు విచారంగా ఉండి ఉదాసీనంగా మాట్లాడుతున్నాను. "ఏమయ్యా విచారంగా వున్నావేం? ఏమి ఇబ్బందులు?" అంటే నేనన్నాను. "మా నాయనగారు సినిమాలు చూడ్డానికి డబ్బులివ్వడం లేదు. నేను అనేక ఇంగ్లీషు చిత్రాలు మిస్సవుతున్నాను" అని అనగానే నాకు వారు అరవై రూపాయలు (బర్సరీ) యిచ్చారు. ఇతర లెక్చరర్స్ అడ్డుపడి "యే బేసిస్ మీద యిస్తున్నారు. అతనేమీ అంత బ్రిలియంట్ స్టూడెంట్ కాదు" అన్నారు. అంటే ఆయన అన్నారు "గుడ్ కాండక్టు కింద యిస్తున్నాను. మాట్లాడకండి, పొమ్మన్నా"రు.

**– నేరెళ్ళ వేణుమాధవ్**

# బావగారి వాణి

***ఆకాశవాణి బాణి***

***- వోలేటి పార్వతీశం***

చివరి భాగం...

**బా**వగారి వాణి మాటని ఎంత ప్రతిభావంతంగా, ప్రయోజనకరంగా, ఎన్ని ప్రక్రియల్లో వినియోగించుకో వచ్చునో, ఆ విస్తృతికి ఒక ఆకృతినిచ్చి చెవుల వాకిట నిలిపింది ఆకాశవాణి. మాట శ్రవ్య మాధ్యమానికి జీవబిందువు. మాట్లాడు కోవడమనేది మనం మామూలుగా చేసే పని. ఈ అంశాన్ని అత్యంత ప్రయోజనకరంగా తీర్చి దిద్దింది రేడియో. లక్ష్యాన్ని అలవోకగా సాధించిన కార్యక్రమంగా, సమాజ సంబంధమైన అంశాలను సమర్థవంతంగా శ్రోతల వద్దకు తీసుకు వెళ్ళిన కార్యక్రమంగా, ఆకర్షణీయమైన కార్యక్రమాలలో ఒకటిగా, శ్రోతల ఆదరణను సొంతం చేసుకున్న కార్యక్రమం, 'బావగారి కబుర్లు' శీర్షిక వినగానే, ఆ కార్యక్రమ స్వభావాలు, ఎవరికైనా సరే చాలా సులభంగా అర్థమైపోయినట్లుండే, కార్యక్రమాలలో ఎంతో ప్రధానమైనది ఈ బావగారి కబుర్లు. బాంధవ్యం ఉందో, లేదో కానీ, రెండు పాత్రలు ఒకరినొకరు 'బావగారూ', అని సంబోధించుకుంటూ, ఉపయోగకరమైన మాటలు మాట్లాడుకుంటూ శ్రోతలందరినీ, ఇట్టే ఆకట్టుకొన్న కార్యక్రమంగా, అపరిమితమైన ఖ్యాతిని సంపాదించుకుంది ఈ బావగారి కబుర్లు.

ఆకాశవాణి మద్రాసు కేంద్రం (అంటే ఇప్పటి చెన్నై కేంద్రంలో అన్నమాట) ఈ కార్యక్రమానికి జన్మస్థలి అని చెప్పుకోవాలి. ప్రయాగ నరసింహశాస్త్రి, గాడేపల్లి సూర్యనారాయణ ప్రధాన భాగస్వాములైన ఈ కార్యక్రమం ఆరంభించిన నాటి నుండీ, ఆదరణకు నోచుకుంది. తరువాతి కాలంలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రధాన వేదికగా మారింది. 5 నిమిషాల పాటు మాత్రమే సాగే ఈ కార్యక్రమం విశేషంగా శ్రోతలను ఆకట్టుకోవడంతోపాటు, అత్యంత, ప్రయోజనకరమైన కార్యక్రమాలలో ఒకటిగా నిలిచింది. ఈ కార్యక్రమంలోని అంశాల విభజన అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ విశేషాలతో మూడు భాగాలుగా వుండేది. అంతర్జాతీయ స్థాయిలో, దేశస్థాయిలో, రాష్ట్రస్థాయిలో జరిగే వార్తా విశేషాల వివరాలను, లేదా పరిపాలనా వ్యవస్థ నిర్ణయాల వివరాలను, పెద్దగా చదువుకోని, ముఖ్యంగా వార్తాపత్రికలు చదవలేని గ్రామీణుల స్థాయికి చేర్చడం, ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో సంబోధనా చతురత ఒక ప్రత్యేకతగా ఉండేది . కేవలం వార్తా విశేషాలను ఏకరువు పెడుతున్నట్లు కాకుండా, కాస్తంత హాస్యాన్ని జోడించి, ఆసక్తికరంగా విషయాన్ని విశదం చేయడం, ఈ కార్యక్రమం సాధించిన ఘనత. వారంలో ప్రతిరోజూ, సాయంత్రం వేళల్లో ఈ కార్యక్రమం ప్రసారమయ్యేది. దాదాపుగా 25 సంవత్సరాలపాటు బావగారి కబుర్లు కార్యక్రమం ప్రసారమైందీ అంటే, ఇప్పటికీ మనకి ఆశ్చర్యం కలిగించే విషయం. శని, ఆదివారాలలో రోజూ ఉండే వార్తా విశేషాలు కాకుండా, కొన్ని ప్రత్యేక అంశాలను ఎంచుకునేవారు. ముఖ్యంగా ఆరోగ్యం, పర్యావరణం, చిన్నపిల్లల పెంపకం, వయోజన విద్య లాంటి ప్రత్యేకమైన అంశాలు చోటు చేసుకునేవి. ప్రయాగ, గాడేపల్లి వారి తర్వాత, 'బావగారి కబుర్లు' కార్యక్రమాన్ని చాలా మంది స్వరసంపన్నం చేశారు. తరువాతి వారిలో అత్యంత సమర్థవంతంగా దీనిని నిర్వహించిన జంట సి.రామ్మోహన్‌రావు, నండూరి సుబ్బారావు. విజయవాడ రేడియోలో ఒక ప్రత్యేక సంభాషణా ఒరవడిని సృష్టించిన జంట ఇది. 'బావగారి



నండూరి సుబ్బారావు.

డాక్టరు వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

కబుర్లు' కార్యక్రమానికి ఇంద్రగంటి శ్రీకాంత శర్మ దాదాపు ఒకటిన్నర దశాబ్ద కాలం స్క్రిప్ట్ అందించారు. పాత్రలిద్దరిలో ఎవరైనా ఒకరు అందుబాటులో లేకపోతే, తానే గొంతు విప్పిన సందర్భాలున్నాయి. ఈ కార్యక్రమం నిర్వహించే విభాగానికి ఉషశ్రీ ప్రయోక్తగా వుండేవారు, చాలాకాలం. అంచేత, ఆయనకూడా అప్పుడప్పుడూ అవసరానుగుణంగా పాత్ర పోషణ చేసేవారు. మొత్తం మీద చాలా మంది బావగార్లను తయారు చేసింది ఆకాశవాణి. రేడియో రికార్డులకోసం అవసరం కనుక స్క్రిప్ట్ ఉండేది కానీ, విషయాలను విoగడించుకున్నాకా, ఈ కార్యక్రమం ఆశువుగా సాగిన సన్నివేశాలు కూడా ఎక్కువ. ఇలా ఆశువుగా సాగించడం అనేది ఆ కళాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. బావగారి కబుర్లు కార్యక్రమానికి విజయవాడ రేడియోలో లభ్యమౌతున్న ప్రజాదరణను గమనించి అనంతర కాలంలో, దీనికి సమాంతరంగా హైదరాబాద్ రేడియో కేంద్రం నుండి 'మాటామంతీ' శీర్షికతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంభాషణా శైలిలో సాగే ఈ కార్యక్రమం, దాదాపుగా బావగారి కబుర్లకు రూపాంతరమే. ఎమ్.వి.యస్ రామారావు, శ్రీమతి ఇందిరా బెనర్జీ ఈ కార్యక్రమాన్ని ఎక్కువకాలం నిర్వహించారు. ఆకాశవాణి కడప కేంద్రం కూడా 'బావగారి కబుర్లు' అందిపుచ్చుకుంది. నటునిగా, రచయితగా, చాలామందికి సుపరిచితులైన గొల్లపూడి మారుతీరావు, డా॥ ఆర్. అనంతపద్మనాభరావుగార్లు ఈ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. మారుతీరావు సంభాషణా చతురత కార్యక్రమానికి మంచి గుర్తింపు తెచ్చింది.

అనంతర కాలంలో, బావగారి కబుర్లు కొత్తరూపం దాల్చింది, దాని పేరు 'కిటికీ'. మూడు పాత్రలు, ఈ కిటికీ నుంచి వర్తమాన ప్రపంచాన్ని శ్రవ్యమానం చేస్తూ మనకి చూపించేవి.

ఈ రెండు కార్యక్రమాలని ఎక్కువ కాలం రచన చేసిన ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు. "రేడియోకి రచన చేసేటప్పుడు మనసులో అనుకుంటూ వ్రాస్తే, ఆ రచన రేడియోలో పండుతుంది" అన్న రజనీకాంత రావు సూచనను ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటారు. మొత్తం మీద మాటే ప్రాణంగా ఊపిరి పోసుకున్న


ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

రేడియోలో ఎన్నెన్నో ప్రక్రియలు. వాగ్ఝరీ ప్రవాహంగా సాగే వాటన్నింటిలో ఆకాశవాణి తన బాణీని సుప్రతిష్ఠితం చేసుకుంది. ప్రక్రియ ఏదైనా శ్రవ్య మాధ్యమంలో ఆకాశవాణి బాణీ ఎప్పటికైనా అనుసరణీయం, ఎవరికైనా శిరోధార్యం.

**చెళుకులు :** (ఇవి చెణుకులే) పౌర్ణమి నెలకి ఒక్కరోజే వస్తుంది. కానీ నెలంతా గుర్తుండి పోయే రోజు అది. ఎన్నాళ్లున్నది అన్నది కాదు ప్రశ్న. ఎంత కళ నిచ్చిందన్నదే ప్రధానం. అలాగే ఆకాశవాణిలో కూడా కొన్ని కార్యక్రమాలు, సుదీర్ఘకాలం కొనసాగలేదు గానీ, సాగిన కొద్దికాలంలోనే, గొప్ప ముద్రలు వేశాయి. అలా ఒక ప్రచలితమైన ముద్రను వేసి, ప్రాచుర్యంలోకి వచ్చిన ఒకానొక కార్యక్రమం చెళుకులు. శీర్షికను మరొకసారి గమనించండి. చెణుకులు కాదు చెళుకులు. పేరే కొత్తగా వుంది. ఉచ్చారణ స్పష్టంగా లేకపోతే, రెండూ ఒకేలా ధ్వనించవచ్చు. కానీ రెండింటి మధ్యా భేదం వుంది. చెణుకులో మెఱుపుంది. చెళుకులో చరుపుంది. ఆ చరుపు సున్నితమైన హాస్యంతో కలగలిసి వుంటుంది. అంశాన్ని హాస్యస్ఫోరకంగా నడుపుతూనే, చివరలో మన వివేచనను మేల్కొలుపుతూ ఒక చరుపు చరుస్తుంది.

70వ దశకంలో సేన్ గుప్తా అనే ఆకాశవాణి డైరెక్టర్ బీజప్రాయంగా నాటిన ఆలోచన తదనంతర కాలంలో చెళుకులపేరిట అంకురమై మొలకెత్తింది. ప్రతినిత్యం దినపత్రికలో ప్రత్యక్షమయ్యే కార్టూన్, రేడియోలో ఎందుకుండకూడదు అన్నది ఆయన చేసిన ప్రాథమిక ఆలోచన. ఢిల్లీనుండి ఒక నమూనా తెప్పించారు. అయితే ఈ బీజం మొలకెత్తడానికి నీరు పోసింది, ఆనాటి స్టేషన్ డైరెక్టర్ బాలాంత్రపు రజనీకాంతరావు. రేడియో కార్టూన్, చెళుకులు పేరుతో తెలుగు రూపం దిద్దుకుంది. దీని ప్రతిష్ఠాపకులు సత్యం శంకరమంచి, పరివ్యాపకులు పన్నాల సుబ్రహ్మణ్యభట్టు. ఈ ఇరువురి నిర్వహణలో రమారమి రెండేళ్ళ కాలం చెళుకులు ఆకాశవాణిలో సందడి చేశాయి. ఈ సందడికి నాడీమండలం, ఆకాశవాణి విజయవాడ కేంద్రం. ఎన్నో సమస్యలు, ఇబ్బందులు, సమకాలీన సంఘటనలు చెళుకులు కార్యక్రమంలో చోటు చేసుకునేవి. ఐదు నిముషాల ప్రసార వ్యవధికి మించని ఈ రేడియో కార్టూన్ కోసం ఆకాశవాణి శ్రోత్ర వర్గం ఎంతలా ఎదురు చూసిందో, ఆ కాలంలో రేడియోని ఎరిగున్న వాళ్ళందరికీ తెలుసు. జటిలమైన అంశాన్ని కితకితలు పెట్టినట్లు, నవ్విస్తూ ఆలోచన

కలిగించేలా చెప్పడం కార్టూన్ లక్షణం. దీన్ని ప్రతిభావంతంగా నిర్వహించాయి చెళుకులు. పసందైన రచనలతో సత్యం శంకరమంచి, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు ఈ కార్యక్రమానికి విశేషమైన ప్రాచుర్యాన్ని సంపాదించి పెట్టారు. ఎప్పటికప్పుడు, ఆకర్షణీయంగా తీర్చడానికి కొత్త ఆలోచనలకు చోటివ్వాలనే ఉద్దేశంతో చాలామంది రచయితలకు అవకాశమిచ్చేవారు. సత్యం, భట్టులతో పాటు, ఆదివిష్ణు, ఎన్.సిహెచ్. కృష్ణమాచార్యులు, పుచ్చా పూర్ణానందం, పురాణం సుబ్రహ్మణ్య శర్మ వంటి సునిశిత హాస్య రచయితలు, చెళుకుల్తో మంచి చురకలు వేసేవారు.

రాజకీయ సంబంధమైనవి, సామాజిక సంబంధమైనవి, పౌరజీవనంలోని నిత్య సమస్యలు, ఉద్యోగుల జీతభత్యాలు ఇవన్నీ చెళుకుల్లో వినబడేవి. నండూరి సుబ్బారావు, సి. రామ్మోహనరావు, ఉషశ్రీ వంటి ప్రసార ప్రముఖులు ప్రధానంగా పాలుపంచుకునే వారు. ఆ గొంతులు చెళుకులకు మంచి జవజీవాలనిచ్చాయి. నిజానికి రచనా పరంగా చెళుకులు కార్యక్రమం ఒక గొప్ప టెక్నిక్ అని చెప్పాలి.

ప్రచురణ మాధ్యమంలో వుండే కార్టూన్‌ని శ్రవ్య మాధ్యమంలోకి అనువర్తించిన ప్రక్రియ ఇది. అచ్చులో చూసినప్పుడు, కార్టూన్ చూసీ చూడగానే మొత్తం విషయం అర్థమైపోతుంది. అందులో సస్పెన్స్‌కి చోటుండదు. కానీ రేడియో కార్టూన్ అలాకాదు. ఈ అనువర్తనలో ఒక సౌలభ్యం ఏర్పడింది. విషయ విపులీకరణతో రచన ముందుకు సాగుతూ ఉత్కంఠత కలిగిస్తుంది. సస్పెన్స్‌కు తెర తీస్తుంది. చివరన ఒక్క మలుపు తిరిగి ఒక చరుపు ధ్వనింప చేస్తుంది. ఈ రచనా సౌలభ్యం రేడియో కార్టూన్‌కి చాలా ఆదరణ సంపాదించి పెట్టింది.

రేడియోలో ప్రతికార్యక్రమం, ఒక Signature Tuneతో ప్రారంభమౌతుంది. కార్మికుల కార్యక్రమం, పంటసీమలు, రంగవల్లి, వనితావాణి, బాలానందం ఇలా ఏ కార్యక్రమాన్నైనా Signature Tune విని మనం గుర్తు పట్టేయొచ్చు. ఈ సంకేత స్వరరచనలు ఎక్కువగా రజనీకాంతరావు రచించినవే. ఈ చెళుకులు కార్యక్రమానికి కూడా ఒక ఆసక్తికరమైన సంకేత స్వరరచన ఆయన రూపొందించారు. ఈ Tune వినబడగానే, గబగబా రేడియోల దగ్గరికి చేరడం, రేడియో వాల్యూమ్ పెంచడం, ఆ పైన చెవులప్పగించడం, ఇవన్నీ ఆనాటి శ్రోతలకి ఇప్పటికీ గుర్తుండే విశేషాలే. Tune చివర్లో వినబడే చరుపు శబ్దం, ఆ తరం శ్రోతల చెవుల్లో ఇప్పటికీ రింగుమంటూ వుంటుంది. ఇలాంటి శబ్దాల్ని రేడియోలో సృష్టించడానికి, కొరడాలు, చర్నాకోళ్ళు వంటి వాటిని, ఆకాశవాణి స్టూడియోల్లోకి తేలేరు కదా! అంచేత రెండు కొబ్బరాకులు తెచ్చి, చెళుకుల సంకేత స్వరరచనలో చరుపు శబ్దాన్ని సృష్టించిన రజనీకాంతరావు, సి.రామ్మోహనరావు సృజనాత్మక ప్రతిభను, భట్టుగారు ఇప్పటికీ జ్ఞాపకంచేస్తూవుంటారు.


నండూరి విఠల్

**ప్రత్యక్ష ప్రసారవాణి:** ఆకాశవాణి అనే పేరు ఏ సుముహూర్తాన ఏర్పడిందోగానీ సార్థక నామధేయం అయింది ఈ శ్రవ్య మాధ్యమం. ఏదో ఒక అదృశ్య వాణి ఎక్కడో కంటికి కనపడని దృశ్యాలను మనకళ్ళముందు సాక్షాత్కరింప చేసినట్లుండేది రేడియో పలుకు. ఆకాశవాణికి నామౌచిత్యాన్ని ప్రసాదించిన ఒకానొక ప్రక్రియ ప్రత్యక్ష వ్యాఖ్యానం. ఎక్కడో సుదూర ప్రాంతాలలో జరుగుతున్న ఒక విశేష సంఘటనను, అది జరుగుతున్న క్షణంలోనే, ఆ సంఘటనాస్థలి నుంచి, ఒక వ్యక్తి ఎవరో ఆ మొత్తం దృశ్యాన్ని, శ్రవ్యంగా అనువర్తించి, రేడియో ద్వారా లక్షలాది మంది శ్రోతలకు అందించిన ఒక గొప్ప సాంకేతిక అద్భుతం ప్రత్యక్ష వ్యాఖ్యానమనే ప్రక్రియ. ఈ ప్రక్రియకు ఊపిరి పోసింది ఆకాశవాణి. అయితే తెలుగు వాళ్ళ రేడియోకి సంబంధించినంత వరకు, ఈ ప్రక్రియను ప్రారంభించి, ప్రాచుర్యాన్ని సంతరించిపెట్టిన ఘనతను తనఖాతాలో వేసుకుంది విజయవాడ ఆకాశవాణి కేంద్రం.

ప్రత్యక్ష వ్యాఖ్యానాల ప్రసార సరళిని ప్రారంభించిన మొట్ట మొదటి విశేష సంఘటన, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రుల కల్యాణ వేడుక. 1960వ దశకం ఉత్తరార్థంలో ఈ గొప్ప సంఘటన చోటుచేసుకుంది. ఆనాటి తెలుగుశాఖ ప్రయోక్త శ్రీ జి.వి. కృష్ణారావు నేతృత్వంలో మొట్టమొదటి ప్రత్యక్ష వ్యాఖ్యానప్రసారం జరగిందనడానికి దాఖలాలున్నాయి. ఈ ప్రత్యక్ష వ్యాఖ్యాన ప్రక్రియకు తొట్ట తొలిగా ఒక స్వరమార్గాన్ని, ఒక శైలీమార్గాన్ని, ఒక భాషా మార్గాన్ని నిర్మించిన వారు జమ్మలమడక మాధవ రామ శర్మ. రేడియోలో వీరు నిర్మించిన వ్యాఖ్యాన మార్గం ఎంత పటిష్ట



ప్రయాగ నరసింహశాస్త్రి

మైనదంటే, ఈ నాటికీ అధిక శాతం, వ్యాఖ్యాతలు అదే మార్గంలో పయనిస్తున్నారు. తెలుగు కవిత్వానికి ఆదికవి నన్నయ్య లాగా, తెలుగు రేడియోలో తొలి ప్రత్యక్షప్రసార వ్యాఖ్యాత మాధవరామ శర్మే. గొప్ప పాండితీ ప్రకర్ష కలిగిన శర్మ మామూలు శ్రోతలకు కూడా అర్థమయ్యేరీతిలో వ్యాఖ్యానం చెయ్యడం, దీనికి విశేషమైన ఆదరణను చేకూర్చింది.

జాన్యక్యాః కమలాంజలిపుటే, యాః పద్మనాగాయిత, అన్న శ్లోకాన్ని జీవనాడిగా పట్టుకొని వ్యాఖ్యానాన్ని అల్లుకు పోయే సంవిధానాన్ని ఆయన మొదలు పెట్టిందే. జమ్మలమడక మాధవరామ శర్మ, లక్ష్మణ యతీంద్రులు, కందుకూరి రామభద్రరావు, ఏలూరిపాటి అనంతరామయ్య, ఉషశ్రీ, సత్యం శంకరమంచి, జె.వి. సుబ్బారాయుడు, జి.వి. సుబ్రహ్మణ్యం, సుప్రసన్నాచార్యులు వంటి వారితో పాటు, డా॥ అనంత పదర్మనాభ రావు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ వంటి వారు కూడా, ఈ ప్రత్యక్ష వ్యాఖ్యానాలకు తమ గొంతు నిచ్చిన వారే. ఈ వ్యాఖ్యాతల సంఖ్య ఐదారుపదులు దాటినా, కవిత్వంలో కవిత్రయంలాగా, ఈ ప్రత్యక్ష వ్యాఖ్యానాలకు, వ్యాఖ్యానకారత్రయంగా పేరు తెచ్చుకున్నవారు ముగ్గురు. జమ్మలమడక మాధవరామ శర్మ, ఏలూరిపాటి అనంతరామయ్య, ఉషశ్రీ.

ఇద్దరూ, ముగ్గురు వ్యాఖ్యాతలుండే, ప్రసారంలో అంశాలవారి విభజన వుండేది. ఆగమశాస్త్ర విధివిధానాలను, కల్యాణ సన్నివేశ విధివిధానాలను సమశ్రుతిగా కలగలిపి చెబుతుండేవారు. “అమ్మా సీతమ్మ తల్లీ నువ్వు మరీ అంతగా సిగ్గుతో తలవంచుకుంటే ఎలా? మాస్వామి సూత్ర ధారణ ఎలా చేస్తాడు. కాస్తంత తలపైకెత్తు తల్లీ” అంటూ కొలువు తీరిన కళ్యాణ విగ్రహాలతో సంభాషించినట్లుండే, ఆ పద్ధతికి అనూహ్యమైన ఆదరణ సంపాదించి పెట్టారు శర్మ.

అనంతర వ్యాఖ్యాతలకు ఈ ధోరణి అనుసరణీయమై పోయింది. ఇలాంటి ప్రత్యక్ష వ్యాఖ్యానాలలో మరొక విశేషమైన సంఘటన గోదావరి నదిపై నిర్మించిన రైలురోడ్డు వంతెన ప్రారంభోత్సవం ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన ఈ సన్నివేశాన్ని ప్రత్యక్ష వ్యాఖ్యానంతో ప్రసారం చేసింది ఆకాశవాణి. రాజమండ్రి నుండి రోడ్డు వంతెన ప్రారంభాన్ని సత్యం శంకరమంచి, కొవ్వూరు నుండి రైలు వంతెన ప్రారంభాన్ని ఉషశ్రీ తమ వ్యాఖ్యానంతో దృశ్యమానం చేసిన రేడియో ప్రసారాన్ని ఆ తరం శ్రోతలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.

తరువాతి కాలంలో ప్రత్యక్ష వ్యాఖ్యానమనేది చాలా విస్తృతి చెందింది. శ్రీశైలం నుండి శివరాత్రి పర్వ దినాలలోని లింగోద్భవ సన్నివేశాలు, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, సింహాచలం అప్పన్న చందనోత్సవాలు, అన్నవరం కల్యాణోత్సవాలు, ఇలాంటి ఆధ్యాత్మిక వైదిక కార్యక్రమాలతో పాటు, క్రికెట్ వంటి అంతర్జాతీయ క్రీడా విశేష సంఘటనలు, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి సాంస్కృతికోత్సవాలు, గోదావరి, కృష్ణావంటి జీవనదులు పుష్కరోత్సవాలు ఇలా ఎన్నో విశేష సంఘటనలను, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంతో సహా ఎన్నో కేంద్రాలు ప్రత్యక్ష వ్యాఖ్యానాలతో శ్రవణ శుభగంగా చేశాయి. స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యక్షప్రసారం ఎంతో జనాదరణ పొందిన కార్యక్రమం.

భాష మీద అపరిమిత అధికారం, అలవోకగా ప్రత్యామ్నాయ పద ప్రయోగపాటవం, అనుకోని అవాంతరాలు ఎదురైనా, సమయానుకూలంగా, వాగ్విలాసంతో వాటిని అధిగమించడం, అన్నింటికి మించి, జనరంజకమైన సంభాషనా చాతుర్యం, వర్ణనా పటిమ ఇవన్నీ ప్రత్యక్ష వ్యాఖ్యానానికి, అత్యంత ఆవశ్యకమైన లక్షణాలు. ఇవి పుష్కలంగా కలిగిన వ్యాఖ్యాతలు ఈ ప్రక్రియలో ఎక్కువగా రాణిస్తారు.

ప్రత్యక్ష వ్యాఖ్యానాల కారణంగా, ఈ శ్రవ్యమాధ్యమం దశాబ్దాలకు ముందే దృశ్యమాధ్యమంలా భాసించింది. ఆ కారణంగా ఆకాశవాణి తన ప్రత్యేకతను ఆనాడే సుప్రతిష్ఠం చేసుకుంది.



‘ఆకాశవాణి’ బాణీలను
గొలుసు కట్టుగా అందించి
*మిసిమి* పాఠకులను అలరించిన
వోలేటి పార్వతీశంగారికి
అభివందనలు

– సం.

# అదే గాలి
# చైనా కవిత్వం

– *ముకుంద రామారావు*

చైనా కవిత్వం 5000 ఏళ్ళకు పూర్వమే మొదలయింది. వారి మొదటి కవితలు పాటలు. పండుగలు ముఖ్యమైన సందర్భాల్లో వారికి పరిచితమైన రాగాల్లో ప్రజలు కొత్త గీతాల్ని సమకూర్చుకొనే వారు. వారి ఆలోచనల్ని భావాల్ని పాటల్లో వ్యక్తపరుచుకునే వారు. అందరికీ తెలిసిన చైనా మొదటి కవిత్వ సంకలనం *షీ చింగ్* (Book of Songs పాటల పుస్తకం). క్రీస్తుపూర్వం సుమారు 600 ప్రాంతంలో, వెదురు కర్రల మీద రాయబడింది. ఇప్పటికీ కొనసాగుతున్న సంపన్న, అతిపురాతన కవిత్వ సాంప్రదాయం చైనాది.

ప్రజల పాటల్ని తెలుసుకుని, వారి బాధల్ని, మనోభావాల్ని, ఆస్థాన సంగీతకారులు ప్రభుత్వ అధికారులకు కవిత్వం ద్వారా వివరించి చెప్పేవారు. రాజుకు అధికారుల ద్వారా ప్రజల బాగోగులు తెలిసేవి. ఆ రోజుల్లో ఆస్థాన సంగీతకారులు ప్రభుత్వానికి మూలస్తంభాలుగా ఉండేవారు. పండితుడు, అధ్యాపకుడైన కన్‌ఫ్యూశియస్ (551–479 క్రీ.పూ), విద్యాధికుల్లో ఒకడిగా మనడానికి ఈ పాటల్ని అధ్యయనం చేయమని తన కొడుకుకు చెప్పేవారు. కన్ ఫ్యూశియస్ తరువాత కాలంలోనే, సంగీతం నుండి కవిత్వం వేరవుతూ వచ్చింది.

అనేక ఒడిదుడుకుల్లో చైనా నడిచేది. ఏడు చిన్న సామ్రాజ్యాలు నిత్యం పోరాడుకునేవి. క్రీ.పూ 221లో, అందులో ఒక రాజు, మిగిలిన అన్ని సామ్రాజాల్నీ, జయించి, దానికి చిన్ రాజ్యంగా పేరు పెట్టాడు. తన పేరు కూడా చిన్ షిహుయాంగ్ (చిన్ మొట్టమొదటి చక్రవర్తి)గా ప్రకటించుకున్నాడు. చిన్ నుండే చైనా పేరు వచ్చింది.

చిన్ షిహుయాంగ్ తెలివైన వాడు, కౄరుడు. తన రాజభవనం, భూగర్భంలోని విశాలమైన సమాధి, తన సామ్రాజ్యాన్ని శతృవుల నుండి కాపాడుకుందుకు గొప్ప గోడ (great wall) నిర్మాణంలో, అనేక వేల మంది కూలీల్ని పొట్టన పెట్టుకున్నాడు. తనముందరి రాజులతో ఏవిధమైన పోలికలు తెలియకుండా, ఆధారాలన్నింటినీ ధ్వంసం చేశాడు. కొన్నింటిని రాజుకు తెలియకుండా దాచేయటం మూలాన భద్రంగా ఉన్నాయి. వాటిల్లో *పాటల పుస్తకం* కూడా ఒకటి. ఒకే భాష. దేశమంతటా వాడాలన్న శాసనం మూలాన, అనేక మాండలికాలున్నా చైనా అంతా ఒకే అక్షరలిపి వాడుకలో కొచ్చింది. చైనా భాషలో ప్రతి అక్షరం ఒక పదం/చిత్రం.

శతాబ్దాల తరబడి తన సామ్రాజ్యమే ఉంటుందనుకున్న ఆ చక్రవర్తి మీద ప్రజలే తిరగబడ్డారు. క్రీ.పూ. 206 సరికి హాన్ సామ్రాజ్యం మొదలయింది. ఈ కాలంలో 'షి' పద్ధతిలో ('షి' అంటే కవిత్వం) ఒక కొత్త ఒరవడిలో కవిత్వం మొదలయింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. 'షి' పద్ధతిలో కవిత కేవలం నాలుగు లేదా ఎనిమిది పంక్తులు మాత్రమే. ఒక్కో పంక్తికి అయిదు లేదా ఏడు అక్షరాలే. రెండవ, నాలుగవ పంక్తులకు అంత్యప్రాసలుంటాయి.

ఒక్కోమారు మొదటి పంక్తికి కూడా. సాధారణంగా మొదటి రెండు పంక్తులు ఒక దృశ్యాన్ని చిత్రిస్తాయి. మూడవ పంక్తిలో ఒక కొత్త కోణం లేదా ఒక మెలిక ఉంటుంది. ఆఖరి పంక్తి కవి భావాన్ని తెలియ జేస్తుంది.

టాంగ్ సామ్రాజ్య (618–907) కాలంలో కవిత్వం ఉన్నత శిఖరాలకు చేరుకుంది. చైనా కవిత్వం ఇతర దేశాలకు కూడా చేరడం మొదలయింది. ముద్రణ పద్ధతులు కూడా మెరుగుపడటంతో, ప్రచురణ సులువయింది. 684 నుండి 704 వరకూ, వూ జెటియన్, ఒక స్త్రీ చక్రవర్తిణి మరికొన్ని 'షి' పద్ధతిలో కవితలు చేర్చబడ్డాయి. అవి ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షల కోసం వాడేవారు. 19 వ శతాబ్దం వరకూ ఈ పరీక్షల విధానం, ఛీన్సీ పేరున, పరిపాలనకు సంబంధించి కొనసాగింది. అందులో కవిత్వం ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది. కవిత్రయంలా పేరొందిన కవులు వాంగ్ వెయ్, లీపో, టూ ఫూ ఈ కాలంలోని వారే. దాదాపు వీరు బతికినంత కాలం ఒకే చక్రవర్తి మింగ్ హువాంగ్ సామ్రాజ్యం కావడం

విశేషం. ఈ ముగ్గురి కవుల్లో ఎవరి ప్రత్యేకతలు వారికున్నా, ముగ్గురిలో కనిపించేవి సంగీతం, ప్రకృతి పట్లప్రేమ, స్నేహితులు, కుటుంబం, తమ ఇళ్లు ఊరు పట్ల చింత, చాలావరకూ ఒకటే.

సాంగ్ సామ్రాజ్యం (960–1279) చివరి దశలో కవిత్వం ప్రభుత్వ పరీక్షలనుండి తొలగించారు. అయినా కనీసం మూడువందల కవితలు ఆ కాలంలోనివి ఇప్పటికీ పిల్లలకు నేర్పుతున్నారు. విద్యాభ్యాసానికి ముందే, ఈ కవితలు కొన్నైనా పిల్లలకు కంఠతా వస్తాయి.

చైనాలో అనేక సామ్రాజ్యాలు రాజ్యవేలాయి. అన్నింటిలో ఎంతోకొంత కవిత్వం ఉండనే ఉంది. అయితే టాంగ్ సామ్రాజ్యంలో అందర్నీ ఆకర్షించినంత కవిత్వం అంతకుముందుగానీ ఆ తరువాతగానీ రాలేదంటే అతిశయోక్తి కాదు. రెండు వేలకు పైగా కవులు, యాభైయి వేలకు పైగా కవితలు ఆ కాలంలోనే వచ్చాయంటే, అప్పటి కవిత్వ దశని ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. మౌలికంగా ముందునుండీ వచన కవిత్వ రూపమే. ఎన్ని పంక్తులు, ఏ ఏ పంక్తులకు ప్రాస ఉందన్న పద్ధతుల్లో రూపాల్లో కొన్ని మార్పులు కొనిస్తాయి. అలా వచ్చిన పద్ధతుల్లో 'షి' ఎక్కువ ప్రాచుర్యం పొందింది.

కవిత్వ పోటీలకు విశేష ప్రజాదరణ ఉండేది. ఏదో ఒక వస్తువు మీద ఒకే కవిత్వ పద్ధతిలో, కుటుంబ సభ్యులు, లేదా స్నేహితులు కవితని పూర్తిచేస్తారు. గుంపుగా ఒక చోట చేరి, రాసే పద్ధతిని, విషయాన్ని నిర్ణయించుకుని, లాటరీ పద్ధతిలో ఎవరు మొదలెడతారో తేల్చుకుని, ముందు చెప్పిన పంక్తికి ధీటుగా, ఒక్కొక్కరు ఒక్కొక్క పంక్తి చేర్చుకుంటూ పోతారు. అలా చేయలేనివారు పోటీ నుండి విరమిస్తారు. స్త్రీలు కూడా పాల్గొనవచ్చు. కానీ వారు కుటుంబ సభ్యుల పోటీలకే పరిమితమయేవారు. అప్పట్లో ప్రతిభ లేని స్త్రీ సద్గుణవతిగా చెప్పుకునేవారు.

చైనా చరిత్ర చాలా వరకు కవితల్లోనే ఉన్నా, అవి చాలా వరకూ విద్యాధికులు, ఏలుబడి చేసే వర్గానికి చెందినవారు రాసినవే. ఇప్పుడు స్త్రీలు, పురుషులు, అన్ని వర్గాలకు చెందిన వారు కూడా కవిత్వం రాస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు, ఇతర ముఖ్యమైన సందర్భాలలో అదృష్టాన్ని సూచించే చరణాలు రాసుకోవటం సంప్రదాయంగా మారింది. లేదా పురాతన కవితల్లోని పంక్తులు ఏరుకుని ఎర్రటి కాగితం మీద రాసి, ద్వారాలకు వేలాడదీస్తారు. ఎరుపు చైనాలో అదృష్టానికి చిహ్నం.

చైనా కవిత్వానికి ఇతర దేశాల కవిత్వానికి భేదాలున్నాయి. 1. కవిత్వ పుస్తకంతో మొదలైన చైనా కవిత్వం అతి పురాతనం 2. మొదటినుండి ఈ కవిత్వం సంగీత భరితం 3. లయాత్మకం 4. చాలా వరకు కర్తలేని పంక్తుల్లో సాంద్రత 5. అన్ని వర్గాల ప్రజలు ఆదరించే ప్రక్రియ.

**చైనాలో ముఖ్యమైన కావ్యాలు, కవుల గురించి:**

**1. షీ *చింగ్* అను కవిత్వ పుస్తకం:** ఇది చైనా ఆది కావ్యంగా గుర్తించబడింది. కవిత్వం పాటల రూపంలో ఉన్నా, దీనిని రాసిందెవరో తెలియదు. క్రీ.పూ. పది నుండి ఆరవ శతాబ్దం మధ్య రాయబడిన ఈ కావ్యంలో 3000 కవితలుంటే, కన్ఫ్యూశియస్ దాన్ని కుదించి 300 కవితల పుస్తకంగా మార్చారు. ప్రధానంగా ఇందులో ఇతివృత్తమిది.

అవిశ్వాసుల కంటే నీతివంతులైన భార్యా భర్తలు ఎక్కువ ఆనందం పొందుతారు. సైనికుడి జీవితం, అతనికి, అతని కుటుంబానికీ బాధించేదే, కానీ అతని పరాక్రమం అన్నింటినీ చెరిపేస్తుంది. పెద్దల్ని మన్నించి గౌరవించాలి. పూర్వీకుల్ని యజ్ఞాచారాలతో సంతుష్టిపరచాలి. రాజధిక్కారానికి పాల్పడకూడదు లాంటివి.

కనీసం 3000 సంవత్సరాల వరకూ ఈ కవిత్వం ప్రజల్ని ప్రభావితం చేసింది. అందులో జానపదాలు, ప్రేమ పాటలు, పాలకుల్ని పెద్దల్ని కీర్తించేవి. ఆచారాలకు పనికొచ్చే గీతాలు, యుద్ధం పాటలు, అలా అన్ని సందర్భాలకు పనికొచ్చేవిగా ఉండటంతో అలా సాధ్యమైంది. ఇప్పటికీ మనం అన్వయించుకునే అందులోనే ఈ కవితే అందుకు ఉదాహరణ:

**మూడేళ్లుగా నీ భార్యను / ఇంటిపనుల్లో నేనెప్పుడూ అలసిపోలేదు**
**పెందరాలే లేచి ఆలస్యంగా పక్కమీద వాలతాను / పనిలేని ఉదయమే లేదు**
**ముందు నీకు నా తప్పులు కనిపిస్తాయి / ఆ తరువాత నామీద దౌర్జన్యం**
**నా సోదరులకిది తెలియదు / ఎగతాళి చేస్తూ నవ్వుతారు**
**స్థిమితంగా అదే ఆలోచిస్తూ / నా మీద నేనే జాలిపడతాను.**

అంచేతనే ఇది చైనా ప్రామాణిక గ్రంథంగానే కాకుండా, ప్రపంచ సాహిత్యంలోనే విశిష్ట గ్రంథమయింది. ఈ కవిత్వ పుస్తకం లానే, మరో నాలుగు గ్రంథాలలో *(చరిత్ర పుస్తకం, మార్పుల పుస్తకం, ఆచారాల పుస్తకం, ఋతువుల పుస్తకం)* మార్పుల పుస్తకంలో మాత్రం కొంత కవిత్వం కనిపిస్తుంది. అలాగే క్రీ.పూ. 300 ఏళ్లనాటి మార్గదర్శిగా భావించే టావో టె ఛింగ్ పుస్తకంలో కూడా.

**2. చూ యువాన్ / ఛూ పింగ్ (క్రీ.పూ. 343-278) కవిత్వం:** వీరివి మూడు ప్రసిద్ధ కావ్యాలు వెలుగులోకొచ్చాయి. మొదటిది *లీ సావో* – దుఃఖాన్ని ఎదుర్కోవడం – దోషి అయిన మంత్రి రాజుకు విధేయుడుగా మృత్యు ముఖంలో కూడా నేరాంగీకార పశ్చాత్తాపమే ఈ కావ్యమంతా.

**చెట్లు, పూలు, వాడిపోయి రాలిపోతున్నాయనుకుని**
**నా చక్కనైన అందం కూడా వాడిపోతుందని భయపడ్డాను**

**మీ స్త్రీలంతా నా సున్నితమైన అందానికి ఈర్ష్యచెంది**
**నేను అక్రమ మార్గంలో నడుస్తున్నానని,**
**అపనిందలు పుకార్లు పుట్టిస్తున్నారు.**

**రెండవది *ఛియో కో* – తొమ్మిది పాటలు:** ఒక మోసపోయిన పూజారి దీనంగా దేవుడ్ని వేడుకోవడం ఇందులో కనిపిస్తుంది.

**గాలి హోరుహోరున వీస్తూ చెట్లని కదపగలుగుతున్నాయి.**
**నా ప్రియమైన దేవుడు నాకు దుఃఖాన్నే ఇవ్వగలిగాడు.**

**మూడవది *టైన్ వెన్* – స్వర్గం ప్రశ్నిస్తుంది:** సమకాలీన సమాజంలో స్వర్గం పాత్రని, కుతూహలం సంశయంతో కవి ప్రశ్నిస్తున్న కావ్యం.

**వరద నీరు అగాధంలా / అలా ఎలా నిండింది**
**భూమ్మీద తొమ్మిది ప్రాంతాలు / అలా ఎలా ఏర్పడ్డాయి**

**3. టాఓ యువాన్ మింగ్ / టాఓ ఛిఎన్ (క్రీ.పూ. 365-427):** వీరి ముఖ్యమైన కావ్యాలివి. *నా పాత ఇంటికి తిరిగి రావడం, దేశంలో నివాసానికి తిరిగి రావడం, ఇంటికి రావడం, క్యూ మావో సంవత్సర వసంతం మొదట్లో* మొదలైనవి. వీరి కావ్య వస్తువు అంతా – రాజకీయాలకు దూరంగా, నిరాడంబరంగా నిజాయితీగా ఏకాంతవాసం చేయటం, సమయానుకూలంగా స్థలాలు, మనుషులు మారుతున్నా శాశ్వత విలువలుంటాయిని చెప్పడం, పొలంలో కవులైనా, కష్టించడంలోని తృప్తి, ప్రపంచానికి దూరంగా కర్షక వర్గం ఉండటం ఆదర్శవంతమను కోవడం.

**రుతుకార్యంగా నవ్వుతూ నాగలి పట్టుకుని**
**రైతుల్ని ఉత్సాహ పరుస్తాను**
**సూర్యాస్తమయానికి అందరం కలిసి తిరిగొస్తాం**
**నీళ్ల కూజాతో దగ్గరున్న పొరుగువారిని సంతోష పరుస్తాను.**

**సూర్యుడు అస్తమించే సరికి, ఇళ్లు చీకటి పడుతుంది**
**ముళ్లకంప మంట, కొవ్వొత్తి అవసరం తీరుస్తుంది**
**రాత్రి చిన్నదని, ఆనందంలో బాధపడతాం**
**అప్పుడే మరోమారు సూర్యోదయానికి దగ్గరవుతాం**

- దేశంలో నివాసానికి తిరగి రావడం

**4. హ్సీ లింగ్ యున్ / హ్సీ కాంగ్లో (క్రీ.శ. 385-433) :** వీరి కావ్యాల్లో, *మెరుస్తున్న నా సంపదని దాటుకుంటూ, పడమటి విలువిద్య, భవనాన్ని సందె చీకటిలో విడిచిపెడుతూ, నా దక్షిణ పర్వతాలనుండి ఉత్తర పర్వతాల దారిలో, సరస్సునుండి నేను చూస్తున్న దృశ్యం, ప్రవాహంతో ప్రయాణం* మొదలైనవి ముఖ్యమైనవి.

వాటిల్లో ఇతివృత్తంగా – ప్రపంచంలోని కొండలు, నదులు, తతిమా ప్రకృతిని కవిత్వంతో కొనియాడాలని, సమయంతో బాటు, కష్టాలు, జ్ఞాపకాలూ వస్తాయి, కానీ ప్రకృతి పరిణామంలో సంతృప్తిని చూడగలగాలని, ఒక్కోమారు మన అనుభవాల్ని, ఆలోచనల్ని ఇతరులతో పంచుకోవాలని, జయాపజయాల నిమిత్తం లేని నిరాడంబర జీవితం ఉత్తమమని.

**ఈ కొండలెక్కుతూ, వాటి ఎత్తుల్ని లోతుల్ని నేను దువ్వుతాను**
**నదుల్ని దాటుతూ, ఎగువన దిగువన వాటి గమనాన్ని శోధిస్తాను**
**దగ్గరైన పర్వత శ్రేణులనుండి శిఖరాల్ని ఒంచుతాను**
**దీవులు అంతులేని ఇసుకదిబ్బల చుట్టూ అల్లుకుంటాయి**
**తెల్లని మేఘాలు చీకటి శిలల్ని చుట్టుముడతాయి**
**స్వచ్ఛమైన అలలు పచ్చటి వెదుర్లని ఆకర్షిస్తాయి**

- మెరుస్తున్న నా సంపదని దాటుకుంటూ

**5. వాంగ్ వెయ్ (699-761):** చైనా ముఖ్యమైన ముగ్గురు కవుల్లో ఒకరు. తతిమా ఇద్దరూ లీ పో, టూ ఫూ. వీరంతా సమకాలికులు కావడం విశేషం. అప్పటి ప్రభుత్వంలో వాంగ్ వెయ్ అనేక ఉన్నత పదవుల్లో ఉన్న సంపన్న కుంటుంబలో జన్మించారు.

తొమ్మిదేళ్లనుండే కవిత్వం మొదలెట్టారు. కవిత్వమే కాక చిత్రలేఖనం, సొగసైన దస్తూరికి కూడా వీరు ప్రసిద్ధి.

వీరి చిత్రాలు ఏవీ లభించనప్పటికీ, వీరి కవిత్వం కూడా దృశ్య కావ్యాలుగా కీర్తించబడ్డాయి. వీరి ముఖ్యమైన కావ్యాలు – *వాంగ్ నది కవితలు, మేఘాల లోయ కవితలు, ఉదయం స్రోతలు, కొండల్లో నివాసం, వెదురు విడిది, లేళ్ల తోట, పుటి మఠం నుండి, హిబిస్కస్ కొండ, చిచో దగ్గర మూడవ త్సూకు వీడ్కోలు, నా స్నేహితుడు ప్రెఫెక్ట్ వెయ్ మీద కవితరాసి పంపమని చక్రవర్తి ఆదేశం.*

వాంగ్ వెయ్ ఛన్సీ పరీక్షలో ఉత్తీర్ణులై అనేక ఉన్నత పదవులు పొందగలిగారు. తొందరగానే పెళ్లయినా, 730లో

భార్య మరణించింది. పిల్లలు లేరు. వీరు ఆ తరువాత వివాహం చేసుకోలేదు. శాన్సీలో జన్మించి వంగ్చుయన్‌లో మరణించారు. వీరి మరణానంతరం వీరి సోదరుడు సేకరించిన కవితలు, 2000 వరకూ ఉండాల్సిన వాటిలో 400 మాత్రమే దొరికాయి. సాధారణంగా వ్యక్త పరచలేని వాటిని కూడా కవిత్వం ద్వారానే చెప్పొచ్చని బలంగా నమ్మేవారు. వాంగ్ వెయ్ మానసికావస్థ ఎక్కువగా కోరుకునేది-ఏకాంతం, ప్రశాతం, ప్రకృతిలో లీనమవడం, బౌద్ధం, పారే నీరు, వేకువ, సాయంత్రం, వెదురు, స్నేహం, నిరాడంబర జీవితం, ఖాళీ, నిశ్శబ్దం. ఇవే వీరి కవిత్వంలో తరచు తొంగి చూస్తాయి. వీరి కవితల్ని నాలుగు భాగాలుగా విభజించొచ్చు. 1 కోర్టు కవితలు, 2. ప్రకృతి కవితలు, 3.బౌద్ధం కవితలు, 4. స్నేహ కవితలు.

శాంతంగా ఏకాంతంలో తలుపు మూస్తాను
ఆకాశపు సాయంత్రపు దీప్తిని చూస్తాను
కొంగలు దేవదారు వృక్షాలమీద స్థిరపడతాయి
సందర్శకులెవరూ నా గేటుముందు ఉండరు
వెదుళ్ల లేతగా కొత్త పెరుగుదలతో ఉంటాయి
ఎర్రతామర తన పాత దుస్తుల్ని విడుస్తుంది
రేవు దగ్గర దీపపు పురుగుల వెలుగు
నీటి అడవికాయల్ని ఏరుకునే
వాళ్ళంతా ఇళ్లు చేరుకుంటున్నారు - ప్రకృతి కవిత

దట్టమైన వెదురువనం మధ్య నేను ఏకాంతంగా కూర్చుంటాను
వీణ వాయించు, మళ్లీ ఈల గట్టిగా వేయు
దట్టమైన అడవిలో ఎవరికీ తెలీదు
నా మీద ప్రకాశించదానికే కాంతివంతమైన చంద్రుడొస్తాడు
- బౌద్ధం కవిత

కలుసుకున్న నవ్వులు, వీడ్కోలు కన్నీరుగా మారిపోయాయి
అసాధ్యమైన దుఃఖంలో మరణించినట్టు ఇళ్లు, ఊరు
చల్లని ఆకాశం మీద పదునుగా దూరపు కొండలు
మునిచీకటిలో పొడవైన నది పరిగెడుతోంది
నేనింకా అక్కడే నిల్చుని ఉన్నా, నా చూపుకు అందనంతగా
నిన్ను తీసుకుని పడవ కదిలిపోయింది - స్నేహ కవిత

దాని పదివేల ద్వారాలు హృదయాన్ని బాధిస్తాయి:
అటవిక పొగ పెరుగుతుంది
వంద ప్రభుత్వ ఉద్యోగులు, చక్రవర్తి న్యాయస్థానానికి
ఎప్పుడు వస్తారో మళ్లీ
శరత్కాలపు ప్రత్యేక ఆకులు ప్రాసాదపు
ఖాళీలలో పడుతున్నాయి
గడ్డకట్టిన గుర్రపు తట్టు మడుగు పక్కన,
తంత్రులు పిల్లనగ్రోవుల సంగీతం - కోర్టు కవిత

**6. లీ పైగా కూడా పిలవబడే లీ పో (701-762):** వీరి ముఖ్య కావ్యాలు-*నిశ్శబ్దపు రాత్రి ఆలోచనలు ప్రాచీన అహంకారం షూ కి దారి కష్టం, చంద్రుని సమక్షంలో ఏకాంతంగా తాగుతూ* వాటిల్లో ముఖ్యమైన ఇతివృత్తాలివి. నిజమైన శాంతి ఏకాంతంలోనే తెలుస్తుందని. ఒక్కోమారు ఇళ్లు, అక్కడి దినచర్యలకు దూరంకావడం బాధిస్తుందని. నిరంతర ప్రయాసతో ఏమి లాభిస్తుంది, లోకం మారుతుందని, కీర్తి, సంపద, తోడు రావని, చంద్రుని కింద తాగడంలో తనకి తోడుగా చంద్రుడు-తన నీడ-తానేనని. చైనా కవిత్వమంటే, టాంగ్ సామ్రాజ్యాన్ని (618-908) గుర్తుచేసుకోని వారుండరు. ఎంతో అద్భుతమైన కవిత్వం, కవులంతా ఆ కాలంలోని వారే. కవిత్వానికి అదొక సువర్ణ సమయం. లీ పో (701-762), టూ ఫూ (712-770), వాంగ్ వెయ్ (701-762), హాన్ యూ (768-824), పో చూయి (772-846), లీ హో (790-816) ఇంకా ఎందరో, వీరందరిలో లీ పో, వీరి మిత్రుడు టూ ఫూ ఎక్కువ కవిత్వ కీర్తినార్జించారు.

లీ పో కి అంత ఖ్యాతి రావడానికి కారణాలివి - వీరి కవిత్వ శైలి సరళం. అత్యుక్తి, వక్రోక్తి వీరికిష్టం, కాల్పనిక ఊహానుభూతి వేపు మళ్లి, పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. తోటి కవులే వీరిని కవిత్వ మేధావిగా కీర్తించే వారు. 701లో చైనా తుర్కిస్తాన్లో బహుశా జన్మించిన వీరు, అయిదేళ్ల ప్రాయంలో చైనా చాంగ్మింగ్ కి వలస వచ్చారు. అక్కడే వీరి బాల్యం గడిచింది. ప్రజల గుర్తింపు పొందాలన్న తహతహలో అనేక ప్రాంతాలు తిరిగారు. పిల్లలకోసమని అనేక పెళ్లిల్లు చేసుకున్నారు. వాంగ్ వెయి వీరి సమకాలికులైనా వీరిద్దరూ కలుసుకోలేదు. కానీ వీరిద్దరికీ తెలిసిన కవి మెంగ్ హావోరన్ మీద వీరిరువురూ కవితలు రాశారు.

ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలు రాయలేదు. సమకాలీన విషయాలు కవిత్వంలో ఎక్కడా కనబడవు. ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందినా, రాజధాని నుండి కోర్టు ఉత్తరువులు మూలాన తరిమేయబడ్డారు. మళ్లీ ప్రభుత్వ ఉద్యోగం కోసం, గుర్తింపుకోసం తీవ్రంగా ప్రయత్నించినా, ఉద్యోగంలో నియమిస్తూ ఉత్తరువు లొచ్చే సరికి 762 లో డాంగ్టున్ లో మరణించారు. దొరికిన 1100 కవితలు వీరివిగా చెప్పబడుతున్నా, కొన్ని వీరి పేరనున్న ఇతరుల కవితలనే చెబుతారు. వీరి కవిత్వం ఎక్కువగా-నాలుగు పాదాల సంక్షిప్త పద్యం, ప్రాచీన దీర్ఘ కవితలు, సంగీత భరిత జానపదం. లీ పో కవిత్వంలో రుచి, వేగం, విస్తారం ఎక్కువ. కత్తి, గుర్రం,

మద్యం, చంద్రుడు, బంగారం, పాలపుంత తరచు కనిపించే అంశాలు. తనదైన రసవాదంతో – జీవితాన్ని మత్తులాంటి కవిత్వం, మధువు, సంగీతం ద్వారా – ఉల్లాసాన్ని, ఉపేక్షని కలిగిస్తారు. నా పక్కముందు నేలంతా పిండార బోసినట్టు

ప్రకాశవంతంగా చంద్రకాంతి
తలెత్తి చూస్తే వెలిగిపోతున్న చంద్రుడు
తలకిందికి దింపితే ఇంటికి చేరుకున్నట్టు కల

- నిశ్శబ్దపు రాత్రి ఆలోచనల నుండి

ఈ పచ్చని కొండల్లో నేనెందుకున్నానని వాళ్లడుగుతారు
నవ్వి జవాబివ్వను, నా హృదయం ప్రశాంతం
తిరిగిరాకుండా, పీచ్ మొగ్గలు దిగువ ప్రవాహంలో కొట్టుకు
పోతున్నాయి
ఇక్కడికంటే వాటికి మరో భూములూ ఆకాశాలూ ఉన్నాయోమో

- కొండల్లో ప్రశ్నిస్తూ

వీరి స్వీయ చిత్రం వీరి ప్రసిద్ధ కవిత చంద్రుడి సమక్షంలో తాగుతున్న పాటలో కనబడుతుంది. ఈ కవితపై అనేక అనువాదాలున్నాయి. వాటిల్లో ఓ రెండు అనువాదాలు.

పుష్పించిన చెట్ల మధ్య, మద్యం కూజాతో కూర్చుంటాను
ఒక్కడినే తాగుతున్నాను, నా మిత్రులేరి?
మీది నుండి చంద్రుడు కింద నన్ను చూస్తాడు
నేను పిలిచి అతని ప్రకాశానికి కప్పు పైకెత్తుతాను
తాగేవాడు, చంద్రుడు, నీడ / మనమంతా ఈ రాత్రి మిత్రులం
మన ఈ విలాసం వసంతకాలపు కలయిక కానీ

- చంద్రుడికింద ఒక్కడినే తాగుతూ (1)

పుష్పించిన చెట్లమధ్య నేనొక్కడినే తాగుతూ
మద్యం కుండతో కూర్చుంటాను / తరువాత కప్పు పైకెత్తి
చంద్రుడిని నాతో తాగమని అడుగుతాను
మద్యం కప్పులో ప్రతిబింబాలు చంద్రుడిది, నాది
నాతో కలిసి మేం ముగ్గురం / చంద్రుడు తాగలేకపోతున్నందుకు
నా ప్రతిబింబం మాట్లాడకుండా నన్ను అనుకరిస్తున్నందుకు
నేను నిట్టూరుస్తాను
ఇంకెవరూ మిత్రులు లేరు కావున / వీరిద్దరినీ తోడుగా పెట్టుకుంటాను
సంతోష సమయంలో నా చుట్టూ ఉన్నవారితో
నేను కూడా ఆనందంగా ఉండాలి / చంద్రుడు నాతోబాటే ఉన్నట్టు
నేను కూర్చుని పాడతాను / నేను నాట్యం చేస్తే
నా నీడ కూడా నాతోబాటు నాట్యం చేస్తుంది
నేను పూర్తిగా తాగనపుడు
చంద్రుడ్ని, నా నీడని మిత్రులుగా చూసి ఆనందిస్తాను
పూర్తిగా తాగినపుడు / మేమంతా విడిపోతాం
అయినా వాళ్లు మిత్రులు / ఏవిధమైన ఉద్వేగం లేని వీరిని
ఎల్లప్పుడూ నమ్ముతాను / మేం ముగ్గురం ఒకరోజు
గహనమైన నక్షత్రవీధిలో కలుస్తామనే ఆశిస్తాను.

- చంద్రుడికింద ఒక్కడినే తాగుతూ (2)

**7. టూ ఫూ (712–770):** వీరి కావ్యాలు – *ఉత్తరం వేపు ప్రయాణం, పెంగ్యా గేయాలు, సైనిక శకటాల గేయాలు, రాజధాని నుండి ఫెంగియన్ పెర్ఫెక్చర్ కి వెళ్తున్నప్పటి నా భావాలు, యువరాజు కోసం శోకం, వృద్ధుని వియోగం, శరత్తు ప్రేరణ, శరత్కాలపు వృధా, హాన్ యాంగ్జె నదులు, షిహావ్ సమీకరణ అధికారి, క్వింయో నుండి ఇరవై వివిధ కవితలు* వాటిల్లో ముఖ్యమైన ఇతివృత్తాలివి. పండితుల ముఖ్య భూమిక ప్రజల పట్ల సానుభూతి, రాజ్యానికి విధేయుడిగా సేవ. దౌర్భాగ్యంలో ఉన్నా, అధికారులకు సాధారణ ప్రజల అవస్థలు ముఖ్యం. యుద్ధం తిరుగుబాట్ల మూలాన ఎక్కువ ఇబ్బందులు సామాన్యులకే. వార్ధక్యంలో కుటుంబ ప్రకృతే తృప్తి.

ప్రజలపట్ల వీరి సానుభూతి, సేవా దృక్పథం, వీరిని గొప్ప కవిగా నిలబెట్టాయి. వీరు 712 లో చాంగన్ ఇప్పటి జియాన్‌లో జన్మించారు. వీరి తాతగారు ఫూ జెటియన్ ఒక స్త్రీ చక్రవర్తిని దగ్గర ప్రముఖ కవి అధిగారిగా పనిచేశారు. ఏడేళ్ల ప్రాయం నుండి కవిత్వ రచన టూ ఫూ మొదలెట్టారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎన్ని మార్లు ఛినీస్ పరీక్షలు రాసినా ఉత్తీర్ణుడు కాలేదు. ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తూ కాలం గడిపే వారు. వీరి అమ్మమ్మ చనిపోయినప్పుడు చెన్లూ కి వెళ్లినపుడు, మొదటిసారి ప్రఖ్యాత కవి లీ పో తో పరిచయమైంది. దరిమిలా వీరిద్దరూ మంచి మిత్రులయ్యారు.

లీ పో మీద వీరు రాసిన కవితలు కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. టూ ఫూ కవిత్వం సూచనప్రాయంగా లోతైన భావాలతో ఉంటూ, పాపిష్టి సమాజాన్ని, చరిత్రని, రాజ్యాన్ని, తాను స్వయంగా కలత చెందిన సమయాల్ని ప్రతిబింబిస్తుంది. ప్రజలకు వీరి కవిత్వం దగ్గరవడానికి కారణం – పేదరికం, కరువు, యుద్ధం మూలాన అనేక బాధలు అనుభవిస్తున్న ప్రజల పట్ల వీరు చూపించిన సానుభూతి.

టూ ఫూ ప్రకృతిని చూసే విధానం వాగ్ వెయ్, లీ పో కి భిన్నం. సానుభూతితోనైనా, ద్వేషంతోనైనా, మానవ జీవితం, మానవ సంఘటనలకు దగ్గరగా, ప్రకృతి ఉద్విగ్నభరితంగా, సదాచారవ్యక్తిత్వంతో ఉంటుందని భావించేవారు. రాసిన మూడు సార్లూ వైఫల్యం చెందినా అధికారిలా జీతం కోరుకునే వారు. పరీక్షల్లో విఫలమైనా వీరి కవిత్వం ప్రావీణ్యత మూలాన ప్రభుత్వ ఉద్యోగం దొరికినా, ఆశించినంత సంతృప్తి అందులో

పొందలేదు. కుటుంబాన్ని పోషించలేక పోయినందుకు బాధపడే వారు. చైనాలో మొదటిసారిగా సామాజిక కవిత్వాన్ని రాసింది వీరే. రాజధానిలో తిరుగుబాటుకు ముందు, తరువాత పరిస్థితుల్ని కవిత్వమయం చేశారు. అలాగే వైయక్తిక కవిత్వానికి కూడా వీరే ఆద్యులు.

వీరు రాసిన 1450 కవితల్లో సగానికి పైగా వీరి చివరి పదేళ్లలో రాసినవే. వారి కాలంలో అంతగా గుర్తింపు పొందకపోయినా, వీరి తరువాతి కాలంలో అనేకులు వీరి కవిత్వాన్ని అనుసరించారు. టూ ఫూ టాణ్జో దగ్గర 770లో నవంబరు లేదా డిసెంబరులో మరణించారు.

**వసంతం రోజు: లీ పో గురించి ఆలోచిస్తూ**

లీ పో కవిత్వం : ఎక్కడైనా సాటిలేనిది
**అతని ఊహ ఎప్పుడూ ఇతరులకంటే మించి ఆకాశంలో**
**ఎగురుతుంది**
**యూ షిన్ లా స్పష్టం నవీనం**
**పావో చావో లా స్వేఛ్ఛగా, చురుకుగా ప్రవహిస్తుంది**
**వెయి నదికి దక్షిణాన: వసంతం చెట్లు**
**యాంగ్జే కి తూర్పున: సూర్యాస్తమయం మేఘాలు**
**మళ్లీ మనమెపుడు సాహిత్యం మాట్లాడుకుందాం**
**ఒక సీసా మద్యంతోనేనా?**

**వంద చింతలు**

**నాకు గుర్తు / పదిహేనేళ్లపుడు నాది పసిహృదయం**
**లేగదూడలా ఆరోగ్యంగా వెర్రిగా పరిగెట్టేవాడిని**
**ఆగష్టులో తోటలో బేరీ ఖర్జూరం పండ్లు పూసినపుడు**
**రోజుకి వేయిసార్లు చెట్లెక్కేవాడిని**
**ఒక్కసారిగా యాభయ్యేళ్లొచ్చేసాయ్**
**నిల్చుని నడవలేక కూర్చునో, పడుకునో**
**నవ్వుతెచ్చుకుని మా పోషకులతో ఏదో కొద్దిగా మాట్లాడతాను**
**కానీ వంద చింతలు నా ఉద్వేగం చుట్టూ**
**అవే ఖాళీ నాలుగు గోడల ఇంటికొస్తే**
**అదే దుఃఖం నా ముసలి భార్య చూపుల్లో చూస్తాను**
**నా కొడుకులు తమ తండ్రిని మర్యాదతో చూడరు.**
**తిండికోసం ద్వారం దగ్గరే నా మీద అరుస్తారు**

**8. 7వ శతాబ్దపు హాన్షన్ రాసిన ముఖ్య కావ్యం :** *మంచు పర్వతం.* వీరు ధార్మిక ఆధ్యాత్మిక కవి. ప్రాపంచిక బంధనాలనుండి బయటపడి తనను తాను తెలుసుకోమని కవిత్వం, సూత్రాల ద్వారా, ఉద్బోధించేవారు. వీరివి 311 కవితలే దొరికాయి.

**9. బో జూయిగా పిలవబడే పో చీ యీ (772-846):** వీరి ముఖ్య కావ్యాలు: *కొత్త గేయాలు, క్విన్ పాటలు, శాశ్వతమైన శోకం పాటలు.* కవిత్వం సామాజిక రాజకీయ దుర్వినియోగాన్ని ఖండిచాలని భావించే కవి. అధిక పన్నులతో ప్రజల్ని పీడించటాన్ని నిరసించే వారు.

వీరివి 2800 కు పైగా కవితలు దొరికాయి. టాంగ్ సామ్రాజ్యంలో అధికంగా రాసిన కవి వీరే.

**10. లీ హే గా పిలవబడే లీ హో (790-816):** వీరి ముఖ్య కావ్యాలు: దివ్య తంత్రులు, బాధిత హృదయగేయం, నా దక్షిణ తోటనుండి పదమూడు కవితలు, ఆకుపచ్చ రాతల్లో బంధించిన పదార్థాలు, జనరల్ లూ పాట, చంగు ప్రకృతి పూర్తిగా ఆశ్చర్యం, నిగూఢం, అద్భుతం, వేడుక అని ప్రగాఢంగా నమ్మే కవి. వ్యవహారిక ప్రపంచం ప్రమాదకారి లంచగొండి గా భావించే వారు. అనారోగ్యం మూలాన 26 ఏళ్లకే మరణించారు.

**11. సూ షి (1037-1101):** వీరి ముఖ్య కావ్యాలు- *ఎర్ర శిఖరం మీద వచన కవితలు, పశ్చిమ అడవి మందిరపు గోడమీద రాతలు, దక్షిణ ప్రయాణ సంగ్రహం, యాంగ్జే మీద కొండల్ని చూస్తూ.* కవిత కేదీ కాదు అనర్హం అనుకున్న కవి.

తన చుట్టూ ఉన్న ప్రపంచంతో సంలీనమయి సాహిత్యాన్ని మెరుగుపర్చుకోవాలని చూసేవారు. ఆధ్యాత్మిక శ్రేష్టత, సాంసారిక ప్రపంచపు జీవితం ఒకదానికొకటి సంతృప్తినిస్తాయని నమ్మేవారు.

**12. ఆధునిక కవిత్వం:** ఏ పద్ధతులకూ కట్టుబడి లేని వచన కవిత్వం, ముఖ్యంగా 1919 మే విప్లవం తరువాత మంచి కవిత్వం వచ్చింది. ప్రజలు మాట్లాడుకునే భాషలో, కాల్పనిక కవిత్వం, ఇతర దేశాల ప్రభావాలతో కవిత్వం రావడం మొదలయింది. సాంస్కృతిక విప్లవ బంధనాలను తెంచుకుని రాసిన కవులు కొందరు ప్రపంచ దృష్టిని ఆకర్షించ గలిగారు.

వారిలో ముఖ్యులు - షూ టింగ్, బై డా ఓ (ఇటీవల కాలంలో బై డా ఓ, నోబెల్ బహుమతి ఆశావహుల్లో ఉన్నారు). గు ఛెంగ్, డుఓ డుఓ, యాంగ్ లీన్, హై గీ. 1989 టీనన్మెన్ స్క్వేర్ ప్రదర్శనల తరువాత, వీరిలో ఎక్కువ మంది ప్రవాసంలోనే గడిపారు.

హై గీ ఆత్మహత్య చేసుకున్నాక వీరి కవిత్వానికి మరింత ప్రాముఖ్యత పెరిగింది.

అయినా ఇప్పటి కవిత్వం వచనమో, కవిత్వమో తెలియక ప్రజాదరణ కోల్పోతూ వస్తోంది.

# పుస్తక ప్రపంచం

- జి. లక్ష్మి

చిన్నప్పుడు చదివిన చందమామ, పంచతంత్రం, భేతాళ, విక్రమార్క కథలతో పాటు తర్వాత నేను చదివిన అనేక పుస్తకాలు నన్ను బాగా ప్రభావితం చేశాయని చెప్పొచ్చు. అయితే అవి చూపిన ప్రభావంలో కొద్దిపాటి హెచ్చు తగ్గులు ఉండొచ్చు. చందమామలో ఎంతో ఆసక్తిగా చదివిన సీరియల్స్ దాసరి సుబ్రహ్మణ్యం గారు రాసినవి అని, ఆయన చనిపోవడానికి కొద్దికాలం ముందు తెలిసి ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా కలిగింది. పంచతంత్రం కథలు తెలుగుభాషని నేర్చుకోవడానికి ఉపయోగపడితే, భేతాళ కథలు తార్కిక బుద్ధిని నేర్పాయి.

తర్వాత కొడవటిగంటి, చలం, గురజాడ, మల్లాది, శ్రీపాద, బుచ్చిబాబు, గోపీచంద్, చాసో, శరత్, ప్రేమ్‌చంద్, టాగోర్... ఇలా చాలామంది నన్ను ప్రభావితం చేశారు. కొడవటిగంటి, చలం తెలుగు సాహిత్యానికి రెండు పార్శ్వాలు. ఒకరిది హృదయప్రధానమైన రచనలైతే రెండోవారిది బుద్ధిప్రధానమైనది.

చలం రచనల్లోని ఎమోషన్స్ గుండెని బలంగా పట్టి ఊపినా కొడవటిగంటివి చదువుతున్నప్పుడు అంతులేని తార్కికత, జీవితపులోతుల విశ్లేషణ, మధ్యతరగతి మనుషుల మనస్తత్వ చిత్రణ జీవితాన్ని, మనుషులను నిశితంగా చూడడం నేర్పాయి. చలం "మైదానం", "జీవితాదర్శం" లాంటివి ఆకాశంలో విహరింపచేస్తే కొడవటిగంటి "అనుభవం", నీకేంకావాలి, చదువు, "ప్రేమించని మనిషి" లాంటివి నేలమీదకు దించేవి. కొడవటి గంటి పుస్తకాల్లో ఏ జీవిని బైబిల్‌లో కళ్ళు మూసుకొని తెరిచినా అందులో జీవితానికి పనికి వచ్చే మాట ఒకటి అయినా ఉంటుందని అనిపిస్తుంది.



మునిమాణిక్యం నరసింహారావు

ఇక బుచ్చిబాబు "చివరకు మిగిలేది", గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" రెండింటి ప్రభావం గురించి చెప్పక తప్పదు. "చివరకు మిగిలేది", దయానిధి, అమృతం పాత్రలతో పాటు నవల ఆద్యంతం అంతర్లీనంగా ప్రవహించే నిర్వేదం, తాత్వికత మనసుపై చెరగని ముద్రవేస్తాయి. మానసిక విశ్లేషణ ప్రధానంగా నడిచే "అసమర్థుని జీవయాత్ర" మానవ జీవితంలోని నిష్ఫలతని విప్పిచెప్పి భయం పుట్టిస్తుంది. గురజాడ "కన్యాశుల్కం" మధురవాణి అంటే చాలా ఇష్టం. "ఇంటిలిజెంట్ అండ్ హ్యూమర్" అనే షేక్‌స్పియర్ కాన్సెప్ట్‌కు మధురవాణి నిజమైన ప్రతీక. ఇక మల్లాదివారి కథలు, శ్రీపాద "వడ్లగింజలు", "కలుపుమొక్కలు", "గులాబీఅత్తరు" లాంటి కథలు, చాసో కథలు ముఖ్యంగా ఎంపు, కుంకుడాకు లాంటివి, బాలగంగాధర్ తిలక్ కథలు, మా గోఖలే కథలు, మొక్కపాటి నరసింహశాస్త్రి "బారిష్టర్ పార్వతీశం", మునిమాణిక్యం నరసింహారావు "కాంతం కథలు", ఉప్పల లక్ష్మణరావు "అతడు- ఆమె", జి.వి.కృష్ణారావు "కీలుబొమ్మలు", "పాపికొండలు", డాక్టర్ పి. శ్రీదేవి "కాలాతీత వ్యక్తులు", విశ్వనాథ "చెలియలికట్ట" బీనాదేవి "భూమి గుండ్రంగా ఉంది", రాచకొండ "రాజమహిషి", అడవి బాపిరాజు "హిమబిందు", "గోనగన్నారెడ్డి", రాటారి భరద్వాజ "పాకుడురాళ్ళు" ఇష్టమైన రచనలు. "కారాయజ్ఞం" అన్నా ఇష్టమే.





మొక్కపాటి నరసింహశాస్త్రి

భార్యాభర్తలు స్నేహితుల్లా ఎలా ఉండొచ్చో సున్నితంగా చెప్పిన "స్వీటహోమ్"లోని విమల పాత్ర అన్నా ఇష్టం. "స్వీట్‌హోమ్"తో పాటు రంగనాయకమ్మ ఎంతో ధైర్య సాహసాలతో రచించిన రామాయణ విషవృక్షం ప్రభావంనాపై బలంగా ఉంది. రాముడు, కృష్ణుడు లాంటి ఆదర్శ పురుషుల్ని, వాళ్ళ చుట్టూ ఉన్న ఇమేజ్‌ని బద్దలు చేయడానికి వాళ్ళల్లోనూ కొన్ని లోపాలు, బలహీనతలు ఉంటాయని చెప్పడానికి ఆవిడ చూపిన సాహసాన్ని తక్కువగా చూడటం. ఈ మధ్య ఎస్.ఎస్.భైరప్ప 'పర్వ' చదువుతున్నప్పుడు అందులో అర్జునుడు ధర్మరాజుని నరకడానికి కత్తిదూయడం ఒకరకంగా ఏమన్నా డిస్టార్షన్ అయిండాలేమో అని ఉషశ్రీ భారతం రిఫర్ చేస్తే అందులో కూడా ఈ విషయం యథాతథంగా కల్పించినపుడు

జి. లక్ష్మి, ఫోన్: 9490735322



కె.యన్.వై.పతంజలి

కానీ అది నమ్మడానికి మనసు అంగీకరించలేదు. పురాణపాత్రల పై మన మనస్సుల్లో ఏ ఇమేజ్ ఉంటుందీ, దానిని బద్దలు చేయడం ఎంత కష్టమనే విషయాన్ని చెప్పడానికే దీనిని ప్రస్తావించాను. ఆ రకంగా విశ్వనాథ "కల్పవృక్షం" కన్నా "విషవృక్షం" నాలో ఎన్నో కొత్త ఆలోచనలు రేకెత్తించింది.

ఇటీవలి కాలంలో చనిపోయిన కె.యన్.వై. పతంజలి నాకెంతో ఇష్టమైన రచయిత. ఆయన రాసిన "పిలక తిరుగుడు పువ్వు", "వీరబొబ్బిలి", "రాజుగోరు", "అప్పన్న సర్దార్", "కోటకథలు" ఆయన తప్ప ఇంకెవ్వరూ రాయరనిపిస్తుంది. వాటిల్లోని సెటైర్, సునిశితమైన హాస్యం పెదాలపై నవ్వుల్ని పూయించడంతో బాటు బుద్ధి కూడా పదునుపెడుతుంది. ఇక ముద్దుకృష్ణ "వైతాళికులు" పుస్తకం కాలేజీలో నాకు బహుమతిగా వచ్చినప్పుడు అది కలిగించిన సంచలనం మాటల్లో చెప్పలేను. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, రాయప్రోలు, నండూరి, బసవరాజు, విశ్వసుందరమ్మ తదితరుల రచనలు కంఠతో వచ్చేవి. తిలక్ "అమృతం కురిసిన రాత్రి", కుందుర్తి వచన కవిత్వం, నండూరి "ఎంకిపాటలు" అన్నా ఇష్టం.

ఇక ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదం అయిన రచనల విషయంలోకి వస్తే సాంకృత్యాయన్ "బుద్ధచరియ" కూడా చాలాసార్లు చదివాను. రాహుల్ సాంకృత్యాయన్ "ఓల్గా నుంచి గంగకు", "విస్మృత యాత్రికుడు", "జయమౌధాయ" లాంటి నవలలు అన్నా, "చెంఘిజ్‌ఖాన్", "స్పార్టకస్", అన్న నవల చివరికి వస్తోందంటే బెంగ పడేంత ఇష్టం. "చెంఘిజ్‌ఖాన్" పేరు చెబితేనే గోబీ ఎడారి, ఉడుకుతున్న లేత గొర్రెమాంసం సువాసన మనసుని కమ్ముకుంటాయి. స్పార్టకస్ వరీనియాతో "జీవితం ఉన్నది జీవించడానికే" ఎన్ని కష్టాలు వచ్చినా జీవించడానికే ప్రయత్నించు అని చెప్పిన మాట ఎప్పుడూ మంత్రాక్షరంలా చెవుల్లో మోగుతూనే ఉంటుంది.

ఇక మార్క్‌ట్వాన్, టామ్‌సాయర్, "శోకల్ బెరీఫిన్" లను ప్రథమార్థంలో గుర్తుకు తెచ్చే శరత్ "శ్రీకాంత్" నవల అన్నా ఇష్టం. "విరాజ్‌బహు", "రాముని బుద్ధిమంతతనం", "బడదీదీ", "భారతి" అగ్ని ఒక ఎత్తు. ఒక శేషప్రశ్న అంటే ఒక ఎత్తూను. "శేషప్రశ్న" లోని కమల పాత్ర నాకు ఇంతవరకు చదివిన అన్ని నవలల్లోని పాత్రల్లో నాకు ఎంతో నచ్చిన పాత్ర. ఒకరకంగా ఆ పాత్ర శరత్‌కు మౌత్‌పీస్‌లాంటిది. నాదృష్టిలో "గిబ్సన్ డాల్స్ హౌస్" లోని ప్రధానపాత్ర "నోరా" లాగే కమల కూడా ఎంతో మానసిక పరిణతి కలిగిన పాత్ర.

ఇక ప్రేమ్‌చంద్ "రంగభూమి", "గోదాన్", గబన్ నవలల ప్రభావం కూడా తక్కువ ఏమీలేదు. టాగోర్ "గీతాంజలి" అయితే నిత్య పారాయణ గ్రంథం అంత ప్రభావం చూపింది. ఇక విభూతిభూషణ వంద్యోపాధ్యాయ "పథార్ పాంచాలి", "వనవాసి" నవలలు ఒక్క మాటలో చెప్పి వదిలివేయాల్సినవి కావు. మనసు ఎప్పుడు బాగుండకపోయిగా "వనవాసి" లోని ఏ పేజీ చదివినా అందులోని ప్రకృతి చిత్రణకు మనసు పరవశమై ఊరట పొందుతుంది. సాహిత్య అకాడమీ, హెచ్ బిటి, ఎన్ బిటి ప్రచురితమైన "రాయలు", కలకత్తాకి దగ్గరలో "పర్వ", "దాటు", "గృహభంగం", "కొన్ని సమయాలలో కొందరు మనుషులు ఇలాంటివి ఎన్నో ఎన్నెన్నో నాకు నచ్చినవి చాలానే ఉన్నాయి. శివశంకరపిళ్ళై, భైరప్ప, పొట్టెన్నాల్, జయకాంతన్, మహాశారదాదేవి రచనలన్నా ఇష్టం.

తెలుగుభాషంత విస్తారంగా చదవకపోయినా ఆంగ్లభాషలో చదివిన వాటిల్లో డోస్టిమోవిస్కీ "క్రైమ్ అండ్ పనిష్‌మెంట్", "ఇడియట్" టాల్‌స్టాయ్ "వార్ అండ్ పీస్" అన్నా కెరీనా "మార్క్‌ట్వాన్", "ప్రిన్స్ అండ్ పాపర్" అయాన్‌రాండ్ "ఫౌంటెన్ రోడ్" గుస్టార్‌ఫ్లాబర్ట్ "మాడమ్ బావరీ" ఆల్బర్ట్ కామా "అవుట్‌సైడర్" ఎర్నెస్టె హెమ్మింగ్వే "ఓల్డ్‌మాన్ అండ్ ది సీ", బెర్నార్డ్‌షా "పిగ్మాలియాన్" అంటే ఇష్టం. "పాపిలాన్" నవల అన్నా ఇష్టం. జీ ఎగ్రీ, మొపాసా, మామ్ కథలన్నా ఇష్టం. కీట్స్ కవిత్వం ఇష్టం. ఇంకా కొట్రీస్, కార్మన్ బెమాన్, గోర్కీ 'అమ్మ' రష్యన్ అనువాదాలైన "శాశ్వత రాత్రులు", "పేదజనం" లాంటి నవలలు కూడా ఎంతో ప్రభావాన్ని కలిగించాయి. ఇవన్నీ బాగా గుర్తుండి ఉదహరించిన పుస్తకాలు. ఉదహరించి పోయినంత మాత్రాన నేను చదివిన మిగిలిన వాటి ప్రభావం తక్కువ ఉందని కాదు. స్థలాభావం వల్ల మిగిలిన వాటిని ఉదహరించ లేకపోయాను. నా జీవితంలో నాకు సంతోషం కలిగించే విషయం ఇదే. ఈ పుస్తకాలని చదువుకొని ఆనందించ గలగడం. అయి పోతుందని బెంగపడడం. స్నానం, తిండి, నిద్రని కూడా మరిపించిన బంగారు పుస్తకాలు అవి మరి.

# అథో ప్రపంచపు గాథ – ఉచల్యా




ప్రతి సభ్య సమాజానికి ఆవల ఒక అథో ప్రపంచం ఉంది. అది ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. మనమే దాన్ని గుర్తించం. గుర్తించినా గుర్తించ నట్టే నటిస్తాం. దాన్ని ఎవరో ఎత్తి చూపితే అప్పుడే గుర్తించినట్టు ఒక్కసారి కళ్ళు తెరిచి ఉలిక్కి పడతాం. దేశదిమ్మరులు, దొంగలు, సంఘబహిష్కృతులు, పీడితుల ప్రపంచం అది. బైటి నాగరీక ప్రపంచానికి ఏ మాత్రం తెలీని కనీసం ఊహకు కూడా అందని అథోలోకం అది. అలాంటి అథో ప్రపంచపు వాస్తవ చరిత్రే లక్ష్మణ్ గైక్వాడ్ *ఉచల్యా. ఉచల్యా* అంటే జేబుదొంగ. సంతలలో చిన్న చిన్న దొంగతనాలు చేసే వాళ్ళని మహారాష్ట్రలో ఉచల్యాలు లేక సంతముచ్చులు అంటారు. అలాంటి దేశదిమ్మరులకూ, దొంగలకూ కూడా ఒక జీవితం ఉంటుందని, వాళ్ళు కూడా మనుషులేనని అంటూ చరిత్ర చూడని చీకటి కోణాలను కళ్ళముందుంచడానికి ప్రయత్నం చేస్తాడు లక్ష్మణ్ *ఉచల్యాలో*.

పొట్టనింపుకోడం కోసం దొంగతనాలు చేయడం, దొంగతనాలు చేస్తారనే ముద్ర కారణంగా పనిపాటలు దొరక్క పోవడం, పనిదొరక్క దొంగతనాలు చేయడం, పోలీసులకు పట్టుబడి జరిమానాలు కట్టడానికి అప్పులు చేయడం, అవి తీర్చడానికి మళ్ళీ దొంగతనాలు చేయడం ఇలా ఒక విషవలయంలో చిక్కుకుని శలభాల్లా మాడి మసైపోతున్న ఉచల్యాల పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తారు లక్ష్మణ్. అంతే కాకుండా, నీతి అవినీతికి సంబంధించిన సరిహద్దు రేఖపై నిలబడి వ్యవస్థకు సూటి ప్రశ్నలు సంధిస్తారు కూడా.

ఉచల్యాలకు ఒక ప్రత్యేకమైన జీవనవిధానం ఉంది. మూఢనమ్మకాలు, కుల కట్టుబాట్లు కనపడని సరిహద్దు రేఖలున్నాయి. దేశ దిమ్మరులు కాబట్టి దొంగలు, నేరస్తులని పుట్టుకతోనే వారిపై కనబడని ముద్ర ఉంది. ఉచల్యా జాతిలో పిల్లలకు దొంగతనంలో శిక్షణ ఇవ్వడానికి టోలీలు ఉంటాయి. పిల్లలను బడిలో చేర్చినట్లు వీరు టోలీల్లో చేరుస్తుంటారు. పిల్లలను కొట్టి, హింసించి పోలీసు దెబ్బలకు తట్టుకుని రాటు దేలేటట్టు చేయడం దొంగతనాలకు సంబంధించిన కిటుకులు నేర్పడం ఈ టోలీల పని. ఉచల్యా లకు భారత్ బ్లేడు లక్ష్మీదేవితో సమానం. వీళ్ళు ముఠాలుగా చీలి దొంగతనాలకు వెళుతుంటారు. దోచుకున్న నగదు, బంగారాన్ని సమానంగా పంచుకుంటారు. ఉచల్యాలు ఊరు వదిలి వెళ్ళాలంటే పోలీసు పటేల్ దగ్గర దాఖలా పత్రం తీసుకు వెళ్ళాలి. అది లేకపోతే పోలీసులు దొంగతనం మోపి జైలులో పెడతారు. దొంగతనం చేస్తూ ఉచల్యాలు పోలీసులకు దొరికితే వాళ్ళు ఉచల్యాలను తల్లకిందులుగా వేలాడ దీసి పాదాల మీద కర్రలతో కొడతారు. సిగరెట్లతో కాలుస్తారు. దొంగతనం చేశానని ఒప్పుకునే దాకా మలమూత్రాలు నోటి వరకు తెచ్చి తినమని హింసిస్తారు. దొంగలు దోచుకున్న సొత్తును తమలో తాము పంచుకోవడం పైకి కనిపించే కథ. ఆ దొంగలు దోచుకున్న దానిని దోచుకుని, తలా కాస్త పంచుకుని, దొంగలుండే ప్రాంతాలకు కావాలని బదిలీలు చేయించుకుని దొంగల డబ్బుతో మేడల మీద మేడలు కట్టి సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణీ అయ్యే పోలీసులదే బయటకు కనబడని అసలు సిసలైన కథ.

నేరస్తులని ఎటుతిరిగా ముద్ర ఉంది కనుక వాళ్ళు చేయని నేరాలను కూడా ఉచల్యాలపై రుద్ది వాళ్ళను జైళ్ళలోకి తోస్తున్నారని, ఈ చీకటి గదులనుండి బయట పడకుండా వాళ్ళ రెక్కలను కత్తిరించి వేస్తున్నారని లక్ష్మణ్ అంటారు. "కాలుతున్న కడుపులను నింపుకోవడానికి ఉచల్యాలు దొంగతనం చేస్తారు. కాని తమ స్వార్థం కోసం అన్యాయంగా డబ్బును ఆర్జించే ధనవంతులు, విద్యావంతులు ఎంతమంది లేరు? ఇటువంటి దొంగతనాలను ప్రభుత్వం పట్టుకోదు? కడుపు నింపుకోవడానికి పది పదిహేను రూపాయలను దొంగతనం చేసేవారిని నేరస్తుల కింద చూస్తారు. బతకడానికి చాలినంత డబ్బు ఉన్నా సుఖభోగాలకోసం అవినీతి పనులు చేసే మనుషులు ఈ వ్యవస్థలో ఎంతమంది లేరు–" అంటూ సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తారు కూడా.

అంతే కాదు, "ప్రతి కులం వారి కోసం ఈ వ్యవస్థ ఒక్కొక్క చట్రాన్ని తయారు చేసింది. ఒక్కోకులం వారి విలువలను ఒక్కొక్క కొలబద్దతో కొలుస్తూ వచ్చింది. దరిద్రులు, ఉపేక్షితులు, పుట్టకతోనే నేరస్తులయిన పీడిత జీవితాలను వ్యవస్థ బాగు చేయదు. బాగుపడనివ్వదు. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే పోరాటం చేయడం ఒక్కొటే మార్గం" అంటారు.

"బతకడానికి ఏదారీ లేనప్పుడు, జీవనోపాధి లేనప్పుడు మేం దొంగలం కాక మరేం అవుతాం" అంటూ సమాజాన్ని నిలదీస్తాడు లక్ష్మణ్. తమ జాతివాళ్ళు కూడా చదువు నేర్చుకొని ఉచల్యా జాతిలో చైతన్యాన్ని తీసుకు రావాలని, వ్యవస్థలో అన్ని వర్గాలు తమ పట్ల ముందే ఏర్పరుచుకొన్న అభిప్రాయాలను వదలి పెట్టి కొత్త దృష్టితో చూడాలని ఆయన అంటారు. ఉచల్యాల గురించి ఏ ఒక్కరూ సహృదయతతో ఆలోచించినా లక్ష్మణ్ గైక్వాడ్ ఆశయం నెరవేరినట్లే.

– జి. లక్ష్మి

మి

# చదవండి...

- ఎన్నార్కె




❖ **వేద పరిచయము :** ఇతిహాస కాలంలో మానవజీవితం ప్రకృతికి, సూర్యచంద్రులకు, సాగరములకు, ఆకాశానికి, అగ్నికి ఒదిగి ఉండేది. వ్యాసుని నిరుక్తం వలన, సాయనాచార్యుల భాష్యాల వలన వేదములు గ్రహణమొనర్చుటకు పండితులకు సులభసాధ్యమైనది. వేదాలలో పేర్కొనబడిన ఋషుల విషయాలు ఈ సంకలనంలో సామాన్య పాఠకులకు అందజేశారు. ఇందులో వేదముల యొక్క స్వరూపము 34 అంకాలుగా విభజించబడి భాష్యకారులు ఋగ్వేద గణములు మొదలైన విషయములతో పొందుపరచబడినవి.

*పేజీలు 170, వెల : ₹ 100/-*




❖ **మతప్రపంచము :** ప్రతి మత గ్రంథంలోను ప్రజల చింతనకు అణుగుణంగా కొన్ని సిద్ధాంతాలు కలవు. అవి ఆ నైసర్గిక ప్రదేశములలో వివిధ జాతులపై ప్రభావం చూపి వారి ఆచారవ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను ఉన్నతీకరిస్తాయి. భిన్న దృక్పథాలతో నున్న వాటన్నిటినీ ఒక్క చోట చేర్చి అన్ని మతస్థుల మధ్య సహనాన్ని, పరస్పర విశ్వాసం పెంపొందించటంకోసమే ఈ రచన. ఇందులో ముఖ్యమైన కొన్ని ఉపనిషత్తులు, షోడశకళలు, ప్రాణాయామ లక్షణములు గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో రచన సాగింది. హిందూ, జైన, బౌద్ధ, శిక్కు, జూడా, క్రైస్తవ, ఇస్లాం మతములలోని మూలధోరణులు, వాటి ప్రాశస్త్యం, అందులోని సమాన ధర్మాలు, భేదాలు మొదలైన అంశాలను రచయిత ఉటంకించారు.

*పేజీలు 280, వెల : ₹ 100/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




❖ **భౌతిక ప్రపంచము :** విశ్వం పుట్టుకపై శాస్త్రవేత్తలు తామూహించిన సిద్ధాంతాల నుంచి వివిధ దేశాలలో మానవజన్మను గురించిన నమ్మకము మొదలైన 43 భిన్న అంశాలతో చారిత్రక, శాస్త్రీయ నేపథ్యంతో వ్రాయబడ్డ రచన. ఇంద్రజాలం అన్న చివర వ్యాసంలో రచయిత మనదేశంలో నెలకొన్న మూఢాచారాలను ఖండిస్తూ ఆ విషవలయం నుండి మేల్కొలిపే విద్య మనకు కావాలని అపేక్షించారు.

*పేజీలు 160, వెల : ₹ 100/-*

*పైన పేర్కొనబడిన మూడు సంకలనాల రచయిత నిమ్మగడ్డ జనార్దనరావు. దోనేపూడి, గుంటూరు జిల్లా. ఫోన్ : 98644-273250.*




❖ **మాఊరు దోనేపూడి:** రచయిత నిమ్మగడ్డ జనార్దనరావు. ఇందులో తన స్వగ్రామమైన దోనేపూడికి సంబంధించిన స్థలపురాణంతో పాటు చారిత్రక నేపథ్యాన్ని, 1930 నుంచి వచ్చిన సాంఘిక పరిస్థితుల గురించి వివరిస్తూ వాఖ్యానం చేశారు.

వెల పేర్కొనలేదు. పేజీలు 65.




❖ **పొదరిల్లు :** నాటకం జనరంజకంగా ఉంటే సరిపోదు. ఆలోచింప చెయ్యాలి. ఆచరణ వైపు అడుగు వేసేలా కదిలించాలి. అందుకోసం తెగించాలి అని అనడమేకాదు. సాధించిన రచయిత పూసల. 1965 నుండి నేటి వరకూ అసంఖ్యాక నాటకాలు రచించారు. ఈ నాటకం మానవ ప్రేమ, జీవితంలో మానవత్వపు అవసరం గురించి చెబుతుంది.

*పేజీలు : 60, వెల : ₹ 50/-, ప్రతులకు ఫోన్ : 9346366304 లో సంప్రదించండి.*




❖ **అన్యస్వరం :** రచయిత్రి ఇంద్రకంటి జానకీబాల. అనేక సామాజికాంశాలు, స్త్రీల పట్ల వివక్షత మున్నగు చర్చనీయాంశాలపై రచయిత్రి వ్రాసిన యాభై పైచిలుకు వ్యాసాల సంపుటి. వ్యాసాలు చిన్నవయినా చెప్పవలసిన విషయాలను ముక్కుసూటిగా చెప్పే ఆమె శైలికి మనం ఆకర్షితులవుతాం. అనల్ప ప్రచురణలు.

*పేజీలు 225, వెల : ₹ 150/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




❖ **నా అంతరంగ కథనం :** బుచ్చిబాబుగారి సతీమణి శివరాజు సుబ్బలక్ష్మి వారు మరణించిన తరువాత అచ్చువేయించిన పుస్తకం ఇది. బుచ్చిబాబు కథకులు, సౌందర్య పిపాసి, చిత్రకారుడు, తత్త్వజ్ఞుడు. తన చిన్ననాటి ముచ్చట్లతో తనలో అంకురించిన జ్ఞానతృష్ణను, తాత్త్వికత మూలాలను, వాటి స్వభావాలను ఇందులో విశ్లేషించాడు. ఆయన రచనలలో ప్రఖ్యాతి గాంచిన చివరకు మిగిలేది కథలోని పాత్రలు ఆయన వాస్తవిక జీవితం నుంచి తీసుకున్నవే. అలానే తరువాత రచనలలో కనిపించే అనేక సంఘటనలు, వ్యక్తుల సహజాతాలు తన చుట్టూ ఉన్న జీవితం నుంచే స్వీకరించాడు. బుచ్చిబాబు కథలలోనున్న పాత్రల స్వభావాలు, ఆయన బాల్య స్మృతులలో ఏర్పడిన వాస్తవిక సంఘటనలే. బుచ్చిబాబు అభిమానులు తప్పనిసరిగా చదవవలసిన అసమగ్ర స్వీయ చరిత్ర ఇది.

*పేజీలు 112, వెల : ₹ 55/-, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ*




❖ **స్వర్ణనందులు :** టి.వి. సినీ, రంగస్థల రచయితగా పేరుగాంచిన ఆకెళ్ళవారు రచించిన బంగారు నందులు బహుమతిగా పొందిన ఇదొక విషాదం, మీ ఇల్లెక్కడ అనే రెండు నాటకాలు కలిగిన సంపుటి. ఒకే సెట్టు మీద నాటకమంతా సాగిపోయేట్టు రాయడం ఆకెళ్ళ నాటక రచనా విధానంలో ఒక ప్రత్యేకలక్షణం: సామాజిక శ్రేయస్సుకోరి సాగించే రచనా విధానం మానవ స్వభావం గురించి రచయిత అక్కడక్కడా చేసే వాఖ్యానం మనల్ని అలరిస్తుంది.

*పేజీలు 132, వెల : ₹ 75/-, ప్రచురణ సంస్థ అరవింద ఆర్ట్స్ 9-234, తాడేపల్లి, గుంటూరు జిల్లా.*




❖ **ఆంధ్రప్రదేశ్‌లో మానవ ఉద్యమం :** ఈ విషయంపై సుదీర్ఘమైన విశ్లేషణతో ఎన్. ఇన్నయ్య ఇంగ్లీషు, తెలుగు భాషలలో వ్రాసిన రెండు వ్యాసాల సంపుటి. రెండు వ్యాసాల్లోనూ విషయం ఒక్కటే. ఎమ్. ఎన్. రాయ్ యొక్క రేడికల్ హ్యూమనిజం, దాని చరిత్ర ఆంధ్రప్రదేశ్‌లో దానిని కొనసాగిస్తున్న కొందరు ప్రముఖుల పరిచయాలు ప్రస్తావించబడ్డాయి.

*పేజీలు 65, వెల : ₹ 5/-, హేతువాద ప్రముఖుల ఛాయా చిత్రాలు కూడా ప్రచురించబడ్డాయి. నవోదయ బుక్ హౌస్ వారి ప్రచురణ.*




❖ **నన్నెచోడుని దారిద్ర్య విద్రావణస్తవము :** రచయిత పెదపాటి నాగేశ్వరరావు. దక్షిణభారత శైవ సిద్ధాంతము అత్యంత ప్రాచీనమైనది. నన్నెచోడ మహారాజు కూడ శైవసాధన యను దృష్టిలో స్వర్ణవిద్యనుపాసించి యుండును. దారిద్ర్యమును విద్రావణము చేయుట (కరిగించుట) యందు సమర్థుడైన వాడు పరమేశ్వరుడని తాత్పర్యము.

*పేజీలు 12, వెల : ₹ 10/-, ప్రతులు లభించు చోటు 402, అవంతీ మేన్షన్స్, బి. 64, దుర్గాబాయ్ దేశముఖ్ కాలనీ, శివం రోడ్, హైదరాబాద్.*

# అ'మో'ఘమ్



వాసన

22/2/2011

'మో' మొదటి వర్ధంతి : ఆగష్టు 3

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | నిత్యజీవితంలో సజీవధ్యానం | " " | 50.00 |
| 9. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 10. | అమాహ | " " | 60.00 |
| 11. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 12. | సిద్ధార్థ | " " | 50.00 |
| 13. | నాలో నేను | " " | 30.00 |
| 14. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 15. | కథాంజలి-2 | " " | 110.00 |
| 16. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 17. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 18. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 19. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 20. | గురవాయణం | *డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ - మహ్మద్ ఖదీర్ బాబు | |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని (తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు) | 35.00 |
| 12. | మిళింద ప్రశ్నలు (బోధచైతన్య) | 150.00 |
| 14. | బౌద్ధ ధర్మదర్శిని (భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మిరెడ్డి) | 100.00 |
| 15. | ప్రజ్ఞాదీపిక (తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు) | 60.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |


మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................................................

వీథి ..............................................................................

పేట ..............................................................................

ఊరు ..............................................................................

పిన్ ..............................................................................

సెల్ ..............................................................................

**3. సంతకం :** ..............................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు <u>**మిసిమి**</u> పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

<u>**మిసిమి**</u> లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్దార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi




తీరిక

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



ఆటబొమ్మ